

శనివారం 21-12-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 270
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL








ధ్యానం భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవన వారసత్వం!. వేద కాలం నుండి మనుషులలో అంతర్గత వికాసానికి, ఆత్మసాక్షాత్కారానికి ధ్యానం ఒక సాధనం. అలాంటి ధ్యానంకు ప్రపంచస్థాయి గుర్తింపునిస్తూ ఐక్యరాజ్యసమితి డిసెంబర్ 21ని ప్రత్యేకంగా "ప్రపంచ ధ్యాన దినోత్సవంగా" జరపాలని ప్రకటించడం యావత్ భారతీయ సాంస్కృతిక వారసత్వానికే గర్వకారణం!.

ప్రస్తుతం వేర్వేరు కారణాల వల్ల మహోన్నత భారతీయ సాంస్కృతిక జీవన విలువలు ధ్వంసమై ఎన్నో అనర్థాలకు దారితీస్తున్నాయి. సమాజంలోని కొందరు పెడత్రోవ పట్టి దురలవాట్లకు, నేరాలకు పాల్పడే పరిస్థితి దాపురించింది. జీవనశైలులలో వచ్చిన మార్పులు, ప్రపంచ దేశాలలో పొడచూపుతున్న పరిణామాలు కలిసి కుటుంబ జీవన పద్ధతులను, మానవ సంబంధాలను, నైతిక జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి ఎన్నో దుష్పరిణామాలకు పరిష్కారాన్ని మన జీవన విధానంలో మార్పు ద్వారా సాధించవచ్చు.

రూపాయి ఖర్చు లేకుండా రోజుకు ఒక గంట మనది కాదనుకొని యోగ, ధ్యానం, వ్యాయామాలపై దృష్టి కేంద్రీకరిస్తే వందేళ్ళ ఆనందకరమైన నిండు జీవితం మనదే అవుతుంది. ఆరోగ్యకరమైన జీవన విధానం, ఆహారపు అలవాట్ల ద్వారా మనల్ని, మన కుటుంబాన్ని, మన సమాజాన్ని ఆరోగ్యవంతంగా మలిచి, మనం అప్పుల పాలు, ఆసుపత్రుల పాలు కాకుండా కాపాడుకోవచ్చు. విద్యార్థులు, తల్లిదండ్రులు, రైతాంగం, యువత, మహిళలు, రాజకీయ నాయకులు, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను మాత్రమే కాక సరైన ఆలోచనా ధోరణులను కూడా అలవర్చుకోవడం ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, విద్యాపరమైన విజయాలను కూడా సాధించవచ్చు. అలా వ్యక్తుల ఆలోచనా ధోరణి, అలవాట్లలో మార్పు ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చు.

ఒక జాతి సంస్కృతి అంటే వేలాది ఏండ్ల నుండి ఆ జాతి సముపార్జించిన ఆచారాలు, వ్యవహారాలు, కట్టుబాట్లు, సంప్రదాయాలు, విలువలు, మానవ సంబంధాలు, భాష, సాహిత్యం, సాంకేతిక పరిజ్ఞానం అన్నీ!. శతాబ్దాల కాలం నుండి పరంపరగా వస్తున్న భారతీయ తాత్వికతను, జీవన విధానాన్ని, జనజీవన శైలులను, "సత్యం - శివం - సుందరం" వంటి ఆధ్యాత్మక, తాత్విక విలువలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రశాంత, ప్రగతి శీలక తెలంగాణ సమాజ నిర్మాణానికి ధ్యానం ఒక మార్గం. కనుక ఈ తరానికి, మన సమాజానికి ధ్యానం ఆవశ్యకతపై సరైన అవగాహన కలిగించాల్సి ఉందని, దీక్షా, పట్టుదల, సంకల్పం, లక్ష్య సాధన గల నవ సమాజ నిర్మాణానికి ధ్యానం కూడా ఒక వారధి అవుతుందని మనసా, వాచా, కర్మణా త్రికరణశుద్ధిగా నేను భావిస్తున్నాను.



జూపల్లి కృష్ణారావు
పర్యాటక, సాంస్కృతిక శాఖామాత్యులు

ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం

పర్యాటక, సాంస్కృతిక శాఖ-తెలంగాణ ప్రభుత్వం

II
సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 21-12-2024



● బంధం

● శిశుగృహలో చిన్నారుల వివరాలు తెలుసుకుంటున్న అప్పటి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్, ప్రస్తుత కలెక్టర్ విజయేందిర బోయి

‘మురిపాల’మూరు చిన్నారులు

'నాకూ నా కుటుంబం ఉంది' అనేది గుండె నిండా ధైర్యాన్ని ఇచ్చే మాట.
'నాకు నా కుటుంబం ఉంది' అనేది చీకట్లో వెన్నెలై పలకరించే మధురమైన మాట.
ఆ ధైర్యాన్ని ఇచ్చే మాట, మధురమైన మాటకు నోచుకోని శిశువులు అక్కడ కనిపిస్తారు.
అయితే వారి దురదృష్టాన్ని చూసి 'పాలమూరు శిశుగృహ' కన్నీళ్లు పెట్టుకున్నట్లు ఉండదు.
వెన్నెల రాత్రులలో చందమామ కథలు చెబుతున్నట్లు ఉంటుంది...

‘చిన్నీ... నువ్వేమీ బాధ పడవద్దు. నిన్ను వెదుక్కుంటూ ఒక అమ్మ తప్పనిసరిగా వస్తుంది' అని అభయమిస్తున్నట్లుగా ఉంటుంది.



మహబూబ్‌నగర్‌లోని శిశుగృహ

నిజమే, దత్తత తీసుకోవడానికి దేశవిదేశాల నుంచి ఎంతోమంది తల్లులు ఈ శిశుగృహకు వస్తున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలో 2010లో శిశుగృహ ఏర్పాటు అయింది. 2011 నుంచి దత్తత ప్రక్రియ మొదలైంది. సంతానలేమితో బాధపడుతున్న దంపతులు రోజుల వయసున్న పసికందు నుంచి అంత కంటే పెద్ద వయసు ఉన్న పిల్లల వరకు దత్తత తీసుకునే అవకాశాన్ని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కల్పించింది. 'శిశుగృహ' నుంచి 230 మంది చిన్నారులు దత్తతకు వెళ్లారు. ఇలా దత్తతకు వెళ్లిన వారిలో ఆడ శిశువులు, బాలికలే అధికంగా ఉండడం విశేషం.

ప్రేమకు ఊరితో పనేమిటి? దేశంతో పనేమిటి?

'నాకు ఒక బిడ్డ కావాలి' అంటూ అమెరికా నుంచి రెక్కలు కట్టుకొని వాలింది క్రిస్టినా నోయ. క్రిస్టినా–మాథ్యూ థామస్ దంపతులు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లుగా పనిచేస్తున్నారు.

వారికి ఇద్దరు సంతానం. ఇద్దరూ మగపిల్లలే కావడంతో ఆడబిడ్డను దత్తత తీసుకున్నారు. ఆ పాపను ఎత్తుకుంటూ క్రిస్టినా నోయల్ మురిసిపోయింది. 'నా బిడ్డలతో సమానంగా చూసుకుంటాను. ఎలాంటి కష్టం రానివ్వను...' ఇలా తన చుట్టూ ఉన్న వారితో చెప్పుకుంటూ పోతూనే ఉంది ఆ తల్లి. తనను వెదుక్కుంటూ వచ్చిన తల్లిని చూసిన మొదటి క్షణంలో ఆ పాప కళ్లలో ఎలాంటి భావం లేదు. ఆ తరువాత మాత్రం నవ్వింది. 'ఇప్పుడు నాకు కూడా ఒక అమ్మ ఉంది' అని తెగ సంబరపడుతున్నట్లుగా ఉంది ఆ నవ్వు.

ఆ నవ్వు చూసి అక్కడున్న వాళ్లందరూ నవ్వారు... ఇలాంటి ఆత్మీయ పరిమళాలు వెదజల్లడం పాలమూరు శిశుగృహలో కొత్త కాదు.

దేవుడు నాకు ఇచ్చిన అవకాశం



'శిశుగృహ'లోని వారు ఎక్కడెక్కడి వారో కాదు... నా పిల్లలే. 'వారి భవిష్యత్ బాగుండాలనే ఎప్పుడూ కోరుకుంటున్నాను. ఎక్కడ ఉన్నా వారు చల్లగా ఉండాలి.

– చెన్నమ్మ, ఆయా

అల్లారుముద్దుగా



శిశుగృహకు వచ్చిన చిన్నారులను చూస్తే జాలి కలగని వారు ఉండరు. బుడిబుడి నడకల వయసులోనే వారికెన్ని కష్టాలు అనిపిస్తుంది. వారిని మా సొంత పిల్లల మాదిరిగా చూసుకుంటాం. అల్లారుముద్దుగా పెంచుతాం. వారు వెళితే బాధగా ఉన్నప్పటికీ వారికి ఆసరా ఉండాలి కదా.

– వెంకటమ్మ, ఆయా

విదేశాల్లో మా పిల్లలు... గర్వంగా ఉంది



మేము పెంచి పెద్దచేసిన పిల్లలు విదేశాలకు దత్తత వెళ్లి అక్కడే ఉన్నందుకు మాకు గర్వంగా ఉంది. మేము కష్టపడి పెంచినందున ఆ కష్టానికి తగిన ఫలితం దొరికింది అని సంతోషపడతాం. ఏదో ఒకరోజు మా దగ్గరికి వచ్చి పలకరిస్తారనే ఆశ ఉంది.

– విజయలక్ష్మి, ఆయా

అప్పుడు బాధగా అనిపిస్తుంది



వివిధ కారణాలతో శిశుగృహకు వచ్చే పిల్లలకు మేమే అమ్మలమవుతాం. కడుపున పుట్టకపోయినా అన్ని రకాల ప్రేమలు అందిస్తాం. దత్తత వెళ్లేవరకు ఆ పిల్లలకు తల్లిదండ్రులం మేమే. దత్తత వెళ్లిన పిల్లలు గుర్తుకు వచ్చినప్పుడు చాలా బాధగా ఉంటుంది. అయితే వారు ఎక్కడున్నా మంచిగా ఉండాలన్నదే మా కోరిక.

– మణెమ్మ, ఆయా

అమ్మను మించిన అమ్మలు

పిల్లలు దత్తతకు వెళ్లినప్పుడు అందరి కంటే ఎక్కువ సంతోషించేదీ, బాధ పడేదీ శిశుగృహలో పని చేసే ఆయాలు. సంతోషం ఎందుకంటే...'మా పిల్లలకు అమ్మ దొరికింది' అనుకోవడం వల్ల. బాధ ఎందుకంటే...'అయ్యో! నా సొంత బిడ్డలా చూసుకున్న పిల్ల ఇక నాకు కనిపించదా!' అనుకోవడం వల్ల. ఇక్కడ ఆయాగా పనిచేస్తున్న చెన్నమ్మ తాను చేస్తున్నది ఉద్యోగం మాత్రమే అనుకోవడం లేదు.

ఆడ శిశువులే ఎక్కువ

'శిశుగృహ'లో నుంచి ఇప్పటివరకు 28 మంది శిశువులను విదేశీయులు దత్తత తీసుకున్నారు. ఇందులో ఆడశిశువులు ఇరవైరెండు మంది. మగ శిశువులు ఆరుగురు. అమెరికాకు పద్నాలుగు మంది, స్పెయిన్‌కు ఐదుగురు, ఇటలీకి ముగ్గురు, మాల్టా, స్వీడన్‌కు ఇద్దరు, ఫిన్‌లాండ్, కెనడాకు ఒక్కొక్కరు దత్తతకు వెళ్లినట్లు రికార్డులు చెబుతున్నాయి.

– కిషోర్ కుమార్ పెరుమాండ్ల,
సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్





పోలీసులే పాఠాలు చెబుతారు

● చైతన్య పథం

వన్స్ అపాన్ ఏ టైమ్ ఆ ఊళ్లో పోలీసులు కనిపిస్తే పిల్లలు భయంతో పరుగులు తీసేవారు. ఇప్పుడు సీన్ పూర్తిగా మారిపోయింది. పోలీసులు కనిపిస్తే పిల్లలు పరుగెత్తుకు వస్తారు. చాలామంది పేదింటి పిల్లలు 'పోలీస్ పాఠశాల'లో చదువుకుంటున్నారు. ఈ మార్పుకు కారణం నసీమా ఖాతూన్...

బిహార్‌కు చెందిన నసీమా తన స్వగ్రామం చతుర్భుజ్‌స్థాన్‌లో 'పోలిస్ స్కూల్' పేరుతో వినూత్న పాఠశాలను ప్రారంభించింది. పోలీసులతో పిల్లలు స్నేహపూర్వకంగా ఉండే లక్ష్యంతో ఈ పాఠశాలకు రూపకల్పన చేసింది. ఈ స్కూల్‌లో పోలీసులు పిల్లలకు పాఠాలు చెబుతారు. వారితో ఆడుకుంటూ ఆటలు నేర్పిస్తారు. వ్యాయామాలు చేయిస్తారు. వారి కోసం కేకులు, బహుమతులు తీసుకు వస్తారు. 'నా చిన్నప్పుడు పోలీసులను చూసి భయపడి పరుగెత్తేవాళ్లం. అలాంటి భయం ఈ కాలం పిల్లల్లో ఉండకూడదని, పోలీసులను చూడగానే ఆత్మీయులను చూసినంతగా సంతోషించాలనే భావనతో ఈ స్కూల్ మొదలుపెట్టాం. మా ప్రయత్నం ఫలించింది' అంటుంది నసీమా. ఖాళీగా ఉన్న ఒక పోలీసు రూమ్‌లో పదిహేనుమంది విద్యార్థులతో ఈ స్కూల్ మొదలైంది. ఇప్పుడు విద్యార్థుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూ పోతోంది. బడి మానేసిన ఎంతోమంది విద్యార్థులు ఈ స్కూల్‌లో చేరడం విశేషం.

'మేము పోలిస్ పాఠశాల పిల్లలం' అని పిల్లలు గర్వంగా చెప్పుకుంటారు.

ఈ పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చే తేజస్విని పోలీస్ ఆఫీసర్ కావాలనేది తన లక్ష్యం అని చెబుతుంది.

అణగారిన వర్గాల గొంతు

అణగారిన వర్గాల గొంతును ప్రపంచానికి వినిపించడానికి 'జుగు' అనే ప్రచురణ సంస్థను, కమ్యూనిటీ–బేస్డ్ ఆర్గనైజేషన్ 'పర్చమ్'ను ప్రారంభించింది. 'పర్చమ్' అంటే జెండా అని అర్థం. మొదటి అడుగుగా తమ ప్రాంతంలోని నిరక్షరాస్యులైన మహిళలకు అక్షరాలను నేర్పించడం మొదలుపెట్టింది. వారు అక్షరాస్యులు కావడమే కాదు తమలోని భావాలకు అక్షర రూపం ఇచ్చే వాళ్లు. ఆ రచనలను 'జుగ్ను'లో ప్రచురించేవారు. 'మా రచనలు పరిపూర్ణంగా లేనప్పటికీ మాకు అంతులేని ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయి' అంటుంది నసీమా. 'జుగు' పరిధి ఇప్పుడు విస్తరించింది. బిహార్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోని పేదల మనసులోని భావాలకు వేదిక అయింది.

ఆ ఊరి పేరు చెబితే హేళన చేసేవాళ్లు...

బిహార్‌లోని చతుర్భుజ్‌స్థాన్‌లోని రెడ్ లైట్ ఏరియాగా ముద్ర పడిన ప్రాంతంలో పుట్టి పెరిగిన నసీమా ఖాతూన్ సెక్స్ వర్కర్లు, వారి పిల్లలు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రత్యక్షంగా చూసింది. వారి జీవితాల్లో మార్పు తీసుకు రావడానికి రకరకాల కార్యక్రమాలు చేపడుతోంది.

'ఇళ్లపై పోలీసులు దాడి చేసే దృశ్యాలు చిన్నప్పుడు ఎన్నో చూశాను. మా అమ్మమ్మ ఇంట్లో పిల్లలందరినీ నిద్ర లేపి ఒక దగ్గర కూర్చోబెట్టి బిగ్గరగా పాఠాలు చదవమని చెప్పేది. ఇలా చేయడం వల్ల ఇది అందరిలాంటి ఇల్లు కాదని, సాధారణ పిల్లలు ఆ ఇంట్లో నివసిస్తున్నారని పోలీసులు అర్థం చేసుకుంటారని అమ్మమ్మ నమ్మేది' గతాన్ని గుర్తు చేసుకుంది నసీమ.

ఆ ఏరియాలో సెక్స్‌వర్కర్లు కాని వారు ఎంతోమంది ఉన్నారు. అయితే ఆ ప్రాంతం పేరు చెబితే అందరినీ ఒకే గాట కట్టేవాళ్లు.

'మీ వల్ల ఇతరులకు కూడా చెడ్డ పేరు వస్తుంది' అనే కోపం సహజంగానే రావాలి. అయితే సెక్స్ వర్కర్లు ఎదుర్కొంటున్న అవమానాలు, కష్టాల వల్ల వారి మీద తనకు సానుభూతి మాత్రమే ఉండేది. వారి కోసం ఏదైనా చేయాలని గట్టిగా తపించేది. ఆరోజుల్లో జిల్లా మెజిస్ట్రేట్ రాజ్ బాలా వర్మ ఎంబ్రాయిడరీ వర్క్ నేర్పించడానికి, ఆరోగ్య సంరక్షణ కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. అలా నిర్వహించిన 'బెటర్ లైఫ్ ఆప్షన్' అనే కార్యక్రమం ద్వారా ఎంబ్రాయిడరీ నేర్చుకుంది నసీమా. ఆ సమయంలోనే నిరుపేద మహిళల కోసం పని చేసే 'అదితి' అనే స్వచ్ఛంద సంస్థ సహాయంతో ఎన్నో వృత్తివిద్యలు నేర్చుకోవడానికి వీలైంది. వృత్తి విద్యలలో ప్రావీణ్యం తనను మైక్రో–లెవెల్ ప్లానర్, ట్రైనర్‌గా మార్చింది. తాను నేర్చుకున్న విద్యలను చతుర్భుజ్ స్థాన్‌లోని మహిళలకూ నేర్పిస్తోంది నసీమా ఖాతూన్.


● ముగ్గు ముచ్చట





ఆర్.ఇందిర
వెలమ వారి వీధి,
బొబ్బిలి.

17 చుక్కలు,
7 వరుసలు,
7 వచ్చే వరకు
సరి చుక్క





సి. తన్మయి
ఎ.ఎస్.రావ్ నగర్,
హైదరాబాద్

17 చుక్కలు,
1 వచ్చే వరకు,
చుక్క వదిలి చుక్క

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

● నగధగలు

ల్యాబ్ డైమండ్ అచ్చమైన వజ్రమే!



ఆభరణాల్లో ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ హవా మొదలైంది. ఆభరణాల్లో పొదగడం మొదలైన తర్వాత వీటి గురించి తెలుస్తోంది. కానీ నిజానికి ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ తయారీ 1950లలోనే మొదలైంది. అప్పట్లో పారిశ్రామిక అవసరాలకు, డెంటల్ ట్రీట్‌మెంట్, ఎయిర్‌పోర్ట్ రన్‌వేలలో ఉపయోగించేవారు. వజ్రానికి ఉన్న గట్టిదనం దృష్ట్యా వీటిని ఉపయోగించేవారు. అప్పటి వరకు డైమండ్ అంటే మనకు తెలిసింది ఆభరణాల్లో వాడే మైన్డ్ డైమండ్స్ గురించి మాత్రమే. ఇవి భూమిలోపలి పొరల్లో కార్బన్, వాయువుల ఒత్తిడితో వేల సంవత్సరాలకు వజ్రం రూపం సంతరించుకున్నాయి. అదే కంపోజిషన్‌లో అదే వాతావరణ పరిస్థితులను లాబొరేటరీలో కల్పించినప్పుడు డైమండ్ ఓర్ పూర్తిస్థాయి వజ్రంగా రూపొందుతుంది. అంటే భూమి పొరల్లో వందల ఏళ్లకు జరిగే ప్రక్రియ లాబొరేటరీలో కొద్ది వారాల్లో పూర్తవుతుంది.

- వజ్రాల రాశిలో నుంచి ల్యాబ్ డైమండ్‌ని, మైన్డ్ డైమండ్‌ని వేరు చేయడం సాధ్యం కాని పని. థర్మల్ కండక్టివిటీ పెన్ టెస్ట్ ద్వారా కూడా వర్గీకరించలేం. అడ్వాన్స్‌డ్ యూవీ కార్బన్ డాటింగ్ టెస్ట్ ద్వారా వజ్రం వయసును కనుక్కోవడం మాత్రం సాధ్యమవుతుంది.
- క్లారిటీ వర్గీకరణ, కలర్ గ్రేడింగ్, సర్టిఫికేషన్‌లో రెండింటికీ ఒకే ప్రమాణాలు పాటిస్తారు. ఇప్పుడు ల్యాబ్ డైమండ్స్‌లో పోల్కీలు కూడా వస్తున్నాయి.
- సాధారణంగా ఆయోమయానికి గురి చేసేవి అమెరికన్ డైమండ్స్ మాత్రమే. ఆ పేరుతో దొరికేవి సీజెడ్స్. అంటే క్యూబిక్ జెరకాన్స్. సాంకేతిక నామం సీజెడ్స్ అయితే వాటిని మార్కెట్‌లోకి తెచ్చిన బ్రాండ్ పేరు అమెరికన్ డైమండ్స్. ఇప్పుడు లభిస్తున్న మొజానైట్స్ కూడా దాదాపు అలాంటివే. వాటిని సిమిలెంట్స్, సింథటిక్స్ పేర్లతో వ్యవహరిస్తారు.
- ధరించడం, భద్రపరచడం విషయంలో ల్యాబ్ డైమండ్స్ పొదిగిన ఆభరణాలకు కూడా మైన్డ్ డైమండ్స్ ఆభరణాలకు పాటించిన నియమాలే వర్తిస్తాయి. ఇవన్నీ తెలిసిన తర్వాత వచ్చే ప్రధానమైన సందేహం రీసేల్ వాల్యూ గురించి. ల్యాబ్ డైమండ్స్‌కి కూడా నూటికి నూరుశాతం ఎక్స్‌ఛేంజ్ వాల్యూ, 80 శాతం రీసేల్ వాల్యూ ఉంటుంది.



– విశేషిణి రెడ్డి, జీఐఏ జెమ్మాలజిస్ట్

క్రిస్మస్‌కి రెడీ

వంటిల్లు

క్యాలెండర్ చివరికి వచ్చేశాం.
హాయ్ చెప్పడానికి క్రిస్మస్ వస్తోంది.
కేక్ మీదకు మనసుపోతుంది.
బేకరీ కేక్‌లన్నీ మైదా కేక్‌లే.
ఆరోగ్యంగా ఏమీ తినలేమా?
పండగ కోసం కొంచెం కష్టపడదాం.
మన వంటిల్లు క్రిస్మస్‌కి సిద్ధమైంది.

సెమోలినా కోకోనట్ కేక్



కావలసినవి: బొంబాయి రవ్వ– పావు కేజీ; కొబ్బరి తురుము – 125 గ్రాములు; చక్కెర పొడి– 150 గ్రాములు; బటర్– 125 గ్రాములు; పెరుగు– 125 గ్రాములు; పాలు – 125 ఎం.ఎల్; వెనీలా ఎసెన్స్ – అర టీ స్పూన్; బేకింగ్ పౌడర్– టీ స్పూన్; బేకింగ్ సోడా– అర టీ స్పూన్; ఉప్పు – చిటికెడు; బటర్– టీ స్పూన్; బాదం పప్పు – గుప్పెడు (సన్నగా తరగాలి).

షుగర్ సిరప్ కోసం: చక్కెర – 125 గ్రాములు; నీరు – 200 ఎంఎల్; దాల్చిన చెక్క – అంగుళం ముక్క; రోజ్ ఎసెన్స్ – 2 చుక్కలు.

తయారీ: ● మొదట షుగర్ సిరప్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. ఇందు కోసం నాన్‌స్టిక్ పెనంలో చక్కెర, నీరు, దాల్చిన చెక్క, రోజ్ ఎసెన్స్ వేసి కలిపి గరిటెతో కలుపుతూ సన్న మంట మీద వేడి చేయాలి. 8 నుంచి పది నిమిషాలకు మిశ్రమం తీగపాకం వస్తుంది. అప్పుడు స్టవ్ మీద నుంచి దించేయాలి ● కేక్ ట్రేకి టీ స్పూన్ బటర్ రాయాలి. తర్వాత దళసరి కాగితాన్ని పరిచి సిద్ధంగా ఉంచుకోవాలి ● ఒవెన్‌ని హీట్ చేయాలి ● కేక్ తయారీ కోసం తీసుకున్న పదార్థాలలో బాదం పలుకులు మినహా మిలిగిన అన్నింటినీ ఒక పాత్రలో వేసి బీటర్‌తో బాగా చిలకాలి. నురగ వచ్చే వరకు చిలికిన తరవాత మిశ్రమాన్ని ట్రేలో పోసి ఒవెన్‌లో పెట్టి 180 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో 40 నిమిషాల సేపు ఉంచాలి ● ఒవెన్‌లో నుంచి కేక్‌ను బయటకు తీసిన తరవాత ముందుగా కలిపి పెట్టిన షుగర్ సిరప్‌ని కేక్ అంతటికీ సమంగా పట్టేలాగ పోసి (దాల్చిన చెక్కను తీసేయాలి), బాదం పలుకులను కూడా చల్లి ట్రేని కదిలించకుండా పక్కన ఉంచాలి. కేక్ చల్లారేటప్పటికి షుగర్ సిరప్ చక్కగా పడుతుంది. చల్లారిన తర్వాత చాకు సహాయంతో కేక్‌ను ఒక ప్లేట్‌లోకి తీసుకుని ముక్కలుగా కట్ చేయాలి.

ఖజూర్ బర్ఫీ



కావలసినవి: మెత్తటి ఖర్జూరాలు– 300 గ్రాములు; వాల్‌నట్ –30 గ్రాములు; పిస్తా– 40 గ్రాములు (రోస్టెడ్, సాల్టెడ్ పిస్తా); నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు; బాదం పప్పు– 30 గ్రాములు (సన్నగా తరగాలి); యాలకుల పొడి– పావు టీ స్పూన్; గసగసాలు – టేబుల్ స్పూన్.

తయారీ: ● ఖర్జూరాల నుంచి గింజలు తొలగించాలి. వాల్‌నట్స్‌ని సన్నగా తరగాలి. పిస్తాను కూడా తరగాలి ● ఖర్జూరాలను మిక్సీ బ్లెండర్‌లో వేసి గుజ్జుగా చేయాలి ● పెనం వేడి చేసి అందులో నెయ్యి, బాదం, వాల్‌నట్, పిస్తా పలుకులు వేసి సన్న మంట మీద గోధుమరంగులోకి వచ్చే వరకు వేయించాలి. వేగిన గింజలను ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే పెనంలో మిగిలిన నెయ్యిలో యాలకుల పొడి, ఖర్జూరం పేస్ట్ వేసి కలుపుతూ వేయించాలి. ఖర్జూరం పేస్ట్ మృదువుగా మారిన తరవాత అందులో ముందుగా వేయించి పక్కన పెట్టిన గింజలను వేసి కలిపి దించేయాలి ● ఒక దళసరి పేపర్ మీద ఖర్జూర మిశ్రమాన్ని వేసి సమంగా పరిచి పైన గసగసాలను పలుచగా చల్లి పేపర్‌ను రోల్ చేసి మనకు కావల్సిన సైజ్‌లో కట్ చేసుకుంటే ఖజూర్ బర్ఫీ రెడీ. ఇవి మూడు వారాల వరకు నిల్వ ఉంటాయి. వీటిని వేడి తగ్గిన తర్వాత తినవచ్చు. చల్లగా తినాలంటే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.

● సమ్‌థింగ్ స్పెషల్

టియర్ గన్

‘నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి' అన్నాడు కవి. ఈ అమ్మాయి ఏడిస్తే కన్నీళ్లే కాదు... వాటి నుంచి బుల్లెట్లు కూడా వస్తాయి!

తైవాన్‌నుకు చెందిన ఇ పీ చెన్‌కు తనపై ఎవరైనా అధికారం చెలాయించడం ఇష్టం ఉండదు. అలాంటి వారితో ఘర్షణ పడుతుంటుంది. ఆ సమయంలో కన్నీళ్లు కూడా పెట్టుకుంటుంది. నెదర్లాండ్స్‌లోని యూనివర్శిటీలో చదువుకుంటున్న చెన్‌కు ఒక అసైన్‌మెంట్‌కు సంబంధించి ప్రొఫెసర్‌తో వాదన జరిగింది. ఆ క్రమంలో కన్నీళ్లు పెట్టుకుంది. 'కన్నీళ్లు ఇలా వృథా పోవడం ఎందుకు!' అనుకుందో ఏమో 'టియర్ గన్' కాన్సెప్ట్‌పై దృష్టి పెట్టింది. తన కాన్సెప్ట్‌ను వాదోపవాదాలు జరిగిన ప్రొఫెసర్‌కు చెబితే 'భేష్' అని ప్రశంసించాడు.



(పాపం...ఆయనకు తెలియదు తన వల్లే ఈ కాన్సెప్ట్ పుట్టిందని!) ఈ కాన్సెప్ట్ ఆమె గ్రాడ్యుయేషన్ ప్రాజెక్ట్‌గా కూడా మారింది. టియర్ గన్ ఎలా పనిచేస్తుందనే విషయానికి వస్తే...హై–ప్రెజర్ బాటిల్‌లో నిల్వ చేసిన కార్బన్‌డయాక్సైడ్‌ను ఉపయోగించి కళ్ల కింద సిలికాన్ పాకెట్‌లో పడే కన్నీళ్లను 20 సెకనలలో ఫ్రీజ్ చేస్తుంది. స్ప్రింగ్–లోడెడ్ వ్యవస్థను ఉపయోగించి వాటిని చిన్న మంచు బుల్లెట్లుగా విడుదల చేస్తుంది.

ఏ కారణంతో టియర్ గన్‌ను డిజైన్ చేసినప్పటికీ ఈ ఆవిష్కరణ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

చెన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్‌లో టియర్ గన్ పనితీరుకు సంబంధించిన విజువల్ కనిపిస్తుంది. ఆమె సృజనాత్మకతపై నెటిజనులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 270

శనివారం 21-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



చిప్ చిప్ హుర్రే!

భారత్‌లో సెమీకండక్టర్స్ రంగంలో అపార అవకాశాలు -15లో



ఇన్వెస్టర్లకు ఫ్రై డే

వడ్డీ రేట్లపై ఫెడ్ సంకేతాలు, ఎఫ్ఐఐల విక్రయాలతో సెన్సెక్స్ క్రాష్ -15లో



వాళ్లు గొప్ప నటులు!

పార్లమెంటు ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న బీజేపీ ఎంపీలది నటనేనని ఎస్పీ ఎంపీ జయాబచ్చన్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



చౌతాలా కన్నుమూత

హరియాణా మాజీ సీఎం, జాట్ దిగ్గజం, ఐఎన్ఎల్డీ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ చౌతాలా (89) గుండెపోటుతో కన్నుమూశారు.

వివరాలు 6లో ▸



రాజస్తాన్‌లో ఘోర ప్రమాదం

రాజస్తాన్‌లో ఎల్పీజీ ట్యాంకర్, ట్రక్కు ఢీకొని మంటలు చెలరేగిన ఘటనలో 11 మంది సజీవ దహనం కాగా 35 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



సంభాల్ ఎంపీ ఇల్లు నేలమట్టం

ఆక్రమణల తొలగింపులో భాగంగా యూపీలోని ఎస్పీ ఎంపీ జియా ఉర్ రెహ్మాన్ ఇంటిని అధికారులు నేలమట్టం చేశారు.

వివరాలు 6లో ▸

ఫార్ములా-ఈ ఫైర్!

ఏసీబీ కేసు నమోదైన 24 గంటల్లోనే రంగంలోకి దిగిన ఈడీ



- వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర సవాళ్లు
- 'ఫార్ములా-ఈ'పై చర్చకు బీఆర్ఎస్ ఆఫీసుకైనా వస్తానన్న సీఎం
- 2023 డిసెంబర్ నుంచి ఇప్పటిదాకా ఏం జరిగిందో త్వరలో బయటపెడతానని రేవంత్‌రెడ్డి ప్రకటన
- ఈ అంశంలో అణాపైసా అవినీతి లేదని స్పష్టం చేసిన కేటీఆర్
- ఉన్మాదులు తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని ధ్వజం
- 'ఫార్ములా-ఈ' అంశంపై చర్చకు అసెంబ్లీలో బీఆర్ఎస్ పట్టు
- స్పీకర్ అనుమతించకపోవడంతో తీవ్ర నిరసన.. సభలో గందరగోళం
- మరోవైపు కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్టు చేయవద్దంటూ హైకోర్టు ఆదేశం.. ఈ వ్యవహారంలో కేటీఆర్ ఏం లబ్ధి పొందారని ప్రశ్నించిన న్యాయమూర్తి
- అదంతా దర్యాప్తులో తేలుతుందని సమాధానమిచ్చిన ఏజీ
- దర్యాప్తు కొనసాగించవచ్చని హైకోర్టు సూచన.. దీనితో దూకుడు పెంచేందుకు ఏసీబీ ఏర్పాట్లు

రాష్ట్రంలో 'ఫార్ములా-ఈ' కార్ల రేసు అంశం మంటలు రేపుతోంది. ఏసీబీ కేసు నమోదైన 24 గంటల్లోనే ఈడీ రంగంలోకి దిగడం, మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు కోసం ఈసీఐఆర్ నమోదు చేయడం రాష్ట్ర రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించింది. ఈ వ్యవహారం అసెంబ్లీని కూడా అట్టుడికించింది. బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు, అధికార కాంగ్రెస్ సభ్యుల విమర్శలతో సభ స్తంభించిపోయింది. ఫార్ములా-ఈ అంశంపై చర్చకు సిద్ధమని, సభలోనైనా సరే లేదా బీఆర్ఎస్ కార్యాలయానికి రమ్మన్నా సరే వస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసరగా.. కార్ల రేసు అంశంలో అణాపైసా అవినీతి జరగలేదని, కొందరు ఉన్మాదులు తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మరోవైపు ఈ నెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దంటూ హైకోర్టు ఊరటనిచ్చింది. ఈ వ్యవహారంలో కేటీఆర్ ఏం లబ్ధి పొందారని ప్రశ్నించింది. ప్రాథమిక విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. అదే సమయంలో దర్యాప్తు కొనసాగించవచ్చని సూచించింది. దీనితో దూకుడు పెంచాలని నిర్ణయించిన ఏసీబీ.. అధికారులు, నిందితుల నుంచి వాంగ్మూలాలు తీసుకునేందుకు ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఇక ఈ అంశంలో రంగంలోకి దిగిన ఈడీ ... ఏసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా 'ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు' నమోదు చేసింది.

- పూర్తి వివరాలు 12లో▶



శుక్రవారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన ఎట్‌హోం కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, సీఎం రేవంత్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

3 ప్రాజెక్టుల డీపీఆర్‌లు వెనక్కి

- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జల సంఘం భారీ షాక్
- కాళేశ్వరం అదనపు టీఎంసీ, పాలమూరు-రంగారెడ్డి, వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లు తిప్పి పంపుతూ లేఖ
- తాము లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వకపోవడంతో తీవ్ర చర్యలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) భారీ షాకిచ్చింది. అనుమతుల కోసం గతంలో రాష్ట్ర ప్రభుత్వం పంపించిన కాళేశ్వరం అదనపు టీఎంసీ, పాలమూరు-రంగారెడ్డి, వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లను వెనక్కి పంపించింది. ఈ మూడు ప్రాజెక్టులపై తాము లేవనెత్తిన అంశాల(అబ్జర్వేషన్ల)కు తెలంగాణ ప్రభుత్వం దీర్ఘకాలంగా సమాధానం ఇవ్వలేదని పేర్కొంది. బీఆర్ అంబేడ్కర్ వార్ధా ప్రాజెక్టు డీపీఆర్‌పై తాము లేవనెత్తిన అంశాలకు ఏడాదిగా సమాధానం ఇవ్వలేదని, సత్వరంగా ఇవ్వకపోతే డీపీఆర్‌ను వెనక్కి పంపిస్తామని హెచ్చరిస్తూ గత నెల 22న రాష్ట్ర ప్రభుత్వానికి సీడబ్ల్యూసీ లేఖ రాసింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో.. మూడు ప్రాజెక్టుల డీపీఆర్‌లను పరిశీలించలేమని, వాటిని తమ

మిగతా 14వ పేజీలో ▶

న్యూస్‌రీల్

సాగులో సాంకేతికత పెంచండి



దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకలాంటిదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాలను చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ శుక్రవారం ప్రారంభించారు.

- వివరాలు 13లో▶

కలుపు తీస్తుంది... ఎరువు జల్లుతుంది!



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కిసాన్‌మేళాకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. శాస్త్రవేత్తలు, విద్యార్థులు తమ పరిశోధనలను ప్రదర్శించారు.

- వివరాలు 13లో▶

స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనే!



గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేవారు ఇద్దరికంటే ఎక్కువ సంతానం కలిగి ఉండరాదన్న నిబంధనను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- వివరాలు 2లో▶

జేపీసీకి జమిలి బిల్లులు

తీర్మానాలను ఆమోదించిన పార్లమెంట్ ఉభయ సభలు

- 39 మంది ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ
- లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మందికి స్థానం
- కమిటీ చైర్మన్‌గా బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నియామకం

6 లో





ట్రంప్ ప్రతిపాదనల్ని తిరస్కరించిన హౌస్

- రుణ పరిమితి పెంపు బిల్లు ఆమోదానికి లభించని మూడింట రెండొంతుల మెజారిటీ
- 174-235 ఓట్ల తేడాతో బిల్లు వీగిపోయినట్లు స్పీకర్ మైక్ జాన్సన్ ప్రకటన -6లో



ఓ రోజు వాళ్ల కంపెనీ బ్యాగును కూడా మీ వెంట తీసుకెళ్లితే వాళ్లకు ప్రచారం చేసినట్లు అవుతుందట మేడం!

● యోగా

చురుగ్గా ఉండాలంటే.. సైడ్ పోజ్

ఆటలు ఆడుతూ యాక్టివ్‌గా ఉండే వారు ఈ ఆసనాన్ని నిత్యం సాధనం చేస్తుంటారు. ఈ భంగిమలోని వేగం వారి వారి శరీర సామర్థ్యాన్ని బట్టి ఉంటుంది. ఉత్థిత పార్శ్వకోణాసనగా చెప్పే ఈ ఆసనాన్ని సైడ్ యాంగిల్ పోజ్ అని కూడా అంటారు.

ఈ ఆసనాన్ని సాధన చేయడం ద్వారా కాలు కండరాల, కీళ్ళు, వెన్నెముక, భుజాలను బలపరుస్తుంది. పొట్టలోని అవయవాలను ఉత్తేజపరుస్తుంది. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుంది. సంతానోత్పత్తిని పెంచుతుంది. నడుము నొప్పి, మలబద్ధకం, బహిష్ఠు నొప్పిని తగ్గిస్తుంది. మోకాలిని వంచి ఒక వైపు భాగం వంపు తిరిగేలా ఈ భంగిమ ఉంటుంది. అందుకే దీనిని సైడ్ యాంగిల్ పోజ్ అంటారు.



సాధన చేసే విధానం..

- రెండు పాదాలను సాధ్యమైనంత దూరంగా ఉంచాలి. కుడి మోకాలును వంచి, ఎడమ కాలును నిటారుగా ఉంచాలి.
- ఎడమ చేతిని సాగదీస్తూ తలమీదుగా నిటారుగా ఉంచాలి. కుడి చేతిని మోకాలు మీద లేదా హృదయస్థానంలో ఉంచవచ్చు.
- తల భాగాన్ని ఎంత వీలైంత అంత ఎడమ నుంచి కుడి మోకాలు మీదుగా ఉంచాలి. ఎడమ చేయి నిటారుగా తల మీదుగా ఉండాలి.
- ఇదే విధంగా కుడి నుంచి ఎడమ వైపుగా చేయాలి.
- కుడివైపుకు ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని వదలాలి. అలాగే, ఎడమవైపుకు భంగిమలో ఉన్నప్పుడు ఐదు శ్వాసలు తీసుకొని వదలాలి.

ఈ భంగిమలో కండరాలు, కీళ్ల స్ట్రెచ్ అయ్యి, రక్తప్రసరణ పెరిగి, శరీరం అంతా యాక్టివ్ అవుతుంది.

● పెట్ పేరెంటింగ్



పెట్‌ను పెంచుకునే విషయంలో భారతీయ సమాజం జపాన్ దిశగా అడుగులు వేస్తోంది. పిల్లలు పెద్దయి ఉద్యోగాలు, వ్యాపారాలతో దూరంగా వెళ్లిపోయిన తర్వాత ఇంట్లో ఆ వెలితిని భర్తీ చేయడానికి పెట్‌లను ఆశ్రయిస్తున్నారు. అలాగే సింగిల్ చైల్డ్ ఉన్న పేరెంట్స్ కూడా తమ బిడ్డకు తోబుట్టువులు లేని లోటు తీర్చడానికి పెట్ మీద ఆధారపడుతున్నారు. అయితే పెట్ పేరెంట్స్ ఎటికెట్స్ పాటించకపోవడం సమాజానికి ఇబ్బందిగా మారుతోంది. ఇందుకోసం యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా కొన్ని మార్గదర్శకాలను చెప్పింది కూడా. అయినా పట్టించుకోవడంలో మనవాళ్లు విఫలమవుతూనే ఉన్నారు. ఫలితం... పాదచారులు ఫుట్‌పాత్‌లు, రోడ్డు అంచున ఉన్న పెట్ మల విసర్జకాలను తప్పించుకుంటూ నడవాలి. వాహనదారులు పెట్ ఒక్కసారిగా రోడ్డు మీదకు దూకుతుందేమోననే ఆందోళనతో వాహనం నడపాలి. పెట్‌ని కంట్రోల్ చేయడంలో విఫలమవుతున్న కారణంగా ఎదురవుతున్న సమస్యల జాబితా పెద్దదే.

పిల్లల్లాగే కనిపెట్‌కోవాలి

ఎప్పటికీ చంటిబిడ్డే!

పెట్‌ని పెంచుకోవడం అంటే చంటిపిల్లలను పెంచినట్లే. పిల్లలైతే పెద్దయ్యేకొద్దీ వాళ్ల పనులు వాళ్లు చేసుకుంటారు. పెట్ విషయంలో అలా కుదరదు. దాని జీవితకాలమంతా చంటిబిడ్డను సాకినట్లే చూసుకోవాలి. మన దగ్గర ఇతర జంతువులకంటే ఎక్కువగా కుక్కలనే పెంచుకుంటారు.



పెట్‌ని పెంపకానికి ఇచ్చేటప్పుడే ఏమి చేయాలి, ఏమి చేయకూడదనే నియమావళి చెబుతాం. వ్యాక్సినేషన్, శుభ్రంగా ఉంచడం వరకే పాటిస్తుంటారు. విసర్జకాలు, మనుషుల మీదకు ఎగబాకడం వంటి విషయాలను తగినంతగా పట్టించుకోవడం లేదు. ఎక్కడ రాజీపడతారో సరిగ్గా వాటిలోనే ఇరుగుపొరుగుతో విభేదాలు తలెత్తుతుంటాయని చెప్పారు ఢిల్లీలోని యానిమల్ యాక్టివిస్ట్ కావేరి రాణా. పెట్ పేరెంటింగ్ విషయంలో పాటించాల్సిన ఎటికెట్స్ నేర్పించడానికి క్లాసులు నిర్వహిస్తున్న సృష్టి శర్మ మాట్లాడుతూ... శిక్షణ పెట్‌కి మాత్రమే అనుకుంటారు. కానీ పెట్ పేరెంట్‌కి కూడా అవసరమే. పెట్‌ని వాకింగ్‌కి తీసుకెళ్లినప్పుడు తప్పనిసరిగా బెల్ట్ వేసి తీసుకెళ్లాలి. అయితే బెల్ట్‌ను వదులుగా పట్టుకుంటారు. దాంతో ఆ పెట్ కొత్త మనిషి లేదా మరొక కుక్క కనిపించగానే మీదకు ఉరుకుతుంది. అలాగే ఒక్కసారిగా రోడ్డు మీదకు ఉరకడంతో వెనుక నుంచి వచ్చే వాహనాల కింద పడే ప్రమాదం ఉంటుంది. వీటితోపాటు తరచూ ఎదురయ్యే వివాదాలన్నీ పెట్ విసర్జన విషయంలోనే. పెట్‌ని వాకింగ్‌కి కాలనీల్లో రోడ్డు మీదకు లేదా పార్కులకు తీసుకెళ్తారు. విసర్జన కూడా రోడ్డు మీద లేదా పార్కులోనే చేయిస్తారు. వాకింగ్‌కి వచ్చిన ఇతరులకు కలిగే అసౌకర్యాన్ని ఏ మాత్రం పట్టించుకోరు.



ఖట్‌ని నియంత్రించరాదు!

యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ నియమాల ప్రకారం పెట్‌ని నియంత్రించే ప్రయత్నం చేయరాదు. అవరడం వంటి దాని సహజసిద్ధమైన చర్యలను గౌరవించాలి. అలాగని రాత్రిళ్లు అరుస్తూ ఉంటే ఇరుగుపొరుగు వారికి అసౌకర్యం. కాబట్టి పెట్ కూడా రాత్రి నిద్రపోయేటట్లు రెగ్యులర్ స్లీప్‌టైమ్‌ని అలవాటు చేయాలి. బయటకు తీసుకెళ్లినప్పుడు ఎవరి దగ్గరైనా ఆహారపదార్థాలు కనిపిస్తే వాళ్ల మీదకు దూకి లాక్కునే ప్రమాదం ఉంటుంది. కాబట్టి బయటకు తీసుకెళ్లడానికి ముందే వాటి ఆకలి తీర్చాలి. విసర్జన విషయంలో... ఒక పేపర్ లేదా పాలిథిన్ షీట్ మీద విసర్జన చేయించి ఆ షీట్‌తో సహా తీసి డస్ట్‌బిన్‌లో వేయాలి. పెట్ పేరెంట్స్ తమ పెట్‌లను గారంగా చూసుకుంటారు. కాబట్టి వాటికి పాంపరింగ్ అలవాటైపోతుంది. ఇంట్లో వాళ్లతోపాటు ఇంటికి వచ్చిన అతిథులు కూడా గారం చేయాలని కోరుకుంటాయి. అతిథుల మీదకు వెళ్లిపోయి ఒడిలో కూర్చుంటాయి. వచ్చిన వాళ్లకు పెట్‌లను తాకడం ఇష్టంలేకపోతే వారికి ఎదురయ్యేది నరకమే. అలాగే పెట్ పేరెంట్స్ పెట్ ఒళ్లంతా నిమిరి చేతులను కడుక్కోకుండా అలాగే అతిథులకు తినుబండారాలను వడ్డించడం కూడా దాదాపు అలాంటిదే. పెట్ పేరెంట్‌కు శిక్షణ తరగతుల్లో అన్ని విషయాలనూ వివరిస్తారు. కానీ మన భారతీయ సమాజం కొంతవరకే ఒంటపట్టించుకుంటోంది. జపాన్, యూఎస్ వంటి దేశాల్లోనూ పెట్ లవర్స్ ఎక్కువే. అక్కడ నియమావళిని కూడా అంతే కచ్చితంగా పాటిస్తారు.

వింటర్ ఒంట బట్టిందా...



'వింటర్ వచ్చిందంటే ఉదయమే లేవబుద్ధికాదు, ఓ పట్టాన ఏ పనీ చేయబుద్ధి కాదు. ఇక వ్యాయామం ఎప్పుడు చేయాలి సామీ?' అంటారు చాలామంది. అయితే ఆరోగ్యాభిలాషుల నుంచి వచ్చే ప్రశ్న మరోలా ఉంటుంది. 'శీతాకాలంలో వ్యాయామం ఏ సమయంలో చేస్తే మంచిది?' అనేదే వారి అనుమానం.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ చండీగఢ్, కార్డియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రాజేష్ విజయ వర్గియా ఇదే ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఉదయం లేదా సాయంత్రం మంచులేని వేళల్లో ఎవరైనా వ్యాయామం చేసుకోవచ్చు. అయితే ప్రతిరోజు ఒకటే టైమ్‌ని, ఒకటే షెడ్యూల్‌ని తప్పకుండా పాటించడం ఉత్తమం' అని చెప్పారు. జాగింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి సాధారణ వ్యాయామ నియమావళి, చలికాలంలో కార్డియో రెస్పిరేటరీ ఫిట్‌నెస్‌కి సరిపడా వ్యాయామమని ఆయన అన్నారు.

శీతాకాలంలో ఒత్తిడి లేకుండా, శక్తికి మించకుండా, చక్కటి అనుభూతిని పొందగలిగే వ్యాయామాలనే ఎంచుకోవాలి, వ్యాయామం తర్వాత కూడా వ్యక్తిగత పనులను సులభంగా చేసుకోగలగాలి. అలా చేస్తే గుండె, ఊపిరితిత్తులు, కండరాలు ఆరోగ్యకరంగా మారతాయి. కార్డియోరెస్పిరేటరీ ఫిట్‌నెస్ బాగుందో లేదో కూడా చేసే వ్యాయామాన్ని బట్టి, వ్యాయామం చేస్తున్నప్పుడు కలిగే అలసటను బట్టి తెలుసుకోవచ్చు. కఠినమైన వ్యాయామాలు చేసేటప్పుడు హార్ట్ బీట్‌ని బట్టి, శ్వాస తీసుకునే విధానాన్ని బట్టి ఆరోగ్యపరిస్థితిని అంచనా వేయొచ్చు. కార్డియోరెస్పిరేటరీ ఫిట్‌నెస్ బాగుండాలంటే రోజుకి పది వేల అడుగులను లక్ష్యంగా చేసుకోవాలి అని రాజేష్ చెబుతున్నారు.

శీతాకాలంలో శారీరక శ్రమ తగ్గడం, బరువు పెరగడం, వాయు కాలుష్యం, ఇండోర్ స్మోకింగ్ వంటి ఎన్నో కారణాలు ఆరోగ్యానికి ప్రమాద సూచికలు. వింటర్‌లో గుండె ఆరోగ్యం ఎక్కువ శాతం ప్రతికూలంగా మారుతుంది. అధిక రక్తపోటు ఎక్కువయ్యే అవకాశాలు పెరుగుతుంటాయి. శరీరంలోని వివిధ ప్రతికూల జీవరసాయన ప్రతిచర్యలు, ధమనుల సంకోచం, పెరిగిన అడ్రినలిన్ స్రావం, ప్లేట్‌లెట్ అగ్రిగేషన్ మొదలైనవి గుండెపోటుకు దారి తీస్తాయి.

వ్యాయామానికి సరిపడా వెచ్చని దుస్తులు, పగటిపూట శారీరక శ్రమతో పాటు, చక్కటి కేలరీ ఫుడ్ తీసుకోవడం, క్రమం తప్పకుండా బీపీ చెక్ చేసుకోవడం ఉత్తమం. గుండె, రక్తపోటు సమస్యలు ఉన్నవారు మందులు మానకూడదు. వ్యాయామానికి ముందు తగినన్ని నీళ్లు తాగాలి.



మీకు తెలుసా?

ఇటీవలి కాలంలో ఆరోగ్యానికి మంచిదనే ప్రచారం జరుగుతుండడంతో పచ్చిపసుపు వాడకం పెరుగుతోంది. అయితే మంచిది కదా అని ఎవరు పడితే వారు ఎంతపడితే అంత, ఎలా పడితే అలా తీసుకోకూడదు. దానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం...

- కామెర్లు ఉన్నవారు పసుపును తీసుకుంటే హెపటైటిస్ ప్రమాదాన్ని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. పసుపు అధిక మోతాదులో తీసుకుంటే శరీరంలో ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తుంది. అందువల్ల, ఐరన్ లోపం ఉన్నవారు పసుపును జాగ్రత్తగా వాడాలి. ఇది శరీరంలో మరింత ఐరన్ లోపానికి కారణమవుతుంది.



- పసుపులో ఉండే కర్కుమిన్ అనే రసాయనం డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయులను తగ్గిస్తుంది. అందువల్ల డయాబెటిస్ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు, ఎందుకంటే కర్కుమిన్ రక్తంలో చక్కెర స్థాయుల మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపి ఒక్కసారిగా రక్తంలో చక్కెర స్థాయులను తగ్గిస్తుంది.

సినిమా



● అనుపమ

న్యాయం కోసం...

మలయాళ స్టార్ సురేష్ గోపి, అనుపమా పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' (జె.ఎస్.కె). ప్రవీణ్ నారాయణ దర్శకత్వంలో జె. ఫణీంద్ర కుమార్ నిర్మించారు. ఈ సినిమాని ఫిబ్రవరిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ''వాస్తవ ఘటనల ఆధారంగా తీసిన కోర్టు రూమ్ డ్రామా మూవీ 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. తనకు జరిగిన అన్యాయాన్ని జానకి కోర్టులో ఎలా ఎదుర్కొంది? న్యాయం కోసం ఆమె ఎలా పోరాటం చేసింది? అనే నేపథ్యంలో ఇంటెన్స్ డ్రామాగా నిర్మించాం. ఈ కేసుని వాదించే లాయర్‌గా సురేష్ గోపి చేశారు'' అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: రెనదివ్, సంగీతం: గిరీష్ నారాయణన్, జిబ్రాన్.

పుష్ప రికార్డుల మోత



● అల్లు అర్జున్

- హిందీలో 15 రోజుల్లో 632 కోట్ల వసూళ్లు
- వందేళ్ల హిందీ సినిమా చరిత్రను తిరగరాసిన 'పుష్ప'

బాక్సాఫీస్ వసూళ్ల వేటలో పుష్పరాజ్ ('పుష్ప'లో అల్లు అర్జున్ పాత్ర) ఏ మాత్రం తగ్గడం లేదు. సరికొత్త రికార్డులను సృష్టించడంలో అస్సలు తగ్గేదే లే అంటూ దూసుకెళుతున్నాడు. ఇప్పటి వరకు హిందీ సినీ చరిత్రలో ఏ సినిమా కలెక్ట్ చేయని విధంగా 15 రోజుల్లోనే 632 కోట్ల 50 లక్షల రూపాయల వసూళ్లను సాధించిన తొలి భారతీయ చిత్రంగా 'పుష్ప 2: ది రూల్' నిలిచినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా నటించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహించారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన సంగతి తెలిసిందే. విడుదలైన తొలి రోజు నుంచే అన్ని ఏరియాల్లో కలెక్షన్స్ విషయంలో ఆల్‌టైమ్ రికార్డులు నెలకొల్పుతున్న 'పుష్ప 2: ది రూల్' బాక్సాఫీస్ వద్ద తన హవా కొనసాగిస్తోంది. ముఖ్యంగా వందేళ్ల హిందీ సినీ చరిత్రలో 'పుష్ప 2' చిత్రంతో అల్లు అర్జున్ కొత్త రికార్డులు సృష్టిస్తున్నట్లు చిత్రబృందం పేర్కొంది. ''ఇప్పటి వరకు హిందీ సినీ చరిత్రలో ఏ సినిమా కలెక్ట్ చేయని విధంగా కేవలం 15 రోజుల్లోనే 632 కోట్ల 50 లక్షల రూపాయల వసూళ్లను సాధించిన తొలి భారతీయ చిత్రంగా 'పుష్ప 2' ఘనతను దక్కించుకుంది. ఇప్పటి వరకు అత్యధిక వసూళ్లను సాధించిన 'స్త్రీ 2' చిత్రం లైఫ్ టైమ్ రన్‌ను కేవలం 15 రోజుల్లోనే 'పుష్ప 2' అధిగమించింది. ఇంకా అత్యంత వేగంగా 14 రోజుల్లోనే రూ. 1500 కోట్ల వసూళ్లు సాధించిన తొలి భారతీయ చిత్రంగా, అలాగే కేవలం ముంబైలోనే 200 కోట్ల నెట్ వసూళ్లు చేసిన తొలి చిత్రంగానూ మా సినిమా రికార్డులు సృష్టించింది. 2024లో అత్యధిక గ్రాస్‌ను సాధించిన తొలి భారతీయ చిత్రంగానూ రికార్డు నమోదు చేసింది. 'పుష్ప: ది రైజ్, పుష్ప 2: ది రూల్' చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ అత్యధిక గ్రాసర్స్ వసూలు చేసిన ఇండియన్ సినిమాల హీరోగా అల్లు అర్జున్ కొత్త రికార్డు సాధించారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఆధ్యాత్మిక ప్రపంచంలోకి...



● యుగంధర్ ముని, రాజశేఖర్, ఆది సాయికుమార్

ఆది సాయికుమార్, అర్చనా అయ్యర్ జంటగా నటిస్తున్న చిత్రం 'శంబాల'. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో ఆరంభమైంది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ-''సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'శంబాల'. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ పొందిన యుగంధర్ హాలీవుడ్ స్థాయి నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో ఈ మూవీని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులను ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ చిత్రం ఉంటుంది. ఆది జియో సైంటిస్ట్‌గా కనిపించనున్నారు'' అని తెలిపారు. శ్వాసిక, రవివర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీరామ్ మద్దూరి.

విలన్‌గా...

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఎన్‌కేఆర్ 21' (వర్కింగ్ టైటిల్). ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. విజయశాంతి, శ్రీకాంత్, పృథ్వీరాజ్ కీలక పాత్రలు చేస్తున్నారు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటుడు సోహైల్ ఖాన్ తెలుగు తెరకు పరిచయం కానున్నారు. శుక్రవారం (డిసెంబరు 20) సోహైల్ పుట్టినరోజు సందర్భంగా 'ఎన్‌కేఆర్ 21'లో ఆయన చేస్తున్న పాత్ర ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''సోహైల్ ఖాన్ చేస్తున్న విలన్ పాత్ర, హీరో, ఈ పాత్ర మధ్య వచ్చే సన్నివేశాలు హైలైట్‌గా ఉంటాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. కల్యాణ్ రామ్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: రామ్ ప్రసాద్.



● సోహైల్ ఖాన్

స్టూడెంట్‌గా నటించడం ఓ సవాల్

– ఐశ్వర్యా శర్మ



''డ్రింకర్ సాయి'లో ఒక మంచి ప్రేమకథను చూస్తారు. ఈ సినిమాలో బాగీ పాత్రలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని ఐశ్వర్యా శర్మ తెలిపారు. ధర్మ హీరోగా కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరీధర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన ఐశ్వర్యా శర్మ మాట్లాడుతూ- ''మా నాన్న స్టేజ్ యాక్టర్ కావడంతో నేనూ ఆర్టిస్టుగానే ఉండాలనుకున్నాను. ఇంటర్ పూర్తయిన తర్వాత జమ్మూ నుంచి ముంబై వచ్చి యాక్టింగ్ కోర్సులో జాయిన్ అయ్యాను. కొన్ని యాడ్స్‌లో నటించాను. 'డ్రింకర్ సాయి'తో హీరోయిన్‌గా పరిచయమవుతున్నాను. ఈ సినిమాలో మెడికల్ స్టూడెంట్ బాగీ పాత్ర చేశాను. రెగ్యులర్ హీరోయిన్ పాత్రలకు భిన్నంగా ఈ క్యారెక్టర్ ఉంటుంది. అందుకే ఈ స్టూడెంట్ క్యారెక్టర్ సవాల్‌గా అనిపించింది. ఇక 'అర్జున్ రెడ్డి' చిత్రానికీ, 'డ్రింకర్ సాయి' సినిమాకు పోలిక లేదు'' అని చెప్పారు.


పోరాటాలకు విరామం ఉండదు



● చాణక్య, కియా రెడ్డి, కళా శ్రీనివాస్

చాణక్య హీరోగా నటించిన చిత్రం 'దక్కన్ సర్కార్'. కియా రెడ్డి, మౌనిక హీరోయిన్లు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించడంతో పాటు దర్శకత్వం వహించి, నిర్మించారు కళా శ్రీనివాస్. ఈ సినిమా టీజర్, పోస్టర్ లాంచ్ కార్యక్రమంలో కళా శ్రీనివాస్ మాట్లాడుతూ- ''తెలంగాణలోని ప్రతి అంశంపై సినిమా తీయవచ్చు. పోరాటాలకు విరామం ఉండదనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీయడం జరిగింది'' అని తెలిపారు. ''తెలంగాణలోని ప్రతి ఒక్కర్నీ ప్రతిబింబించేలా ఈ చిత్రంలోని సన్నివేశాలు ఉంటాయి'' అని అన్నారు చాణక్య. ''తెలంగాణ ఉద్యమంలోని కష్టాలను ఈ సినిమాలో చూపించారు. ఉద్యమంలో పని చేసిన కళా శ్రీనివాస్ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఈ సినిమా తీశాడు'' అన్నారు తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నారెడ్డి.

మనుషులను... మనసులను కదిలించే ముఫాసా



మనం చూసే ప్రతి సినిమాలో మనలోని నిజ జీవిత పాత్రలను మనలోని కొంతమంది (నటీనటులు) తెర మీద పోషించి మనల్ని మెప్పించడం సహజమే. కానీ మనలోని భావావేశాలను జంతువులతో డిజిటల్ రూపంలో పలికించి మన మనసులను కదిలించడమంటే సామాన్యమైన విషయం కాదు. ఈ విషయంలో హాలీవుడ్‌ని నిజంగా అభినందించాలి. కానీ హాలీవుడ్ కన్నా మన టాలీవుడ్ 40 ఏళ్ల క్రితమే... అంటే డిజిటల్ సాంకేతికత మనకు పరిచయం కాని రోజుల్లోనే ఇటువంటి కోవలోనే మనకు ఓ సినిమా పరిచయం చేసింది. ఆ సినిమా పేరే 'మాకూ స్వాతంత్ర్యం కావాలి'. ఇక్కడ టాలీవుడ్, హాలీవుడ్ చేసిందా అన్నది కాదు, మనుషులకు జంతువులతో కూడా భావావేశాలు పలికించవచ్చన్నదే విషయం. 2019లో విడుదలైన 'ది లయన్ కింగ్' సినిమా సిరీస్‌లో వచ్చిన రెండో భాగం 'ముఫాసా'. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో అన్ని భాషల్లో విడుదలైంది. ఈ సినిమాకి అన్ని భాషల్లో పేరున్న గొప్ప నటీనటులు డబ్బింగ్ చెప్పడం మరో విశేషం. తెలుగులో ప్రముఖ నటులు మహేశ్‌బాబు, సత్యదేవ్, బ్రహ్మానందం, అలీ తదితరులు తమ వాయిస్ ఇచ్చారు. కాబట్టి సినిమా చూస్తున్నంతసేపు మన నేటివిటీ ఎక్కడా తగ్గదు... ఒక్క పేర్లలో తప్ప. ఈ సినిమాకి బారీ జెర్కిన్స్ దర్శకుడు. కథాపరంగా లయన్ కింగ్‌కి కొనసాగింపైన ఈ 'ముఫాసా'లో సింబా–నాలా సింహాలకు కియారా అనే ఆడ సింహం పుడుతుంది. టిమన్, పంబ దగ్గర కియారాని వదిలేసి సింబా–నాలా సింహాలు తమ ఇంకో బిడ్డకు జన్మనివ్వడానికి సెరెన్ ఒయాసిస్‌కు బయలుదేరతాయి. అప్పుడు రఫీకి అనే కోతి కియారాకు తాను సింబా వయస్సులో ఉన్నపుడు జరిగిన ముఫాసా కథ గురించి చెబుతుంది. ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్ ఆర్‌సియం రోజు ఈ రఫీకి గాత్రదానం చేశారు. కథంతా ఈ రఫీనే చెప్తాడు. ముఫాసా అనే పిల్ల సింహం ఓ తుఫానులో చిక్కుకుని తన తల్లిదండ్రుల నుండి విడిపోతుంది. అలా నీళ్లలో ముఫాసా కొట్టుకుపోతూ టాకా అనే మరో సింహం పిల్లను కలుస్తుంది. టాకా తల్లిదండ్రులు ఒబాసీ, ఇషా. వీళ్లిద్దరూ వారి ప్రాంతంలో రాజు, రాణి. టాకాని యువరాజును చేయాలనుకుంటారు. ఇంతలో తెల్ల సింహాల గుంపు వీరి రాజ్యం మీద దాడి చేస్తుంది. వాటి నుండి ముఫాసా, టాకా తప్పించుకుంటారు. ముఫాసా తన తల్లిదండ్రులను వెతుక్కుంటూ మిలేలే అనే ప్రాంతానికి వెళ్లాలనుకుంటాడు. తరువాత సినిమా అంతా ముఫాసా తన తల్లిదండ్రులను చేరుకుంటాడా? లేదా అన్నదే. ఈ సినిమా స్క్రీన్‌ప్లే పిల్లలకు బాగా నచ్చుతుంది. అలానే పెద్దల మనసులను కదిలిస్తుంది. ఎక్కడా గ్రాఫిక్స్ అన్నదే తెలియకుండా నిజజీవితంలో జంతువుల కథను దగ్గరగా చూసినట్లు ఉంటుంది. వర్తపుల్ మూవీ ఫర్ ఫ్యామిలీ.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 270

శనివారం 21-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఈ నీళ్లు.. చాలా ఖరీదు గురూ!

-16లో



ఆసీస్ జట్టులో కొన్‌స్టాస్‌కు చోటు


-15లో



కారులో 52 కిలోల బంగారం

భోపాల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కారులో రూ. 40 కోట్ల విలువైన 52 కిలోల బంగారం, రూ. 11 కోట్ల నగదును వదిలివెళ్లారు.

వివరాలు 6లో ▶



పెళ్లి కమర్షియల్ వెంచర్ కాదు

మహిళా చట్టాలను భర్తలపై వేధింపులకు, దోపిడీకి సాధనాలుగా దుర్వినియోగం చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▶



కుదిరితే కప్పు టీ

భారత ప్రధాని నరేంద్ర మోదీతో తనకు చక్కటి సంబంధాలు ఉన్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ చెప్పారు.

వివరాలు 6లో ▶



రాహుల్‌పై కేసు క్రైం బ్రాంచ్‌కు

ఎంపీల తోపులాటకు సంబంధించి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై నమోదైన కేసును ఢిల్లీ పోలీసులు క్రైం బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

వివరాలు 6లో ▶

రైతుల సమాచారం
దేశం దాటించారు

తెలంగాణ భూ రికార్డులను విదేశీ కంపెనీల చేతుల్లో పెట్టారు

చెప్పలేని స్థాయిలో పోర్టల్ నిర్వహణ కంపెనీ అరాచకాలు

భూ భారతి బిల్లుపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఆ నేరాలకు శిక్ష వేయాలంటే చట్టాలన్నీ చదవాలి
- ధరణి కేసీఆర్ సృష్టి కాదు.. 2010లోనే ఒడిశాలో ఈ పోర్టల్
- ఆ పోర్టల్ నిర్వహించిందీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీనే
- మేం తొందరపడి చర్యలు తీసుకుంటే భూ రికార్డులన్నీ క్రాష్ అయ్యేవన్న సీఎం
- తెలంగాణ రైతాంగానికి మేలు చేసేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడి



భూ భారతి బిల్లుపై చర్చలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ధరణి పోర్టల్ అద్భుతమని, అమృతమని చెప్పారు. కానీ ఆ పోర్టల్ నిర్వహించిన కంపెనీ అరాచకాలు, దుర్మార్గం, దురాగతాలు చెప్పలేని స్థాయిలో ఉన్నాయి. కాంట్రాక్టు అగ్రిమెంట్‌ను ఉల్లంఘించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో ఉండి ధరణి పోర్టల్ నిర్వహించాలనే నిబంధనను పట్టించుకోలేదు. యజమానులు మారినప్పుడు ప్రభుత్వానికి ముందస్తు సమాచారం ఇవ్వాలన్న అంశాన్ని పక్కన పెట్టారు. బెంగళూరు, విజయవాడ, గుర్‌గావ్, ఈశాన్య రాష్ట్రాల్లో ఉండి తెలంగాణ భూముల క్రయ, విక్రయ లావాదేవీలు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని భూముల వివరాలను విదేశీ కంపెనీల చేతుల్లో పెట్టారు. రైతాంగ సంపూర్ణ సమాచారాన్ని దేశం దాటించారు. రైతుల భూమి డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు, టెలిఫోన్ నంబర్లు దేశం దాటి వెళ్లిపోయాయి. ఇది తీవ్రమైన నేరం. దీనికి ఏ స్థాయిలో శిక్ష విధించాలో

మిగతా 2వ పేజీలో ▶

భూ భారతి బిల్లుకు ఆమోదం

- రెవెన్యూ మంత్రిని అభినందించిన మంత్రులు, సభ్యులు 2లో

ధరణి లావాదేవీలపై 'ఫోరెన్సిక్ ఆడిట్': పొంగులేటి

- వివరాలు 2లో

చిరుధాన్యాల్లో మనమే పెద్దన్న

ప్రపంచంలో చిరు ధాన్యాలను అధికంగా పండించే దేశం మనదే. ప్రపంచంలో పండే వాటిలో మనదేశ వాటా 38.4 శాతం. మన తరువాతి స్థానాల్లో నైజీరియా, చైనా ఉన్నాయి. 2023–24లో మనదేశం రూ.489 కోట్ల విలువైన 1,32,985 టన్నుల చిరుధాన్యాలను ఎగుమతి చేసింది. ఇందులో 90 శాతానికి పైగా కేవలం 10 రాష్ట్రాల నుంచే జరిగింది.

1.46 లక్షల హెక్టార్లు 2023–24లో ఏపీలో చిరు ధాన్యాలు పండించిన విస్తీర్ణం

2,672 కిలోలు ఏపీలో హెక్టారుకు వచ్చిన దిగుబడి. దేశంలో ఇదే అత్యధికం. గత 5 ఏళ్లలోనూ ఏపీలోనే అత్యధికం.

రాష్ట్రం	ఎగుమతుల విలువ (రూ.కోట్లలో)
గుజరాత్	166
మహారాష్ట్ర	76
రాజస్థాన్	48
తెలంగాణ	4.9
ఝార్ఖండ్	33
ఆంధ్రప్రదేశ్	24
పంజాబ్	21
పశ్చిమబెంగాల్	19
కర్ణాటక	17
తమిళనాడు	10

ఆధారం: డీజీసీఐఎస్, ఏపీఈడీప

అసెంబ్లీలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ సభ్యులను అడ్డుకుంటున్న మార్షల్స్



అట్టుడికిన అసెంబ్లీ

సభలో తీవ్ర ఉద్రిక్తత... గందరగోళం

- 'ఫార్ములా–ఈ'రేసుపై ఏసీబీ కేసు మీద చర్చకు బీఆర్ఎస్ పట్టు
- అంగీకరించని స్పీకర్.. భూ భారతి బిల్లుపై చర్చిద్దామని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ సభ్యులు, మార్షల్స్‌కు మధ్య తోపులాట
- సభ వాయిదా పడి తిరిగి ప్రారంభమైనా కొనసాగిన ఆందోళన
- స్పీకర్ పట్టించుకోక పోవడం, అధికార పక్షం స్పందించకపోవడంతో సభ నుంచి నిష్క్రమణ

2లో

కోత చకచకా.. ఆరబోతకు వెత

గంటలోనే ఎకరం పొలం కోసేస్తున్న హార్వెస్టర్


- ఆపై ధాన్యం ఆరబెట్టేందుకు అందుబాటులో లేని యంత్రాలు
- రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న వరిసాగు విస్తీర్ణం

5లో

మేడిగడ్డ నిర్ణయం కేసీఆర్‌దే!

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు తెలిపిన కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్

- తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ అనలేదు
- ముంపు సమస్య మహారాష్ట్రతో సంప్రదింపుల ద్వారా పరిష్కారమయ్యేది
- రాజకీయ, ఇతర కారణాలతోనే మేడిగడ్డ బరాజ్ నిర్మాణం
- మేడిగడ్డ తరహాలో అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కూడా కుంగిపోవచ్చని వ్యాఖ్య



విచారణకు హాజరై వస్తున్న వెదిరె శ్రీరామ్

సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహెట్టికి బదులు మేడిగడ్డ బరాజ్ నిర్మించాలన్న ఆలోచన నాటి సీఎం కేసీఆర్‌దేనని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారుడు వెదిరె శ్రీరామ్ స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) లేఖ ఇవ్వడం, మహారాష్ట్రతో ముంపుపై వివాదం ఏర్పడడంతోనే మేడిగడ్డకు మార్చామని కేసీఆర్ ప్రభుత్వం చేసిన వాదన పూర్తిగా అబద్ధమని కొట్టిపారేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటిలభ్యత ఉందని సీడబ్ల్యూసీ ఎన్నో లేఖలు రాసిందని, సంప్రదింపులతో మహారాష్ట్రతో ముంపు సమస్యను పరిష్కారానికి అవకాశం ఉండేదన్నారు. రాజకీయ, 'ఇతర'కారణాలతోనే మేడిగడ్డ బరాజ్ నిర్మించారని ఆరోపించారు. కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ శుక్రవారం నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు వెదిరె శ్రీరామ్ హాజరై

మిగతా 5వ పేజీలో ▶

రాష్ట్రాల అభివృద్ధికి రుణస్వేచ్ఛ ఇవ్వండి

- ప్రీబడ్జెట్ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరిన డిప్యూటీ సీఎం భట్టి
- రాష్ట్రాల మూలధన వ్యయానికి ఏటా రూ. 2.5 లక్షల కోట్లు కేటాయించాలని వినతి
- ఎంఎస్ఎంఈ సాంకేతిక అభివృద్ధి నిధిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు వెల్లడి
- గిగ్ కార్మికులకు సరైన భద్రత కోసం జాతీయ విధానాన్ని రూపొందించాలని సూచన

- వివరాలు 3లో



కార్పొరేషన్లుగా పాలమూరు, మంచిర్యాల

రాష్ట్రంలో కొత్తగా రెండు మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు కాబోతున్నాయి. గ్రేడ్–1 మున్సిపాలిటీలుగా ఉన్న మహబూబ్‌నగర్, మంచిర్యాలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం రూపొందించిన చట్ట సవరణ బిల్లుకు శాసన సభ ఆమోదం తెలిపింది. ఈ రెండు మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది.

- వివరాలు 3లో ▶



రెక్కవిచ్చుకున్న 'అక్షరం'

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు రెండో రోజు శుక్రవారం సందర్శకులు, పుస్తకప్రియులు పోటెత్తారు. మధ్యాహ్నం నుంచే స్టాళ్లన్నీ కిటకిటలాడాయి. యువ రచయితల పుస్తకాలు పాఠకులను ఆకట్టుకుంటున్నాయి.

7లో

అట్టుడికిన అసెంబ్లీ

సభలో తీవ్ర ఉద్రిక్తత .. గందరగోళం


అసెంబ్లీలో స్పీకర్ పోడియం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. 'ఫార్ములా–ఈ'రేసుపై ఏసీబీ కేసు మీద చర్చకు బీఆర్ఎస్ పట్టుబట్టడం, స్పీకర్ అంగీకరించకపోవడంతో నిరసనకు దిగడం, స్పీకర్ పోడియంను ముట్టడించే క్రమంలో వారికి మార్షల్స్‌కు మధ్య తోపులాట జరగడం, కాంగ్రెస్ సభ్యులు కూడా ఢీ అంటే ఢీ అన్నట్టు సిద్ధమవటంతో కొద్దిసేపు తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. సభ వాయిదా అనంతరం తిరిగి ప్రారంభమయ్యాక కూడా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగించారు.

'ఫార్ములా–ఈ'రేసుపై ఏసీబీ కేసు మీద చర్చకు బీఆర్ఎస్ పట్టు

- అంగీకరించని స్పీకర్.. భూ భారతి బిల్లుపై చర్చిద్దామని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ సభ్యులు, మార్షల్స్‌కు మధ్య తోపులాట
- సభ వాయిదా పడి తిరిగి ప్రారంభమైనా కొనసాగిన ఆందోళన
- స్పీకర్ పట్టించుకోకపోవడం, అధికార పక్షం స్పందించకపోవడంతో సభ నుంచి నిష్క్రమణ

తొలుత ఏసీబీ కేసుపై చర్చించాల్సిందే: హరీశ్‌రావు

శుక్రవారం ఉదయం సభ ప్రారంభం కాగానే భూ భారతి బిల్లుపై చర్చను ప్రారంభించేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సిద్ధమయ్యారు. అయితే బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు జోక్యం చేసుకుని ముందుగా ఫార్ములా–ఈ రేస్ విషయంలో ఏసీబీ కేసుపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ వెంటనే చర్చించలేని పక్షంలో ఎప్పుడు చర్చకు అనుమతిస్తారో ప్రకటించాలని కోరారు. ముందైతే భూ భారతి బిల్లుపై చర్చను కొనసాగిద్దామని, ఆ తర్వాత ఈ ఫార్ములా రేస్ అంశంపై చూద్దామని స్పీకర్ పేర్కొనగా.. హరీశ్‌రావు అభ్యంతరం చెప్పారు.

ఆ సభ్యుడికి అవకాశం ఇవ్వాలి కదా..

'కేటీఆర్‌పై పెట్టింది అక్రమ కేసు కాకుంటే, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ సభలో ఈ–కార్ రేసింగ్ అంశంపై చర్చించాలని కోరుతున్నా. అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఓ సభ్యుడిపై అక్రమ కేసు పెట్టినప్పుడు ఆ సభ్యుడికి చెప్పుకునే అవకాశం ఇవ్వాలి కదా.. ఆయనకు చెప్పుకునే అవకాశం ఇస్తే ఆ కేసులో ఆయనది తప్పా, ఒప్పా అన్న విషయంలో ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు కూడా ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. ఇది ముమ్మాటికీ అక్రమ కేసు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల గురించి, లగచర్ల అంశం గురించి ప్రశ్నిస్తున్నాడు గనుకనే కేటీఆర్‌ను వేధించే క్రమంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసు పెట్టారు..'అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



భూ భారతి రాష్ట్రానికి సంబంధించిన అంశం: స్పీకర్

స్పీకర్ స్పందిస్తూ..'శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి సభలో లేరు. ఆయన వచ్చిన తర్వాత మీ వినతిపై నిర్ణయం తీసుకుంటాం. ముందైతే భూ భారతి మీద చర్చను కొనసాగిద్దాం..'అని అన్నారు. అయినా హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ సభ్యులు ముందు వరసలోకి వచ్చి ఫార్ములా–ఈ రేసుపై చర్చకు పట్టుబట్టారు. దీంతో 'భూ భారతి రాష్ట్రానికి సంబంధించిన అంశం. మీరు అడుగుతోంది ఓ సభ్యుడికి సంబంధించింది. ముందు భూ భారతిపై చర్చ జరుపుదాం..' అని స్పీకర్ మరోసారి కోరారు. కానీ బీఆర్ఎస్ సభ్యులు పట్టువీడలేదు. కాంగ్రెస్ సభ్యుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి లేచి, ఈ–కార్ రేసింగ్‌పై విచారణకు గవర్నర్ అనుమతిచ్చాక, ఏసీబీ కేసు పెట్టిన తర్వాత శాసనసభలో దానిపై చర్చించే అంశమే ఉత్పన్నం కాదని, ప్రజల్లో ఓ అయోమయాన్ని సృష్టించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. అనంతరం భూ భారతి బిల్లుపై స్పీకర్ చర్చ ప్రారంభించారు.

స్పీకర్‌పైకి ప్లకార్డు ముక్కలు, కాగితాలు

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చర్చను ప్రారంభిస్తూ.. భూ భారతి చట్టం తేవాలనుకోవటానికి గల కారణాలను వివరించటం ప్రారంభించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి వచ్చి, ఈ–కార్ రేస్‌పై పెట్టిన కేసు కక్షపూరితమైందని పేర్కొనే ప్లకార్డులు పట్టుకుని నినాదాలివ్వటం ప్రారంభించారు. తర్వాత స్పీకర్ పోడియం దగ్గర గుమిగూడారు. మార్షల్స్‌ను తోసుకుంటూ పోడియంను ముట్టడించారు. ఈ క్రమంలో మార్షల్స్‌కు, బీఆర్ఎస్ సభ్యులకు మధ్య తోపులాట జరిగింది. ఇంతలో మరికొందరు మార్షల్స్ అక్కడికి చేరుకుని బీఆర్ఎస్ సభ్యులను పోడియంకు దూరంగా నెట్టుకుంటూ తీసుకెళ్లారు. ఆ సమయంలో బీఆర్ఎస్ సభ్యుడు కౌశిక్‌రెడ్డి తన చేతిలోనే ప్లకార్డును ముక్కలు చేసి స్పీకర్‌పైకి విసిరారు. మరికొందరు సభ్యులు, అసెంబ్లీ వ్యవహారాలకు సంబంధించిన కాగితాలను పోడియం పైకి విసిరారు. బీఆర్ఎస్ సభ్యుడొకరు మంత్రి పొంగులేటి వైపు దూసుకు రావడంతో కొందరు కాంగ్రెస్ సభ్యులు ఆయనకు రక్షణగా నిలబడ్డారు.

బీఆర్ఎస్ సభ్యులపైకి కాగితాలు

ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ సభ్యులు కొందరు ముందు వరసలోకి వచ్చి కాగితాలను బీఆర్ఎస్ సభ్యులపైకి విసిరారు. పరిస్థితి చేయిదాటేలా ఉండటంతో స్పీకర్ సభను 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. స్పీకర్ చాంబర్‌లో దీనిపై కాంగ్రెస్ సభ్యులు ఆయనతో చర్చించారు. 35 నిమిషాల తర్వాత సభ తిరిగి ప్రారంభం కాగా.. మంత్రి పొంగులేటి ప్రసంగాన్ని కొనసాగించారు. అయితే ఆయన మాట్లాడుతున్నంత సేపు బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లో నినాదాలిస్తూ నిరసన తెలుపుతూనే ఉన్నారు. చర్చకు సహకరించాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కోరినా బీఆర్ఎస్ సభ్యులు పట్టువీడలేదు. చర్చలో భాగంగా బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చిన స్పీకర్, ఆ పార్టీ సభ్యుడు పల్లా రాజేశ్వరరెడ్డిని మాట్లాడాల్సిందిగా సూచించినా.. ఆయన నిరసనలోనే ఉండి మాట్లాడ్డానికి రాలేదు. దీంతో బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర రెడ్డికి స్పీకర్ అవకాశం ఇచ్చారు. అయినా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగించారు. దీంతో చాంబర్‌కు వస్తే మాట్లాడదామని వారికి చెప్పిన స్పీకర్ సభను వాయిదా వేశారు.

మధ్యాహ్నం తర్వాతా కొనసాగిన ఆందోళన

మధ్యాహ్నం తర్వాత సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులు పట్టుకుని స్పీకర్ పోడియం వద్దకు వెళ్లే ప్రయత్నం చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు ముందుకు దూసుకువస్తుండడంతో మహిళా మార్షల్స్‌ను వారికి అడ్డుగా నిలబెట్టి నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ గందరగోళంలోనే మహేశ్వర్‌రెడ్డి భూభారతి బిల్లుపై చర్చలో పాల్గొన్నారు. అప్పుడు కూడా బీఆర్ఎస్ సభ్యులు తమ ఆందోళన కొనసాగించారు. మహేశ్వర్‌రెడ్డి, ఆ తర్వాత మంత్రి పొంగులేటి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్‌లు మాట్లాడుతున్నంత సేపు నినాదాలు చేశారు. దాదాపు 45 నిమిషాల పాటు నిరసన కొనసాగించినా స్పీకర్ పట్టించుకోక పోవడం, అధికార పక్షం స్పందించకపోవడం, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక వ్యక్తి కోసం తాపత్రయపడుతున్నారంటూ వ్యాఖ్యానించడంతో సభ నుంచి నిష్క్రమించారు. ఆ సమయంలో మాట్లాడుతున్న అక్బరుద్దీన్..'బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఓడిపోయి వెళ్లిపోతున్నారు.'అని వ్యాఖ్యానించారు.

మండలిలో వాయిదాల పర్వం

శాసనమండలిలో శుక్రవారం వాయిదాల పర్వం కొనసాగింది. శుక్రవారం ఉదయం మండలి ప్రారంభం కాగానే ఫార్ములా ఈ–రేస్ విషయంలో ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. మధుసుదనాచారి, సత్యవతి రాథోడ్, కవిత, వాణీదేవి తదితరులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ ముందుకు సాగనీయకుండా అడ్డుకున్నారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎదుటకు వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో చైర్మన్ స్వల్ప విరామం ఇస్తూ సభను వాయిదా వేశారు. ఆ తర్వాత సభ ప్రారంభం కాగా.. బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగించడంతో చైర్మన్ భోజన విరామం కోసం వాయిదా వేశారు. ఆ తర్వాత సభ ప్రారంభమైనప్పుడు కూడా అదే వాతావరణం నెలకొనడంతో శనివారం ఉదయానికి వాయిదా వేశారు.

నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీకి బీఆర్ఎస్ సభ్యులు

కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారంటూ నినాదాలు

సాక్షి, హైదరాబాద్: రోజుకో తీరున అసెంబ్లీకి హాజరవుతూ వివిధ అంశాలపై ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తిస్తున్న బీఆర్ఎస్ శుక్రవారం కూడా అదే వ్యూహాన్ని కొనసాగించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుపై 'ఫార్ములా–ఈ రేస్'అంశంలో కేసు నమోదు చేయడంపై బీఆర్ఎస్ నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం ఉదయం శాసనసభా పక్షం కార్యాలయానికి చేరుకున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీ సమావేశ మందిరానికి చేరుకున్నారు. హరీశ్‌రావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, చింత ప్రభాకర్, మాధవరం కృష్ణారావు, చామకూర మల్లారెడ్డి, డాక్టర్ సంజయ్ తదితరులు ప్లకార్డులు చూపుతూ నినాదాలు చేశారు. శాసనమండలి సమావేశాలకు కూడా బీఆర్ఎస్ సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నలుపు రంగు చీర ధరించి సమావేశాల్లో పాల్గొన్నారు.

సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

బీఆర్ఎస్ శాసనసభా పక్షం శుక్రవారం స్పీకర్‌కు మరో సభా హక్కుల ఉల్లంఘన నోటీసును అందజేసింది. 'శాసనసభ ఆమోదం పొందని 'భూ భారతి'బిల్లును చట్టంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సొమ్ముతో ప్రకటనలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించింది. ఇది శాసనసభ్యుల హక్కులకు భంగం కలిగించడమే. అసెంబ్లీలో బిల్లుపై చర్చ జరుగుతున్న దశలో చట్టంగా పేర్కొంటూ ప్రకటనలు ఇచ్చారు. శాసన వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి చూపాలనే ప్రయత్నంలో భాగంగానే ఇది జరిగింది. సభ గౌరవాన్ని, సభ్యుల హక్కులను కాపాడి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి..'అని నోటీసులో కోరింది. మరోవైపు 'కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడంపై నిరసన వ్యక్తం చేస్తున్నాం. ఫార్ములా–ఈ కార్ రేస్ అంశంపై చర్చించాలి..'అని కోరుతూ వాయిదా తీర్మానం ప్రతిపాదించింది. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇచ్చిన ఈ వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు. బీజేపీ, సీపీఐ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను కూడా తిరస్కరించారు.

ధరణి తప్పులు కప్పిపుచ్చుకునేందుకు

బీఆర్ఎస్ కుట్ర

భూభారతిపై చర్చలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

సాక్షి, హైదరాబాద్: ధరణిలోని తప్పులు, లోపాలు బయట పడకూడదనే కుట్రతోనే సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. శుక్రవారం అసెంబ్లీలో భూభారతి బిల్లుపై చర్చలో కూనంనేని మాట్లాడారు. 'తెలంగాణ భూ భారతి'బిల్లు రాష్ట్రానికి ఒక వరప్రదాయిని వంటిదన్నారు. 1971 పాస్ పుస్తకాల చట్టంలో తొలగించిన సెక్షన్ 26ను పునరుద్ధరించాలని, వారసత్వ రిజిస్ట్రేషన్ తీసేయాలని సూచించారు. ఆధార్, పాస్‌పుస్తకాలలో తప్పులు, ఒకరి భూమి మరొకరి పేరుతో ఉన్నాయని, ఇంకా చనిపోయినవారి పేర్లతోనే రికార్డులు ఉన్నాయని తెలిపారు. 1948 తర్వాత రైతులకు అసైన్డ్ చేసిన భూములకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, దేవాదాయ, వక్ఫ్ భూములను కాస్తుకాలంలో పెట్టాలని, రుణ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. విలువైన బిల్లులపైన చర్చలో మాట్లాడనివ్వకుండా, దురుద్దేశంతో వ్యవహరించే వారిని ఎవరినైనా సరే సభ నుంచి సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కూనంనేని కోరారు.

భూ భారతి బిల్లుకు ఆమోదం

కీలక బిల్లుపై చర్చలో పాల్గొనని ప్రధాన ప్రతిపక్షం

- స్వాగతించిన ఎంఐఎం, సీపీఐ, బీజేపీ
- రెవెన్యూ మంత్రిని అభినందించిన మంత్రులు, సభ్యులు
- తన జన్మ ధన్యమైందన్న మంత్రి పొంగులేటి


అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ భూ భారతి (రికార్డ్స్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) బిల్లు–2024కు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈనెల 18వ తేదీన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై శుక్రవారం సభలో చర్చ జరిగిన అనంతరం బిల్లు ఆమోదం పొందినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. ఈ బిల్లుపై చర్చలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పాలు పంచుకోలేదు. ఈ–ఫార్ములా రేసింగ్ అంశాన్ని సభలో చర్చించాలని శుక్రవారం మొత్తం సభలో పట్టుపట్టిన బీఆర్ఎస్ కీలకమైన ఈ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొనలేదు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి బిల్లును ఇతర పక్షాలైన బీజేపీ, ఎంఐఎం, సీపీఐలు స్వాగతిస్తూనే కొన్ని సవరణలు ప్రతిపాదించాయి. అయితే, ఈ సవరణలను పరిగణనలోకి తీసుకోకుండానే బిల్లు ఆమోదం పొందినట్టు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

ఆనంద భాష్పాలొస్తున్నాయి..

భూ భారతి బిల్లును అసెంబ్లీ ఆమోదిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించగానే కాంగ్రెస్ సభ్యులు బల్లలు చరుస్తూ హర్షాతిరేకాలు ప్రకటించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జూపల్లి కృష్ణారావులతో పాటు కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐ, బీజేపీ సభ్యులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలసి అభినందించారు. అంతకుముందు చర్చకు ముగింపుగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రం నుంచి కీలకమైన ఆర్‌వోఆర్ చట్టం ప్రవేశపెట్టిన మూడో మంత్రిగా ఈ బిల్లు సభ ఆమోదం పొందినందుకు తన జన్మ ధన్యమైందని, ఆనంద భాష్పాలు వస్తున్నాయని భావోద్వేగానికి గురయ్యారు. వాస్తవానికి, ఈ బిల్లును మంత్రి పొంగులేటి పట్టుపట్టి మరీ ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదింపజేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి స్పీకర్ అనుమతి మేరకు సభలో ప్రవేశపెట్టించి శీతాకాల సమావేశాల్లోనే కొత్త ఆర్‌వోఆర్ చట్టం తీసుకురావాలన్న తన పంతాన్ని నెగ్గించుకున్నారు. ఇక, బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఆఫీసర్స్ గ్యాలరీలో ఉన్న రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్, సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీ వి. లచ్చిరెడ్డిలను మంత్రులు, ఎమ్మెల్యేలు అభినందించారు.

స్పీకర్‌కు మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేల ధన్యవాదాలు

అసెంబ్లీలో భూభారతి బిల్లుకు సభ ఆమోదం లభించిన అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు ధన్యవాదాలు తెలియజేశారు. స్పీకర్ చాంబర్‌లో ప్రసాద్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. రాష్ట్ర రైతాంగం, ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా దీనిని ప్రత్యేక శ్రద్ధతో రూపొందించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

ధరణి లావాదేవీలపై 'ఫోరెన్సిక్ ఆడిట్'

- బీఆర్ఎస్ హయాంలో కొల్లగొట్టిన భూముల వివరాలు పరిశీలిస్తాం
- అక్రమంగా గుంజుకున్న పేదల భూములను వారికే అప్పగిస్తాం
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత జరిగిన భూముల లావాదేవీలపై 'ఫోరెన్సిక్ ఆడిట్'నిర్వహిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొల్లగొట్టిన భూముల వివరాలను ఈ ఆడిటింగ్ ద్వారా కూలంకషంగా పరిశీలిస్తామని చెప్పారు. భూభారతి బిల్లుపై శుక్రవారం అసెంబ్లీలో చర్చ జరిగిన సందర్భంగా బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ధరణి పోర్టల్ ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ఈ అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి పొంగులేటి.. 'మాకు, బీఆర్ఎస్‌కు ఏదో లోపాయికారీ ఒప్పందం ఉందన్నట్టు బీజేఎల్పీ నేత మాట్లాడుతున్నారు. మా నిజాయితీ, చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు ధరణి లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ నిర్వహిస్తాం. పదేళ్ల పాటు పేద ప్రజలను మోసం చేసి గుంజుకున్న ఆస్తులను, భూములను తిరిగి వారికి ఇప్పిస్తాం'అని వెల్లడించారు. ఆ తర్వాత కూడా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫోరెన్సిక్ ఆడిట్ సరిపోదని, సీబీఐ విచారణ జరిపించాలని, లేదంటే సిట్టింగ్ జడ్జి లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపిస్తేనే అక్రమాలు తేలుతాయన్నారు. మంత్రి బదులిస్తూ ఫోరెన్సిక్ ఆడిటింగ్‌పై ప్రాథమిక నివేదిక వచ్చిన తర్వాత ఏం చేయాలన్నది పరిశీలిస్తామని, సీఎంతో పాటు మంత్రిమండలిలో చర్చించి, స్పీకర్ అనుమతితో అసెంబ్లీలో ప్రకటిస్తామని చెప్పారు.

కేసీఆర్ టేబుల్‌పై ఆ పుస్తకం కనిపించేది..

ప్రముఖ న్యాయకోవిదుడు పడాల రామిరెడ్డి భూ సంస్కరణలపై రాసిన పుస్తకం ఎప్పుడూ కేసీఆర్ టేబుల్‌పై కనిపించేదని మంత్రి పొంగులేటి అంటూ, తన సెల్ ఫోన్‌లోని ఆ ఫొటోను ప్రదర్శించారు. అలాంటి పుస్తకాలు చదివిన ఆయన రూపొందించే ధరణి అద్భుతంగా ఉంటుందనుకున్నానని, కానీ ప్రజా కంటకంగా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు రోజుకో వేషం, రోజుకో డ్రామా వేస్తూ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. స్పీకర్ పోడియంపైకి కాగితాలు, పుస్తకాలు విసిరివేయడం, బీజేపీ నాయకుడు మాట్లాడుతున్నప్పుడు వేలు చూపిస్తూ బెదిరించడం లాంటివి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కూడా దాడి చేయాలనే ఉద్దేశంతో తన సీటు వద్దకు వచ్చి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బెదిరించారని పేర్కొన్నారు. ఈ దొరలను ప్రజలు రాష్ట్రంలో ఉండనీయబోరని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. సభలో గూండాయిజం ప్రదర్శించిన వారిపై స్పీకర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసీఆర్ కాపలా కుక్క కాదు.. వేటకుక్క..

తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానని ఉద్యమ సమయంలో కేసీఆర్ చెప్పారని, అయితే ఆయన వేటకుక్కలా రాష్ట్ర ప్రజల సొమ్మును కొల్లగొట్టారని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. భూభారతి బిల్లుపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం ముందు నిరసన తెలుపుతున్న సమయంలో ఆయన జోక్యం చేసుకుని మాట్లాడారు. 'పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్, ప్రతిపక్షంలోనూ అబద్ధాలతో కాలం గడపాలనుకుంటోంది. కీలకమైన రెవెన్యూ చట్టంపై చర్చ జరుగుతుంటే ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తన అనుభవంతో సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నా, ప్రతిపక్ష నేత సభలో కనిపించరు. అధికారంలో ఉన్నప్పటి తరహాలోనే ప్రతిపక్షంలో కూడా బీఆర్ఎస్ అరాచకంగా వ్యవహరిస్తోంది. ధరణితో లక్షల మంది ఇబ్బందికి గురికాగా, బీఆర్ఎస్ నేతలు మాత్రం ఎలాంటి సమస్యల్లేవని బుకాయించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన 73 ఏళ్ల మద్దెల కృష్ణయ్య అనే దళిత రైతు 35 ఏళ్ల క్రితం కొన్న ఏడెకరాల భూమి ధరణి పుణ్యాన వేరే వారి పేరిట మారటంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి' అని పొంగులేటి ధ్వజమెత్తారు.

'స్థానిక' ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనే!

పాత విధానమే అమలుచేయాలని సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేవారు ఇద్దరికంటే ఎక్కువ సంతానం కలిగి ఉండరాదన్న నిబంధనను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిబంధనను ఎత్తేయాలని పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదించినా, కేబినెట్ తిరస్కరించటంతో పాత విధానాన్నే కొనసాగించనున్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రస్తుతం వరుసగా రెండుసార్లు ఒకే రిజర్వేషన్ విధానం అమల్లో ఉండగా, దానిని ఒక టర్మ్‌కే పరిమితం చేస్తూ రూపొందించిన తెలంగాణ పంచాయతీరాజ్ (సవరణ) చట్టం–2024 బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018కి 25 సవరణలు ప్రతిపాదిస్తూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన బిల్లును గురువారం అసెంబ్లీ ఆమోదించగా, శుక్రవారం సభా కార్యకలాపాలకు ఆటంకాలు ఎదురుకావడంతో కౌన్సిల్‌లో ప్రవేశపెట్టలేకపోయారు. దీనిని శనివారం శాసనమండలిలో ప్రవేశపెట్టి చర్చించనున్నారు.

22 మండలాల్లో ఎంపీటీసీల సంఖ్య పెంపు

రాష్ట్రంలో 22మండలాల్లో ఎంపీటీసీల సంఖ్య ఒక్కోదాంట్లో ఐదు కంటే తక్కువగా ఉన్నట్టుగా గుర్తించారు. దీని వల్ల అవిశ్వాస తీర్మానాలు, ఇతర సందర్భాల్లో ఇబ్బందులు తలెత్తుతుండడంతో వీటిలో ఎంపీటీసీల సంఖ్య కనీసం 5కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సమీపంలోని ఓ.ఆర్.ఆర్ పరిధిలో ఉన్న 51 గ్రామపంచాయతీలు పట్టణ లక్షణాలను కలిగి ఉన్నాయి. వీటిని సమీప మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో విలీనం చేయాలని నిర్ణయించారు. మిగతా ప్రాంతాల్లో పట్టణ లక్షణాలున్న 80 పంచాయతీలను కూడా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లుగా మార్చేందుకు చర్యలు చేపట్టనున్నారు.

..దేశం దాటించారు

▶ మొదటి పేజీ తరువాయి

తెలియాలంటే చట్టాలన్నింటినీ చదవాల్సిన పరిస్థితి..'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'విదేశాల నుంచి కూడా లావాదేవీలు నిర్వహించారేమో ఇప్పుడు పరిశీలించాలి. భూముల రిజిస్ట్రేషన్లు రాత్రి 9 గంటల నుంచి ఉదయం వరకు కూడా చేశారు. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఖూనీ చేసి ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..'అని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం శాసనసభలో భూ భారతి బిల్లుపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

అన్ని పోరాటాలూ భూమి చుట్టూనే..

'తెలంగాణలో ప్రతి సమస్య భూమితో ముడిపడి ఉంది. అన్ని పోరాటాలు భూమి చుట్టూనే పరిభ్రమించాయి. పటేల్–పట్వారీ వ్యవస్థ రద్దుకు కూడా భూసంబంధిత ఫిర్యాదులే కారణం. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మేలు జరిగేలా పాలకులు భూమి చట్టాలను రూపొందించారు. అయితే తెలంగాణ ఏర్పాటైన తర్వాత ధరణి పేరుతో తానో అద్భుత సాంకేతిక నైపుణ్య ఆవిష్కరణ చేశానని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. 80 వేల పుస్తకాలు చదివిన అనుభవాన్ని రంగరించి తయారు చేశానని చెప్పడంతో నిజంగానే భూమి సమస్యలు పరిష్కారమవుతాయేమోనని నేను కూడా భ్రమకు లోనయ్యా. కానీ ధరణి కేసీఆర్ సృష్టి కాదు.. 2010లోనే ఒడిశాలో ఈ ధరణి పేరుతో భూ లావాదేవీలను నిర్వహించారు. ఆ పోర్టల్ నిర్వహించింది కూడా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీనే. తెలంగాణలోనూ ధరణి పోర్టల్ ఆ సంస్థకే ఇచ్చారు. నాలుగేళ్ల తర్వాత కాగ్ ఈ కంపెనీ నిర్వాకం బయటపెట్టింది. ఎన్ఐసీ లాంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను పక్కన పెట్టి, ఆ కంపెనీని తెచ్చి అద్భుతాన్ని, అమృతాన్ని సృష్టించామని కేసీఆర్ చెప్పారు'అని రేవంత్ అన్నారు.

యువరాజు సన్నిహితుడి సంస్థకు భాగస్వామ్యం

'ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌తోపాటు అప్పటి యువరాజుకు సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజుకు చెందిన మరో సంస్థ ఈసెంట్రిక్, విజన్ ఇన్ఫోటెక్‌లకు సంయుక్తంగా ఈ కాంట్రాక్టు ఇచ్చారు. అప్పటికే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ దివాలా తీసి క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుంది. కంపెనీ ప్రతినిధులు జైలుకెళ్లారు. ఆ తర్వాత టెర్రాసిస్ టెక్నాలజీ పేరుతో మరో అనుబంధ కంపెనీని తెచ్చారు. ఆ తర్వాత ఫాల్కన్ ఎస్‌జీ అనే ఫిలిప్పీన్స్ కంపెనీ, ఫాల్కన్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే సింగపూర్ కంపెనీ తెచ్చారు. ఆ కంపెనీకి గాదె శ్రీధర్‌రాజు సీఈవో అయ్యాడు. ఆ తర్వాత స్పారో ఇన్వెస్టర్స్, గేట్‌వే స్కై ప్రైవేట్ లిమిటెడ్ అనే సింగపూర్ కంపెనీలు, హిల్‌బ్రూక్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే బ్రిటిష్ వర్జిన్ ఐల్యాండ్ కంపెనీ, గేట్‌వే ఫండ్ 2ఎల్ఎల్‌పీ అనే కెమెన్ ఐల్యాండ్స్ కంపెనీలను సృష్టించారు. అక్కడి నుంచి పెరడిమ్ ఇన్నోవేషన్స్ ఎల్ఎల్‌సీ, క్వాంటెల్లా ఐఎన్‌సీ అనే అమెరికా కంపెనీలను తెచ్చారు. ప్రపంచంలో జరిగే ప్రతి ఆర్థిక నేరానికి మూలం కెమెన్, బ్రిటిష్ ఐల్యాండ్స్ దేశాల్లో ఉంటుంది. పై కంపెనీలు నిర్వహిస్తున్న వారెవరూ ఈ రాష్ట్రం కాదు కదా దేశ పౌరులు కూడా కాదు. ఈ విధంగా తెలంగాణ రైతుకు, రెవెన్యూ శాఖకు మధ్య జరిగే లావాదేవీలు, డిజిటల్ వెబ్‌సైట్ నిర్వహణ పేరుతో రాష్ట్రంలోని అన్ని భూముల వివరాలను విదేశీ కంపెనీల చేతుల్లో పెట్టారు. ప్రజల నమ్మకాన్ని వంచన చేసి, వారి భూముల వివరాలను విదేశీ కంపెనీలకు అప్పజెప్పిన వారిని ఏమనాలి?'అని సీఎం ప్రశ్నించారు.

మేం తొందరపడితే రికార్డులన్నీ క్రాష్ అయ్యేవి

'మీరు అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది కదా.. ధరణిని ఏం చేశారని మమ్మల్ని అడిగారు. మేం విచారణకు ఆదేశించకుండా మౌనంగా ఉండడానికి కారణాలున్నాయి. మేము టెరాసిస్ నుంచి భూముల నిర్వహణ బాధ్యతలు ఎన్ఐసీకి ఇచ్చాం. కానీ ఈ డేటా బదలాయింపునకు గాదె శ్రీధర్‌రాజు సహకరించడం లేదు. మేము తొందరపడి ఆదేశాలిస్తే ఎక్కడో విదేశాల్లో కూర్చుని ఒక్క బటన్ నొక్కితే తెలంగాణ భూ రికార్డులన్నీ క్రాష్ అయిపోయేవి. సర్వర్లు డౌన్ చేస్తే మళ్లీ రిపేర్, రీస్టోర్ చేయడానికి నెలలు పట్టొచ్చు. అందుకే ఆచితూచి వ్యవహరించాం. ధరణి నిజంగా అద్భుతమైతే కేసీఆర్ సభకు వచ్చి మమ్మల్ని అడిగి, కడిగి నిలదీయాలి కదా?'అని ముఖ్యమంత్రి అన్నారు.

ధరణి విషయంలో నిద్రలేని రాత్రులు

'అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మేమంటే, మమ్మల్ని బంగాళాఖాతంలో వేయాలని కేసీఆర్ అన్నారు. ఎన్నికల సభల్లో ఆయన ఆవేశంగా ఎందుకు ఊగిపోతున్నారో నాకు అర్థం కాలేదు. అధికారంలోకి వచ్చాక పరిశీలిస్తే ఇదంతా తెలిసింది. ధరణిని బంగాళాఖాతంలో వేసేందుకు సంవత్సరమంతా సాంకేతిక నిపుణులు, ప్రజలు, రైతులు, రైతు సంఘాలతో చర్చలు జరిపాం. మంత్రి పొంగులేటితో పాటు అధికారులు, నిపుణులు, ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు నిద్రలేని రాత్రులు గడిపారు. అన్నీ ఆలోచించి రైతాంగానికి మేలు జరిగేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం. దీన్ని సభ్యులందరూ ఆమోదించాలి.'అని సీఎం కోరారు.

కేసీఆర్ నేర్పింది ఇదేనా?

బీఆర్ఎస్‌కు రాష్ట్రంకంటే ఒక కుటుంబమే ముఖ్యమా?

- అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకోవటంపై అక్బరుద్దీన్ ఆగ్రహం
- పదేళ్లలో ఏడుతరాలకు సరిపోయేలా లూటీ చేశారు
- ధరణి ద్వారా 20 లక్షల అక్రమ లావాదేవీలు జరిగాయి



సాక్షి, హైదరాబాద్: శాసనసభలో సభా కార్యకలాపాలను బీఆర్ఎస్ సభ్యులు అడ్డుకోవటంపై ఎంఐఎం సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తంచేశారు. కీలకమైన భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా ప్రధాన ప్రతిపక్షం అడ్డుకోవటం ఏంటని మండిపడ్డారు. శుక్రవారం భూ భారతి బిల్లుపై జరిగిన చర్చలో అక్బరుద్దీన్ మాట్లాడుతుండగా బీఆర్ఎస్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన ఆయన.. బీఆర్ఎస్ సభ్యులు మాట వినకుంటే సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరారు. ఆ సమయంలో బీఆర్ఎస్ సభ్యులు గొడవ చేయటంతో 'కేసీఆర్ మీకు నేర్పింది ఇదేనా? బీఆర్ఎస్‌కు ప్రజలకన్నా ఒక వ్యక్తి, ఒక కుటుంబం ఎక్కువయ్యారా?'అని నిలదీశారు.

బీఆర్ఎస్‌దే రాజరికం

తాను మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ సభ్యులు తానాషాహీ నహీ చలేగా.. నహీ చలేగా అని నినాదాలు చేయటంపై అక్బరుద్దీన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'తానాషాహీ (రాచరికం) చేసింది బీఆర్ఎస్ పార్టీయే. ఇప్పుడు చేస్తుంది కూడా వారే. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి ఏడు తరాలకు సరిపోయేలా రాష్ట్రాన్ని లూటీ చేశారు'అని విమర్శించారు. ఆయన బీఆర్ఎస్‌పై విమర్శలు చేసినప్పుడల్లా కాంగ్రెస్ సభ్యులు బల్లలు చరుస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

ధరణి మొదటి రోజు నుంచీ అక్రమాలే

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిన మొదటి రోజు నుంచీ అక్రమాలే జరిగాయని అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ధరణి ఒక కుటుంబానికి, ఒక పార్టీకి వెన్నెముకగా మారిందని విమర్శించారు. ధరణిలో అక్రమాలు ఒక కుటుంబమే చేసిందని, తద్వారా రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల నష్టం జరిగిందని అన్నారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఈ పోర్టల్ వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. ధరణిలో దాదాపు 20 లక్షలకు పైగా అక్రమ లావాదేవీలు జరిగాయని చెప్పారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏలకు తెలియకుండా కేవలం ఒక కుటుంబానికి తెలిసి అక్రమ లావాదేవీలు జరిగేవని ఆరోపించారు. రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే వీఆర్వో వ్యవస్థను ఎత్తేశారని ధ్వజమెత్తారు. భూ భారతి అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా భూముల సర్వే చేయించాలని సూచించారు.

రాష్ట్రాల అభివృద్ధికి రుణస్వేచ్ఛ, ఆర్థిక స్వయంప్రతిపత్తి ఇవ్వాలి

- ప్రీబడ్జెట్ సమావేశంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరిన భట్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాల అభివృద్ధికి రుణస్వేచ్ఛ, ఆర్థిక స్వయంప్రతిపత్తికి తగిన అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు నిర్వహించే కీలకమైన ప్రీబడ్జెట్ సమావేశం శుక్రవారం రాజస్థాన్‌లోని జైసల్మీర్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయమంత్రి పంకజ్‌చౌదరిల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇలాంటి చర్చలు సమాఖ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయని, రాష్ట్రాల ప్రాధాన్యతలను జాతీయ దృష్టితో చూసే అవకాశం కల్పిస్తాయన్నారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, దేశీయ ఆర్థిక మందగమన పరిస్థితుల్లో మూలధన వ్యయానికి ప్రోత్సాహం అవసరమని, రాష్ట్రాల మూలధన వ్యయానికి ఏటా రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల పునరుజ్జీవం దేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముకలాంటివని చెప్పారు. ఇందుకోసం ఎంఎస్ఎంఈ సాంకేతిక అభివృద్ధి నిధిని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రతిపాదిస్తున్నట్టు భట్టి విక్రమార్క తెలిపారు. పారిశ్రామిక శిక్షణ తరగతులను ఆధునీకరించాలని, కృత్రిమ మేధా, పునరుత్పాదక శక్తి, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో యువతకు నైపుణ్యం కల్పించేందుకు నిధులు కావాలన్నారు. గిగ్ కార్మికులకు సరైన భద్రత కోసం జాతీయ విధానాన్ని రూపొందించాలని సూచించారు. 2014 ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రావాల్సిన పెండింగ్ బకాయిలు ప్రతీఏటా రూ. 450 కోట్లు చెల్లించాలని, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ నిధుల వినియోగంలో మరింత సౌలభ్యం కల్పించాలని భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు.

'రీజినల్' అలైన్‌మెంట్ మార్చండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి భూనిర్వాసితుల వినతి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి సమస్య వివరిస్తున్న భూ నిర్వాసితులు

చౌటుప్పల్: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను నిబంధనలకు అనుగుణంగా రూపొందించాలని భూనిర్వాసితులు.. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖమంత్రి నితిన్‌గడ్కరీని ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఓఆర్‌ఆర్‌కు ట్రిపుల్ ఆర్‌కు మధ్య నిబంధనల ప్రకారం 40 కి.మీ. దూరం ఉండాల్సి ఉందన్నారు. కానీ ఉత్తర భాగంలోని చౌటుప్పల్, గజ్వేల్, భువనగిరి ప్రాంతాల్లో కేవలం 20–28 కి.మీ. దూరంలోనే ట్రిపుల్‌ఆర్ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. కేవలం కొంత మంది పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం అలైన్‌మెంట్‌ను పలుమార్లు మార్చారని ఆరోపించారు. ఇష్టానుసారంగా అలైన్‌మెంట్‌ను మార్చడంతో కోట్లాది రూపాయల విలువైన వ్యవసాయ భూములు, నివాస గృహాలు, ప్లాట్లు కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. అలైన్‌మెంట్‌ను మార్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తిచేశారు. భూ నిర్వాసితులకు సరైన న్యాయం చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు నిర్వాసితుల సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, భూనిర్వాసితులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మారుపాక రామలింగం, దబ్బేటి రాములు, బోరెం ప్రకాశ్‌రెడ్డి, జాల వెంకటేశ్, కడారి నర్సింగరావు, మోదుగు అనిల్‌రెడ్డి ఉన్నారు.

కార్పొరేషన్లుగా పాలమూరు, మంచిర్యాల

- గ్రేడ్–1 మున్సిపాలిటీల నుంచి మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్
- రాష్ట్రంలో మరో 12 మున్సిపాలిటీల ఏర్పాటు
- కరీంనగర్ కార్పొరేషన్‌లోకి ఆరు గ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీ!
- మరికొన్ని జిల్లాల్లో మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా రెండు మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు కాబోతున్నాయి. గ్రేడ్–1 మున్సిపాలిటీలుగా ఉన్న మహబూబ్‌నగర్(పాలమూరు), మంచిర్యాలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం రూపొందించిన చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ రెండు మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. ఈ మేరకు ఆయా మున్సిపాలిటీలు తీర్మానాలను కూడా ప్రభుత్వానికి పంపాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు మున్సిపాలిటీలకు ఆనుకొని ఉన్న పంచాయతీలను, మున్సిపాలిటీలను కలిపి కార్పొరేషన్లుగా ఏర్పాటుచేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. అలాగే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆనుకొని ఉన్న ఆరు గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్, మల్కాపూర్, లక్ష్మీపూర్ గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేసినట్లు అధికార వర్గాల సమాచారం. కరీంనగర్‌ను ఆనుకొని ఉన్న కొత్తపల్లి మున్సిపాలిటీని కూడా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిపే అవకాశం ఉందని తెలిసింది.

కొత్తగా 12 మున్సిపాలిటీలు

రాష్ట్రంలో కొత్తగా 12 మున్సిపాలిటీలను కూడా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉండి, పట్టణీకరణ జరిగిన ప్రాంతాలను మున్సిపాలిటీలుగా మార్చారు. సంగారెడ్డి జిల్లాలోని కోహిర్, గడ్డ పోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చారు. మహబూబాబాద్ జిల్లాలో కేసముద్రం, జనగాం జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్, నారాయణపేట జిల్లాలో మద్దూర్, ఖమ్మం జిల్లాలో ఏదులాపురం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట, మహబూబ్‌నగర్‌జిల్లాలో దేవరకద్ర, రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, మొయినాబాద్‌లను మున్సిపాలిటీలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం

ఇప్పటికే ఉన్న మున్సిపాలిటీలలో సమీపంలోని గ్రామాలను ప్రభుత్వం విలీనం చేసింది. పరిగి మున్సిపాలిటీలోకి మరో ఆరు గ్రామాలు చేరబోతున్నాయి. నర్సంపేటలో ఏడు గ్రామాలు, నార్సింగి, శంషాబాద్‌లలో ఒక్కో గ్రామం చొప్పున విలీనం కానున్నాయి.

నాలుగు రోజులు ఏపీజీవీబీ సేవల నిలిపివేత

- ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి



హనుమకొండ: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ) బ్రాంచీలు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్న క్రమంలో ఈ నెల 28, 29, 30, 31 తేదీల్లో బ్యాంకు సేవలు నిలిచిపోనున్నాయని ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం హనుమకొండలోని బ్యాంకు వరంగల్ ప్రాంతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఒక రాష్ట్రంలో ఒకే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు తీసుకొచ్చిందని, ఈ క్రమంలో తెలంగాణలోని ఏపీజీవీబీ బ్రాంచీలను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తున్నట్టు పేర్కొన్నారు. వరంగల్ ప్రధాన కార్యాలయంగా ఏపీజీవీబీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 771 బ్రాంచీలు ఉండగా.. ఇందులో తెలంగాణలోని 493 బ్రాంచీలను తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో విలీనం చేస్తున్నట్టు తెలిపారు. ఏపీలోని 278 బ్రాంచీలు ఏపీజీవీబీ బ్రాంచీలుగా అదే రాష్ట్రంలో కొనసాగుతాయన్నారు. హనుమకొండలో ఉన్న ఏపీజీవీబీ ప్రధాన కార్యాలయం మూడు నెలల తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతుందని, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉందన్నారు. 2025 జనవరి 1 నుంచి సేవలు పునరుద్ధరించబడుతాయన్నారు. బ్రాంచీల విలీనం జరిగినా ఖాతా నంబర్లు మారవని, చెక్కు బుక్కులు, పాస్ బుక్కులు కొత్తవి జారీ చేస్తున్నామని, వీటికి ఎలాంటి చార్జీలు వసూలు చేయమని, ఏపీజీవీబీ ఏటీఎంలు, నెట్ బ్యాంకింగ్, యూపీఐతో పాటు ఇతర బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

శీతోష్ణాలు, సుఖదుఃఖాలు ఎప్పటికి ఉండేవి కావు.
వచ్చిపోయే వాటిని కొద్దికాలం ఓర్చుకోవాలి.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 21 డిసెంబర్ 2024

ఇదేనా అంబేడ్కర్ వారసత్వం!

అనుకున్నట్టే పార్లమెంటు శీతాకాల సమావేశాలు పరస్పర వాగ్యుద్ధాలతో మొదలై ఘర్షణలతో ముగిశాయి. పార్లమెంటు ముఖద్వారం వద్ద అధికార, విపక్ష సభ్యులు ఒకరినొకరు తోసుకోవటం, ఒకరిద్దరు గాయపడటం, పోలీసు కేసుల వరకూ పోవటం వంటి పరిణామాలు అందరికీ దిగ్భ్రాంతి కలిగించాయి. తమ ఎంపీలు ప్రతాప్ చంద్ర సారంగి, ముకేశ్ రాజ్‌పుత్‌లు గాయపడ్డారని బీజేపీ అంటున్నది. కాదు... వారే తమను పార్లమెంటులోకి వెళ్లకుండా అడ్డగించారని, ఆ తోపులాటలో కిందపడ్డారని కాంగ్రెస్ చెబుతున్నది. వారు అడ్డగించటం వల్ల తమ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే కూడా గాయపడ్డారని, ముగ్గురు బీజేపీ ఎంపీలు రాహుల్ గాంధీపై భౌతికదాడికి పాల్పడ్డారని వివరిస్తున్నది. రెండు వర్గాలూ అటు స్పీకర్‌కూ, ఇటు పోలీసులకూ ఫిర్యాదులు చేసుకున్నాయి. నాగాలాండ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ సభ్యురాలు కోన్యాక్ తనతో రాహుల్ గాంధీ అభ్యంతరకరంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఈ విషయంలో రాహుల్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదయ్యే అవకాశం ఉన్నదంటున్నారు. అసెంబ్లీ సమావేశాలప్పుడు ఏదో వివాదం రేకెత్తి ఒకరిపైకొకరు లంఘించటం, ఘర్షణపడటం, కుర్చీలు విసురుకోవటం, దుర్భాషలాడుకోవటం రాష్ట్రాల్లో సర్వసాధారణమైంది. కానీ ఇదేమిటి... దేశమంతటికీ ప్రాతినిధ్యం వహించే అత్యున్నత చట్టసభ ఇంత చట్టుబండలు కావటం ముందూ మునుపూ విన్నామా? సమావేశాల ప్రారంభంలోనే అదానీ వ్యవహారంపై విపక్షాలు పెద్ద రగడ సృష్టించాయి. ఆయనపై అమెరికాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, అరెస్టు చేస్తారని వచ్చిన వార్తలు నిజం కావని ప్రముఖ న్యాయవాదులు చెప్పాక అది సద్దుమణిగింది.

వివాదాలు ఉండొచ్చు... విధానాల విషయంలో విభేదాలుండొచ్చు. కానీ చట్టసభ అనేది అధికార, విపక్షాలు ప్రజలకు గరిష్ఠంగా మేలు చేయటానికి గల అవకాశాలను అన్వేషించే వేదిక. తమ నిర్ణయాల పర్యవసానం గుర్తెరగకుండా పాలకపక్షం ప్రవర్తిస్తున్నప్పుడు విపక్షాలు నిరసన గళం వినిపిస్తాయి. అందువల్ల పాలకపక్షం తనను తాను సరిదిద్దుకునే ఆస్కారం కూడా ఉంటుంది. అది లేనప్పుడు కాస్త ఆలస్యం కావొచ్చుగానీ... అధికార పక్షానికి ప్రజలే కళ్లు తెరిపిస్తారు. ఇందిరాగాంధీ ఏలుబడిలో ఎమర్జెన్సీ విధించినప్పుడేమైంది? ఆ తర్వాత వచ్చిన జనతాపార్టీ ప్రభుత్వం ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను ఇష్టారాజ్యంగా రద్దుచేసినప్పుడు భంగపాటు తప్పలేదు. ఏకంగా 400 మంది సభ్యుల బలం ఉన్న రాజీవ్‌గాంధీ ఏకపక్షంగా వ్యవహరించినప్పుడు కూడా ఆయనకు చేదు అనుభవాలే ఎదురయ్యాయి. 2020లో వచ్చిన సాగుచట్టాలు కూడా ఎన్డీయే సర్కారు ఉపసంహరించుకోక తప్పలేదు. ఏ విషయంలోనైనా తక్షణమే అమీతుమీ తేల్చుకోవాలనుకునే మనస్తత్వం వల్ల ఉన్న సమస్య కాస్తా మరింత జటిలమవుతున్నది. ఇటీవలి కాలంలో చట్టసభలు బలప్రదర్శన వేదికలవుతున్నాయి. సమస్య ఎదురైనప్పుడు దాని ఆధారంగా అవతలి పక్షం అంతరంగాన్ని బయటపెట్టి ప్రజలు గ్రహించేలా చేయటం అనే మార్గాన్ని వదిలి బాహాబాహీ తలపడటం అనేది దుష్ట సంప్రదాయం. అందువల్ల చట్టసభ అంటే సాధారణ పౌరుల్లో చులకన భావం ఏర్పడటం తప్ప సాధించేదేమీ ఉండదు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఎవరు అవమానించారు... ఎవరు నెత్తిన పెట్టుకున్నారన్న విషయమై ఏర్పడిన వివాదం కాస్తా ముదిరి పరస్పరం క్రిమినల్ కేసులు పెట్టుకోవటం వరకూ పోవటం విచారకరం. బీజేపీ ఎంపీలు అప్పటికే బైఠాయించిన ప్రధాన ద్వారం వైపునుంచే పార్లమెంటులోకి ప్రవేశించాలని కాంగ్రెస్ అనుకోవటం వల్ల బాహాబాహీకి దిగే పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి వేరే ద్వారంనుంచి వెళ్లమని భద్రతా సిబ్బంది చేసిన సూచనను రాహుల్ గాంధీ బేఖాతరు చేశారని, పైగా ఇతర సభ్యులను రెచ్చగొట్టారని బీజేపీ ఫిర్యాదు సారాంశం.

దేశంలో ఏదో ఒకమూల నిత్యమూ సాగిపోతున్న విషాద ఉదంతాలు గమనిస్తే డాక్టర్ అంబేడ్కర్ నిజమైన వారసులెవరన్న అంశంలో భౌతికంగా తలపడిన రెండు పక్షాలూ సిగ్గుపడాల్సి వస్తుంది. ఒకపక్క పార్లమెంటులో ఈ తమాషా నడుస్తుండగానే తన పెళ్లికి ముచ్చటపడి గుర్రంపై ఊరేగుతున్న ఒక దళిత యువకుడిపై ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో ఆధిపత్య కులాలవారు దాడిచేసి కొట్టారన్న వార్త వెలువడింది. ఇది ఏదో యాదృచ్ఛికంగా కులోన్మాదులు చేసిన చర్య కాదు. దశాబ్దాలుగా ఇలాంటి ఘోరాలు సాగుతూనే ఉన్నాయి. తాము ఉపయోగించే బావిలో లేదా చెరువులో దప్పిక తీర్చుకున్నారన్న ఆగ్రహంతో దళితులపై దాడులు చేసే సంస్కృతి ఇంకా పోలేదు. చాలాచోట్ల రెండు గ్లాసుల విధానం ఇంకా సజీవంగా ఉంది. మన రాజ్యాంగం అమల్లోకొచ్చి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా చర్చిస్తుండగానే... డాక్టర్ అంబేడ్కర్ వారసత్వం గురించి పార్టీలు పోటీపడుతుండగానే వాస్తవ స్థితిగతులు ఇలా ఉన్నాయి.

సైద్ధాంతిక విభేదాలను ఆ స్థాయిలో మాట్లాడుకుంటే, ఆరోగ్యకరమైన చర్చల ద్వారా అన్ని విషయాలనూ ప్రజలకు తేటతెల్లం చేస్తే మెరుగైన ఫలితం వస్తుంది. నిజానిజాలేమిటో అందరూ గ్రహిస్తారు. డాక్టర్ అంబేడ్కర్ తన జీవితకాలమంతా రాజీలేని పోరాటం చేశారు. మెజారిటీ ప్రజానీకం ప్రయోజనాలను దెబ్బతీసే భావాలనూ, చర్యలనూ అడుగడుగునా తీవ్రంగా వ్యతిరేకించారు. ఉద్యమాలు నిర్వహించారు. అంతేతప్ప అవతలిపక్షంపై హింసకు దిగలేదు. ఆయన వారసత్వం తమదేనంటున్నవారు వాస్తవానికి తమ చర్యల ద్వారా ఆ మహనీయుడి స్మృతికీ, ముఖ్యంగా ఆయన నాయకత్వంలో రూపొందిన రాజ్యాంగానికీ అపచారం చేస్తున్నామని గుర్తిస్తే మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.షష్ఠి ప.1.41 వరకు తదుపరి సప్తమి, **నక్షత్రం:** పుబ్బ పూర్తి (24గంటలు), **వర్జ్యం:** ప.2.27 నుండి 4.11 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.29 నుండి 7.55 వరకు, **అమృతఘడియలు:** రా.12.36 నుండి 2.31 వరకు.

సూర్యోదయం: 6.28
సూర్యాస్తమయం: 5.26
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

బంధం బలపడేలా...

విశ్లేషణ



సతీశ్ సి. మెహతా

డిసెంబర్ 21, 22 తేదీలలో రెండు రోజుల పర్యటనకు ప్రధాని నరేంద్ర మోదీ కువైట్ వెళ్లనున్నారు. 43 ఏళ్లలో భారత ప్రధాని కువైట్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. విశ్వసనీయమైన చమురు సరఫరాదారు అయిన కువైట్‌లో 21 శాతం జనాభాతో అతిపెద్ద విదేశీ సమూహంగా భారతీయులు ఉంటున్నారు. భారత్‌లో కువైటీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులను ఆకర్షించడం, అనూహ్య పరిస్థితులలో ఉపయోగపడటానికి భారత్‌లో కువైటీ చమురును వ్యూహాత్మకంగా నిల్వ చేయడం, కువైట్ ఆధునికీకరణలో భారత కంపెనీలకు భాగస్వామ్యం కల్పించడం, రక్షణ, భద్రత లాంటి అంశాలు చర్చకు రానున్నాయి.

స్థిరమైన, బాగా వృద్ధి చెందుతున్న ద్వైపాక్షిక సంబంధాల పట్ల ఉన్నత స్థాయి శ్రద్ధ అనేది దురదృష్టవశాత్తు కొన్ని సందర్భాలలో ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చు. 1981లో ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కువైట్‌ను సందర్శించిన 43 ఏళ్ల తరువాత, 2013లో కువైట్ ప్రధానమంత్రి భారతదేశ పర్యటనకు వచ్చిన 11 ఏళ్ల తరువాత మొదటిసారిగా భారతదేశం నుండి కువైట్‌కు ప్రధాని స్థాయి పర్యటన జరగడానికి గల కారణం ఇదే అయి ఉండవచ్చు.

అతిపెద్ద విదేశీ సమూహంగా భారతీయులు

కువైట్‌తో భారతదేశ సంబంధాలు రెండు దేశాలు స్వాతంత్ర్యం పొందడానికి ముందు నుండీ ఉన్నాయి. బస్రా నగరం పేరుతో ప్రసిద్ధి చెందిన బస్రా ముత్యాలను సాహసవంతులైన కువైట్ డైవర్లు సేకరించి బస్రా పోర్టు నుండి భారత్‌కు తెచ్చేవారు. వీటిని రాజవంశీయులు, సంపన్నులు ఆభరణాల రూపంలో ధరించేవారు. వారి తిరుగు ప్రయాణంలో దుస్తులు, సుగంధ ద్రవ్యాలు, ఆహార పదార్థాలు, ఇతర ఉత్పత్తులను తమ పడవల్లో తీసుకువెళ్లేవారు. శిలాజ ఇంధన వనరులను గుర్తించడానికి ముందు, గల్ఫ్ ప్రాంతంలో నిపుణులైన కువైట్ వ్యాపారస్తులకు భారత్‌తో వాణిజ్యం అనేది సంపదకు ముఖ్య వనరుగా ఉండేది. ఈ సంబంధాలు కేవలం వాణిజ్యం వరకు పరిమితం కాలేదు. బొంబాయిని సందర్శించాలనే ఆకాంక్ష వారిలో ఉండేది. కువైట్‌కు చెందిన అమీర్ ఒకరు వర్షాకాలంలో గడపడానికి తనకు బాగా నచ్చిన బొంబాయి నగరంలోని మెరైన్ డ్రైవ్‌లో విలాసవంతమైన ఆస్తిని కొనుగోలు చేశారు. ఆ ఆస్తి ఇప్పటికీ ఉంది. ఇరు దేశాలకు చెందిన ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అందువల్ల, 1961లో కువైట్ స్వతంత్ర దేశంగా మారినప్పుడు, దానితో మొదటగా దౌత్య సంబంధాలు నెలకొల్పుకున్న దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచింది.



కువైట్ యువరాజు అల్-సబాహ్, భారత ప్రధాని మోదీ

1970ల దశకం నుండి శిలాజ ఇంధనాల ద్వారా భారీగా ఆదాయం రావడంతో, తమ సాంకేతికత, విద్య, రక్షణ, భద్రత, పెట్టుబడులు, వినోదం కోసం పశ్చిమ దేశాలపై కువైట్ ఆధారపడసాగింది. భారత్‌తో సంబంధాలు కొనసాగినప్పటికీ, వాటి ప్రాధాన్యత అదే విధంగా కొనసాగలేదు. కానీ గత రెండు దశాబ్దాలుగా భారత్‌లో వేగంగా జరిగిన ఆర్థికాభివృద్ధి, సాంకేతికత–రక్షణ రంగాలలో పెరిగిన సామర్థ్యం, ప్రాంతీయ బలం కారణంగా భారత్, కువైట్ మధ్య సంబంధాలు గణనీయంగా పెరిగాయి. ద్వైపాక్షిక వాణిజ్యం 10 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటింది. కువైట్‌లో పది లక్షల కంటే ఎక్కువ మంది భారతీయులు నివసిస్తున్నారు. అతి పెద్ద విదేశీ సమూహంగా కువైట్ జనాభాలో 21 శాతంగా ఉన్నారు. ఆ దేశం కార్మిక శక్తిలో 30 శాతంగా ఉన్నారు. భారత్ చమురు దిగుమతి చేసుకునే మొదటి ఆరు దేశాలలో కువైట్ ఒకటి. విశ్వసనీయమైన సరఫరాదారుగా కువైట్ నిలిచింది. ఇండియాలో కువైట్ సంస్థాగత పెట్టుబడులు 15 బిలియన్ అమెరికన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉంటాయని అంచనా.

రెండు బిలియన్ డాలర్ల ఎగుమతులు

ఇండియాతో దీర్ఘ కాలంగా వ్యాపార సంబంధాలు నెరుపుతున్న అల్ ఘనిమ్, అల్ షాయా వంటి వ్యాపార సంస్థలు ఇక్కడి తయారీ, సేవల రంగంలో పెట్టుబడులు పెట్టాయి. అదేవిధంగా భారత్‌కు చెందిన ఎల్ అండ్ టి, శాపూర్‌జీ పల్లోంజీ, కల్పతరు, కేఈసీ, ఇఐఎల్, మేఘా, అశోక్ లేల్యాండ్, విప్రో, టాటా, టీసీఐఎల్, కిర్లోస్కర్ వంటి సంస్థలు కువైట్ మౌలిక వసతులు, అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నాయి. ఆర్థిక, సంబంధిత రంగంలో ఎల్ఐసీ, న్యూ ఇండియా ఎస్యూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ వంటి సంస్థలు అనేక సంవత్సరాలుగా కువైట్‌లో క్రియాశీల కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2023–24లో మొదటిసారిగా కువైట్‌కు భారతీయ ఎగుమతులు 34 శాతం పెరిగి 2 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటాయి. ప్రవాస భారతీయుల నుండి భారత్‌కు వస్తున్న రెమిటెన్సులు ఇప్పుడు 5 బిలియన్ అమెరికన్ డాలర్లకు పైగా ఉంటాయని అంచనా. కువైట్‌లో భారతీయ ఉత్పత్తులు, బ్రాండ్లకు ప్రాధాన్యం పెరుగుతోంది.

కానీ ఇంకా ఎంతో సాధించవచ్చు. ఇదొకసారి చూడండి: 18,000 చదరపు కిలోమీటర్ల కంటే తక్కువ భౌగోళిక వైశాల్యం కలిగిన కువైట్ (వైశాల్యంలో అనేక భారతీయ జిల్లాలు దానికంటే పెద్దవి) 105 బిలియన్ బ్యారెల్స్ కంటే ఎక్కువ చమురు నిక్షేపాలు కలిగి ఉండి ప్రపంచంలోనే 6వ స్థానంలో ఉంది. దాని సావరిన్ ఫండ్లో సుమారుగా ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లు ఉన్నాయి. భారత నాణ్యమైన ఉత్పత్తులు, సేవలకు అత్యధిక తలసరి ఆదాయ దేశంగా కువైట్ ఒక లాభసాటి మార్కెట్. పైగా రానున్న పదేళ్లలో మౌలిక సదుపాయాలపై 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళిక ఉన్నందున భారతీయ సంస్థలకు గొప్ప అవకాశం. అంతే కాకుండా, భారతదేశంలో విలాసవంతమైన పర్యాటకం, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులకు సంపన్న కువైటీలు ఒక మంచి వనరుగా ఉండగలరు.

సంబంధాలు మరో స్థాయికి...

విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ 2024 ఆగస్టులో కువైట్‌ను సందర్శించారు. సెప్టెంబర్‌లో న్యూయార్క్‌లో కువైట్ యువరాజు, ప్రధాని మోదీ భేటీ జరిగింది. కువైట్ విదేశాంగ మంత్రి ఈ నెల ఆరంభంలో భారత్ వచ్చారు. ఇప్పుడు మోదీ కువైట్ పర్యటనతో సంబంధాలు మరో స్థాయికి చేరడానికి సిద్ధంగా ఉన్నాయి.

పర్యటనను ఫలవంతం చేయటానికి అనేక ముందస్తు చర్యలు ఇప్పటికే చేపట్టారు. వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, రక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆహార భద్రత, వ్యవసాయం, ఉప దౌత్య అంశాలపై పనిచేసే ఏడు కొత్త జాయింట్ వర్కింగ్ గ్రూపు (జేడబ్ల్యూజీ)లకు ఇరువురు విదేశీ మంత్రులు ఆమోదించారు. చమురు, కార్మికులు, ఆరోగ్యంపై ఇదివరకే ఉన్న జేడబ్ల్యూజీలతో కలిసి పనిచేస్తూ విస్తృత స్థాయిలో ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకువెళ్ళడానికి ఈ కొత్త గ్రూపులు సహాయపడతాయి. భారత్‌లో కువైటీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులను ఆకర్షించడం, అనూహ్య పరిస్థితులలో ఉపయోగపడటానికి భారత్‌లో కువైటీ చమురును వ్యూహాత్మకంగా నిల్వ చేయడం, భారతీయ పెట్రో కెమికల్స్ రంగంలో కువైట్ పాల్గొనడం, కువైట్ ఆధునికీకరణ ప్రణాళికలలో ప్రపంచ స్థాయి సామర్థ్యాలు కలిగిన భారతీయ మౌలిక సదుపాయాల కంపెనీలు ఎక్కువగా పాలుపంచుకునే విధంగా మార్గం సుగమం చేయడం లాంటివి ఈ సంబంధాల నుంచి ఆశిస్తున్న ఫలితాలు. కువైట్‌లో భారతీయ కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, వారి సమస్యలను వేగంగా పరిష్కరించడం మరో ముఖ్యమైన అంశం.

రక్షణ, భద్రతా సమస్యలు కూడా చర్చించాల్సి ఉంది. భారత్, కువైట్ పరస్పర సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ, భారతీయ నౌకాదళానికి చెందిన నౌకలు క్రమం తప్పకుండా కువైట్ పోర్ట్‌ను సందర్శిస్తున్నప్పటికీ, రక్షణ, భద్రత సహకారంపై మరింత శ్రద్ధ, సంప్రదింపులు అవసరం.

పశ్చిమాసియాలో ఇటీవలి పరిణామాల కారణంగా, ఈ ప్రాంతంలో ఆందోళన భావన నెలకొంది. జీసీసీ (గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్) అధ్యక్ష స్థానంలో కువైట్ ఉన్నందున, భారత సౌహార్దత, దౌత్య సంబంధాల సహకారంతో ఈ సమస్యకు పరిష్కారం కనుగొనవచ్చు.

వ్యాసకర్త కువైట్‌కు భారత మాజీ రాయబారి



నేడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం

టార్చ్ బేరర్

'ప్రతి 30 సంవత్సరాలకు బతుకు తాలూకా ఆలోచన మారుతుంది. సినిమా వాళ్లు దాన్ని ట్రెండ్ అంటారు. వ్యాపారవేత్తలు ఫ్యాషన్ అంటారు. రాజకీయ నాయకులు తరం అంటారు. మామూలు జనం జనరేషన్ అంటారు. కానీ ప్రతి జనరేషన్‌లో ఆ కొత్త థాట్‌ను ముందుకు తీసుకెళ్లేవాడు మాత్రం ఒక్కడే వస్తాడు. వాడినే టార్చ్ బేరర్ అంటారు.' ఇది 'అరవింద సమేత వీర రాఘవ' సినిమాలోని ఓ డైలాగ్. నిజ జీవితంలో ఇలాంటివారు అరుదుగా ఉంటారు. 2019 – 24 మధ్య ఏపీలో జరిగిన పాలనను చూస్తే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని టార్చ్ బేరర్‌గా చెప్పొచ్చు. ఆ ఐదేళ్లలో ఆయన చేసిన సంస్కరణలు అలాంటివి.

> ప్రభుత్వ విద్యావ్యవస్థ బాగు కోసం ఐదేళ్లపాటు జగన్ అహర్నిశలు కృషి చేశారు. పిల్లల్ని గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేందుకు శ్రమించారు.

ఎంపీగా మొదలైన జగన్ ప్రస్థానం ఏపీ రాజకీయాలను కొత్త దారిలో నడిపించే స్థాయికి చేరుకుంది. ప్రజలకు మంచి చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంటుంది. జగన్ మొదటి నుంచీ ప్రజల్లోనే ఉన్నారు. ఆయన పాదయాత్ర చేస్తే పల్లె, పట్టణం అనే తేడా లేకుండా కాలు కదిపాయి. కోట్ల మంది ఓన్ చేసుకున్న లీడర్!

జగన్ దేశంలో ఏ నాయకుడూ సాహసం చేయని పనులకు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమం, అభివృద్ధి కాగితాలకు పరిమితం కాలేదు. క్షేత్రస్థాయిలో కనిపించింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అక్క చెల్లెమ్మలకు డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ. 2,83,866 కోట్లు అందించారు. ఆయన పాలనే విప్లవాత్మక నిర్ణయాలతో మొదలైంది. సీఎం అయిన ఆరు నెలల్లోనే గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి 1.34 లక్షల ఉద్యోగాలిచ్చారు. 58 వేలమంది ఆర్టీసీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. 2.60 లక్షల మంది వలంటీర్లను నియమించి రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా పథకాలను అందించారు.

చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేశారు. కార్పొరేట్‌ను పెంచి పోషించారు. కానీ విద్యావ్యవస్థ బాగు కోసం ఐదేళ్లపాటు జగన్ అహర్నిశలు కృషి చేశారు. పిల్లల్ని గ్లోబల్ సిటిజన్లుగా మార్చేందుకు కష్టపడ్డారు. ఏపీలోని పల్లెల బిడ్డలు ఐక్యరాజ్యసమితిలో మాట్లాడతారని ఏనాడైనా అనుకున్నామా? 'నాడు – నేడు'తో బడికి కొత్త కళ వచ్చింది. ఏపీలో విద్యారంగ సంస్కరణల కోసం గత ప్రభుత్వం చేసిన ఖర్చు అక్షరాలా రూ. 73 వేల కోట్లు. అభివృద్ధి, సంక్షేమాన్ని చంద్రబాబు గ్రాఫిక్స్‌లో చూపిస్తే జగన్ క్షేత్ర స్థాయిలో కనిపించేలా చేశారు. 17 మెడికల్ కాలేజీలు, నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, పేదలందరికీ ఇళ్ల నిర్మాణం ... ఇలా ఆయన చేపట్టినవి ఎన్నో!

దేశ చరిత్రలో ఏ నాయకుడిపై జరగనంత వ్యక్తిత్వ హననం జగన్‌పై జరుగుతోంది. జగన్ వీటిని చిరునవ్వుతోనే ఎదుర్కొంటున్నారు తప్ప ఎక్కడా మాట తూలలేదు. చంద్రబాబు పెంచి పోషిస్తున్న సోషల్ మీడియా సైకోలు జగన్‌పై నిత్యం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, యూట్యూబ్‌లలో దుష్ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. జగన్ కూర్చొన్నా, మాట్లాడినా, నవ్వినా, చూసినా పిచ్చిపిచ్చి రాతలతో పోస్టులు, రీల్స్ పెడుతున్న వారి కుటుంబాల్లో ఎంతోమంది గత ప్రభుత్వంలో లబ్ధి పొంది ఉంటారు!

జగన్‌కు పడటం కొత్త కాదు. ఎంతో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లే వ్యక్తికి ఎలా లేచి నిలబడాలో బాగా తెలుసు. ఏదో మేజిక్ వల్ల గెలిచిన కూటమి పెద్దలు ఆయన పని అయిపోయిందని ఇప్పుడు సంబర పడుతూ ఉండొచ్చు. ఏపీలో అధికా రంలోకి వచ్చిన కొన్ని నెలలకే చంద్రబాబు అంతులేని వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. ఒకప్పటిలా సంక్షేమం అందకపోవడంతో జనం నిరాశలో కూరుకుపోతున్నారు. ప్రజల బాగు కోసం పనిచేసే నాయకుడు ఎప్పటికీ ఫెయిల్ కాడు. ఎందుకంటే వారి సంకల్ప బలం చాలా గొప్పది. నిజమైన జననేతకు జన్మదిన శుభాకాంక్షలు!

– వెంకట్

ఇన్ బాక్స్

సుదీర్ఘ రాత్రికి కారణమేమిటి?

ఈ ఏడాది డిసెంబర్ 21కి ఓ ప్రత్యేకత ఉంది. పగటి సమయం 8 గంటలూ, రాత్రి సమయం 16 గంటలూ ఉంటుందని అంటున్నారు. కానీ, పదమూడున్నర గంటలే ఉంటుందనేది నిపుణుల అభిప్రాయం.

సాధారణంగా ప్రతిరోజూ మనకు 12 గంటల పగలు 12 గంటలు రాత్రి సమయం ఉంటుంది. అయితే రుతువులను బట్టి, భూమిపై ఉన్న ప్రాంతాన్ని బట్టి పగలు – రాత్రుల సమయంలో ఎక్కువ తక్కువలూ ఉంటాయి. భూమి ఇరుసు 23.4ని కోణంలో వంగి ఉండటం వలన సూర్యుని నుండి వెలువడే సూర్యకాంతి భూమిపైన సమానంగా కాకుండా వివిధ కాలాలలో వివిధ రీతుల్లో పడుతుంది. ఫలితంగా రాత్రి–పగలు సమయాల్లో ఒక్కోసారి ఎక్కువ తేడాలు వస్తాయి. దీన్నే 'ఆయనాతం' అంటారు. సంవత్సరంలో రెండుసార్లు ఆయనాతం ఏర్పడుతుంది.



మొదటిది వేసవి కాలపు ఆయనాతం కాగా, రెండవది శీతాకాలపు ఆయనాతం. శీతాకాలపు ఆయనాతం డిసెంబర్ 19–23 తేదీల మధ్యలో ఏదో ఒక రోజు ఏర్పడుతుంది. ఈరోజు మనం చూసేది శీతాకాలపు అయనాతాన్నే. ఇదే సమయంలో ఆస్ట్రేలియా వంటి ప్రాంతాల్లో పగలు ఎక్కువగా ఉండి రాత్రి తక్కువగా ఉంటుంది. శీతకాల ఆయనాతంతో భూమి ఉత్తరాయణం ప్రారంభిస్తుంది. అంటే... సూర్యుడు ఉత్తర దిశ వైపుకు కదలడం ప్రారంభిస్తాడు. అదే క్రమంలో జనవరి నుండి పగలు సమయం క్రమంగా పెరుగుతూ రాత్రి సమయం క్రమంగా తగ్గుతుంది.

అయనాతం వంటి వాటిని ఆసరా చేసుకుని కొంతమంది ప్రత్యేక పూజలు చేస్తామంటూ కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేసే అవకాశం ఉంది. గ్రహణం ఏర్పడడం, ఆయనాతం ఏర్పడడం, నెలలో ఒకసారి పౌర్ణమి, ఒకసారి అమావాస్య ఏర్పడడం... ఇవన్నీ ప్రకృతిలో చోటు చేసుకునే సహజ ప్రకియలు. శాస్త్రీయ సమాచారాన్ని అర్థం చేసుకుని మోసగాళ్ల పాల బడకుండా జాగ్రత్తగా ఉండాలి. మూఢనమ్మకాలను నిర్మూలించి శాస్త్రీయ సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– చార్వాక, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ నేషనల్ కోఆర్డినేటర్

కథా ప్రేమికుడే కాదు... నిర్మొహమాట విమర్శకుడు

సందర్భం



కాట్రగడ్డ దయానంద్

వార పత్రికల సీరియల్ నవలల మధ్య తెలుగు కథ ఇరుక్కుని కునారిల్లుతున్న ఎనభయ్యో దశకంలో... సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం సాధించే కృషిలో భాగంగా, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన తెలుగు కథానిక అవతరణ వికాసాలను ప్రతిబింబించే ప్రముఖ రచయితల ప్రసిద్ధ కథలను సంకలనాలుగా తీసుకువచ్చింది 'అరసం' గుంటూరు జిల్లా శాఖ. భవిష్యత్తులోకి తొంగి చూసి, అమూల్యమైన సందేశాలను అందించిన కథలుగా, యువ రచయితలకు మార్గదర్శకాలుగా 29 కథలతో వరుసగా నాలుగు సంకలనాలను ప్రచురించింది. ఆ కథా సంకలన రూపకర్త అప్పటి అరసం ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ.

పరుచూరి రాజారామ్, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, హితశ్రీ, మధురాంతకం రాజారాంలు ఈ కథా సంకలనాలను స్వాగతిస్తూ విశ్లేషించారు. ఈ సంకలనాలు వెలువడుతున్న కాలంలోనే మెల్లిమెల్లిగా కథలకు ప్రచారం, ప్రోత్సాహం మొదలైంది. 1910– 1980 మధ్య ఒక ఏడు దశాబ్దాలకాలంలో వెలువడిన 30 కథల సంకలనం 'విస్మృత కథ'. అప్రసిద్ధుల కనుమరుగైపోయిన కథలు, గొప్ప వస్తు వైవిధ్యం కలిగిన, మరుగున పడిన మంచి కథలను, విస్మృతిలోకి జారిపోయిన రచయితలను మళ్లీ పాఠక లోకానికి పరిచయం చేయాలని పాపినేని శివశంకర్, వల్లూరు శివప్రసాద్‌లతో కలిసి పెనుగొండ సంకలనం చేసిన కథలు.

పీవీ నరసింహారావు 'విజయ' కలం పేరుతో రాసిన 'గొల్ల రామవ్వ' కథను 56 సంవత్సరాల తర్వాత వెలికి తీసి ప్రచురించడం ఈ సంకలనం ప్రత్యేకత. ఆ తర్వాత రోజుల్లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలం నాటి ఆ కథను విశ్లేషిస్తూ తెలంగాణ సాయుధ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ కూడా ఒకటి రెండు సాయుధ దళాలను ఏర్పాటు చేసి ఆ పోరాటంలో పాల్గొన్నట్లుగా పెనుగొండ ధ్రువీకరిస్తారు.

గుంటూరు కథను కథలతోనే చెప్పించాలనే ప్రయత్నంలో భాగంగా మూడు తరాల రచయితల 70 కథలతో డిసెంబర్ 2013లో పెనుగొండ సంపాదకుడుగా 'గుంటూరు కథలు' ప్రచురించారు. ప్రాంతీయ కథా సంకలనాల చరిత్రలోనే ఒక బృహత్ ఒరవడికి తెరతీసిన సంకలనం ఇది.

ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ప్రధాన సంపాదకుడుగా సింగమనేని నారాయణ, సదానంద్ శారదలతో కలిసి సంపాదకుడుగా పెనుగొండ 'విశాలాంధ్ర తెలుగు కథ 1910 –2000' వెలువరించారు. 2015లో గుంటూరులో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి స్ఫూర్తి పురస్కారం అందు కుంటూ కాళీపట్నం రామారావు 'శ్రీకాకుళం కథా నిలయం' వ్యవస్థాపనకు మూలం గుంటూరు అనీ, పెనుగొండ లక్ష్మీ నారాయణ అనే వకీలు తెలుగులో కథా సంకలనాలు 400 ఉంటాయని రాసిన వ్యాసం చదివి, వాటిని పోగేసి ఒకచోట చేరిస్తే కథా నిలయం ఏర్పడుతుందన్న ఆలోచనతో 'కథా నిలయం' స్థాపనకు దిగాననీ ప్రకటించడం విశేషం.



పెనుగొండ లక్ష్మీనారాయణ



'అనేక' (అక్టోబర్ 2004), 'విదిత' (అక్టోబర్ 2014), 'దీపిక' (జూన్ 2021) అనే వ్యాస సంపుటాలను 80 వ్యాసాలతో వెలువరించారు పెనుగొండ. కథ, కవిత్వం, ఉద్యమాలు, వ్యక్తులు, సమీక్షలు, విమర్శలు, పరామర్శలతో ఈ వ్యాసాలున్నాయి. కథ పట్ల ప్రత్యేక అభిరుచి కలిగి ఆయన చేసిన విమర్శలు, పరామర్శలలో 'ప్రాంతీయ కథా సంకలనాల పరామర్శ', 'ఇరవయ్యో శతాబ్ది కథానిక సంకలనాల చరిత్ర'లో వివిధ వర్గీకరణల కింద 300 కథా సంకలనాలు పరిశీలించి సవిస్తారమైన చరిత్రను లిఖించారు.

అక్కిరాజు రమాపతిరావు సంపాదకత్వంలో ప్రచురించిన 'తొలి మలి తరం తెలుగు కథలు' సంకలనాన్ని 'ప్రామాణికత లోపించిన తొలి మలి తరం తెలుగు కథలు' అంటూ నిర్మొహమాటంగా విమర్శించి సాహిత్య పరిశోధకుడిగా పెనుగొండ నిలుస్తారు.

'కవితా ఓ కవితా' (తెలుగు వచన కవితల సంకలనం 1981–90) సంకలనాన్ని పెనుగొండ, పాపినేని శివశంకర్ సంపాదకులుగా ప్రచురించారు. 'భావకవుల ప్రేమ గోల వైతాళికులు' అన్న శీర్షికన ఆనాటి కవిత్వ స్థితిగతులను తన వ్యాసం ద్వారా విశ్లేషించి కృష్ణశాస్త్రి భావాల మేరకు కావాలనే జాషువాతో సహా మరికొందరి కవితల్ని వైతాళికులు సంకలనంలో చేర్చలేదని పెనుగొండ అభిప్రాయపడతారు.

కథానిక పట్ల ఎంతో అనురక్తి కలిగిన పెనుగొండని కథలెందుకు రాయలేదని ప్రశ్నిస్తే, 'కథల మీద గౌరవంతో' అని చిరునవ్వుతో సమాధానమిస్తారు. కవిగా, విమర్శకుడిగా, సంపాదకుడిగా, సాహిత్య పరిశోధకుడిగా, సంకలనకర్తగా, అనువాదకుడిగా, మరీ ముఖ్యంగా సాహిత్య కార్యకర్తగా బహుముఖీన కృషి సలిపి, నిరంతరం మార్క్సిస్టు అవగాహనతో అభ్యుదయ సాహిత్యోద్యమాన్ని శ్వాసించిన పెనుగొండ లక్ష్మీనారాయణ వృత్తి రీత్యా గుంటూరులో వకీలు, ప్రవృత్తి రీత్యా అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు. గతంలో అధికార భాషా సంఘం వారి తెలుగు భాషా పురస్కారం, ప్రజాకవి సుంకర సత్యనారాయణ స్మారక సాహిత్య పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం పొందారు. 2025 జనవరి 4న అజో–విభో విశిష్ట మూర్తి జీవన సాఫల్య పురస్కారం స్వీకరిస్తున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పెనుగొండ విమర్శ వ్యాసాలు 'దీపిక'కు పురస్కారం ప్రకటించిన సందర్భంగా ఈ నాలుగు మాటలు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత
(పెనుగొండ లక్ష్మీనారాయణ విమర్శ వ్యాస సంపుటి 'దీపిక'కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా)

క్లుప్తంగా...

అప్పుల బాధతో నేతన్న ఆత్మహత్య


గణేశ్

సిరిసిల్ల క్రైం: ఉపాధి కరువై.. చేసిన అప్పులు తిరిగి చెల్లించలేని స్థితిలో సిరిసిల్లకు చెందిన ఓ పవర్‌లూమ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నేతకార్మికుడిగా పనిచేస్తున్న దూస గణేశ్ (50)కు ఏడాదిగా పనులు సరిగ్గా లేవు. బతుకుదెరువు కోసం రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతో అప్పులు చెల్లించే మార్గం లేక ఇంటిలోనే ఉరివేసుకున్నాడు. మృతదేహం వద్ద లభించిన సూసైడ్ నోట్‌లో.. తనకు పని కరువైందని, సిరిసిల్ల అర్బన్ బ్యాంకు, ఓలా బండిషోరూం, ఎకో ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్‌లో రూ.5 లక్షల వరకు అప్పులు అయ్యాయని అందులో పేర్కొన్నాడు. చివరలో తనను క్షమించాలని కుటుంబీకులను వేడుకున్నాడు. అయితే గణేశ్ తరచూ మద్యం తాగొచ్చి భార్య, పిల్లలను వేధిస్తుండటంతో వేరుగా ఉంటున్నారని బంధువులు తెలిపారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ వెల్లడించారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు సుమశ్రీ, పూజిత ఉన్నారు.

విచారణకు భయపడి ఆత్మహత్య

- దొంగతనం మోపడంతో మనస్తాపం


మల్లేశ్

మొయినాబాద్: దొంగతనం నెపం వేయడంతో పోలీసుల విచారణకు భయపడిన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిన్నమంగళారంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనపై పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలివి. అవుశాపేట మల్లేశ్ (42) అజీజ్‌నగర్ రెవెన్యూలోని ఆర్గానిక్ విల్లాస్‌లో ఉండే జైపూర్‌కు చెందిన మేఘవి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితం మేఘవి ఇంట్లో దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఆమె మొయినాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, పోలీసులు రెండుసార్లు మల్లేశ్‌ను ఠాణాకు తీసుకెళ్లి విచారించారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం మేఘవి 'నువ్వే దొంగతనం చేశావు.. సీపీ వద్దకు వెళ్లి నీ పని చేయిస్తా'.. అంటూ భయపెట్టింది. దీంతో మనస్తాపానికి గురైన మల్లేశ్ శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోనే పురు గు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి మల్లేశ్‌ను ఆస్పత్రికి తరలించారు. అక్క డే చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సారూ.. కొడుకులు అన్నం పెడ్తలేరు..

- ఆర్డీవోకు వృద్ధురాలి ఫిర్యాదు


ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న బాలమ్మ

జగిత్యాల: 'సారూ.. ఇద్దరు కొడుకులు పట్టించుకోవడం లేదు, అన్నం పెడ్తలేరు'.. అంటూ ఒక వృద్ధురాలు ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. వివరాలివి. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన దుర్గం బాలమ్మకు ఇద్దరు కుమారులున్నారు. భర్త గతంలోనే చనిపోయాడు. ఇద్దరు కొడుకులు చెరో నెలపాటు తల్లిని సాకుతున్నారు. పెద్ద కొడుకు చూసుకున్న అనంతరం చిన్నకొడుకు వద్దకు వెళ్తే అన్నం పెట్టడం లేదని వృద్ధురాలు వాపోయింది. ఉన్న భూమిని అమ్ముకుని డబ్బులు తీసుకున్నారని, తన భూమిని ఇప్పించాలని వేడుకుంది. తనకు ఇంకా 6 గుంటల ఇంటి భూమి, రూ.2.4 లక్షల నగదు ఉందని, వాటితో వృద్ధాశ్రమానికి వెళ్తానని కన్నీరు పెట్టింది. కాగా, కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ అనంతరం వారిపై చర్యలు తీసుకుంటామని, ఆందోళన చెందవద్దని ఆర్డీవో మధుసూదన్ హామీ ఇచ్చారు.

చకచకా కోత.. ఆరబోతకు వెత

గంటలోనే ఎకరం పొలం కోసేస్తున్న హార్వెస్టర్ • ఆపై ధాన్యం ఆరబెట్టేందుకు అందుబాటులో లేని యంత్రాలు • రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న వరిసాగు విస్తీర్ణం

ఈ ఫొటోలో కనిపిస్తున్నది శ్మశానం.ఇల్లెందు మండలం కొమురారం గ్రామానికి చెందిన రైతులు రెండు, మూడు వారాల పాటు రేయింబవళ్లు ఇక్కడే ఉంటున్నారు. ఇదేమీ గ్రామ ఆచారం కాదు. ధాన్యం ఆరబెట్టేందుకు ఖాళీ స్థలం లేక శ్మశానమే వేదికగా మారింది.




ఈ ఫొటోలో కనిపిస్తున్నది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కుదురునూరులో కొనుగోలు కేంద్రం. మబ్బులు పట్టి చినుకులు కురుస్తుండడంతో అప్రమత్తమైన రైతులు కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలుగా పేరుస్తూ కవర్లు కప్పేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎకరం వరి పొలాన్ని ఒకే రోజులో కోయాలంటే గతంలో పన్నెండు మంది కూలీలు అవసరమయ్యేవారు. ఇలా కోసిన పంటను కుప్ప వేసి తూర్పారబట్టడం వరకు కనీసం రెండు వారాల సమయం పట్టేది. కానీ ఇప్పుడు హార్వెస్టర్ ఎకరం పొలాన్ని గంటలోనే కోసి ధాన్యం, గడ్డిని వేరు చేసి ఇస్తోంది. దీంతో రెండు వారాల్లో చేయాల్సిన పని ఒక గంటలోనే పూర్తవుతోంది. ఇదంతా పైకి బాగున్నట్టే కనిపిస్తున్నా ధాన్యం ఆరబెట్టేందుకు అవస్థలు తప్పడం లేదు. రాష్ట్రంలో నానాటికీ వరి సాగు పెరుగుతున్న నేపథ్యంలో ఆరబోత అనేది ఇప్పుడు పెద్ద సమస్యగా మారుతోంది.

తేమ చిక్కులు

వరి కోసినప్పుడు సాధారణంగా 35 శాతం నుంచి 40 శాతం మధ్య ధాన్యంలో తేమ ఉంటుంది. ఈ తేమ 17 శాతం ఉంటేనే ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. గతంలో కొడవళ్లతో కోసి, తూర్పారబట్టే వరకు ధాన్యం పంట పొలాల్లోనే ఎండి సాధారణ స్థాయికి తేమ చేరేది. అయితే హార్వెస్టర్ కోత కావడంతో ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటోంది. దీనిని తగ్గించేందుకు రైతులు ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెడుతున్నారు. కూలీలను పెట్టి ప్రతీ అరగంటకు ఓసారి నెరుపుతున్నారు. దీంతో రైతులకు ఖర్చు పెరుగుతోంది.

ధాన్యం ఆరబోత యంత్రాలు

ధాన్యాన్ని ఆరబెట్టే మొబైల్ ప్యాడీ డ్రయర్ మిషన్లు మార్కెట్లలో అందుబాటులో ఉన్నాయి. మోడళ్ల ఆధారంగా వీటి ధర రూ.8 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఉంది. గంట వ్యవధిలో ఒక ఎకరం పొలంలో పండిన ధాన్యాన్ని ఆరబెట్టడమే కాక తాలును వేరు చేస్తుంది. కోతల సమయాన హార్వెస్టర్ మాదిరే ఈ యంత్రాలతోనూ ప్రయోజనాలు ఉన్నాయి. మొబైల్ ప్యాడీ డ్రయర్ మిషన్లకు రాష్ట్ర రైతు సంక్షేమ శాఖ పరిధిలోని యాంత్రీకరణ- సాంకేతిక విభాగం 2023 జనవరి 23న ఆమోదించింది. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళా రైతులకు 60 శాతం సబ్సిడీ, ఇతరులకు 50 శాతం సబ్సిడీ అందించవచ్చని పేర్కొంది. ఈ నిర్ణయం వెలువడి దాదా రెండేళ్లు కావొస్తున్నా యంత్రాలు విరివిగా అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైంది.

తెలంగాణలో వరిసాగు విస్తీర్ణం ఇలా...

సంవత్సరం	విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)	దిగుబడి (లక్షల మెట్రిక్ టన్నుల్లో)
2019–20	40.31	89.77
2020–21	52.51	96.31
2021–22	62.14	124.46
2022–23	65.00	138.03
2023–24	65.95	146.47
2024–25	66.78	156.20


హార్వెస్టర్‌తో వరి కోత

పది రోజులుగా ఇక్కడే...



కల్లాల్లో ధాన్యం ఆరబోసి ఎప్పుడు అమ్ముడవుతుందా అని చూడాల్సి వస్తోంది. పది రోజులుగా కల్లాల దగ్గరే రాత్రీ పగలు కాపలా ఉంటున్నాం. తేమ శాతం 17కు ఎప్పుడు చేరుతుందా అని ఎదురుచూస్తున్న. ఈ సమయంలో మబ్బులు పడితే భయం పుడుతోంది.

– తడికల నర్సింగరావు, కుదునూరు, చర్ల మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ధరణి పేరుతో లక్షల ఎకరాల స్కామ్

- రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: ధరణి పేరుతో గత ప్రభుత్వం లక్షల ఎకరాల స్కామ్ చేసిందని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వేల కోట్లకు తగ్గకుండా సంపాదించుకుని రాష్ట్రాన్ని లూటీ చేశారని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నల్లగొండలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ధరణిని తీసుకురావడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు స్కామ్‌లు చేసి దోచుకున్నారని మండిపడ్డారు. ధరణితో రైతులు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో భూభారతిని తీసుకొచ్చామన్నారు. ప్రతి రైతుకు గుంట భూమి ఉన్నా భూధార్ కార్డు ఇస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్, రూ.500కు గ్యాస్, ఉచిత కరెంట్‌తో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. సంక్రాంతికి రైతు భరోసాను అందిస్తామని తెలిపారు. వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరిస్తామన్నారు. సంక్రాంతికే ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోయడంతో పాటు కొత్త రేషన్ కార్డులు ఇచ్చే కార్యక్రమం చేపట్టబోతున్నామని వెల్లడించారు. దివంగత సీఎం వైఎస్సార్ మహిళలను లక్షాధికారులను చేస్తే ప్రస్తుత సీఎం మహిళలను కోటీశ్వరులను చేసే ఉద్దేశంతో ముందుకు పోతున్నారని చెప్పారు.

మంత్రి కోమటిరెడ్డి రక్తదానం


రక్తదానం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తన కుమారుడు కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి వర్ధంతి సందర్భంగా నల్లగొండ ఎన్జీ కళాశాల వద్ద శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో.. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రక్తదానం చేశారు. శిబిరంలో 200 మంది రక్తదానం చేసినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించకుంటే సచివాలయం ముట్టడి: జాజుల



కవాడిగూడ (హైదరాబాద్): గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల నిధులు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో వేలాది మంది విద్యార్థులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఇందిరాపార్కులో బీసీ విద్యార్థి సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 8న జరిగే బీసీల శంఖారావం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ తదితర విద్యాకోర్సులు చదువుతున్న 12 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో వార్షిక పరీక్షలు రాయలేక పోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు శ్యామ్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ ప్రచార యావే ప్రాణం తీసింది

జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు 'రాచాల' ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: పుష్ప–2 చిత్రం ప్రచార మోజులో మహిళ ప్రాణాలు తీసిన అల్లు అర్జున్, ప్రొడక్షన్ టీం, సంధ్య థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్రవారం ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. డిసెంబర్ 4న హైదరాబాద్ లోని సంధ్య థియేటర్‌లో పుష్ప–2 ప్రీమియర్ షో సందర్భంగా అల్లు అర్జున్ నిర్లక్ష్యం కారణంగా మానవ హక్కులకు తీవ్ర భంగం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రేక్షకులను నియంత్రించలేమని పోలీసు లు హెచ్చరించినా.. లెక్కలేనితనంతో నటుడు అల్లు అర్జున్ వచ్చారని ఆరోపించారు. దానివల్ల ఒక నిండు ప్రాణం బలైందని, ఆమె కుమారు డు శ్రీతేజ చావు బతుకుల మధ్య ఉన్నాడని పేర్కొన్నారు.

బాలుడి కిడ్నాప్ విషాదాంతం

- తన అన్న చావుకు కారణమంటూ.. బాలుడిని చంపేసి తానూ ఆత్మహత్య
- బావిలో ఇద్దరి మృతదేహాలు వెలికితీత
- చేతబడి నెపంతో కక్ష సాధింపు చర్య


పవన్‌కుమార్


గోవిందు

కేటీదొడ్డి: చేతబడి చేసి తన అన్నను చంపారని కక్ష పెంచుకున్న ఓ తమ్ముడు.. అందుకు కారణమైన కుటుంబంలోని బాలుడిని కిడ్నాప్ చేసి హత్య చేశాడు. ఆ తర్వాత తాను సైతం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన వడ్డె మచ్చప్ప, వడ్డె నర్సింహులు సొంత అన్నదమ్ములు. వడ్డె మచ్చప్ప–లక్ష్మి దంపతులకు ఇద్దరు కొడుకులు రాజు(28), గోవిందు. కాగా, రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వడ్డె నర్సింహులుకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. నర్సింహులు కుమారుడు పవన్‌కుమార్(7) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం స్కూల్‌కు వెళ్లిన పవన్ సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గోవింద్ బైక్‌పై పవన్‌ను చూసినట్టు గ్రామస్తులు చెప్పా రు. అదే సమయంలో గోవిందు సైతం కనిపించలేదు. దీంతో పోలీసులు మచ్చప్ప కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకొని విచారించారు. శుక్రవారం కర్ణాటకలోని రాయిచూర్ జిల్లా యాపల్‌దిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలో గాలింపు చేపట్టారు. అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించగా.. సోలార్ పవర్ ప్రాజెక్ట్ వద్ద గోవిందు బైక్ పార్కు చేసి ఉండటం గుర్తించారు. పోలీసులు సెల్‌నంబర్ ట్రేస్ చేయగా, సిగ్నల్స్ ఆధారంగా ఓ పాడు పడిన బావి వద్ద చివరి లొకేషన్ చూపించింది. దీంతో అనుమానంతో పోలీసులు బావిలో వెతకగా గోవిందు మృతదేహం లభ్యమైంది. గజ ఈతగాళ్ల సాయంతో మళ్లీ వెతకగా బాలుడి మృతదేహం సైతం లభ్యమైంది. ఇద్దరి మృతదేహాలను బయటకు తీసి పోస్టు మార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. కాగా, తన అన్న రాజును నర్సింహులు కుటుంబ సభ్యులు చేతబడి(బాణామతి) చేసి చంపేశారనే కోపంతో గోవింద్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.

మేడిగడ్డ నిర్ణయం కేసీఆర్‌దే!


వికాస్‌రాజ్


కోదండరాం

▶ మొదటి పేజీ తరువాయి

సమాధానాలిచ్చారు.

వ్యక్తిగత హోదాలోనే సాక్ష్యం...

వ్యక్తిగత హోదాలోనే కమిషన్ ముందు సాక్షిగా హాజరైనట్టు వెదిరే శ్రీరామ్ స్పష్టత ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు కోరుతూ సీడబ్ల్యూసీకి నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీఓ) సీఈ రాసిన లేఖను సాక్ష్యంగా ఆయన గతంలో కమిషన్‌కు సమర్పించగా, ఆ లేఖలో వ్యత్యాసాలున్నట్టు కమిషన్ ఎత్తిచూపింది. ఈ లేఖను తాను సీడబ్ల్యూసీ నుంచే స్వీకరించానని, సీడీఓ సీఈ లేఖను మార్చి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. అధికారికంగా తీసుకోనందున వాటిని సాక్ష్యంగా పరిగణించబోమని కమిషన్ తేల్చి చెప్పింది.

అన్నారం, సుందిళ్ల కుంగిపోవచ్చు..

మేడిగడ్డ బరాజ్ తరహాలో అన్నారం, సుందిళ్ల బరాజ్‌లూ కుంగిపోవచ్చని వెదిరె శ్రీరామ్ అన్నారు. బరాజ్‌ల వైఫల్యానికి కారణాలేమిటని కమిషన్ ప్రశ్నించగా, సరైన ఇన్వెస్టిగేషన్లు జరపకుండానే డిజైన్ల రూపకల్పన, డిజైన్లు, మాడల్ స్టడీస్‌కు విరుద్ధంగా నిర్మాణం, నిర్వహణ జరగడమేనన్నారు. ప్లాన్ తయారీకి ముందే పనులు ప్రారంభించారా అని కమిషన్ అడగ్గా, అవునని బదులిచ్చారు. 2016 ఏప్రిల్/మేలో బరాజ్‌లు నిర్మించాలని నిర్ణయించి 2019లోగా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం అత్యాశే అన్నారు. డీపీఆర్ తయారీకి ఏడాది అవసరం కాగా, 4 నెలల్లోనే పూర్తి చేయాలని వ్యాప్కోస్‌ను కోరారన్నారు. డీపీఆర్‌కు ఆమోదం లభించక ముందే టెండర్లు పిలిచి పనులు అప్పగించారని, నాటికి ఇంకా డిజైన్లు సైతం సిద్ధం కాలేదన్నారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల స్థలాలను మార్చడంతో అప్పటికే నిర్వహించిన ఇన్వెస్టిగేషన్లు వృథా అయ్యాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ ఆమోదించిందా అని కమిషన్ అడగగా, లేదని బదులిచ్చారు. తొందరపాటుతో క్షేత్రస్థాయిలోని ఈఈ నుంచి ఈఎన్సీ వరకు అందరూ తప్పిదాలు చేశారన్నారు.

నిర్వహణ విభాగం ఈఎన్సీ జాప్యం చేశారు

బరాజ్‌లలో సీపేజీతో నీరు లీకైనప్పుడు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) సలహా కోరడంలో నిర్వహణ విభాగం ఈఎన్సీ(నాగేంద్రరావు) జాప్యం చేయడంతో నష్టం తీవ్రత పెరిగిందా అని కమిషన్ ప్రశ్నించగా, అవునని వెదిరె బదులిచ్చారు. బరాజ్ కుంగే వరకు ఎన్డీఎస్ఏకు సమాచారం లేదని, కుంగిన 5 రోజులకు ఎన్డీఎస్ఏ బృందం పరిశీలనకు వచ్చిందన్నారు. ఎన్డీఎస్ఏ 20 రకాల సమాచారం కోరితే సకాలంలో ఆ ఈఎన్సీ ఇవ్వలేదని, దీంతో బరాజ్‌ల వైఫల్యానికి కారణాలను గుర్తించడం ఎన్డీఎస్ఏకి క్లిష్టంగా మారిందన్నారు.

మళ్లీ గడువు పొడిగించలేం.. కోదండరాంకు కమిషన్ స్పష్టీకరణ

మీరు సమర్పించిన పత్రాలకు ఆధారాలు ఏమిటని టీజేఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాంను కమిషన్ ప్రశ్నించగా, మరిన్ని ఆధారాలు సమర్పించేందుకు రెండు రోజుల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఓసారి గడువు పొడిగించి మీకు అవకాశం ఇచ్చామని, మళ్లీ పొడిగించడం సాధ్యం కాదని కమిషన్ స్పష్టం చేసింది. అఫిడవిట్‌పై చేసిన సంతకం మీదేనా? అని కమిషన్ ప్రశ్నించగా, అవునని కోదండరాం ధ్రువీకరించారు. గతంలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన వికాస్‌రాజ్ కమిషన్ ముందు హాజరై కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తన పాత్ర ఏమిలేదని తెలపడంతో ఆయనకు కమిషన్ ఎలాంటి ప్రశ్నలు వేయలేదు.

బెయిల్‌పై లగచర్ల రైతుల విడుదల


జైలు నుంచి విడుదలైన లగచర్ల రైతులు

సంగారెడ్డి టౌన్: కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులపై దాడి చేసిన ఘటనలో అరెస్టై జైలుకు వెళ్లిన వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామ రైతులు 37 రోజుల తర్వా త బెయిల్‌పై విడుదలయ్యారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులకు నాంపల్లి కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం రైతులు జైలు నుంచి విడుదల కావాల్సి ఉన్నప్పటికీ జైలు అధికారులకు ఆలస్యంగా బెయిల్ పత్రాలు ఇవ్వడంతో శుక్రవారం వారిని కంది జైలు నుంచి విడుదల చేశారు. మొత్తం 17 మందికి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సురేశ్‌తోపాటు మరో ఏడుగురికి బెయిల్ లభించలేదు. కాగా, రైతులు జైలు నుంచి బయటకు వస్తూనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిరిజన సంఘాలు, బీఆర్‌ఎస్ నేతలు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైతులు మీడియాతో మాట్లాడుతూ.. తమ ఆస్తులను కాపాడుకోవడం కోసం పోరాటం చేశామని, జీవితంలో చూడని బాధలను జైల్లో చూశామని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా రైతులను కూడా విడుదల చేస్తే సంతోషంగా ఉండేదని చెప్పారు. మిగతా రైతులను కూడా విడుదల చేయాలని, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

కుదిరితే కప్పు టీ

- భారత ప్రధాని మోదీతో సంభాషణ చాలా ఇష్టం
- ఆయన నాకు మంచి మిత్రుడు: రష్యా అధ్యక్షుడు పుతిన్


పుతిన్, మోదీ సమావేశం(ఫైల్)

మాస్కో: భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయి. భారత ప్రధానమంత్రులు ఎవరైనా సరే రష్యాతో అనుబంధానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. రష్యా అధినేతలు సైతం అదే రీతిలో స్పందిస్తుంటారు. ప్రస్తుత అధ్యక్షుడు పుతిన్ భారత ప్రధాని నరేంద్ర మోదీతో తన స్నేహం, అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. మోదీతో చక్కటి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ప్రపంచదేశాల అధినేతల్లో తనకున్న కొద్ది మంది మిత్రుల్లో మోదీ కూడా ఒకరని అన్నారు. పుతిన్ తాజాగా మీడియా ప్రతినిధుల వార్షిక సమావేశంలో మాట్లాడారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. ఈ సందర్భంగా ఆసక్తికరమైన విషయం బయటపెట్టారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో తేనీరు సేవిస్తూ ఏ దేశ అధినేతతో సంభాషించాలని మీరు కోరుకుంటారు? అని ప్రశ్నించగా, భారత ప్రధాని మోదీతోపాటు జర్మనీ మాజీ చాన్స్‌లర్ హెల్ముత్ కోల్, ఫ్రాన్స్ అధ్యక్షుడు జాక్విస్ చిరక్, ఇటలీ మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ, చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో మాట్లాడడం ఇష్టమని, వారంతా తనకు మంచి స్నేహితులని స్పష్టంచేశారు. కుదిరితే వారితో టీ సేవిస్తూ సంభాషించడానికి ఇష్టపడతానని వెల్లడించారు. బ్రెజిల్, చైనా, దక్షిణాఫ్రికా, రష్యా, ఇండియాతో కూడిన 'బ్రిక్స్' కూటమి పశ్చిమ దేశాలకు వ్యతిరేకం కాదని పుతిన్ తేల్చిచెప్పారు. తమ కూటమి దేశాల ప్రయోజనాల కోసం తప్ప ఇతర దేశాలకు వ్యతిరేకంగా తాము పనిచేయడం లేదని వివరించారు. ఇదిలా ఉండగా, పుతిన్ వచ్చే ఏడాది మొదట్లో భారత్‌లో పర్యటించబోతున్నారు. ప్రతిఏటా కనీసం ఒక్కసారైనా భేటీ కావాలని పుతిన్, మోదీ ఇప్పటికే నిర్ణయించుకున్నారు.

పెళ్లి కమర్షియల్ వెంచర్ కాదు

- భరణం సహేతుకంగా ఉండాలి: సుప్రీం
- చట్టాలను దుర్వినియోగం చేయొద్దు



న్యూఢిల్లీ: మహిళల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలను భర్తలపై వేధింపులకు, దోపిడీకి సాధనాలుగా దుర్వినియోగం చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ''భరణం మహిళకు సహేతుకమైన జీవన ప్రమాణాలను అందించడానికి ఉద్దేశించింది. అంతే తప్ప మాజీ జీవిత భాగస్వామితో సమానమైన ఆర్థిక స్థితిని కల్పించడానికి కాదు'' అని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం నొక్కి చెప్పింది. ఒక మహిళ దాఖలు చేసుకున్న విడాకుల కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. తన భర్తకు రూ.5,000 కోట్ల నికర ఆస్తులున్నాయని, మొదటి భార్యకు ఏకంగా రూ.500 కోట్ల భరణం చెల్లించాడని ఆమె పేర్కొంది. తనకూ భారీగా భరణం ఇప్పించాలని కోరింది. దీనిపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చింది. ''మాజీ భార్యకు తన ప్రస్తుత ఆర్థిక స్థితి ఆధారంగా నిరవధికంగా మద్దతివ్వాల్సిన అవసరం పురుషునికి లేదు. వివాహం కుటుంబానికి పునాది మాత్రమే తప్ప కమర్షియల్ వెంచర్ కాదు. మహిళలు తమ మేలు కోసం కోరే చట్టాలను జాగ్రత్తగా ఉపయోగించాలి'' అని సూచించింది. వివాహాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్‌కు శాశ్వత భరణం కింద నెల రోజుల్లో రూ.12 కోట్లు చెల్లించాలని మాజీ భర్తకు ఆదేశించింది. అతనిపై దాఖలు చేసిన క్రిమినల్ కేసులను కొట్టేసింది. ''విడాకుల కేసుల్లో భార్యలు తమ జీవిత భాగస్వామి ఆస్తులు, హోదా, ఆదాయాలను హైలైట్ చేయడం, వాటిలో సమాన వాటా కోరడం బాగా పెరుగుతోంది. ఇది సమర్థనీయం కాదు. భరణం విషయంలో భర్త ఆదాయాన్ని మాత్రమే కాకుండా, భార్య ఆదాయం, అవసరాలు తదితర అంశాలెన్నింటినో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ విడాకుల తర్వాత దురదృష్టం కొద్దీ భర్త నిరుపేదగా మారితే? అప్పుడు తామిద్దరి సంపదను సమానం చేసుకోవడానికి సిద్ధపడుతుందా?'' అని ప్రశ్నించింది. భార్య, ఆమె కుటుంబ సభ్యులు క్రిమినల్ చట్టాలను బేరసారాల సాధనంగా దుర్వినియోగం చేయరాదని హెచ్చరించింది.

జేపీసీకి జమిలి బిల్లులు

తీర్మానాలను ఆమోదించిన పార్లమెంట్ ఉభయ సభలు

- 39 మంది ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ
- లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మందికి స్థానం
- కమిటీ చైర్మన్‌గా బీజేపీ ఎంపీ పి.పి.చౌదరి నియామకం

సాక్షి, న్యూఢిల్లీ: 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' దిశగా మరో ముందడుగు పడింది. జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ(129వ సవరణ) బిల్లు–2024, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల(సవరణ) బిల్లు–2024ను సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు సిఫార్సు చేయడానికి పార్లమెంట్ శుక్రవారం ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ రెండు వేర్వేరు తీర్మానాలను లోక్‌సభ, రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఉభయ సభలు ఈ తీర్మానాలను ఆమోదించాయి. జమిలి ఎన్నికల బిల్లులు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున తదుపరి పరిశీలన నిమిత్తం జేపీసీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. లోక్‌సభతోపాటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా రెండు బిల్లులను సమగ్రంగా పరిశీలించడానికి, భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరపడానికి జేపీసీని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అనుకున్నట్లుగానే జమిలి బిల్లులపై తదుపరి అధ్యయనానికి 39 మంది ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఎంపీలకు ప్రాతినిధ్యం లభించింది. వాస్తవానికి జేపీసీలో 31 మందిని నియమించనున్నట్లు కేంద్రం తొలుత వెల్లడించింది. కానీ, కీలకమైన ఈ బిల్లులపై విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరపాల్సి ఉన్న దృష్ట్యా 39 మందిని నియమించాలని నిర్ణయించింది. వివిధ పార్టీల ఎంపీలు సైతం జేపీసీలో చేరడానికి ఆసక్తి చూపారు. ఈ కమిటీ చైర్మన్‌గా బీజేపీ ఎంపీ పి.పి.చౌదరిని నియమించారు. కేంద్ర మాజీ మంత్రులు అనురాగ్ ఠాకూర్, పురుషోత్తం రూపాలా, పి.పి.చౌదరి, మనీశ్ తివారీతోపాటు ప్రియాంకగాంధీ వాద్రా, బన్సూరీ స్వరాజ్, సంబిత్ పాత్రా, హరీశ్ బాలయోగి తదితరులను జేపీసీ సభ్యులుగా నియమించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు, పార్టీ ఫ్లోర్ లీడర్ వి.విజయసాయిరెడ్డిని జేపీసీ సభ్యుడిగా నియమిస్తూ రాజ్యసభ సెక్రటేరియేట్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యసభ నుంచి జేపీసీలో చోటు దక్కిన వారి పేర్లను చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వెల్లడించారు. విజయసాయిరెడ్డితో పాటు ఘన్‌శ్యామ్ తివారీ, భువనేశ్వర్ కలిత, కవిత పాటిదార్, సంజయ్ కుమార్ ఝా, రణ్‌దీప్‌సింగ్ సూర్జేవాలా, ముకుల్ బాలకృష్ణ వాస్నిక్, సాకేత్ గోఖలే, పి.విల్సన్, సంజయ్‌సింగ్, మానస్ రంజన్ మంగరాజ్, డాక్టర్ కె.లక్ష్మణ్ జేపీసీలో సభ్యులుగా ఎంపికయ్యారు. తెలంగాణకు సంబంధించి బీఆర్ఎస్ నుంచి కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి, దీవకొండ దామోదర్‌రావు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జేపీసీలో ఒక్కరికైనా చోటు దక్కుతుందని ఆశించిన బీఆర్ఎస్‌కు భంగపాటు ఎదురయ్యింది. ఆంధ్రప్రదేశ్ నుంచి విజయసాయిరెడ్డి, హరీశ్ బాలయోగి, తెలంగాణ నుంచి కె.లక్ష్మణ్ జేపీసీకి నామినేట్ అయ్యారు.

ఎన్డీయే నుంచి 22, ఇండియా నుంచి 10 మంది

జేపీసీలో బీజేపీ నుంచి 16 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురికి అవకాశం కల్పించారు. అలాగే సమాజ్‌వాదీ పార్టీ(2), తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(2), డీఎంకే(2), వైఎస్సార్‌సీపీ(1) శివసేన(1), టీడీపీ(1), జేడీ–యూ(1), ఆర్ఎల్డీ(1), ఎల్‌జేపీ–ఆర్‌వీ(1), జేఎస్పీ(1), శివసేన–ఉద్ధవ్(1), ఎన్సీపీ–శరద్ పవార్(1), సీపీఎం(1), ఆమ్ ఆద్మీ పార్టీ(1)కి సైతం స్థానం కల్పించారు. అధికార ఎన్డీయే నుంచి 22 మంది, విపక్ష ఇండియా కూటమి నుంచి 10 మంది జేపీసీని నామినేట్ అయ్యారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన తీర్మానం ప్రకారం జాయింట్ పార్లమెంటరీ కమిటీ తన నివేదికను వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో చివరి వారానికి సంబంధించిన మొదటి రోజు నాటికి లోక్‌సభకు సమర్పించాల్సి ఉంటుంది.



గొప్ప గౌరవంగా భావిస్తున్నా: విజయసాయిరెడ్డి

''జమిలి ఎన్నికల బిల్లుకు సంబంధించి జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నామినేట్ కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, పాలనా సామర్థ్యాన్ని పెంచడానికి, మన రాజకీయ నాయకుల జవాబుదారీతనాన్ని నిలబెట్టడానికి, జాతీయ ప్రయోజనాలకు తోడ్పడతానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నా'' అంటూ విజయసాయిరెడ్డి గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

జమిలిని కచ్చితంగా వ్యతిరేకిస్తాం: జైరామ్ రమేశ్

జమిలి ఎన్నికలను కచ్చితంగా వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇలాంటి ఎన్నికలు దేశ రాజ్యాంగ మౌలిక స్వరూపానికే విరుద్ధమని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్య వ్యతిరేక, సమాఖ్య వ్యతిరేక ఎన్నికలు మనకు అవసరం లేదని అన్నారు. జమిలి బిల్లులు నెగ్గాలంటే లోక్‌సభలో 272 మంది సభ్యుల మద్దతు అవసరమని చెప్పారు. అంతబలం మోదీ ప్రభుత్వానికి లేదని, బిల్లులు ఆమోదం పొందడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

చివరి రోజు సైతం కొనసాగిన విపక్షాల ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాల చివరి రోజు సైతం విపక్షాలు ఆందోళన కొనసాగించాయి. లోక్‌సభ ప్రారంభానికి ముందే కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై చర్చించేందుకు వాయిదా తీర్మానం నోటీసు ఇచ్చారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సభ ప్రారంభం కాగానే అమిత్ షా వ్యాఖ్యలపై విపక్షాలు నిరసనకు దిగాయి. ఈ గందరగోళం మధ్యే స్పీకర్ ఓంబిర్లా పార్లమెంట్ ద్వారాలు, పరిసర ప్రాంతాల్లో నిరసనలకు సంబంధించి సభ్యులకు సూచనలు జారీ చేశారు. ''సభ గౌరవాన్ని, మర్యాదను కాపాడేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలి. పార్లమెంట్ ద్వారాల వద్ద గానీ, పరిసరాల్లో గానీ ధర్నాలు, ప్రదర్శనలు చేయడం సరైంది కాదు. ఎవరూ ఎలాంటి ప్రదర్శనలు చేయరాదని మరో మారు కోరుతున్నా. సభ్యులంతా నియమాలు పాటించాలి. మా ఆదేశాలను సీరియస్‌గా తీసుకోవాలి'' అని స్పష్టంచేశారు. విపక్షాల ఆందోళనల మధ్యే జమిలి ఎన్నికల బిల్లులను జేపీసీకి పంపిస్తూ కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. తీర్మానం ఆమోదం పొందిన అనంతరం సభను స్పీకర్ ఓంబిర్లా నిరవధికంగా వాయిదా వేశారు.

ఎగువ సభలోనూ రగడ

రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళనకు దిగాయి. అంబేడ్కర్‌ను అవమానించినందుకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని పట్టుబట్టాయి. దీనిపై చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ స్పందిస్తూ.. ''ప్రపంచం మన ప్రజాస్వామ్యాన్ని గమనిస్తోంది. పార్లమెంట్‌లో ఈ అంతరాయాలు ప్రజల విశ్వాసాన్ని, అంచనాలను అపహాస్యం చేస్తున్నాయి. అత్యంత నిబద్ధతతో సేవ చేయాలన్న మన ప్రాథమిక కర్తవ్యాన్ని విస్మరిస్తున్నాం. మనం చర్చించాలనుకున్న విషయాల్లో అస్పష్టత ఉన్నప్పుడు గందరగోళం మాత్రమే చూస్తాం. పార్టీలకు అతీతంగా ప్రతి పార్లమెంట్ సభ్యుడు



తమ మనస్సాక్షిని గమనించాలని కోరుతున్నా'' అని అన్నారు. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు చెబుతూ ఆందోళనకు దిగడంతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ జమిలి ఎన్నికల బిల్లులను జేపీసీకి పంపించే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దానిని మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. అనంతరం ఈ శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ మొత్తంగా 40.03 శాతం ఉత్పాదకతతో పనిచేసిందని, 43.27 గంటల పాటు చర్చలు జరగ్గా, రెండు బిల్లులు ఆమోదం పొందాయని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వెల్లడించారు. సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

వాళ్లు గొప్ప నటులు!

- అన్ని అవార్డులూ ఇవ్వొచ్చు
- బీజేపీ ఎంపీలపై జయ విసుర్లు



న్యూఢిల్లీ: పార్లమెంటు ఘర్షణలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ ఎంపీలది నటనేనని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయాబచ్చన్ ఆరోపించారు. వారి నటనా పటిమకు అన్ని అవార్డులూ ఇవ్వొచ్చంటూ ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ, ఇతర కాంగ్రెస్, విపక్షాల ఎంపీల తోపులాటలో గాయపడ్డట్టు బీజేపీ సభ్యులు ప్రతాప్‌చంద్ర సారంగీ, ముకేశ్ రాజ్‌పుత్ చెప్పడం తెలిసిందే. రాహుల్ తనతో అసభ్యంగా ప్రవర్తించినట్టు ఆ పార్టీకి చెందిన మహిళా ఎంపీ ఫాంగ్నాన్ కొన్యాక్ ఆరోపించారు. శుక్రవారం విపక్షాల ఆందోళన సందర్భంగా జయ మీడియాతో మాట్లాడుతూ వారి తీరును తీవ్రంగా ఆక్షేపించారు. వాళ్లకంటే మెరుగైన నటులను తన కెరీర్లోనే చూడలేదంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ''రాజ్‌పుత్‌కు తొలుత చిన్న బ్యాండేజీ వేశారు. తర్వాత దాని సైజు పెరిగింది. చివరికి చూస్తే ఐసీయూలో తేలారు. ఎంత అద్భుతమైన నటనో!'' అంటూ దుయ్యబట్టారు. జయ విమర్శలపై బీజేపీ మండిపడింది. ''బాధితులను వదిలి నిందితుని పక్షం వహించడమా? సమాజ్‌వాదీ పార్టీ సంస్కృతికి, విపక్ష ఇండియా కూటమి సంస్కృతికి ఇది మరో నిదర్శనం'' అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు.

రాజస్తాన్‌లో ఘోర ప్రమాదం

ఎల్పీజీ ట్యాంకర్, ట్రక్కు ఢీ

- 11 మంది మృతి, 35 మందికి గాయాలు
- బస్సులు, కార్లు సహా 37 వాహనాలు దగ్ధం

జైపూర్: ఎల్పీజీ ట్యాంకర్, ట్రక్కు ఢీకొని మంటలు చెలరేగిన ఘటనలో 11 మంది సజీవ దహనం కాగా మరో 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. మంటలంటుకుని 37 వాహనాలు మసయ్యాయి. ఈ దుర్ఘటన రాజస్తాన్‌లోని జైపూర్–అజ్మీర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. జైపూర్ పోలీస్ కమిషనర్ బిజూ జార్జి జోసెఫ్ ఘటనాస్థలిని పరిశీలించారు. ట్రక్కును ఢీకొనడంతో ఎల్జీజీ ట్యాంకర్ ఔట్‌లెట్ నాజిల్ ధ్వంసమైంది. దీంతో గ్యాస్ లీకడంతో మంటలు చెలరేగి, ఆ వెనుకగా వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొని మంటలు అంటుకున్నాయని కమిషనర్ జోసెఫ్ వెల్లడించారు. ఎదురుగా వస్తున్న వస్తున్న వాహనాలు కూడా మంటల్లో చిక్కుకున్నాయని చెప్పారు. ఇదంతా వెనువెంటనే జరిగిపోవడంతో వాహనాల్లోని వారు బయటకు వచ్చేందుకు కూడా సమయం లేకపోయిందన్నారు. మంటలంటుకున్న కొందరు దుస్తులను వదిలేస్తూ పరుగులు తీశారన్నారు. ప్రమాద మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు అంటున్నారు. గ్యాస్ ట్యాంకర్ వెనుకే ఉదయ్‌పూర్ నుంచి జైపూర్ వైపు వెళ్తున్న ప్రైవేట్ స్లీపర్ బస్సుకు కూడా మంటలు అంటుకున్నాయి. ప్రమాద బాధితులను గుర్తించే పనిలో ఉన్నామని అధికారులు తెలిపారు.

బస్సులు, కార్లు, కంటెయినర్లు..

రెండు బస్సులు, ఒక ఆటో, ఏడు కార్లు, ఇంకా పికప్ వ్యాన్లు, బైకులు, ట్రక్కులు, కంటెయినర్లు కలిపి మొత్తం 37 వాహనాలు మంటలకు ఆహుతయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన ఎస్ఎంఎస్ ఆస్పత్రికి తరలించేందుకు వీలుగా గ్రీన్‌కారిడార్ ఏర్పాటు చేశారు. ప్రమాదం ప్రభావం జైపూర్–అజ్మీర్ జాతీయ రహదారిపై కిలోమీటర్ మేర కనిపించింది. పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో, అధికారులు వాహనాలను దారి మళ్లించారు. దగ్ధమైన వాహనాలను అక్కడి నుంచి తొలగించి, మధ్యాహ్నానికి రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాద తీవ్రతకు ఆ సమీపంలోనే ఉన్న పైపుల ఫ్యాక్టరీకి నష్టం వాటిల్లింది. దట్టమైన పొగ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కళ్ల మంట, శ్వాస సంబంధ సమస్యతో ఇబ్బందిపడ్డామన్నారు. మంటలు, పొగ తీవ్రతకు కొన్ని పక్షులు సైతం చనిపోయాయని చెప్పారు. రాజస్తాన్ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.1 లక్ష చొప్పున


అగ్నికి ఆహుతవుతున్న వాహనాలు

పరిహారం ప్రకటించింది. అలాగే, ప్రధాని సహాయ నిధి కింద మృతులకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ,, హోం మంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు.

రాహుల్‌పై కేసు క్రైమ్ బ్రాంచ్‌కు...

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం జరిగిన తోపులాటకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీపై నమోదైన కేసును ఢిల్లీ పోలీసులు క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. బీజేపీ ఫిర్యాదు మేరకు రాహుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇకపై ఈ కేసును క్రైమ్‌బ్రాంచ్ దర్యాప్తు చేస్తుందని అధికారులు శుక్రవారం వెల్లడించారు. భారత న్యాయ సంహితలోని సెక్షన్ 117, 125, 131, 351, 3(5) కింద రాహుల్‌పై పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. తోపులాటలో గాయపడిన ఇద్దరు బీజేపీ ఎంపీల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నట్లు అధికారులు చెప్పారు. అలాగే రాహుల్ గాంధీని పిలిపించి ప్రశ్నించనున్నట్లు తెలిపారు. పార్లమెంట్‌లో గురువారం జరిగిన తోపులాటకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీ కోసం పార్లమెంట్ సెక్రటేరియట్‌కు లేఖ రాస్తామని వెల్లడించారు. తోపులాటలో బీజేపీ ఎంపీలు ప్రతాప్‌చంద్ర సారంగి(69), ముకేశ్ రాజ్‌పుత్(56) గాయపడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని, కోలుకుంటున్నారని డాక్టర్లు శుక్రవారం తెలియజేశారు.



ప్రియాంకకు బీజేపీ ఎంపీ బ్యాగ్ బహుమతి



న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ అపరాజితా సారంగి శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రాకు '1984' అని రాసున్న బ్యాగ్‌ను బహుమతిగా అందజేశారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రియాంక పాలస్తీనా, బంగ్లాదేశ్ అని రాసిన బ్యాగులతో కనిపించడం తెలిసిందే. వాటి ంశాల మాదిరిగా 1984 సిక్కు ఘర్షణలను కూడా ప్రస్తావించాలని కోరుతూ ప్రియాంకకు బ్యాగ్ అందజేసినట్లు సారంగి చెప్పారు.

జనరల్ రావత్ మృతి మానవ తప్పిదమే

పార్లమెంటరీ కమిటీ నివేదిక



న్యూఢిల్లీ: దేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ మృతికి మానవ తప్పిదమే కారణమని పార్లమెంటరీ కమిటీ తేల్చింది. 2021 డిసెంబర్ 8న తమిళనాడులో కూనూర్ సమీపంలో హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన మరణించారు. ఎంఐ–17 వీ5 హెలికాప్టర్ కుప్పకూలిన ఆ ఘటనలో జనరల్ రావత్, ఆయన భార్య మధూలికతో పాటు సిబ్బంది కూడా దుర్మరణం పాలయ్యారు. దానికి మానవ తప్పిదమే కారణమని కమిటీ నివేదిక తెలిపింది. 13వ రక్షణ ప్రణాళిక కాలంలో భారత వైమానిక దళ విమానాల ప్రమాదాల సంఖ్యపై రక్షణ శాఖ స్టాండింగ్ కమిటీ తాజాగా పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో ఈ మేరకు వెల్లడించింది. 2018–22 మధ్య కాలంలో జరిగిన ఐఏఎఫ్ విమాన ప్రమాదాలకు కారణాలను అందులో వివరించింది.

ఆ వార్తల్లో నిజం లేదు: జస్టిస్ చంద్రచూడ్



న్యూఢిల్లీ: జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) నూతన చైర్మన్‌గా తన పేరు పరిశీలనలో ఉన్నట్లు మీడియాలో వస్తున్న వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ శుక్రవారం స్పష్టంచేశారు. ప్రస్తుతం విశ్రాంత జీవితం హాయిగా గడుపుతున్నానని చెప్పారు. ఎన్‌హెచ్ఆర్సీ చైర్మన్ పదవి ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ఖాళీగా ఉంది. అరుణ్ కుమార్ మిశ్రా పదవీ విరమణ తర్వాత ఎవరినీ నియమించలేదు.

ట్రంప్ ప్రతిపాదనల్ని తిరస్కరించిన హౌస్



వాషింగ్టన్: వచ్చే ఏడాది మార్చి 14 వ రకు ఫెడరల్ ప్రభుత్వ వ్యయంపై ఎన్నికైన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకూలురు శుక్రవారం ఉదయం ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను ప్రతినిధుల సభ తిరస్కరించింది. రుణ పరిమితి పెంచుతూ చేసిన ప్రతిపాదనల్ని సభలో ప్రవేశపెట్టగానే ఒక్క పెట్టున నిరసనలు చెలరేగాయి. హఠాత్తుగా తీసుకొచ్చిన ప్రతిపాదనల్ని ఆమోదించేది లేదని సభ్యులు ప్రకటించారు. బిల్లు ఆమోదానికి కావాల్సిన మూడింట రెండొంతుల మెజారిటీ లభించలేదు. 174–235 ఓట్ల తేడాతో వీగిపోయింది. అయితే, శుక్రవారం అర్ధరాత్రి తుది ప్రయత్నంగా తమ ప్రతిపాదనలను మరోసారి సభలో ప్రవేశపెడతామని స్పీకర్ మైక్ జాన్సన్ ప్రకటించారు. ప్రకృతి విపత్తులకు ఇచ్చే సాయం, రైతులకు ఆర్థిక సాయం కలిపి 110 బిలియన్ డాలర్లను బైడెన్ ప్రభుత్వం వ్యయ బిల్లులో ప్రతిపాదించింది. అయితే, రుణ పరిమితి పెంచితేనే ఓకే చేస్తామని ట్రంప్ అనుకూలురు అంటున్నారు. శుక్రవారంలోగా ఈ విషయంలో స్పష్టత రాకుంటే ప్రభుత్వ పాలన స్తంభించే ప్రమాదముంది.

చౌతాలా కన్నుమూత

- గుండెపోటుతో మరణించిన జాట్ దిగ్గజం
- హరియాణాకు ఐదుసార్లు సీఎం



చండీగఢ్/న్యూఢిల్లీ: హరియాణా మాజీ ముఖ్యమంత్రి, జాట్ దిగ్గజం, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్డీ) అధ్యక్షుడు ఓం ప్రకాశ్ చౌతాలా కన్నుమూశారు. 89 ఏళ్ల చౌతాలా గురువారం గురుగ్రాంలోని తన నివాసంలో గుండెపోటుకు గురయ్యారు. దాంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. గత అక్టోబర్‌లో హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా, అనంతరం స్వగ్రామంలో ఓటేసిన సందర్భంలో చౌతాలా చివరిసారిగా బహిరంగంగా కనిపించారు. ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ మొదలుకుని పలువురు ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు. హరియాణా రాజకీయాల్లో ఆయనది మరవలేని పాత్ర అని ముర్ము కొనియాడారు. దేవీలాల్ వారసత్వాన్ని కొనసాగించేందుకు చౌతాలా కృషి చేశారని మోదీ అన్నారు.

మెరుపులు, మరకలు

ఓం ప్రకాశ్ చౌతాలా జాతీయ రాజకీయాల్లో దిగ్గజ నేత. దివంగత ఉప ప్రధాని చౌదరీ దేవీలాల్ కుమారుడు. 1935 జనవరి 1న జన్మించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో పలు ఉత్థాన పతనాలను చవిచూశారు. 1989లో హరియాణా సీఎంగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. మొత్తం ఐదుసార్లు సీఎంగా చేసినా 1999–2005 మధ్య ఒక్కసారి మాత్రమే పూర్తి పదవీకాలం పూర్తి చేసుకోగలిగారు. కేంద్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా పలు మార్లు ఉద్యమించారు. ఎమర్జెన్సీ సమయంలో 19 నెలలు జైల్లో గడిపారు. చౌతాలా పలు వివాదాల్లోనూ చిక్కుకున్నారు. 1990 ఎన్నికలప్పుడు మేహం అసెంబ్లీ స్థానంలో జరిగిన అల్లర్లు 'మేహం కాండ'గా ఆయనకు తీరని అప్రతిష్ఠ తెచ్చి పెట్టాయి. టీచర్ల నియామకం కుంభకోణంలో 2013లో కుమారుడు అజయ్‌తో పాటు దోషిగా తేలారు. పదేళ్ల జైలు శిక్ష పడటంతో తిహార్ జైల్లో తొమ్మిదిన్నరేళ్ల శిక్ష అనుభవించారు. 2021లో విడుదలైనా ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దోషిగా నాలుగేళ్ల జైలు శిక్షపడటంతో 2022 మేలో 87 ఏళ్ల వయసు లో మళ్లీ తిహార్ జైలుకు వెళ్లారు. జైలు చరిత్రలోనే అత్యంత వృద్ధ ఖైదీగా నిలిచారు. ఆయనకు పడ్డ శిక్షను ఆగస్టులో ఢిల్లీ హైకోర్టు సస్పెండ్ చేసింది.

పిల్లలూ రాజకీయాల్లోనే..

చౌతాలా భార్య స్నేహలత 2019లో మరణించారు. ఆయన కుమారులు అజయ్ సింగ్ చౌతాలా, అభయ్ సింగ్ చౌతాలా, ముగ్గురు కుమార్తెలున్నారు. ఐఎన్ఎల్డీలో చీలిక అనంతరం జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) పేరిట అజయ్ వేరుకుంపటి పెట్టుకున్నారు. కుమారుడు దుష్యంత్ ఉప ముఖ్యమంత్రిగా చేశారు. అభయ్, ఆయన కుమారుడు అర్జున్ ఇద్దరూ ఎమ్మెల్యేలే.

82వ ఏట జైల్లో ఇంటర్ పాస్

చౌతాలా జైల్లో ఉంటూనే పదో తరగతి, ఇంటర్ చదువు పూర్తి చేశారు. దీని స్ఫూర్తితోనే బాలీవుడ్ సినిమా 'దస్వీ' (పదో తరగతి) వచ్చింది.

సంభాల్ ఎంపీ నివాసం నేలమట్టం

సంభాల్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లా దీపా సరాయ్ ప్రాంతంలోని సమాజ్‌వాదీ పార్టీకి చెందిన సంభాల్ ఎంపీ జియా ఉర్ రెహ్మాన్ ఇంటిని శుక్రవారం అధికారులు బుల్డోజర్‌తో నేలమట్టం చేశారు. ఆక్రమణల తొలగింపులో భాగంగా అధికారులు ఎంపీ ఇంటిని కూలగొడుతున్నట్లుగా ఉన్న వీడియో ఒకటి ఆన్‌లైన్‌లో వైరలవుతోంది. మురుగు కాల్వల ఆక్రమణలపై జిల్లాలో 15 రోజుల డ్రైవ్ చేపట్టామని అధికారులు తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన నేరానికి గాను గురువారం ఎంపీపై కేసు నమోదు చేసిన అధికారులు శుక్రవారం రూ.1.91 కోట్ల జరిమానా విధించారు. నివాసానికి విద్యుత్ కనెక్షన్ తొలగించారు. అధికారులను బెదిరించినందుకు ఎంపీ తండ్రిపైన పోలీసులు కేసు పెట్టారు.

52 కిలోల బంగారం, రూ.11 కోట్ల నగదు స్వాధీనం

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిన కారులో భారీ మొత్తంలో బంగారం, నగదు లభ్యమైంది. రూ.40 కోట్ల విలువైన 52 కిలోల బంగారం, రూ.11 కోట్ల నగదును ఆదాయపు పన్ను శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం అధికారులు శుక్రవారం వెల్లడించారు. భోపాల్‌లో ఐటీ అధికారులు కొన్ని రోజులుగా సోదాలు నిర్వహిస్తున్నారు. కుశాల్‌పుర రోడ్డులో ఇన్నోవా క్రిస్టా వాహనాన్ని ఎవరో వదిలేసి వెళ్లిపోయినట్లు గురువారం రాత్రి వారికి సమాచారం అందింది. అందులో సంచులు ఉన్నట్లు తెలిసింది. దాంతో పోలీసులతో కలిసి అధికారులు రంగంలోకి దిగారు. కారును చుట్టుముట్టి తనిఖీ చేశారు. అందులో పెద్ద మొత్తంలో బంగారం, నగదు ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఈ కారు గ్వాలియర్‌కు చెందిన చందన్‌సింగ్ గౌర్ పేరిట రిజిస్టర్ అయినట్లు అధికారులు చెప్పారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 21 । డిసెంబర్ । 2024



అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నేతలు డిమాండ్ చేశారు. -8లో



.. దుల్హా- దుల్హన్

దుల్హా- దుల్హన్ ఫ్యామిలీ ఇనిస్టిట్యూట్‌కు స్పందన లభిస్తోంది. టోలిచౌకిలో నివసించే ఇలియాస్ షంషి అనే వ్యక్తి 'దుల్హా- దుల్హన్' కోర్సును అందుబాటులోకి తెచ్చాడు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/22.0

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. గరిష్టంగా 29, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

నవ కవనం!

కొత్త రెక్కలు విచ్చుకుంటున్న సృజన ప్రపంచం

తెలుగు సాహిత్యానికి యువ రచయితల అక్షరాభిషేకం

- విభిన్న ఇతివృత్తాలతో వైవిధ్యభరిత రచనలు
- రెండో రోజు పుస్తక ప్రదర్శనలో సందర్శకుల సందడి



బుక్‌ఫెయిర్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న యువతులు

సాక్షి, సిటీబ్యూరో: పుస్తకం కొత్త పుంతలు తొక్కుతోంది. యువతరం సృజనాత్మకతకు పట్టం కడుతోంది. కథ, నవల, చరిత్ర, ప్రక్రియ ఏదైనా సరే కొత్త తరం ఆలోచనలకు, భావజాలానికి ఊపిరిలూదుతోంది. సామాజిక మాధ్యమాల ఉధృతిలో.. పుస్తక పఠనం ప్రమాదంలో పడిపోయిందనే ఆందోళన వెల్లువెత్తుతున్న ప్రస్తుత తరుణంలోనూ టీవీగా దర్శనమిస్తోంది. వైవిధ్యభరితమైన సాహిత్యంతో పాఠకులను ఆకట్టుకొంటోంది. సామాజిక జీవనంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సరికొత్త ఇతివృత్తాలతో పాఠక ప్రపంచాన్ని తట్టి లేపుతోంది. పుస్తకానికి ఏ మాత్రం ఆదరణ తగ్గలేదనేందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఒక్కో వందలు, వేల సంఖ్యలో అమ్ముడవుతోంది. ఈ క్రమంలోనే నవ తరం పాఠకుల అభిరుచికి ప్రాతినిధ్యం వహించే కొత్తతరం రచయితలు ముందుకు వస్తున్నారు. తమదైన ప్రాపంచిక దృక్పథంతో, భావజాలంతో అద్భుతమైన రచనలు చేస్తున్నారు. హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో యువ రచయితల పుస్తకాలు, స్టాళ్లు పాఠకులను ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ రచయితల కోసం స్వయంగా 7 స్టాళ్లను ఏర్పాటు చేసింది. మరోవైపు పలు ప్రచురణ సంస్థలు సైతం యువ రచయితలకు సముచితమైన ప్రోత్సాహాన్ని అందజేస్తున్నాయి. ఇంచుమించు అన్ని స్టాళ్లలోనూ కొత్త తరం రచయితల పుస్తకాలు కనిపిస్తున్నాయి. రెండో రోజు శుక్రవారం పుస్తక ప్రదర్శన సందర్శకులతో కళకళలాడింది.

కొత్తగా.. పొత్తమిచ్చెనా..

హైదరాబాద్ పుస్తక ప్రదర్శన ప్రతి సంవత్సరం కొత్త రచయితలను పరిచయం చేస్తోంది. ఏటా లక్షలాది మంది పాఠకులు పుస్తక ప్రదర్శనకు తరలి వస్తున్నారు. వేలాది పుస్తకాలు అమ్ముడవుతున్నాయి. సమస్త ప్రపంచం మొబైల్ ఫోన్‌లోనే ఇమిడి ఉందని భావిస్తున్న పరిస్థితుల్లోనూ పుస్తకమే సమస్తమై పాఠకులకు చేరువవుతోంది. కొత్తగా రాయాలనుకొనే ఎంతోమందికి ఇది స్ఫూర్తినిస్తోంది. 'ప్రతి సంవత్సరం బుక్‌ఫెయిర్‌కు వస్తాను. మొదట్లో పెద్దగా పుస్తకాలు చదివే అభిరుచి కూడా లేదు.. కానీ క్రమంగా అలవాటైంది. ఓ 20 పుస్తకాలు చదివిన తర్వాత నేను కూడా రాయగలననే ఆత్మస్థైర్యం వచ్చింది.

ఇప్పుడు రాస్తున్నాను' అని ఓ యువ రచయిత అభిప్రాయపడ్డారు. సామాజిక దృక్పథంతో రాస్తున్నవాళ్లు కూడా వినూత్నంగా తమ ఆలోచనలను ఆవిష్కరిస్తున్నారు. 'తాము సైతం' అంటూ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో భాగస్వాములవుతున్న పలువురు యువ రచయితలు 'సాక్షి'తో తమ అభిప్రాయాలను, ఆలోచనలను ఇలా పంచుకున్నారు.

రచయితగా మారిన పాఠకుడిని: సురేంద్ర శీలం



నేను రచయితను కాదు. పాఠకుడిని. నిజానికి 2019 వరకు పుస్తకాలు పెద్దగా చదవలేదు. ప్రతి సంవత్సరం పుస్తక ప్రదర్శనకు మాత్రం వచ్చాను. మొదట పాఠకుడిగా మారాను. ఆ తర్వాత రాయడం అలవడింది. 2022లో రాసిన 'పాల్పెట్ట'కు రావి శాస్త్రి సాహితీ పురస్కారం లభించింది. యండమూరి అవార్డు కూడా వచ్చింది. ఇప్పుడు 'నడూరి మిద్దె' నవలతో పాఠకుల ముందుకు వచ్చాను.

కష్టాల నుంచి 'అన్వీక్షికి' ఆవిర్భావం: వెంకట్ శిద్ధారెడ్డి



మొదట్లో నేను రాసిన కథలు, నవలలు అచ్చువేయడం చాలా కష్టంగా ఉండేది. ప్రచురణ సంస్థలు ముప్పుతిప్పలు పెట్టేవి. ఒక పుస్తకాన్ని ప్రచురించి విక్రయించేందుకు రచయితలే డబ్బులు ఇవ్వాలి. చివరకు వాళ్లకు మిగిలేదేం ఉండదు. ఈ అనుభవాలే 'అన్వీక్షికి' ప్రచురణ సంస్థను ఏర్పాటు చేసేందుకు దారితీశాయి. ఇప్పటి వరకు మా సంస్థ నుంచి 200 మంది కొత్త రచయితలు వెలుగులోకి వచ్చారు. ఈ ఏడాది 65 కొత్త పుస్తకాలను ప్రచురించాం. ఒక్కో పుస్తకం ఒక్క రోజులోనే వెయ్యి కాపీలు అమ్ముడైన సందర్భాలు ఉన్నాయి.

తాత్విక దృక్పథంతో రాయడం ఇష్టం
మహి బెజవాడ



మొదటిసారి 2013లో 'ఊదా రంగు చినుకులు' కథ రాశాను.' సాక్షి' పత్రికలో అచ్చయింది. అంతకుముందు బ్లాగ్స్‌కు ఎక్కువగా రాసేవాడిని. సాక్షిలో ప్రచురించడంతో ఉత్సాహం వచ్చింది. ఏదైనా సరే కొత్తగా చూడడం ఇష్టం. జీవితం, ప్రేమ వంటి విలువల పట్ల నాదైన తాత్విక దృక్పథంతో రాస్తున్నాను. ఇప్పుడు గన్స్‌అండ్ మాన్సూన్స్‌తో పాఠకుల వద్దకు వచ్చాను.

చిన్నప్పటి నుంచి రాస్తున్నాను
కడలి, రచయిత్రి



మా నాన్న పేరు రవి. ఆయన రచయిత. ఆ స్ఫూర్తితో చిన్నప్పటి నుంచి రాస్తున్నాను. ప్రేమ, స్నేహం, మానవీయ విలువలను ప్రధాన అంశాలుగా చేసుకొని రాశాను. చిక్‌లిట్ కొత్తగా రాసిన నవల. వెయ్యి కాపీలు ప్రింట్ వేశాం. ఇప్పటికే 500 కాపీలు అమ్ముడయ్యాయి. స్త్రీలకు గొంతుకనివ్వడమే నా రచనల ప్రధాన లక్ష్యం. కొన్ని సినిమాలకు స్క్రీన్‌ప్లేలు కూడా రాశాను. గతంలో రాసిన 'లెటర్స్ లవ్' కథల పుస్తకం బాగా అమ్ముడైంది. ఇప్పటి వరకు మూడు, నాలుగు పుస్తకాలు రాశాను.

మానవ సంబంధాలను ప్రోత్సహించేలా ఉండాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గవర్నర్‌తో చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు తదితరులు

సనత్‌నగర్: శాస్త్ర, సాంకేతికతలు మానవ సంబంధాలను ప్రోత్సహించేలా ఉండాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు. గవర్నర్ ఆహ్వానం మేరకు చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రాజ్‌భవన్‌లో శుక్రవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా కార్యకలాపాలను ఆయన అభినందించారు. దేశం గర్వపడేలా, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకువచ్చేలా కష్టపడి చదవాలన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో స్పేస్ క్లబ్ వ్యవస్థాపకుడు శాంతమూర్తి, సోలార్ సైంటిస్ట్ జయప్రకాష్ బాబు తదితరులు ఉన్నారు.

జలమండలి స్థల పరిశీలన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌ను ఆనుకుని జలమండలికి కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతోందని ఫిర్యాదులు రావడంతో శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో పాటు వివిధ విభాగాల అధికారులు ఇక్కడ పర్యటించారు. సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్, షేక్‌పేట తహసీల్దార్ అనితా రెడ్డి, జలమండలి ఈడీ మయాంక్ అగర్వాల్, జీఎం హరిశంకర్, హైడ్రా డీఎస్పీ పాపారావు, తహసీల్దార్ హేమమాలిని, ఎస్టేట్ ఆఫీసర్ విజయ్‌కుమార్ తదితరులు ఇక్కడ పర్యటించి జలమండలికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జలమండలికి ప్రభుత్వం గతంలో రెండు దఫాలుగా 2 ఎకరాల 20 గుంటల స్థలం కేటాయించిందన్నారు. ఇన్నాళ్లూ ఈ స్థలం ఖాళీగా ఉందని, దీనిని రక్షించుకోవాలని ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు సూచించారు. జలమండలికి కేటాయించిన స్థలం కబ్జాకు గురైనట్లు ఆరోపణలు రావడంతో అధికారులంతా ఇక్కడ పర్యటించారు. అయితే ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు స్టేటస్‌కో ఇవ్వడంతో జలమండలి ప్రహరీ నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడింది. కాగా.. జలమండలి స్థలం కబ్జా కాకుండా ముందస్తు జాగ్రత్తగా కంచె ఏర్పాటు అనుమతి కోసం త్వరలో హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

రూ.100 కోట్లు పెరిగెన్!

బల్దియా సవరణ బడ్జెట్ రూ.8,440 కోట్లు



కొత్త బడ్జెట్‌లో ఖర్చులిలా

హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కింద..

అంశం	కేటాయింపు (రూ.కోట్లు)
ప్రాజెక్టులు(ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు ఇతరత్రా)	1,237
రోడ్లు (గతంలో ఎస్సార్‌డీపీ)	650
సమగ్ర రోడ్డు నిర్వహణ	185
నాలాలు, డ్రెయిన్లు	200
మొత్తం	2,272

ఇంకా..

పార్కులు, పచ్చదనం	208
చెరువులు,వారసత్వ కట్టడాల పరిరక్షణ	173
అప్పులు	1,933
ఇంజినీరింగ్ నిర్వహణ పనులు	314
హెల్త్, శానిటేషన్	600

- తప్పదు అన్నట్లుగా మొక్కుబడి తంతు
- హై సిటీ పనుల కోసం అత్యధికంగా రూ.2,272 కోట్లు
- నూతన సంవత్సరంలోనూ రూ.700 కోట్ల కొత్త అప్పులకు రెడీ



సాక్షి, సిటీబ్యూరో: రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించి గత నెల 30న జరిగిన ముసాయిదా బడ్జెట్‌ను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు తిరస్కరించడంతో సవరణ బడ్జెట్‌ను అధికారులు రూపొందించారు. సవరణ బడ్జెట్‌పై ఈ నెల 23న జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించి ఆమోదం తెలపనున్నారు. జీహెచ్ఎంసీకి ఎన్నో ఆదాయ వనరులున్నా, వాటిని బడ్జెట్‌లో తక్కువగా చూపడంపై స్టాండింగ్ కమిటీ సభ్యులు అప్పుడు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ఆ బడ్జెట్ మొత్తాన్ని రూ.100 కోట్లు పెంచి సవరించారు. అప్పుడు రూ.8,340 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించగా,తాజాగా దాన్ని రూ.8,440 కోట్లకు సవరించారు. మొక్కుబడి తంతుగా మమ అనిపించారు. ఈసారి కూడా సభ్యులు తిరస్కరిస్తారో, లేక బడ్జెట్ ఆమోదానికి నిర్ణీత వ్యవధి ఇప్పటికే ముగిసిపోవడంతో ఆమోదిస్తారో కమిటీ సమావేశంలో వెల్లడి కానుంది.

గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రవేశపెట్టిన రూ.8,340 కోట్ల బడ్జెట్‌ను రూ.8,440 కోట్లకు సవరించారిలా..

అంశం	ఇప్పుడు (రూ.కోట్లు)	అప్పుడు (రూ.కోట్లు)
రెవెన్యూ ఆదాయం	4,445	4,205
రెవెన్యూ వ్యయం	4,000	3,936
రెవెన్యూ మిగులు	445	269
క్యాపిటల్ ఆదాయం	4,440	4,404
క్యాపిటల్ వ్యయం	4,440	4,404

- రెవెన్యూ వ్యయంలో రూ.64 కోట్లు, క్యాపిటల్ వ్యయంలో రూ.36 కోట్లు పెంచి రూ. సవరణ బడ్జెట్‌ను రూ.100 కోట్లు పెంచారు.
- వెరసీ.. బడ్జెట్ (రెవెన్యూ వ్యయం+ క్యాపిటల్ వ్యయం) = రూ.8,440 కోట్లు
- సవరణ బడ్జెట్ కసరత్తులో భాగంగా ఆస్తిపన్ను, టౌన్‌ప్లానింగ్, ట్రేడ్‌లైసెన్స్, అడ్వర్టయిజ్‌మెంట్ ఫీజుల ద్వారా దాదాపు రూ. 228 కోట్ల ఆదాయం అదనంగా చూపారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను రూ.419 కోట్ల నుంచి రూ. 279 కోట్లకు తగ్గించారు. ఇలా కూడికలు, తీసివేతలతో కొంత కసరత్తు చేసి మొత్తానికి రూ.100 కోట్లు పెంచారు.

క్యాపిటల్ పద్దు కింద నిధులొస్తాయనే ఆశలిలా..

అంశం	నిధులు (రూ.కోట్లలో)
15వ ఆర్థికసంఘం గ్రాంట్లు	279
రాష్ట్రప్రభుత్వ గ్రాంట్లు	3000
అప్పులు	700
ఇతరత్రా	16
రెవెన్యూ రెవెన్యూ మిగులు	445
మొత్తం	4,440

(రెవెన్యూ మిగులు నిధులను కూడా ఇందులో చేర్చడం గమనార్హం)

'నా భార్యను చంపేశాను'

వీధిలోకొచ్చి ఓ సైకో భర్త వీరంగం

- కోకాపేటలో ఇల్లాలి దారుణ హత్య
- ఠాణాలో లొంగిపోయిన నిందితుడు



నిందితుడు ముత్యాలు (ఫైల్), సునీత (ఫైల్)

మణికొండ: 'నా భార్యను చంపేశాను.. పీడ విరగడైంది'.. అంటూ ఓ సైకో భర్త వీధిలో వీరంగం సృష్టించి పైశాచిక ఆనందం పొందాడు. శుక్రవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో ఈ ఘటన కలకలం సృష్టించింది. స్థానికులు, మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం శాయినిపేటకు చెందిన సునీత, ఇదే గ్రామం పక్కన ఉన్న దొరుడిపల్లికి చెందిన ముత్యాలు దంపతులు. వీరికి ముగ్గురు కుమారులు. కోకాపేటలో హోటల్ నడుపుతూ జీవిస్తున్నారు. ముత్యాలు తరచూ భార్యను కొడుతుండేవాడు. డబ్బులు కావాలని వేధించేవాడు. ఈ క్రమంలో పలుమార్లు ఇరు కుటుంబాల మధ్య పంచాయితీలు నడిచాయి. 'ఎప్పటికైనా నిన్ను చంపుతా' అని భార్య సునీతను ముత్యాలు బెదిరించేవాడు. గతంలో సునీత ఆరు నెలల పాటు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందింది. రెండు రోజుల క్రితం మృతురాలి బంధువు ఆంజనేయ స్వామి మాల వేయటంతో పూజకు వెళ్లారు. తిరిగి వచ్చిన తర్వాత వీరు శుక్రవారం ఇంట్లో గొడవ పడ్డారు. కోపోద్రిక్తుడైన ముత్యాలు భార్య గొంతు నులిమి, మర్మాయవాల్లో కర్రతో గుచ్చి రాక్షసంగా హత్య చేశాడు. కాగా.. ముత్యాలు మొదటి భార్య అతని సైకో చేష్టలు భరించలేక వదిలి వెళ్లిపోయింది. ఆ తర్వాత సునీతను రెండో వివాహం చేసుకుని ఇంతటి దారుణానికి ఒడిగట్టాడు. భార్యను హత్య చేసి.. ఇంటికి తలుపు వేసి వీధిలోకి వచ్చాడు. 'నా భార్యను చంపాను' అంటూ అరుస్తూ నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేశారు.

హిట్ అండ్ రన్..
బీటెక్ విద్యార్థి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి లోకేష్ ..

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసు నమోదయ్యింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బీటెక్ విద్యార్థిని వెనక నుంచి వేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన పున్నం లోకేష్ (21) బాచుపల్లిలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి కాలేజీకి స్నేహితుడితో కలిసి వెళ్తున్నాడు. పంజగుట్ట- అమీర్‌పేట మార్గంలోని బిగ్‌బజార్ ఎదురుగా గుర్తు తెలియని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంతో వచ్చి వెనక నుంచి లోకేష్ బైక్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న లోకేష్ తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడికి స్వల్ప గాయాల య్యాయి. ప్రమాద స్థలికి వచ్చిన పోలీసులు లోకేష్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

యథేచ్ఛగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు..

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ప్రమాదాలు ఈ ప్రాంతంలో నిత్యకృత్యమయాయి. ట్రావెల్స్ బస్సులు ఉదయం 7.30 గంటల్లోపే నగరంలోని రోడ్లల్లో తిరగాలనే నిబంధనలు ఉండడంతో సమయంలోపు నగర శివారు దాటాలన్న ఉద్దేశంతో అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని స్థానికులు అంటున్నారు. పోలీసులు సమయం దాటిన తర్వాత రోడ్లపైకి వచ్చే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు జరగవని వారు పేర్కొంటున్నారు.

హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష

మరొకరికి యావజ్జీవ కారాగారం



రాగుల సాయి, రాహుల్

కాచిగూడ: నలుగురిని పెట్రోల్ పోసి చంపిన కేసులో ఒకరికి మరణ శిక్ష, మరో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ నాంపల్లి అడిషనల్ సెషన్స్ జడ్జి వినోద్ కుమార్ తీర్పు వెలువరించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. 2022లో రాగుల సాయి అనే వ్యక్తి తన మాజీ భార్య ఆర్తికి మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. రాగుల సాయి స్నేహితుడైన నాగరాజును ఆర్తి రెండో వివాహం చేసుకుంది.

కొన్నాళ్ల తర్వాత నాగరాజు ఆర్తిని వేధింపులకు గురి చేసేవాడు. ఆర్తిని చెల్లిగా పిలవాలని నాగరాజు స్నేహితుడైన రాగుల సాయికి తెలపడంతో వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీనిని మనసులో పెట్టుకున్న రాగుల సాయి తన స్నేహితుడు ఎ.రాహుల్ ఇద్దరూ కలిసి గర్భంతో ఉన్న ఆర్తిని, నాగరాజును, వీరి ఏడాది కుమారుడు విష్ణుపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల స్టేట్‌మెంట్స్ నారాయణగూడ పోలీసులు రికార్డ్ చేసుకొని కేసు నమోదు చేశారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆర్తి, నాగరాజు, వీరి ఏడాది కుమారుడు విష్ణు, ఆర్తి కడుపులోని బిడ్డతో సహా నలుగురూ మృతి చెందారు. అప్పట్లో ఈ కేసు సంచలనంగా మారింది. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న నారాయణగూడ పోలీసులు దర్యాప్తు సాగించారు. మొదటి ప్రాధాన్యతగా ఈ కేసుగా తీసుకున్న నాంపల్లి క్రిమినల్ కోర్టు జడ్జి వినోద్ కుమార్ శుక్రవారం నిందితుడైన రాగుల సాయికి మరణశిక్ష, అతని స్నేహితుడైన రాహుల్‌కు యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు.

రహదారిపై రక్తచరిత్ర

వేట కొడవళ్లతో దాడి

- ఇద్దరికీ తీవ్ర గాయాలు
- పాత కక్షలే కారణం



దాడి చేస్తున్న దృశ్యం





రక్తపు మడుగులో రాము, ఆస్పత్రిలో నాగరాజు

నాగోలు: అది కొత్తపేట- నాగోలు రహదారి.. శుక్రవారం సాయంత్రం.. వాహనాల రొద ఒకవైపు.. జన సంచారం మరోవైపు.. ఇదే సమయంలో అక్కడ వేట కొడవళ్లు విరుచుకుపడ్డాయి. సినీ ఫక్కీలో ఓ గుంపు దారుణంగా దాడికి పాల్పడింది. బాధితుల రోదనలు, రక్తపు మరకలతో ఆ ప్రాంతమంతా భయాందోళనతో గజగజ వణికిపోయింది. పాత కక్షలతో.. ఒకరిపై గురి పెట్టి వచ్చి.. తమకు సంబంధం లేని ఇద్దరు యువకులపై వేట కొడవళ్లతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. చైతన్యపురి పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. ఎల్బీనగర్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పురుషోత్తం అనే వ్యక్తి రెండేళ్ల క్రితం హయత్‌నగర్‌లో జరిగిన పెళ్లి ఊరేగింపు ఏర్పడిన వివాదం నేపథ్యంలో తన స్నేహితుడైన తట్టిఅన్నారంనకు చెందిన బోడ్డు మహేష్‌పై బీరు బాటిల్‌తో దాడి చేశాడు. ఈ ఘటనలో తలకు గాయాలైన మహేష్ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు కోర్టులో నడుస్తోంది. అయితే.. ఆ తర్వాత వీరిద్దరూ రాజీ కోసం మాట్లాడుకున్నారు. పురుషోత్తం వద్ద మహేష్ కొన్ని డబ్బులు కూడా తీసుకున్నాడు. శుక్రవారం కేసు విషయమై మహేష్ కోర్టుకు రావాల్సి ఉంది. కానీ తాను సూర్యాపేటలో ఉన్నానంటూ కోర్టు కానిస్టేబుల్‌కు చెప్పి పురుషోత్తం హత్యకు పథక రచన చేశాడు. నాగోలు వెళ్లే రోడ్డులోని అమరావతి వైన్స్ వద్ద పురుషోత్తం ఉన్నాడనే పక్కా సమాచారంతో మహేష్ తన స్నేహితులైన బెల్లి భరత్, దాసరి సురేందర్ అలియాస్ సూరి తదితరులు కారు, బైక్‌లపై వచ్చారు. పురుషోత్తంపై వేట కొడవలితో దాడి చేయబోగా అతను తప్పించుకున్నాడు. దీంతో పురుషోత్తం స్నేహితులైన సికింద్రాబాద్ తుకారాం గేట్‌కు చెందిన గడ్డమోయిన రాము, నాగోలు తట్టిఅన్నారంనకు చెందిన పాశం నాగరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణాలను కాపాడుకునేందుకు సమీపంలోని ఓ బ్యాంకులో తలదాచుకున్న రాముపై వేట కొడవళ్లతో దాడి చేయడంతో ఆ ప్రాంతమంతా రక్తం మడుగును తలపించింది. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు చైతన్య పురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరావుతో వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చైతన్యపురి పోలీసులు తెలిపారు.

ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ప్రారంభం



మాదాపూర్: హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు, సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి మంచి అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ క్రెడాయి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షోను నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నిర్మాణాభివృద్ధి రోజురోజుకు అభివృద్ధి చెందుతుందన్నారు. భారత దేశం మొత్తం హౌసింగ్ స్టాక్‌లో 12 శాతం హైదరాబాద్‌దే అని తెలిపారు. ఎస్‌బీఐ ఎనిమిది లక్షల కోట్ల రూపాయలకు పైగా హౌసింగ్ లోన్లు ఇచ్చినట్లు తెలిపారు. ఇళ్లను కొనుగోలు చేసే ఆలోచన ఉన్న వారికి ప్రాపర్టీ షోలో అన్ని సంస్థల వివరాలు ఒకే చోట లభిస్తాయన్నారు. ప్రత్యేక రాయితీలు, ఆఫర్లు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీబీసీ వైస్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, ఎస్‌బీఐ సీజీఎంలు మంజుశర్మ, రాజేశ్‌కుమార్, జనరల్ మేనేజర్ ప్రకాశ్‌చంద్ర బారోర్, 50 మందికి పైగా ప్రముఖ బిల్డర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

- బల్దియా ఆస్తుల వివరాల కంప్యూటరీకరణ
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి


సమీక్షలో ఇలంబర్తి తదితరులు

లక్డీకాపూల్: మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించి.. సాధికారత దిశగా అధికారులు కృషి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్లో ఎస్టేట్, అర్బన్ కమ్యూనిటీ విభాగం అడిషనల్ కమిషనర్లు, ప్రాజెక్టు అధికారులతో పాటు జోనల్ పీఓలు, అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులతో ఆయా శాఖల ప్రగతిపై కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఉందన్నారు. నగరంలో అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించి వారికి బ్యాంక్ లింకేజీ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 10,240 స్వయం సహాయక సంఘాలకు 704.67 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.543.43 కోట్ల రూపాయలు పంపిణీ చేశామని, వచ్చే నెలలోగా పూర్తి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కాగా నగర వ్యాప్తంగా ఉన్న జీహెచ్ఎంసీ ఆస్తులకు సంబంధించిన రిజిస్టర్ ఏర్పాటు చేసి..దాని ప్రకారంగా వివరాలను కంప్యూటరీకరించాలని కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. ఆస్తుల లీజు పూర్తయిన, ఇంకా కొనసాగుతున్న వారి వివరాలు సేకరించి వారందరికీ నోటీసులు జారీ చేయాలన్నారు.

అమిత్ షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి

బర్తరఫ్ చేయాలి

- అంబేడ్కర్‌ను అవమానించడం దారుణం
- ఈ ఉదంతంపై చంద్రబాబు వైఖరి వెల్లడించాలి
- మహిళా కాంగ్రెస్, ప్రజా సంఘాల డిమాండ్


నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మహిళా కాంగ్రెస్ నేత సునీతారావు తదితరులు

ముషీరాబాద్/కవాడిగూడ: అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం, సామాజిక ప్రజా సంఘాలు, దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అమిత్‌షా తన అహంకార పూరితమైన వ్యాఖ్యల ద్వారా రాజ్యాంగ రూపశిల్పిని తీవ్రంగా అవమానించారని వారు పేర్కొన్నారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో అమిత్‌షాకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రోహిన్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం చలో బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పిలుపునివ్వడంతో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు రాజు ఉస్తాద్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అమిత్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సామాజిక ప్రజా సంఘాల నాయకులు పాలడుగు భాస్కర్, స్కైలాబ్‌బాబు, మల్లు లక్ష్మి, ఆర్.శ్రీరాం నాయక్, టి. సాగర్, ఎం.వి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వీరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

అమిత్ షాను వెంటనే అరెస్టు చేయాలి: సునీతారావు

అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే అరెస్టు చేయాలని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో అమిత్‌షాకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌లో నిర్బంధించా. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోనే కేంద్ర ప్రభుత్వానికి, అమిత్ షాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ కేంద్రమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేసి..దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు వైఖరి వెల్లడించాలి

బీజేపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. అమిత్‌షా వ్యాఖ్యలపై తన వైఖరిని ప్రకటించాలని, అంబేడ్కర్‌ను అవమానించినందున కేంద్రానికి తన మద్దతును ఉపసంహరించుకోవాలని సునీతారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుగుణ, ఖైరతాబాద్ అధ్యక్షురాలు ఉషశ్రీ,, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంది. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి.
- మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళామేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- దీప్‌శిఖ మహిళా క్లబ్ 60 సంవత్సరాల వేడుకలు బేగంపేటలోని మాలని హౌస్‌లో రాత్రి 7.15 గంటల నుంచి జరుగుతాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు

– నేటి సాయంత్రం 5 నుంచి రాత్రి 9 వరకు..

సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీ స్టేడియంలో శనివారం జరిగే క్రిస్మస్ వేడుకలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ మళ్లింపులు, ఆంక్షలు విధిస్తూ సిటీ ట్రాఫిక్ చీఫ్ పి.విశ్వప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సమయంలో ఏఆర్ పెట్రోల్ పంప్, బీజేఆర్ స్టాట్యూ, బషీర్‌బాగ్, ఎస్‌బీఐ గన్‌ఫౌండ్రీ, సుజాత స్కూల్, కేఎల్‌కే ఎస్టేట్‌ల నుంచి వాహనాలను స్టేడియం వైపు అనుమతించరు. ఆర్టీసీ బస్సులకు ఇవి వర్తిస్తాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని నగర వాసులు సహకరించాలని పోలీసులు కోరారు.

భారతీయుల ప్రియమైన బ్రాండ్‌గా 'ఫ్రీడమ్ ఆయిల్'



సాక్షి, సిటీబ్యూరో: ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను 2024–25 సంవత్సరానికి గాను భారతీయులు అత్యంత ఇష్టపడే బ్రాండ్‌లలో ఒకటిగా ఇండియా టుడే–మార్క్‌ప్రైమెస్ డైలీ సంస్థ గుర్తించింది. ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ గత మూడేళ్ల నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్ విభాగంలో భారత్‌లో అమ్మకాల పరంగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్ ఇండియా లిమిటెడ్ సేల్స్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..వినియోగదారుల విశ్వాసం, ఆదరణే తమ బ్రాండ్‌ను ఈ స్థాయిలో నిలబెట్టిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇదే ప్రోత్సాహంతో ఎడిబుల్ ఆయిల్ రంగంలో నూతన ప్రమాణాలు నెలకొల్పడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జీఎం(మార్కెటింగ్) చేతన్ పింపాల్ ఖటే తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనలో కేంద్ర సమాచార శాఖ స్టాల్

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర సమాచార, ప్రసార శాఖ మీడియా విభాగానికి చెందిన ప్రచురణల విభాగం స్టాల్‌ను హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను హైదరాబాద్ పీఐబీ (ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో) అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర పబ్లికేషన్స్ డివిజన్ భారత ప్రభుత్వానికి చెందిన ముఖ్యమైన పుస్తక ప్రచురణ విభాగమని, ప్రభుత్వ పథకాల గురించి సమగ్రమైన సమాచారాన్నందించే కీలకమైన పత్రాలను, పుస్తకాలను ఈ విభాగం ప్రచురిస్తుందని వెల్లడించారు. దేశ ఆర్థిక ప్రగతి, గ్రామీణ పునరుజ్జీవనం, సామాజిక అభివృద్ధి, సాహిత్యం, సంస్కృతి, బాల సాహిత్యం, ఉపాధి సంబంధిత సమాచారం వంటి భిన్న అంశాలకు సంబంధించిన పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయన్నారు. గాంధేయ సాహిత్యం, స్వాతంత్ర్య సమరయోధులు, కళలు, చరిత్ర, రక్షణ, రాష్ట్రపతి భవన్, రాష్ట్రపతి, ప్రధాన మంత్రుల ప్రసంగాలు, బాల సాహిత్యం వంటి అనేక రంగాలకు చెందిన విలువైన పుస్తకాలు స్టాల్‌లో అందుబాటులో ఉంటాయని ప్రచురణల విభాగం సహాయ డైరెక్టర్ మహమ్మద్ సిరాజుద్దీన్ తెలియజేశారు. హైదరాబాద్ పుస్తకప్రదర్శన లోని 101, 102 నంబరు స్టాళ్లను సందర్శించి, ప్రచురణల విభాగం అందించే రాయితీలను వినియోగించుకుని పుస్తకాలను కొనుగోలు చేయాలని కోరారు. ప్రత్యేక పుస్తకాలపై 90 శాతం రాయితీ లభిస్తుందన్నారు.

డ్రగ్స్ విక్రేత అరెస్టు

నాంపల్లి: ముంబై నుంచి నగరానికి డ్రగ్స్‌ను తీసుకువచ్చి విక్రయాలు జరుపుతున్న ఓ నిందితుడిని నార్కోటిక్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 320 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బాలాపూర్ అబూబాకర్ కాలనీకి చెందిన షేక్‌అమీర్ అలియాస్ వసీమ్ ఖాన్ (31) మొదట డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. తర్వాత వాటిని విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావించాడు. ఈ క్రమంలో ముంబైలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న మహ్మద్ సలీం అబ్దుల్ హమీద్ షేక్ అలియాస్ సలీమ్‌తో పరిచయం ఏర్పడింది. అతడి వద్ద ఎండీఎంఏ డ్రగ్స్ కొనుగోలు చేసి అధిక ధరలకు సిటీలో విక్రయిస్తున్నాడు. వారం క్రితం అతను ముంబైకి వెళ్లి మహ్మద్ సలీమ్ అబ్దుల్ హమీద్ షేక్ అలియాస్ సలీం, రయాస్ రియాజ్ షేక్ అయాన్‌లను కలిశాడు. ఈ నెల 18న రూ.6 లక్షలు చెల్లించి 320 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం ఓ ప్రైవేట్ బస్సులో సిటీకి బయలుదేరగా..సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నాంపల్లిలో బస్సు దిగుతుండగా పట్టుకున్నారు. వసీమ్ ఖాన్ నుంచి 320 గ్రాముల డ్రగ్స్‌ను, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

రెక్కీ చేస్తుండగా.. చైన్‌స్నాచర్ల పట్టివేత

శామీర్‌పేట: పది రోజుల క్రితం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులు..మరో చోరీ చేసేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా శామీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బండ్లగూడకు చెందిన నూనె అంజిరెడ్డి, బోడుప్పల్‌కు చెందిన సందిటి నరేందర్‌రెడ్డిలు స్నేహితులు. వీరిద్దరు ఈజీగా డబ్బు సంపాదించేందుకు చోరీల బాటపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 10న శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మూడుచింతలపల్లిలో వ్యవసాయ పొలం వద్దకు ఒంటరిగా వెళ్తున్న వృద్ధురాలి మెడలో బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లారు. కేసు నమోదు చేసిన శామీర్‌పేట పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజ్, స్థానికంగా లభించిన ఆధారాలతో సుమారు 70 కిలోమీటర్ల మేర ఉన్న 600 సీసీ కెమెరాలను పరిశీలించారు. టెక్నాలజీ ఆధారంగా నిందితులను ట్రేస్ చేస్తుండగా తూంకుంట మున్సిపాలిటీలో మరో చోట వీరు చోరీ చేసేందుకు రెక్కీ నిర్వహిస్తున్నారని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 5.5 గ్రాముల పుస్తెలతాడు, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీ, కారును స్వాధీనం చేసుకున్నారు.

తొలి ప్రపంచ ధ్యాన దినోత్సవానికి సర్వం సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: ప్రతి ఏటా డిసెంబర్ 21న తొలి ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తొలి వేడుకలకు నగరంలోని గచ్చిబౌలి స్టేడియం వేదికగా సర్వం సిద్ధమైంది. పర్యాటక సాంస్కృతిక శాఖ, రామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

అధిక లాభాల పేరిట రూ.3.1 కోట్లు మోసం

గాయత్రీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ యజమానులు అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు అందిస్తామని ఆశ చూపించి, రూ.3.1 కోట్లు మోసం చేసిన గాయత్రీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ యజమానులను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. డీసీపీ కె.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..కొండాపూర్‌కు చెందిన మగులూరి చంద్రారెడ్డి, అరుణ అలియాస్ అరుణ కుమారిలు ఇద్దరు కలిసి మాదాపూర్‌లో గాయత్రీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో కార్యాలయాన్ని తెరిచారు. సదాశివపేటలో 101 ఎకరాల్లో లేఔట్‌ను అభివృద్ధి చేస్తున్నామని ప్రచారం చేశారు. బై బ్యాక్ స్కీమ్ కింద తమ ప్రాజెక్ట్‌లో పెట్టుబడులు పెడితే 1,600 గజాల స్థలాన్ని లేదా లాభాల రూపంలో రూ.1.60 కోట్లు అందిస్తామని ఆశ పెట్టారు. 9 మంది నుంచి రూ.3.1 కోట్లు వసూలు చేశారు. కస్టమర్లను నమ్మించేందుకు ఎంఓయూ, సేల్ డీడ్, పోస్ట్ డేటెడ్ చెక్‌లు, నగదు రిసిప్ట్‌లను అందించారు. కొద్ది నెలల పాటు కస్టమర్లకు కొంత మేర సొమ్మును చెల్లించి ఆ తర్వాత నిలిపివేశారు. ఈ మేరకు బాధితుడు నిజాంపేటకు చెందిన జొన్నల శ్రీనివాస రెడ్డి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఇద్దరు నిందితులు చంద్రారెడ్డి, అరుణలను అరెస్టు చేశారు.

ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల



సాక్షి, సిటీబ్యూరో: భారత తపాలా శాఖ 'భారత రాజ్యాంగ మాతలు' పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల చేసింది. శుక్రవారం అబిడ్స్‌లోని డాక్ సదన్‌లో భారత తపాలా శాఖ ప్రభుత్వ కార్యదర్శి వందితా కౌల్ ఈ ప్రత్యేక కవర్ విడుదల చేశారు. రాజ్యాంగ పరిషత్‌లోని 15 మంది మహిళా సభ్యులు రాజ్యాంగాన్ని రూపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. ఈ సభ్యుల వ్యక్తిగత చిత్రాలను కవర్‌పై మూడు వరుసలలో అమర్చారు. ఒక్కో వరుసలో ఐదుగురు చొప్పున ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా చరిత్రపై పుస్తకం



సాక్షి, సిటీబ్యూరో: పవన్ సంతోష్ సూరంపూడి రాసిన 'నేడే చూడండి: తెలుగోళ్ళు–సినిమాలు–ఒక చరిత్ర' పుస్తకం శుక్రవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా విడుదల అయింది. తెలుగు సినిమా సాంఘిక చరిత్రగా రాసిన ఈ రచనను మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మన్నం రాయుడు, సినీ చరిత్రకారులు పాలకోడేటి సత్యనారాయణ రావు, దాసుభాషితం సీఈవో కిరణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రాయుడు మాట్లాడుతూ ఇంతవరకూ తెలుగు సినిమా చరిత్రను సమాజంతో, సామాజిక చరిత్రతో ముడిపెట్టి రాసిన పుస్తకాలు తెలుగులో రాలేదని, ఇది ఆ కోణంలో మొట్టమొదటి రచన అని అన్నారు. కార్యక్రమంలో పూర్ణిమ తమ్మిరెడ్డి, యాకూబ్, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మీనా యోగీశ్వర్ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి

- బైక్‌ను ఓవర్‌టేక్ చేస్తూ వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన



సంధ్య, క్రాంతి మృతదేహాలు


ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం

యాదగిరిగుట్ట రూరల్: కారు ఢీ కొట్టడంతో నగరానికి చెందిన తల్లీ కొడుకు మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని హైదరాబాద్– వరంగల్ ప్రధాన జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మాదిరెడ్డి సంధ్య అలియాస్ శాంతి(35) ఆమె కుమారుడు మాదిరెడ్డి క్రాంతి (15) హైదరాబాద్‌లోని ఈసీఎల్ సమీపంలోని దమ్మాయిగూడలో నివాసం ఉంటున్నారు. శాంతి భర్త ప్రతాప్‌రెడ్డి ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. సంధ్య తన కుమారుడు, అదే ప్రాంతానికి చెందిన మరొక వ్యక్తి రాజుతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి స్కూటీపై వ్యక్తిగత పని నిమిత్తం వచ్చారు. పనులు ముగించుకుని సాయంత్రం సమయంలో తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈక్రమంలో యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం స్టేజీ సమీపానికి రాగానే, అదే రూట్లో వెళ్తున్న కారు, ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఎగిరి కింద పడిపోయారు. దీంతో సంధ్య, ఆమె కుమారుడు క్రాంతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న రాజుకు తీవ్ర గాయాలు కాగా, ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు వాకర్లకు జరిమానా

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు లోపల వాక్‌వే నుంచి నిషేధిత వన్యప్రాణుల జోన్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించిన ఇద్దరు వాకర్లకు కేబీఆర్ పార్కు అధికారులు జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే... కేబీఆర్ పార్కు వాక్‌వే నుంచి వాచ్ టవర్ వైపు ఎవరూ వెళ్లకుండా గేటుతోపాటు కంచెను కూడా ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం వాకింగ్ సమయంలో ఇద్దరు వ్యక్తులు గేటు పక్కన ఉన్న మొక్కలను తొక్కుకుంటూ వాకింగ్ కోసం వాచ్‌టవర్ వైపు వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన పార్కు అధికారులు ఆ ఇద్దరినీ పట్టుకొని వన్యప్రాణి హక్కుల చట్టం కింద రూ. 25 వేల జరిమానా విధించినట్లు సమాచారం. వాకర్లు, సందర్శకులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే తిరగాలని పలు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ కొంత మంది పరిధులు దాటి ప్రవర్తించడం వల్ల పార్కులోని పక్షులు, పాములకు ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు తెలిపారు. వైల్డ్ లైఫ్ చట్టాన్ని ఎవ్వరూ ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని పార్కు రేంజ్ ఆఫీసర్ లక్ష్మీపతి రావు అన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



వెంకటేశ్వరకాలనీ: అయ్యప్పస్వామి మహా పడి పూజా మహోత్సవం వందలాదిమంది అయ్యప్ప స్వాముల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం శ్రీ కృష్ణానగర్ ద్వారకామయి నివాస్‌లో భజన కార్యక్రమాన్ని చిన్న ఆంజనేయులు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించగా, గురుస్వాములు శ్రీనివాస్ శర్మ, రామకృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. గురుస్వామి కాళికృష్ణ, సత్యబాబు, మూర్తి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12 ఎమ్మెల్యే కాలనీలోని షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో శుక్రవారం సాయంత్రం న్యూలైఫ్ ఒరియా కమ్యూనిటీ సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఒడిషా రాష్ట్రానికి చెందిన క్రైస్తవులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు హాజరయ్యారు. అనంతరం రెవరెండ్ పాస్టర్ సుశీల్ కుమార్ ఛట్టర్ దైవ సందేశం అందించారు. అంతకుముందు జరిగిన క్రీస్తు నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాస్టర్ రష్మీ ఛట్టర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగి పరార్



మధార్

రహమత్‌నగర్: చికిత్స కోసం వచ్చిన మానసిక రోగి గోడదూకి పారిపోయిన సంఘటన ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుండాల మండలం రామవరం గ్రామానికి చెందిన మధార్‌కు (35) కొన్ని నెలలుగా మానసికస్థితి సరిగా లేదు. ఈ క్రమంలోనే అతని బంధువులు మధార్‌కు శుక్రవారం ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ కోసం వేచిచూస్తున్న సమయంలో తాను బాత్‌రూంకు వెళ్లాలని చెప్పి గోడదూకి మధార్ పారిపోయాడు. దీంతో ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో అతని బంధువులు వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బోరబండ పీఎస్‌లో మధార్ తండ్రి యాదయ్య ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుట్కా విక్రేత అరెస్టు

బంజారాహిల్స్: నిషేధిత గుట్కా ఉత్పత్తులు, సిగరెట్లను విక్రయిస్తున్న ఓ పాన్‌షాపు నిర్వాహకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... కాపత్తర్ రంజన్‌కాలనీకి చెందిన ఎండీ అహ్మద్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-5లోని దేవరకొండ బస్తీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కనే బంజారా పాన్‌షాపు నిర్వహిస్తుంటాడు. అయితే ప్రభుత్వం నిషేధించిన గుట్కా ఉత్పత్తులతో పాటు సిగరెట్లను విక్రయిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఆ మేరకు శుక్రవారం మధ్యాహ్నం దాడులు నిర్వహించగా పలు రకాల నిషేధిత గుట్కా ఉత్పత్తులు లభించాయి. దీంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఎండీ అహ్మద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్నం నరేందర్‌రెడ్డికి ఘన స్వాగతం

బంజారాహిల్స్: లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లి విడుదలైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-5కి చెందిన గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తుల్లో హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. డివిజన్ నేత విష్ణునాయక్ ఆధ్వర్యంలో మహిళలు వెళ్లి ఈ మేరకు ఆయనకు స్వాగతం పలికారు.

తల్లుల చేత..పోషక వంటకాలు..!

- నేడు సర్కార్ బడుల్లో ఆహారోత్సవం
- అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని ఆదేశాలు
- పోషక పదార్థాలు ఏ వంటకంలో ఉంటాయో తెలపనున్న తల్లులు
- అన్ని ఏర్పాట్లు చేసిన ఉపాధ్యాయులు



తల్లిదండ్రుల సమావేశంలో ఉపాధ్యాయుడు

బంజారాహిల్స్: విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతినెలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే ప్రతినెలలో మూడో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశమై విద్యార్థుల పురోగతి, చేపడుతున్న కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 21 (నేడు)న తెలంగాణ ఆహారోత్సవం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శనివారం అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు సర్కార్ బడులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమ వివరాల పట్టికను కూడా అందజేశారు. ఇందుకు మార్గదర్శకాలను అనుసరించాలని పాఠశాలల ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చేసే వంటకాలను పది మందితో పంచుకునే అవకాశం కల్పించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలవనున్నది. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్ తదితర డివిజన్ల పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలల్లో తెలంగాణ ఆహారోత్సవం పేరిట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తల్లిదండ్రులకు ఇందుకు సంబంధించి ఆహ్వాన పత్రికను ఎలా పంపించాలో కూడా అధికారులు సంబంధిత కరపత్రాన్ని ఆయా పాఠశాలలకు పంపించారు.



తల్లిదండ్రులకు పంపించిన ఆహ్వాన పత్రిక

ఇవీ ఉద్దేశం...

అందుబాటులో ఉండే పౌష్టికాహారాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. పండ్లు, కూరగాయలు వంటి పోషకాహారాన్ని విద్యార్థులకు ఎలా అందించవచ్చో ప్రచార పత్రికల సహాయంతో తల్లిదండ్రులు, విద్యార్థులకు పరిచయం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు తెచ్చిన ఆహారం ప్రత్యేకత, ఉపయోగించిన పదార్థాలు, తయారీ విధానం, పోషక విలువలు గురించి తల్లిదండ్రులు వివరించేలా ప్రణాళికలు రూపొందించారు. అంతే కాకుండా ఇందులో పాల్గొనే వారందరూ ప్రశ్నలు, జవాబుల రూపంలో పోషకాహార వంటల విశేషాలను పంచుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 21న జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొనేలా తేదీ, సమయాన్ని సూచిస్తూ వారికి ఆహ్వానాలు పంపించారు. ఇప్పటి వరకు జరిగిన సమావేశాలకు రాని వారిని గుర్తించి తప్పక హాజరయ్యేలా చూడాలని సూచించారు. పోషక విలువలతో కూడిన ఒక వంటకాన్ని చేసి పాఠశాలకు తీసుకురండి.. పౌష్టికాహారం గురించి మాట్లాడండి..తెలుసుకోండి..అంటూ ఇందులో ప్రత్యేకంగా పొందుపర్చారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోజువారీ ఆహారంలో ఇవన్నీ అందిస్తున్నారా?

ప్రతిరోజూ తినే ఆహారంలో పోషక విలువలు సమపాళ్లలో ఉన్నట్లయితే రోగ నిరోధక శక్తి మెరుగుపడి పిల్లలు ఆరోగ్యకరమైన బాల్యాన్ని గడపగలుగుతారని ప్రభుత్వం భావిస్తోంది. స్థానికంగా లభించే ఆహారంలో కూడా ఎన్నో పోషక విలువలు ఉంటాయి కాబట్టి తల్లిదండ్రులు వాటిని పిల్లలకు అందేలా చూడాల్సిన బాధ్యతను ఈ సమావేశంలో తెలియజేయనున్నారు. ముఖ్యంగా బియ్యం, గోధుమ, మొక్కజొన్న, జొన్న, సజ్జ, సగ్గుబియ్యం, బంగాళా దుంపలలో పిండి పదార్థాలు ఉంటాయని, వాటిని పిల్లలకు అందించాలని చెబుతున్నారు. అలాగే చిక్కుడు, బఠాణీలు, అలసంద, మొలకెత్తిన పెసలు, పప్పు ధాన్యాలు, శెనగలు, సోయాబీన్స్ కూడా మన ఇళ్లల్లో వండేవేనని, వాటిని ఇవ్వాలని సూచించారు. పాలకూర, మెంతికూర, తోటకూర, మునగాకు, తెలగపిండి ఆకు, గంగవాయిలి వంటి స్థానికంగా దొరికే ఆకుకూరలను అందించాలంటున్నారు. మన పెరట్లో లభించే మామిడి, బొప్పాయి, గుమ్మడి, క్యారెట్, చిలకడదుంప విటమిన్-ఏ అధికంగా ఉన్న పండ్లు అని సూచిస్తున్నారు. అవసరమైన పది ఆహార విభాగాల పేరుతో ఒక చార్ట్‌ను రూపొందించారు.

అధికారుల స్పెషల్ డ్రైవ్

ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న స్తంభాల తొలగింపునకు నిర్ణయం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని పెద్దమ్మ గుడి కమాన్‌తోపాటు వర మహాలక్ష్మి జంక్షన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సజావుగా సాగేందుకు పుట్‌పాత్‌లు, రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, కరెంటు వైర్లను తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం జూబ్లీహిల్స్ విద్యుత్ ఏఈ సత్యనారాయణ, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సమన్వయంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎక్కడెక్కడ ట్రాఫిక్‌కు అడ్డంకిగా స్తంభాలు ఉన్నాయో వాటిని గుర్తించారు. శనివారం నుంచి వాటిని తొలగించి మరో చోట ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా జర్నలిస్టుకాలనీ జంక్షన్‌లోనూ అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించాలని నిర్ణయించారు. ఈ స్తంభాలను తొలగిస్తే జూబ్లీహిల్స్ రోడ్లపై ట్రాఫిక్ మరింత సజావుగా ముందుకుసాగుతుందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో, ట్రాఫిక్ అధికారులు..

రేపు నగరం చేరుకోనున్న 'గో మహా పాదయాత్ర'

పంజగుట్ట: గో, భూ, పర్యావరణ పరిరక్షణ కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహిస్తున్న గో మహా పాదయాత్ర హైదరాబాద్ చేరుకుంటున్న నేపథ్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత గో సేవా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మల్లేష్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమాల కరపత్రాన్ని ప్రతినిధులు శ్రీనాథ్, రాఘవేందర్, మానిక్ యాదవ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవును కాపాడేందుకు అఖిల భారత గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలక్రిష్ణ గురుస్వామి ఒక పుంగనూరు గోవుతో గత సెప్టెంబర్ 27 నుంచి 2025 మార్చి 27 వరకు 14 రాష్ట్రాలు, 4900 కిలోమీటర్ల మేర 180 రోజుల కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. యాత్ర 87 రోజులుగా 9 రాష్ట్రాలు దాటి 2700 కిలోమీటర్లు పైగా పూర్తి చేసుకుని ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌కు చేరుకుంటున్న నేపథ్యంలో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ శివశంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్, శివ స్వామీజీ, మాతా నిర్మలానంద యోగ భారతిలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ శర్మ, శివపార్వతి మాత, కృష్ణవేణి మాత, అన్నపూర్ణ, జైపాల్ సింగ్‌లు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపార కేంద్రంగా హైదరాబాద్

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్

బంజారాహిల్స్: దేశంలోని ఇతర నగరాలో పోలిస్తే హైదరాబాద్‌లో నగరం రోజురోజుకూ విస్తరిస్తూ ప్రముఖ వ్యాపార కేంద్రంగా మారిందని ఇది మంచి పరిణామమని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన బంజారాహిల్స్‌లో రోడ్‌నెం.2లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరా జ్యువెలర్స్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ, ముంబై, పుణే, బెంగళూరు నగరాలతో పోలిస్తే మన వద్ద తక్కువ ధరల్లోనే బిజినెస్ స్పేస్ దొరుకుతుండటంతో చాలామంది ఇక్కడ వ్యాపారాలు చేసేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరా ఫ్యాషన్ జ్యువెలర్స్ ఎం.డి లాయక్ అక్తర్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.



ఆరా జ్యువెలర్స్‌ను ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్ గౌడ్

అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బోరబండ సైట్-3 వీకర్స్ సెక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేసిన అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతపైనే వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న అమిత్‌షా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బండారు అశోక్, దళిత నాయకులు జైం భీమ్ యాదగిరి. ఆనంద్‌కుమార్, దేవేందర్ నాయకులు కాసుల మహేష్‌గౌడ్, గోగుల్ల వెంకటేశ్, కాశన్న, కృష్ణ, కవిత, లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఎంహెచ్ఎం కోర్సుకు ఆదరణ

లక్డీకాపూల్: నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్ఎం) కోర్సుకు విశేషమైన ఆదరణ లభిస్తుందని కోర్సు అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ మర్తా రమేష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగాధిపతి డాక్టర్ నిమ్మ సత్యనారాయణలు తెలిపారు. దేశంలోనే ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్న ఏకైక సంస్థ నిమ్స్ అని స్పష్టం చేశారు. ఈ కోర్సులో అర్హులైన అభ్యర్థులకు 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. టీఎస్ ఆర్టీసీలో ఇతర విద్యార్థుల మాదిరిగానే ఎంహెచ్ఎం విద్యా ర్థులకు కూడా బస్‌పాస్ సదుపాయాన్ని కల్పించినట్లు చెప్పారు. రెండేళ్ల కాలపరిమితి కలిగిన ఈ కోర్సు కోసం ఎంబీబీఎస్ వైద్యులు సైతం ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. 20 సీట్ల సామర్థ్యం కలిగిన ఈ కోర్సును ఇప్పటి వరకు 20 బ్యాచ్‌లు పూర్తి చేశాయన్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలోని ట్రామా, ఎమర్జెన్సీ బ్లాక్‌లోని ఆడిటోరియంలో శనివారం ప్రెషర్ డే వేడుకలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ వేడుకలలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ముఖ్య అతిథిగా పాల్గొనున్నట్టు చెప్పారు.

మహిళా జర్నలిస్ట్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: ఉద్యోగాలు, ప్లాట్లు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఓ మహిళా జర్నలిస్ట్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మణికొండ ప్రాంతంలో నివసించే ఓ మహిళా జర్నలిస్ట్ ఉద్యోగాలు, ప్లాట్లు ఇప్పిస్తానని ప్రచారం చేసుకుంది. ఈ క్రమంలో అల్వాల్‌కు చెందిన హెల్త్ అండ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారుగా పనిచేసే సుజాతకు కూడా ఉద్యోగం ఇప్పిస్తానని, మరి కొంతమందిని కూడా రిఫర్ చేయమని చెప్పింది. దీంతో ఆమెతో పాటు 18 మంది ఉద్యోగాలు, ప్లాట్ల కోసం రూ. 28,22,500లు చెల్లించారు. వీరిలో కొంతమంది నేరుగా నగదు, మరికొంత సీడీఎం లావాదేవీల ద్వారా చెల్లింపులు జరిపారు. ఆ తరువాత ఉద్యోగాలు, ప్లాట్లు ఇప్పించకుండా తప్పించుకొని తిరుగుతుంది. దీంతో సదరు మహిళా జర్నలిస్ట్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు'

కాచిగూడ: బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు జరుగుతున్నాయని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ చైర్మన్ డాక్టర్ మహిపాల్ యాదవ్ ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేయాలని అన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో ప్రభుత్వ అధికారులు, మధ్యవర్తులతో కుమ్మక్కై రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వికారాబాద్ జిల్లాతోపాటు ఇతర జిల్లాలో బ్యాక్ లాగ్ ఉద్యోగాలను అక్రమంగా అడ్డదారిలో భర్తీకి సన్నా హాలు చేస్తున్నారని, ఈ భర్తీని ఆపకపోతే నిరుద్యోగుల తరఫున పోరాటం చేయడానికి ఎంతదూరమైనా వెళ్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నేతలు రాఘవేందర్, సూరన్న, చీమల జగదీశ్ యాదవ్, నరేష్ యాదవ్, రాము, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గణిత వారోత్సవాలు



గణిత వారోత్సవాల్లో విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో గణిత వారోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థులకు ప్రాథమిక గణితాన్ని సరళంగా, సరదాగా బోధించి వర్ధమాన గణిత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ వారోత్సవాలు కొనసాగాయి. వారం రోజులపాటు ప్రతిరోజూ 2, 3, 4 తరగతులకు చెందిన విద్యార్థులకు గణితం ప్రాముఖ్యతను తెలియజేశారు. కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం చిహ్నాలు వంటి గణితల వివరించారు. పిడికిలి లెక్కింపును ఉపయోగించి నెలలోని రోజులను గుర్తించుకోవడానికి చిట్కాలు, రెండు చేతుల వేళ్లను ఉపయోగించి 9వ పట్టిక ఉపాయం, ఏదైనా రెండు అంకెల సంఖ్యను సెకన్లలోపు 11తో గుణించే ఉపాయం, వివిధ రకాల పజిల్స్‌ను ఛేదించడం వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో గణిత పరిజ్ఞానాన్ని పెంపొందించాయి. శ్రీనివాస రామానుజన్, శకుంతలాదేవి, బ్లేజ్ పాస్కల్, ఆర్యభట్ట, భాస్కరాచార్య, బ్రహ్మగుప్త వంటి గొప్ప గణిత శాస్త్రవేత్తలపై జరిగిన ప్రసంగాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపాయి. గణితం రోజువారీ జీవితంలో భాగమని, 'గణితం అన్ని విషయాలకు రాణి' అనే అంశాలపై దృష్టిసారించిన వీధి నాటకం పిల్లల్లో గణితం ప్రాముఖ్యతను గ్రహించేలా చేసింది. గణితం గొప్పతనంపై పాటలు, గుణకార పట్టికలు, గణితంలో ప్రాథమిక చిహ్నాలపై విద్యార్థుల నృత్యాలు మంత్రముగ్ధులను చేశాయి.

కాలుష్య రహిత నగరానికి సహకరించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి పొన్నం

బంజారాహిల్స్: నగరాన్ని కాలుష్య రహితం చేసే దిశగా పని చేస్తున్న ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని.. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వెనకాల ఉన్న నూతన రోడ్డులో మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం వల్ల పిల్లలు పాఠశాలలకు పోయే పరిస్థితి కూడా కరువైందన్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్ నగరంలోనూ అటువంటి పరిస్థితి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలుష్యాన్ని నివారించేందుకు ఇప్పటికే ప్రభుత్వం నూతన ఈవీ పాలసీని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డీసీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్లకు న్యాయం చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ బిల్ కలెక్టర్లు

పంజగుట్ట: గృహజ్యోతి పథకంతో బిల్ కలెక్టర్లు ఉపాధి కోల్పోయారని ప్రభుత్వం వెంటనే వారికి న్యాయం చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కొలగాని రమేష్‌లు కోరారు. విద్యుత్ బిల్ కలెక్టర్లకు న్యాయం చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ ప్రధాన కార్యాలయం విద్యుత్ సౌధ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థ ఏపీఎస్ఈబీగా ఉన్నప్పటి నుంచి ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ రెండు డిస్కంలల్లో సుమారు 600 మంది విద్యుత్ బిల్ కలెక్టర్లు పని చేస్తున్నారని తెలిపారు. వీరు విద్యుత్ బిల్లులు ఎంత ఉన్నా ఒక్క బిల్లుకు డబ్బులు సేకరిస్తే రూ.1.49 పైసలు కమీషన్ వస్తుందన్నారు. కాగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం వల్ల 200 యూనిట్లలోపు వారికి ఉచిత కరెంట్ పథకం రావడంతో 80 శాతం మంది వినియోగదారులు బిల్లు కట్టాల్సిన అవసరం లేకపోవడంతో వీరికి ఉపాధి కరువయ్యిందన్నారు. అంతే కాకుండా దాదాపు చాలా మంది బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించడంతో వీరికి పూర్తిగా పనిలేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 20 నుంచి 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న 600 కుటుంబాలు రోడ్డునపడ్డాయన్నారు. వీరికి ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ల స్థానంలో లేబర్ యాక్ట్ ప్రకారం స్కిల్డ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే సమస్యపై డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖమంత్రిని కలిసి వినతిపత్రాలు ఇచ్చామని అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అనంతరం యూనియన్ల ప్రతినిధుల బృందం విద్యుత్ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన బిల్ కలెక్టర్లు బి.కృష్ణయ్య, సీ.హెచ్. సోమేశ్, రాజేశ్వరి, సీ.హెచ్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పనులు చేపట్టాలి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పనులు త్వరితగతిన చేపట్టాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్ డివిజన్ బాలిరెడ్డినగర్ నుంచి బసవతారకనగర్ వరకు రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా చేపడుతున్న రోడ్లను శుక్రవారం వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాలిరెడ్డినగర్ కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయానికి సంబంధించిన నూతన రిటైనింగ్ వాల్ నిర్మించాలని, అలాగే బసవతారకనగర్‌లో నూతన రోడ్డు నిర్మించాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు అనిల్, హసన్‌అలీ, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల 'చలో అసెంబ్లీ'ని అడ్డుకున్న పోలీసులు



వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

కాచిగూడ: దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆటో డ్రైవర్లు 'చలో అసెంబ్లీ'నిర్వహించారు. హిమాయత్‌నగర్ నుంచి అసెంబ్లీ వైపు ఆటో డ్రైవర్లు ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అనంతరం ఆటో డ్రైవర్లందరినీ పోలీసులు వ్యాన్లలో ఎక్కించి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. వివిధ యూనియన్లకు చెందిన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నేతలు బి.వెంకటేశం, ఎంఏ సలీం, ఎండి నజీర్, వి.మారయ్య, ఎస్.రాంకిషన్, ఏ.సత్తిరెడ్డి, వి.ప్రవీణ్ ఏ.బిక్షపతి యాదవ్, సీహెచ్ జంగయ్య, ఎస్.అశోక్, ఎండి ఒమర్ ఖాన్, మల్లికార్జున్, ఎస్‌కే లతీఫ్, లక్ష్మణ్, తదితరులు అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో అర్హులైన ప్రతీ ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12వేలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, 20 వేల కొత్త ఆటోలకు పర్మిట్లను జారీ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకొని ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.




గతంలో పెళ్లి జరగాలంటే వధూవరులను పెద్ద నాన్నలు, బాబాయ్‌లు, మామలు, పెద్దమ్మలు, మేనత్తలు అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూసి అబ్బాయి లేదా అమ్మాయి నచ్చితే వారి గుణగణాలు తెలుసుకొని కుటుంబ పరిస్థితి తెలుసుకొని పెళ్లి జరిపించేవారు. వివాహం జరిగిన తర్వాత భర్తతో ఎలా మసలుకోవాలి?, అత్తగారింట్లో ఎలా ఉండాలి? ఇలాంటివన్నీ అమ్మమ్మలు, తాతలు, నానమ్మలు కొత్తగా పెళ్లయిన వారికి చెప్పేవారు. ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు కరువై యాంత్రిక జీవనం కొత్తగా పెళ్లయిన వారినే కాకుండా పెళ్లికి ముందు కూడా వధూవరులను, పెళ్లి తర్వాత భార్యా, భర్తలను మనస్పర్థలకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే టోలిచౌకిలో నివసించే ఇలియాస్‌ షంషి అనే వ్యక్తి 'దుల్హా-దుల్హన్‌' కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చాడు. దీని గురించిన మరిన్ని విశేషాలు..! - బంజారాహిల్స్‌




మంచి స్పందన

మేం ఈ సంస్థను ఏర్పాటు చేసినప్పుడు స్పందన అంతంత మాత్రంగానే ఉండేది. రోజులు గడుస్తున్న కొద్దీ మా సంస్థకు రెస్పాన్స్‌ పెరుగుతోంది. అమెరికా, దుబాయ్‌, కెనడా తదితర ప్రాంతాల నుంచి కూడా మేం నిర్వహించే ఆన్‌లైన్‌ క్లాస్‌లకు అభ్యర్థులు హాజరవుతున్నారు. పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత భార్యా, భర్తల బంధం ఎంత బలంగా ఉండాలో ఈ శిక్షణ ద్వారా సూచిస్తున్నాం. ఇప్పటి వరకూ వేలాది మందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. మూడు నెలల పాటు ఈ ఆన్‌లైన్‌ శిక్షణ ఉంటుంది. అంతే కాదు బెస్ట్‌ మదర్‌ అనిపించుకోవడం ఎలా అన్న దానిపై కూడా మా శిక్షణ కొనసాగుతున్నది. ఇటీవల పెళ్లికి ముందే చిన్న చిన్న విషయాల్లో వధూవరులకు మనస్పర్థలు వచ్చి పెళ్లిళ్లు ఆగిపోతున్న ఘటనలూ చూస్తున్నాం. దుల్హన్‌ కోర్సులో ఈ విషయాలన్నింటికీ సమాధానాలు లభిస్తున్నాయి. యువతీ, యువకులకు వేర్వేరుగా ఈ క్లాసులు ఉంటాయి. ముఖ్యంగా భార్య, భర్తల బంధం బలంగా ఉండాలంటే ఎలా ఉండాలో చూపిస్తున్నాం.

– ఇలియాస్‌, షంషీ, ట్రైనర్‌ ఫ్యామిలీ ఇన్‌స్టిట్యూట్‌



సందేహాలను నివృత్తి చేసే..
దుల్హా-దుల్హన్‌

పెళ్లికి ముందే కాబోయే వధూవరులకు శిక్షణ



టోలిచౌకి బాల్‌రెడ్డినగర్‌ కాలనీలో ఏర్పాటు చేసిన దుల్హా-దుల్హన్‌ ఫ్యామిలీ ఇన్‌స్టిట్యూట్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో కొత్తగా పెళ్లి చేసుకోబోయేవారు ఎలా ఉండాలి అనే దానిపై 15 అంశాల్లో నిర్వాహకుడు ఇలియాస్‌ షంషి శిక్షణ ఇస్తున్నారు. హైదరాబాద్‌లోనే కాకుండా బెంగళూరు, చెన్నై, గుజరాత్‌, ఢిల్లీ, కోల్‌కతాతో పాటు దుబాయ్‌, కెనడా, అమెరికాలో కూడా షంషి ప్రారంభించిన ఆన్‌లైన్‌ క్లాస్‌లకు మంచి రెస్పాన్స్‌ లభిస్తోంది. పెళ్లంటే ఏంటి?, పెళ్లిలో మంత్రాల అర్థం ఏంటి? వాటిని ఎలా అర్థం చేసుకోవాలి?, పెళ్లి ఎందుకు?, బాధ్యతలు, భర్తతో మనస్పర్థలు వస్తే వాటిని ఎలా పరిష్కరించుకోవాలి?, భార్య అంటే ఎలా ఉండాలి?, భర్త చేయాల్సినవి, చేయకూడనివి ఏంటి?, మీరు మంచి భర్తగా ఎలా ఉండొచ్చు తదితర అంశాలపై షంషి శిక్షణ ఇస్తున్నారు.

సందేహాలను నివృత్తి చేస్తూ..

హోమ్‌ మేనేజ్‌మెంట్‌, భర్త మనసును ఎలా గెలుచుకోవాలి, భార్య మనసును ఎలా గెలుచుకోవాలి ఇలాంటివన్నీ ఈ ట్రైనింగ్‌లో భాగమయ్యాయి. పెళ్ళికి ముందు వధూవరులు వస్తే వారు అడిగే ప్రశ్నలకు సందేహాలను నివృత్తి చేస్తూనే పెళ్లి తర్వాత మంచి భర్తగా, లేదా మంచి భార్యగా ఎలా ఉండాలి అన్న అంశాలపై ఈ శిక్షణ కొనసాగుతున్నది.

2019లో ఏర్పాటు..

ప్రతిరోజూ పాతిక మంది వరకూ ఆన్‌లైన్‌ క్లాసులకు హాజరయ్యే ఈ ఫ్యామిలీ ఇన్‌స్టిట్యూట్‌ 2019లో ఏర్పాటైంది. ఇప్పటి వరకూ వేల సంఖ్యలో యువతీ, యువకులకు శిక్షణతో పాటు తగిన సూచనలు జారీ చేశారు షంషి. భార్యా, భర్తల మధ్య ఏదైనా గొడవ వస్తే వాటిని పరిష్కరించే దిశలోనే ఆయన అడుగులు వేస్తున్నారు. ఎవరికైనా ఇలాంటి సలహాలు, సంప్రదింపులు కావాలంటే తమ ఇన్‌స్టిట్యూట్‌లో జాయిన్‌ కావొచ్చు అని కూడా పేర్కొంటునారు. పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత మేం చెప్పబోయే అంశాలు ఏమిటి అన్న దానిపై వివరిస్తూ స్పష్టంగా వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

- భార్య, భర్తల బంధం బలంగా ఉండేందుకు పలు సూచనలు
- దేశంలోనే మొట్ట మొదటి ఆన్‌లైన్‌ శిక్షణా కేంద్రం
- వేలాది మంది యువత సందేహాలను నివృత్తి చేస్తూ
- మూడు నెలల పాటు వివిధ అంశాల్లో అవగాహన



డ్రైవింగ్‌లో ఫోన్‌ వాడొద్దు..

వివో ఎక్స్‌ 200 సిరీస్‌ విడుదలలో నటి సంయుక్త



సాక్షి, సిటీబ్యూరో: 'తాను మొబైల్‌ ఫోన్‌ని బాగా యూజ్‌ చేస్తానని, చాలా చిన్నప్పుడే తన చేతికి ఫోన్‌ వచ్చిందని చెప్పారు నటి సంయుక్త (సంయుక్తా మీనన్‌). బంజారాహిల్స్‌లోని పార్క్‌ హయత్‌లో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రముఖ బ్రాండ్‌ వివోకు చెందిన వివో ఎక్స్‌ 200 సిరీస్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు 5వ తరగతిలో ఉన్నప్పుడు మొట్టమొదటిసారి తాతగారు ఫోన్‌ కొనిచ్చారని చెప్పారు. సోషల్‌మీడియా బూమ్‌ తర్వాత అందరూ బాగా ట్రావెల్‌ చేస్తున్నారని, చలికాలంలో అత్యంత చల్లని ప్రదేశాలను కూడా సందర్శిస్తున్నారని అన్నారు. అదే విధంగా మొబైల్‌ కెమెరాని ఆ సమయాల్లో ఫొటోల కోసం వినియోగించడం అలవాటుగా మారిందన్నారు.అందుకే అందరూ ఫోన్‌ కొనే సమయంలో కెమెరా ఫీచర్స్‌ బాగుండాలని కోరుకుంటున్నారన్నారు. ఎంత ఇష్టమున్నా కార్‌లో డ్రైవింగ్‌ చేస్తూనే మరోవైపు ఫొటోల కోసం మొబైల్‌ వాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వివో ఇండియా సీఎస్‌వో అశ్విని భాస్కర్‌ మాట్లాడుతూ తమ కొత్త ఫోన్‌ సిరీస్‌ విశేషాలను వివరించారు.



ఫిక్కీ లేడీస్‌ ఆర్గనైజేషన్‌
శారీ దినోత్సవం

'ది సారీ- సిక్స్‌ యార్డ్స్‌ ఆఫ్‌ సస్టైనబుల్‌ హెరిటేజ్‌' అనే అంశంపై చర్చ

సాక్షి, సిటీబ్యూరో: చీర కట్టుకునే సంస్కృతి 5 వేల ఏళ్ల నుంచి కొనసాగుతోందని ఫ్లో (ఎఫ్‌ఎల్‌ఓ) హైదరాబాద్‌ చైర్‌పర్సన్‌ ప్రియా గజ్దర్‌ అన్నారు. శుక్రవారం ఫిక్కీ (ఎఫ్‌ఐసీసీఐ) లేడీస్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో ప్రపంచ చీరల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ చీర కట్టు అనేది ప్రపంచం ఉన్నంత కాలం కొనసాగుతుందని అన్నారు. ఏటా డిసెంబర్‌ 21న శారీ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. 'ది సారీ-సిక్స్‌ యార్డ్స్‌ ఆఫ్‌ సస్టైనబుల్‌ హెరిటేజ్‌' అనే అంశంపై చర్చ నిర్వహించారు.



హెల్త్‌కేర్‌ హ్యాండ్‌ బుక్‌ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో : ప్రముఖ జాతీయ స్థాయి ఆన్‌లైన్‌ క్రౌడ్‌ ఫండింగ్‌ వేదిక మిలాప్‌.. వైద్య సేవలు అవసరమైన రోగులకు అందించే కేర్‌ గివర్స్‌కి ఉపయుక్తంగా ఉండేలా తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యాధికారి కార్యాలయ సహకారంతో 'మేకింగ్‌ హెల్త్‌కేర్‌ యాక్సెసబుల్‌ ఇన్‌ హైదరాబాద్‌.. ఏ కేర్‌ గివర్స్‌ హ్యాండ్‌ బుక్‌' పేరిట ఒక పుస్తకాన్ని రూపొందించింది. దీనిని నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో సెర్ప్‌ సీఈఓ, ప్రజావాణి రాష్ట్ర నోడల్‌ అధికారి దివ్యా దేవరాజన్‌ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌ అత్యాధునిక వైద్య సేవలు అందించే ఆస్పత్రులకు చిరునామా కావడంతో.. నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి రోగులు తరలి వస్తున్నారని, అటువంటివారు సమాచార లోపం కారణంగా వైద్య సేవలను పొందడంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా రూపొందిన గైడ్‌ ఎంతైనా ఉపయుక్తమన్నారు.



27 నుంచి హైలైఫ్‌ స్టైల్‌..

బంజారాహిల్స్‌: ఈ నెల 27వ తేదీ నుంచి హెచ్‌ఐసీసీ నోవోటెల్‌లో ప్రతిష్టాత్మక హైలైఫ్‌ లైఫ్‌స్టైల్‌ ఫ్యాషన్‌ ఎగ్జిబిషన్‌ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం శుక్రవారం బంజారాహిల్స్‌ రోడ్‌ నెం.10లో జరిగింది. ఈ సందర్భంగా పలువురు మోడల్స్‌ ఈ ఎగ్జిబిషన్‌లో లభించే దుస్తులు, ఆభరణాలు ధరించి చూపరులను అలరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో ఫ్యాషన్‌ ఉత్పత్తులతో పాటు వెడ్డింగ్‌, ఫెస్టివల్‌ కలెక్షన్స్‌ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని నిర్వాహకులు వెల్లడించారు.




గిరిజన.. సందీపం

గుడ్‌ టచ్‌.. బ్యాడ్‌ టచ్‌.. రుతుస్రావం సమయంలో హైజీనిటీ.. బాల్య వివాహాలు.. గృహ హింస.. ఇలా ఎన్నో అంశాలపై చాలా మందికి అవగాహన ఉండదు. వీటి గురించి కనీసం బయట మాట్లాడటానికే ఇబ్బంది పడుతుంటారు. కానీ ఓ యువకుడు మాత్రం వీటి గురించి ధైర్యంగా మాట్లాడుతున్నాడు. గ్రామగ్రామానికీ, ఇంటింటికీ, ప్రతి స్కూల్‌కీ తిరుగుతూ వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. డిగ్రీ కుర్రాడు ఈ అవగాహనా కార్యక్రమాలు చేపడుతూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

- సాక్షి, సిటీబ్యూరో




- చిన్ననాటి నుంచే సామాజిక స్పృహ
- పలు సమస్యలపై గ్రామాల్లో అవగాహన
- వాయిస్‌ ఫర్‌ వెల్‌ఫేర్‌ పేరిట సంస్థ స్థాపన
- నిజాం కాలేజీ కుర్రోడు సందీప్‌ సేవా కార్యక్రమాలు

అందరిలా కుర్రోళ్లలా ఫోన్లు, గేమ్స్‌ ఆడుకుంటూ ఇన్‌స్టాలో రీల్స్‌ చూసుకుంటూ ఎంజాయ్‌ చేయకుండా సామాజిక స్పృహతో సమస్యలపై అవగాహన పెంచుతూ.. పోరాడుతూ ముందుకు సాగుతున్నాడు ఓ డిగ్రీ కుర్రాడు. అతడే నిజామ్‌ కాలేజీలో బీఏ పొలిటికల్‌ సైన్స్‌ చదువుతున్న సందీప్‌ నాయక్‌. అతడు చేస్తున్న పనిని మెచ్చి వందలాది మంది సందీప్‌ వెనుక నడుస్తున్నారు.

15 ఏళ్ల నుంచే..

ఆదిలాబాద్‌ జిల్లా, ఉట్నూరు సమీపంలోని జైతారం తండాలో జన్మించిన సందీప్‌.. 15 ఏళ్ల వయసు నుంచే సమాజంలోని సమస్యల గురించి తెలుసుకునేందుకు ఆయా ప్రాంతాలను సందర్శించేవాడు. ఎన్నో సవాళ్లతో, సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన సందీప్‌.. వాటిపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు. ముఖ్యంగా పాఠశాలల నుంచి పిల్లల డ్రాపవుట్స్‌ ఎక్కువగా ఉన్నాయని గర్తించాడు. ఈ సమస్యకు వెనుక ఉన్న కారణాల అన్వేషణలో పడ్డాడు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, లింగ అసమానతలు, గృహ హింస, రుతుస్రావం సమయంలో పరిశుభ్రత, ప్యాడ్స్‌ వినియోగం లేకపోవడం వంటి సమస్యలు కారణమని గుర్తించాడు. వీటన్నింటినీ రూపుమాపేందుకు, వాటిపై సమాజంలో అవగాహన పెంచేందుకు గొంతెత్తాలని నడుం బిగించాడు. అనుకున్నదే తడవుగా 'వాయిస్‌ ఫర్‌ వెల్‌ఫేర్‌' పేరుతో ఓ ఎన్జీవో స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా పలు సమస్యలపై పోరాడుతున్నాడు.



మహిళల గొంతుకగా..

సంస్థ ద్వారా చిన్నారులు, మహిళల గొంతుకగా నిలిచేందుకు కృషి చేస్తున్నాడు. నిజామ్‌ కాలేజీలో బీఏ మూడో సంవత్సరం చదువుతున్న సందీప్‌ కార్యకలాపాలకు మెచ్చి తోటి విద్యార్థులతో పాటు తెలిసిన వాళ్లు అతడి వెనుక నడుస్తున్నారు. మారుమూల గ్రామాలు, ప్రాంతాలకు వెళ్లి అక్కడి మహిళలు, చిన్నారులకు ఎన్నో విషయాలపై అవగాహన కల్పిస్తున్నాడు. పాఠశాలలకు వెళ్లి.. చిన్నారులకు చదువు చెబుతున్నాడు. సమాజంలో అసమానతలు తగ్గాలంటే చదువు ఒక్కటే మార్గమని సందీప్‌ చెబుతున్నాడు.

సాక్షి రియల్టీ
శనివారం
21-12-2024



దేశీయ స్థిరాస్తి రంగంలో హైదరాబాద్ పవర్ హౌస్‌గా మారింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ), లైఫ్ సైన్స్ రంగాల బహుళ స్థిరాస్తి పెట్టుబడులకు వేదికగా అభివృద్ధి చెందింది. గతంలో సిటీ రియల్ ఎస్టేట్‌లో ఐటీ కంపెనీలు, ఉద్యోగుల లావాదేవీలు ఎక్కువగా జరుగుతుండేవి. కానీ, కొంతకాలంగా ఫార్మాసూటికల్స్ రంగం నుంచి కూడా పెట్టుబడులు, కొనుగోళ్లు పెరుగుతున్నాయి. దీంతో గృహాలు, ఆఫీసులు, గిడ్డంగులు, డేటా సెంటర్లకు డిమాండ్ ఏర్పడింది. –సాక్షి, సిటీబ్యూరో

ముంబై తర్వాత
మన దగ్గరే..

హైదరాబాద్‌లో గృహాల ఇన్వెంటరీ 1,01,091

వీటి విక్రయానికి పట్టే కాలం 19 నెలలు

టాప్–7 మెట్రోల్లో 5.64 లక్షల యూనిట్లు

సాక్షి, సిటీబ్యూరో: డిమాండ్‌కు మించి సరఫరా జరుగుతుండటంతో హైదరాబాద్‌లో అమ్మకానికి ఉన్న ఇళ్లు(ఇన్వెంటరీ) పెరిగిపోతున్నాయి. దేశంలోని ఏడు ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే ముంబై తర్వాత హైదరాబాద్‌లోనే అత్యధిక ఇన్వెంటరీ ఉంది. ఇక, బెంగళూరు, చెన్నై వంటి మెట్రో నగరాలతో పోలిస్తే మన దగ్గరే ఎక్కువ. ప్రస్తుతం గ్రేటర్‌లో 1,01,091 ఇళ్ల ఇన్వెంటరీ (వీటిలో నిర్మాణంలో ఉన్నవి, పూర్తయినవి కలిపి) ఉంది. వీటి విక్రయానికి కనిష్ఠంగా 19 నెలల కాలం పడుతుంది. రెండేళ్లలో నగరంలో గృహాల సరఫరా పెరగడమే ఇన్వెంటరీ పెరుగుదలకు ప్రధాన కారణం.

- దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఏడాది తొలి తొమ్మిది నెలల కాలంలో మొత్తం 5,64,416 యూనిట్ల ఇన్వెంటరీ మిగిలి ఉందని, వీటి విక్రయానికి కనిష్ఠంగా 14 నెలల కాలం పడుతుందని అనరాక్ గ్రూప్ నివేదిక వెల్లడించింది.



నగరాల వారీగా ఇన్వెంటరీ (యూనిట్లలో)

ఎన్‌సీఆర్	85,460
ఎంఎంఆర్	1,86,677
బెంగళూరు	46,316
పుణే	88,176
హైదరాబాద్	1,01,091
చెన్నై	28,758
కోల్‌కతా	25,938



ఐటీ టు లైఫ్‌సైన్స్!

హైదరాబాద్ బహుళ స్థిరాస్తి పెట్టుబడులకు వేదిక

- ఐటీ, ఫార్మా నుంచి పెరిగిన లావాదేవీలు
- ఇళ్లు, ఆఫీసులు, గిడ్డంగులు, డేటా సెంటర్లకు గిరాకీ
- ఫోర్త్‌సిటీ, మెట్రో, ట్రిపుల్ ఆర్‌లతో భవిష్యత్ ఆశాజనకం

- 2023–24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఎగుమతులు రూ.1,16,182 కోట్లు కాగా.. ఇందులో రూ.2,68,233 కోట్లు ఐటీ, రూ.36,893 కోట్ల ఫార్మాస్యూటికల్స్ ఎగుమతుల వాటాను కలిగి ఉన్నాయి. నగరంలో ఐటీతో మొదలైన రియల్ బూమ్ ఫార్మా ఎంట్రీతో నెక్ట్స్ లెవల్‌కి చేరింది. బలమైన ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ వ్యూహాత్మక ప్రణాళికలు, వ్యాపార అనుకూల విధానాలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి, అందుబాటులో ప్రాపర్టీల ధరలు.. ఇవన్నీ ఐటీ, ఫార్మా రంగాలకు చోదక శక్తిగా మారాయి. బహుళ రంగాల్లో అంతర్జాతీయ కంపెనీలు కొలువుదీరడంతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందింది. రాష్ట్రంలో ఐటీ, ఫార్మా ఎగుమతుల్లో గ్రేటర్ వాటా 60 శాతానికి పైగానే ఉంటుంది. వెస్ట్ హైదరాబాద్‌తో పాటు పోచారం, ఆదిభట్ల వంటి ప్రాంతాల్లో ఐటీ సంస్థలు, మేడ్చల్, కొత్తూరు, పటాన్‌చెరు వంటి ప్రాంతాల్లో వేర్‌హౌస్‌లు, శంషాబాద్, కందుకూరు, మేకగూడ వంటి ప్రాంతాల్లో డేటా సెంటర్లకు డిమాండ్ ఏర్పడింది.

ఇదీ రియల్ వృద్ధి..

హైదరాబాద్‌లో ఈ ఏడాది తొమ్మిది నెలల్లో రూ.36,461 కోట్లు విలువ చేసే రూ.59,386 గృహాలు అమ్ముడుపోయాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా తెలిపింది. అలాగే మార్కెట్‌లోకి కొత్తగా 85 లక్షల చ.అ. ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే ఉన్న ఆఫీస్ స్పేస్‌తో కలిపి మొత్తం 87 లక్షల చ.అ. కార్యాలయాల స్థలాల లావాదేవీలు జరిగాయి. ఇక, గ్రేటర్‌లో 54 లక్షల చ.అ. గిడ్డంగుల స్థలం, 47 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 20 మెగావాట్లు నిర్మాణంలో ఉండగా.. మరో 38 మెగావాట్లు ప్రణాళిక దశలో ఉన్నాయని కొల్లియర్స్ ఇండియా నివేదిక తెలిపింది.

భవిష్యత్తులో మరింత జోష్

ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ, టీ–స్క్వేర్, ఫార్మా క్లస్టర్లు, మెట్రో విస్తరణతో పాటు విమానాశ్రయంతో కనెక్టివిటీ, రీజినల్ రింగ్‌రోడ్ వంటి బృహత్తర ప్రాజెక్ట్‌లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో సిటీ విస్తరణ పెరగడంతో పాటు పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఏర్పడతాయి. దీంతో హైదరాబాద్‌లో ఇళ్లు, ఆఫీసులు, వేర్‌హౌస్, డేటా సెంటర్లకు మరింత డిమాండ్ ఏర్పడుతుందని పరిశ్రమ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. వచ్చే 3–4 ఏళ్లలో నగరంలో కొత్తగా లక్ష గృహాలు లాంచింగ్ అవుతాయని, 2026 నాటికి ఏటా 1.7–1.9 కోట్ల చ.అ. ఆఫీసు స్థలాన్ని అందుబాటులోకి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే వచ్చే రెండేళ్లలో వేర్‌హౌస్ స్థలం 40 లక్షల చ.అ.కు, డేటా సెంటర్ల సామర్థ్యం 23 మెగావాట్లకు విస్తరిస్తాయని అంచనా.

ఐటీ వర్సెస్ ఫార్మా..

- ఐటీ, ఐటీఈఎస్ ఎగుమతులు, ఉత్పత్తులతో హైదరాబాద్ ఐటీ హబ్‌గా పేరొందింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఐటీ ఎగుమతులు 11.3 శాతం పెరిగి రూ.2.68 లక్షల కోట్లను అధిగమించాయి. ప్రస్తుతం 1,500లకు పైగా ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల్లో 9 లక్షలకు పైగా ఉద్యోగులున్నారు. టీ–హబ్, టీ–వర్క్స్ వంటి ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌లతో నగరం 4 వేల స్టార్టప్‌లకు ఆతిథ్యం ఇస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్(ఏఐ), సెమీకండక్టర్ల డిజైన్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి పెట్టడంతో అభివృద్ధి మరింత జోరందుకుంటుంది.
- లైఫ్ సైన్సెస్ క్యాపిటల్‌గా పిలిచే హైదరాబాద్‌లో 1,500లకు పైగా ఫార్మాసూటికల్స్, బయోటెక్ కంపెనీలున్నాయి. దేశంలోని మొత్తం ఫార్మా ఎగుమతుల్లో మన రాష్ట్రం వాటా 20–30 శాతం. దేశంలో మూడింట ఒకవంతు వ్యాక్సిన్లు హైదరాబాద్ నుంచే ఉత్పత్తి అవుతున్నాయి. 2023–24లో రూ.36,893 కోట్ల ఫార్మాసూటికల్స్ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వచ్చే పదేళ్లలో లైఫ్ సైన్స్ పరిశ్రమ వంద బిలియన్ డాలర్ల అభివృద్ధి చేయాలని, కొత్తగా 4 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఫార్మా క్లస్టర్లు, జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైస్ పార్క్‌ల విస్తరణ తదితర బృహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.



భవనాల ఎత్తుకు క్యాప్ పెట్టండి!

అపరిమిత ఎఫ్ఎస్ఐ వల్లే స్థలాలు, ఫ్లాట్ల ధరల పెరుగుదల

కనీసం నివాస భవనాల ఎత్తుపైనైనా ఆంక్షలు విధించాలి	చెరువుల్లోని పట్టా భూములకు 400 శాతం టీడీఆర్	మూసీ బాధితులకు 60–80 గజాల స్థలం కేటాయింపు

'ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ) పరిమితులు ఉన్నాయి. కానీ, ఔటర్ రింగ్ రోడ్డు వరకూ స్థలాల లభ్యత ఉన్న హైదరాబాద్‌లో మాత్రం ఎఫ్ఎస్ఐపై ఆంక్షలు లేవు. దీంతో రోడ్డు, స్థలం విస్తీర్ణంతో సంబంధం లేకుండా బిల్డర్లు ఇష్టారాజ్యంగా హైరైజ్ భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో భూములు, అపార్ట్‌మెంట్ల ధరలు పెరుగుతున్నాయి. ఒకే ప్రాంతంలో భవన నిర్మాణాలు ఉండటంతో రోడ్లపై వాహనాల రద్దీ, కాలుష్యం పెరగడంతో పాటు విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలపై అదనపు భారం పడుతుందని' నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరెడ్కో) వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎం.ప్రేమ్‌కుమార్ అన్నారు. 'సాక్షి రియల్టీ'తో ఆయన ఇంటర్వ్యూ పూర్తి వివరాలివీ..

– సాక్షి, సిటీబ్యూరో



'సాక్షి రియల్టీ'తో నరెడ్కో వెస్ట్ జోన్ చైర్మన్ ప్రేమ్‌కుమార్



మౌలిక వసతులు, డిమాండ్ ఉన్న ప్రాంతంలో తక్కువ స్థలం దొరికినా చాలు బిల్డర్లు హైరైజ్ భవనాలు కట్టేస్తున్నారు. దీంతో స్థలాలు, అపార్ట్‌మెంట్ల ధరలు పెరగడం తప్ప సమాంతరం అభివృద్ధి జరగడం లేదు. నగరాభివృద్ధికి ఆకాశహర్మ్యలే ప్రతీక. ఆర్థికంగా, సాంకేతికంగా మనం ఎంత శక్తిమంతులమో ఇవి నిరూపిస్తాయి. అలా అని రోడ్డు, మౌలిక సదుపాయాలపై పడే ప్రభావాన్ని అంచనా వేయకుండా అనుమతులు ఇవ్వకూడదు. ఎఫ్ఎస్ఐపై ఆంక్షలు ఉంటేనే బిల్డర్లు ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా ఓఆర్ఆర్ చుట్టూ ఖాళీగా ఉన్న ప్రాంతాల వైపు దృష్టిసారిస్తారు. దీంతో ధరలు తగ్గి, సామాన్యుల సొంతింటి కల సాకారం అవుతుంది. నార్సింగి, పుప్పాలగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో కనీసం నివాస భవనాలకైనా ఎఫ్ఎస్ఐపై క్యాప్ పెట్టాలి.

మూసీ పరిహారంగా స్థలాలు..

గ్లోబల్ సిటీగా బ్రాండ్ ఇమేజ్ సొంతం చేసుకున్న హైదరాబాద్‌లో కంపుకొట్టే మూసీ నది ఉండటం శోచనీయం. విదేశీ పర్యాటకులు, పెట్టుబడులను ఆకర్షించాలంటే మూసీ సుందరీకరణ అనివార్యం. ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయం. అయితే మూసీ పరివాహక ప్రాంతంలోని నివాసితులను ఒప్పించి ఆయా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. మూసీ బాధితులకు శివారు ప్రాంతంలో ప్రభుత్వమే లేఔట్ చేసి, 60– 80 గజాల చొప్పున స్థలాన్ని కేటాయించాలి. దీంతో వాళ్లే సొంతంగా ఇళ్లు కట్టుకుంటారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల నిధులను ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చు. మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరణతో రవాణా వ్యవస్థ మరింత మెరుగవుతుంది. రోడ్ల మీద వాహనాల రద్దీతో పాటు ప్రయాణ సమయం తగ్గుతుంది. మెరుగైన రవాణాతో నగరం సమాంతరంగా అభివృద్ధి చెందుతుంది.

చెరువుల్లో పట్టా భూములు..

చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ఏర్పాటైన హైడ్రా ఉద్దేశం మంచిదే. కానీ, ప్రభుత్వం దీన్ని సరైన రీతిలో పరిచయం చేయలేదు. ఇప్పటికీ గ్రేటర్‌లో చాలా చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ప్రభుత్వం నిర్ధారించలేదు. అయినా ఆగమేఘాల మీద బుల్డోజర్లతో కూల్చివేతలు చేశారు. అలా కాకుండా ముందుగా చెరువులకు కంచె వేసి, బఫర్ జోన్లను నిర్ధారించాలి. గ్రేటర్‌లోని చాలా చెరువుల్లో పట్టా భూములు ఉన్నాయి. ఆయా భూయజమానులకు 400 శాతం ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) భూములను స్వాధీనం చేసుకోవాలి. ఈ విధానాన్ని హైదరాబాద్‌కే కాకుండా రాష్ట్రమంతటా అమలు చేయాలి. అప్పుడే బాధితులు ముందుకొస్తారు. గతంలో కొనుగోలుదారులు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పర్మిషన్ ఉందా అడిగేవారు కానీ ఇప్పుడు హైడ్రా పర్మిషన్ ఉందా అని అడుగుతున్నారు.

సోలారే బెటరూ..

సౌర విద్యుత్ వినియోగంపై పెరిగిన అవగాహన

పుంజుకున్న సోలార్ సెట్ వ్యాపార సేవలు	పీఎం సూర్యఘర్ స్కీంతో పెరిగిన సోలార్ రూఫ్ టాప్‌లు	పర్యావరణానికి సైతం మేలు చేస్తున్న సోలార్ సిస్టం

కిలో వాట్ సోలార్ సెట్ పెట్టుకుంటే.. కొన్ని మొక్కలు నాటినట్లే..: ఫ్రెయర్ ఎనర్జీ

సాక్షి, సిటీ బ్యూరో: ఈ మధ్య కాలంలో వచ్చిన అధునాతన సాంకేతిక మార్పుగా అవతరించి.., సామాజికంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న వాటిలో 'సోలార్ విద్యుత్ శక్తి, ఈ–వాహనాలు' హవా కొనసాగిస్తున్నాయి. ఈ రెండు అంశాలు సామాజిక జీవన వైవిధ్యంలో పెను మార్పులకు నాంది పలికాయి. ఒక వైపు విపరీతంగా పెరిగిపోతున్న కరెంట్ వాడకం, దానికి అనుగుణంగానే పెరిగిపోతున్న విద్యుత్ చార్జీలు. వెరసీ అందరి చూపూ సోలార్ విద్యుత్ వైపునకు మళ్లింది. దశాబ్ద కాలంగానే సోలార్‌కు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ అది నగరాల వరకే పరిమితమైంది. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ సోలార్ సెట్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ స్కీంలో భాగంగా దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లకు సోలార్ వ్యవస్థను వ్యాప్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రత్యేక సబ్సిడీలను సైతం అందిస్తున్నారు. కొన్నేళ్లుగా సోలార్ వ్యవస్థ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వ్యాపార సంస్థలు సైతం ఈ సందర్భంగా వారి సేవలు పెంచుతున్నాయి. కొన్ని సంస్థలైతే వివిధ జిల్లాల్లోని టౌన్‌లలో ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఆవిష్కరించి ఈ సోలార్ సెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు.

సూర్య ఘర్ స్కీంతో సబ్సిడీ..

హైదరాబాద్ వంటి నగరాల్లో సోలార్ వాడకంపై అవగాహన మెరుగ్గానే ఉంది. సోలార్ విద్యుత్ వినియోగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఇప్పుడిప్పుడే ఈ విధానానికి అలవాటు పడుతున్నారు. ఈ సోలార్ పద్ధతులు వ్యక్తిగత ఇళ్లతో పాటు చిన్న–పెద్ద తరహా పరిశ్రమల్లోనూ విరివిగా వాడుతున్నారు. వారి వారి విద్యుత్ వాడకానికి అనుగుణంగానే పీఎం సూర్య ఘర్ స్కీంలో ఒక కిలో వాట్ నుంచి వినియోగాన్ని బట్టి అవసరమైనన్ని కిలో వాట్‌ల సోలార్‌సెట్‌లను, వాటికి సబ్సిడీని అందిస్తుంది. ఈ సోలార్ విధానాన్ని రెసిడెన్షియల్ ఏరియాలో, స్కూల్స్, ఫామ్ హౌజ్‌లు, రైస్‌మిల్స్ వంటి చిన్న తరహా పరిశ్రమల్లోనూ ఎక్కువగా వాడుతున్నారు. పరిశ్రమలైనా, వ్యక్తిగత వినియోగమైనా.. టెక్నాలజీ పెరగడంతో కరెంట్ వినియోగం సైతం అధికంగా పెరిగిపోయింది. గతంలో ఇళ్లలో రూ.200 నుంచి రూ.500ల కరెంట్ బిల్ అత్యధికం అనుకుంటే.. ఇప్పుడది రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు పెరిగిపోయింది. ఇక పరిశ్రమల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మిషనరీ, అధునాతన సాంకేతికత వినియోగం పెరగడంతో వాటి చార్జీలు మూడింతల కన్నా పైగానే పెరిగాయని నిపుణులు తెలుపుతున్నారు.



పర్యావరణ హితం.. సోలార్ సిస్టం..

విద్యుత్ తయారీ కోసం ప్రస్తుతం వాడే పద్ధతులన్నీ ఏదో విధంగా పర్యావరణానికి హాని చేసేవే అని పరిశోధకుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సాధారణంగా థర్మల్, గ్యాస్, విండ్, హైడ్రో తదితర పద్ధతుల్లో విద్యుత్‌ను సేకరిస్తున్నారు. ఈ తరుణంలో కిలో వాట్ సోలార్ సిస్టమ్ పెట్టుకుంటే కొన్ని వందల మొక్కలు పెంచిన దానితో సమానమని, అంతటి కాలుష్యాన్ని తగ్గించే విధానంగా సోలార్ నిలుస్తుందని నిపుణుల మాట. ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ పెరగడం, కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు పెరగడం.. తదితర కారణాలతో ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఏర్పడటం, వెరసీ పర్యావరణ మార్పులతో పెను ప్రమాదాలను ఎదుర్కొంటున్నాం. ఇలాంటి తరుణంలో కాలుష్యరహిత పద్ధతులైన సోలార్ సిస్టమ్ అత్యంత శ్రేయస్కరమని భావిస్తున్నారు.

మొదటి ఎక్స్‌పీరియన్స్ సెంటర్..

రాష్ట్రంలో సోలార్ వినియోగంపై అవగాహన పెరిగింది. దేశంలో విప్లవాత్మక మార్పుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనూ సేవలందిస్తున్నాం. కరోనా అనంతరం సోలార్‌ను తీసుకునే వారి సంఖ్య అధికంగా పెరిగింది. పీఎం సూర్య ఘర్ స్కీం కూడా దీనికి కారణం. ఇందులో భాగంగా రూ.2 లక్షల సోలార్ సెట్ బిగించుకుంటే దాదాపు రూ.78 వేల సబ్సిడీ లభిస్తుంది. మిగతా పెట్టుబడి కూడా రెండు మూడేళ్ల కరెంట్ చార్జీలతో సమానం. కాబట్టి మూడేళ్ల తర్వాత వినియోగించే సోలార్ కరెంట్ అంతా లాభమే.



– రాధికా చౌదరి, ఫ్రెయర్ ఎనర్జీ కో–ఫౌండర్.

క్లుప్తంగా...

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి: కిషన్‌రెడ్డి

బీజేపీ ఎంపీలపై దాడి దురదృష్టకరమని వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు ఆవరణలో బీజేపీ ఎంపీలపై జరిగిన దాడికి బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ ఎంపీలకు, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విషయంలో రాహుల్ మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనను యావత్ సమాజం ఖండిస్తోందని తెలిపారు. గురువారం పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీల దాడిలో గాయపడి ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీలు చంద్రప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌తో కలిసి కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఎంపీల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాహుల్ టీషర్ట్ వేసుకుని యువకుడిలా కనిపించాలనుకుంటే తప్పు లేదు. కానీ.. యువకుడిని అనుకుని బీజేపీ ఎంపీలపై దాడికి దిగడం అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంబేడ్కర్ ఆలోచనలను సాకారం చేసే దిశగా కృషిచేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణ సీపీపీ కన్వీనర్‌గా మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) కన్వీనర్‌గా నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని అధిష్టానం నియమించింది. అలాగే మరికొన్ని రాష్ట్రాలకు సీపీపీ కన్వీనర్లను నియమిస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి, ఎంపీ అమర్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతున్న రాహుల్‌గాంధీ: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ ప్రయత్నిస్తుంటే, ఆ రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజకీయ కుట్రతో రాహుల్ గాంధీనీ గతేడాది పార్లమెంట్‌కు రాకుండా చేశారని, ఇప్పుడు కూడా రాహుల్ గాంధీని పార్లమెంట్‌కి రాకుండా దాడి చేసి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా క్షమాపణ చెప్పేంత వరకు రాహుల్‌గాంధీ పోరాటం ఆగదని జగ్గారెడ్డి చెప్పారు. అమిత్ షాకి, రాహుల్ గాంధీకి తేడా ఉందని, బీజేపీ వాళ్లు దేవుణ్ణి మొక్కి కూడా పబ్లిసిటీ చేసుకుంటారని మండిపడ్డారు. అంబేడ్కర్ రాజ్యాంగం దేశ ప్రజలకు ఒక ధైర్యం, కవచం అని, అంబేడ్కర్ రాజ్యాంగం వల్లనే మోదీ అయినా.. అమిత్ షా అయినా పదవులు అనుభవిస్తున్నారని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. అంబేడ్కర్‌ను రాజ్యాంగ నిర్మాణానికి ప్రోత్సహించింది జవహర్ లాల్ నెహ్రూ అయితే, దాన్ని కాపాడటానికి అహర్నిశలు కృషి చేస్తున్నది నెహ్రూ ముని మనవడు రాహుల్ అని పేర్కొన్నారు.

'సాహితీ' కేసులో ఈడీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సాహితీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన రియల్ ఎస్టేట్ కంపెనీలు, సంస్థల చైర్మన్లు, ఎండీల ఇళ్లలో గురువారం సోదాలు నిర్వహించారు. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌లోని సీఎస్‌కే రియల్టర్స్, సింగ్ మన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్యాలయాలు, ఎండీలు సురేశ్, కేఆర్.అగర్వాల్, రక్షిత్ అగర్వాల్ ఇళ్లు సహా మొత్తం11 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.5.42 కోట్లు విలువ చేసే జ్యువెల్లరీ, రూ.72.75 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇతర డాక్యుమెంట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. సాహితీ ఇన్‌ఫ్రాపై సిటీ సీసీఎస్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. సాహితీ లక్ష్మీనారాయణ సహా గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన వారి వివరాలు సేకరించారు. దర్యాప్తులో భాగంగా డిపాజిటర్ల నుంచి రూ.842.15 కోట్లు వసూలు చేసినట్టు ఈడీ గుర్తించింది. ఇందులో రూ.216.91 కోట్ల నగదును డిపాజిటర్ల నుంచి సేకరించింది. ఈ డబ్బును రియల్ ఎస్టేట్ సహా ఇతర వ్యాపారాలకు మళ్లించినట్టు గుర్తించింది. ఈ క్రమంలోనే సీఎస్‌కే రియల్టర్స్, సింగ్ మన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లకు చెందిన సురేశ్, కేఆర్ అగర్వాల్, రక్షిత్‌లకు సంబంధించి రూ.20 కోట్లు సాహితీ ఇన్‌ఫ్రాతో కలిసి పెట్టుబడులు పెట్టినట్టు ఈడీ పేర్కొంది. ఈ కేసులో ఇప్పటికే మొత్తం రూ.161.5 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్టు ఈడీ వెల్లడించింది.

'ఫార్ములా-ఈ'పై ఈడీ కేసు నమోదు

- మనీలాండరింగ్ కోణంలో ఈసీఐఆర్ నమోదు చేసిన ఈడీ అధికారులు
- ఏసీబీ కేసు ఎఫ్ఐఆర్, ఇతర వివరాల ఆధారంగా విచారణ
- హైకోర్టు తీర్పుతో దర్యాప్తు వేగం పెంచనున్న ఏసీబీ
- అధికారుల నుంచి వాంగ్మూలాలు తీసుకునేందుకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా-ఈ'కార్ల రేసు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఏసీబీ పెట్టిన కేసు ఆధారంగా 'ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)'ను నమోదు చేసింది. హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నుంచి విదేశీ కంపెనీకి నిధుల చెల్లింపు అంశంలో రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) గురువారం కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. 'ఫార్ములా-ఈ'కారు రేస్ నిర్వహణకు సంబంధించి హెచ్ఎండీఏ నుంచి పలు దఫాల్లో రూ.45,71,60,625 సొమ్మును యూకేకు చెందిన 'ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ)'కు బదిలీ చేశారని పేర్కొంటూ.. మాజీ మంత్రి కేటీఆర్, మరో ఇద్దరు అధికారులను అందులో నిందితులుగా చేర్చారు. ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా.. ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణంలో విచారణ కోసం ఈడీ చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ జాయింట్ డైరెక్టర్ శుక్రవారం ఏసీబీ డీజీ విజయ్‌కుమార్‌కు లేఖ రాశారు. విదేశీ కంపెనీతో జరిగిన నగదు లావాదేవీలు, ఇతర వివరాలన్నీ తమకు ఇవ్వాలని కోరారు. ఏసీబీ నుంచి అందిన వివరాల ఆధారంగా.. మాజీ మంత్రి కేటీఆర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈసీఐఆర్ నమోదు చేశారు. అన్ని అంశాలను పరిశీలించి 'ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా)'కింద కూడా దర్యాప్తు కొనసాగే అవకాశం ఉన్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి.



దర్యాప్తు వేగం పెంచిన ఏసీబీ..

'ఫార్ములా-ఈ'వ్యవహారంలో ఏసీబీ దర్యాప్తు కొనసాగించవచ్చని హైకోర్టు పేర్కొన్న నేపథ్యంలో... ఏసీబీ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన అభియోగాలకు సంబంధించిన ఆధారాల సేకరణ, నిందితులు, కేసుతో సంబంధం ఉన్న వారి వాంగ్మూలాల నమోదుపై దృష్టిపెట్టారు. తొలుత ఈ అంశంపై ఏసీబీకి ఫిర్యాదు చేసిన పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ నుంచి మరోమారు వివరాలు సేకరించనున్నారు. ఈ-కార్ రేసు నిర్వహణకు సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందాలు, నిధుల చెల్లింపులు, ఇతర లావాదేవీల వివరాలు తీసుకోనున్నారు. హెచ్ఎండీఏ సాధారణ నిధుల నుంచి ఫార్ములా-ఈ రేసు నిర్వహణ కంపెనీ 'ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ)'కు నిధుల చెల్లింపునకు సంబంధించి.. అధికారుల మధ్య సంప్రదింపుల ఫైళ్లను పరిశీలించనున్నారు. కీలక డాక్యుమెంట్ల సేకరణతోపాటు ఎప్పటికప్పుడు వాటిని విశ్లేషించేలా దర్యాప్తు బృందం సభ్యులకు విధులు అప్పగించారు. ఈ కేసును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, ప్రధాన నిందితుడు కేటీఆర్ ప్రధాన ప్రతిపక్షంలోని కీలక వ్యక్తి కావడంతో ఏసీబీ ఉన్నతాధికారులు నేరుగా కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపడుతున్నారు. కీలక ఆధారాల సేకరణ తర్వాత నిందితులకు నోటీసులు జారీ ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఈనెల 30 వరకు అరెస్టు వద్దు

'ఫార్ములా-ఈ' కార్ల రేస్ కేసులో కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

- ఏసీబీ అధికారులు దర్యాప్తు కొనసాగించవచ్చు
- విచారణకు నిందితులు సహకరించాలి.. అడిగిన వివరాలు, పత్రాలు అందించాలని సూచన
- ఈ వ్యవహారంలో కేటీఆర్ ఏం లబ్ధి పొందారని ప్రశ్నించిన న్యాయమూర్తి
- అదంతా దర్యాప్తులో తేలుతుందని సమాధానమిచ్చిన అడ్వొకేట్ జనరల్
- ఎఫ్ఐఆర్ నమోదులో లోటుపాట్లపై ఏసీబీ తీరును తప్పుబట్టిన న్యాయమూర్తి
- ప్రాథమిక విచారణ చేయకుండానే నమోదు చేశారని వ్యాఖ్య
- విచారణ ఈ నెల 27కు వాయిదా.. కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీకి ఆదేశం


సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా-ఈ'కార్ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావుకు హైకోర్టు ఊరటనిచ్చింది. ఈ నెల 30వ తేదీ వరకు ఆయనను అరెస్టు చేయవద్దని ఏసీబీని ఆదేశించింది. అయితే కేసు దర్యాప్తును కొనసాగించవచ్చని పేర్కొంది. అధికారులు అడిగిన డాక్యుమెంట్లు, వివరాలు అందజేసి దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్ (కేటీఆర్)కు సూచించింది. ఈ పిటిషన్‌పై పది రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీకి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

లంచ్‌మోషన్ పిటిషన్ మేరకు..

ఫార్ములా-ఈ వ్యవహారంలో కేటీఆర్, ఇద్దరు అధికారులను నిందితులుగా చేరుస్తూ.. ఏసీబీ రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆ కేసు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ శుక్రవారం హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాప్రతినిధుల కేసులపై విచారణ చేపట్టాల్సిన రోస్టర్ న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సెలవులో ఉండటంతో.. జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ వద్ద విచారణ చేపట్టాలని న్యాయవాదులు ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు కోరారు. దీనిపై సీజే బెంచ్ అనుమతితో మధ్యాహ్నం 3 గంటల సమయంలో జస్టిస్ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు.

అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు..

కేటీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.ఆర్యామ సుందరం వాదనలు వినిపిస్తూ.. "2023 అక్టోబర్‌లో జరిగిన ఘటనపై 14 నెలలు ఆలస్యంగా ఈ నెల 18న సాయంత్రం 5.30 గంటలకు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. కనీసం ప్రాథమిక విచారణ కూడా చేయకుండానే అవినీతి నిరోధక (పీసీ) చట్టంలోని సెక్షన్ 13(1)( ), 13(2) కింద కేసు పెట్టడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం. ఆ సెక్షన్లు ఈ కేసుకు వర్తించవు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వోద్యోగులపై ప్రాథమిక విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయవద్దని లలితాకుమారి, చరణ్‌సింగ్ కేసుల్లో సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని ఏసీబీ ఉల్లంఘించింది. ప్రొసీజర్ పాటించలేదు. ఎఫ్ఐఆర్ నమోదుకు 14 నెలలు ఎందుకు ఆగారో కారణాలు లేవు. నిందితులు వ్యక్తిగతంగా ఆర్థిక లబ్ధి పొందారనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పకుండానే పీసీ యాక్ట్ సెక్షన్లు పెట్టారు.." అని న్యాయమూర్తికి వివరించారు. రాజకీయ కక్ష సాధింపు కోసమే కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. 2022 అక్టోబర్ 25న ఫార్ములా-ఈ రేస్ నిర్వహణపై తొలి ఒప్పందం జరిగిందని.. 2023 అక్టోబర్‌లో నిధుల చెల్లింపు ఒప్పందం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు రాదని వివరించారు. నగదు చెల్లింపులో ప్రొసీజర్ పాటించలేదని ఏసీబీ పేర్కొనడం సరికాదని.. సీజన్ 9, 10, 11, 12 నిర్వహణ కోసం 2022లోనే ఒప్పందం కుదిరిందని తెలిపారు. సీజన్ 9 నిర్వహణతో దాదాపు రూ.700 కోట్లు లాభం వచ్చిందని.. గ్లోబల్ సిటీగా హైదరాబాద్‌ను నిలపడంలో ఫార్ములా-ఈ కీలక పాత్ర పోషించిందని, అంతర్జాతీయంగా పేరు వచ్చిందని వివరించారు. సీజన్ 10 నిర్వహణ నుంచి స్పాన్సర్ తప్పుకోవడంతో ప్రభుత్వమే ఆ బాధ్యతలు తీసుకుందని, అందులో భాగంగానే చెల్లింపులు జరిపిందని తెలిపారు. కానీ కొత్త ప్రభుత్వం ఒప్పందాన్ని ఉల్లంఘించి రేసింగ్‌ను రద్దు చేసిందని.. రద్దుపై ఆర్బిట్రేషన్‌కు కూడా వెళ్లాల్సి వచ్చిందని వివరించారు. రేసింగ్ జరిగి ఉంటే పెద్ద ఎత్తున లాభాలు వచ్చేవని పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థకు లబ్ధి చేకూర్చామని ఏసీబీ పేర్కొందని, కానీ ఆ సంస్థపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని గుర్తు చేశారు.



ఫిర్యాదుకు ముందే ప్రాథమిక విచారణ జరిపాం

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. "ఎఫ్ఐఆర్ అనేది ఎన్‌సైక్లోపీడియా కాదు. ఇది విచారణ ప్రారంభం మాత్రమే. అంతా ఎఫ్ఐఆర్‌లో ఉండదు. కొత్తగా నిందితులను చేర్చే అవకాశం ఉంటుంది. చార్జిషీట్‌లో మాత్రమే అన్ని వివరాలుంటాయి. ఫిర్యాదుకు ముందే ప్రాథమిక విచారణ జరిపాం. పిటిషనర్ ఎమ్మెల్యే కావడంతో గవర్నర్ నుంచి అనుమతి కూడా పొందాం. ఆ తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. 2023 అక్టోబర్ 30న రెండో ఒప్పందం జరిగింది. కానీ అక్టోబర్ 3న (రూ.22,69,63,125 ప్లస్ పన్నులు అదనం), 11న (రూ.23,01,97,500 ప్లస్ పన్నులు అదనం).. అంటే ముందుగానే మొత్తం రూ.56 కోట్లు చెల్లింపులు చేశారు. రూ.700 కోట్లు లాభాలు వచ్చి ఉంటే స్పాన్సర్ ఎందుకు వెళ్లిపోతారు?" అని ప్రశ్నించారు. ఫార్ములా-ఈ సంస్థకు డబ్బును విదేశీ కరెన్సీలో చెల్లించారని, దానితో హెచ్ఎండీఏపై అధిక భారం పడిందని తెలిపారు. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం రిజర్వుబ్యాంకు అనుమతి తీసుకోలేదని.. ఆర్థికశాఖ అనుమతి కూడా లేదని వివరించారు. క్వాష్ పిటిషన్‌పై ఇంత అత్యవసరంగా విచారణ అవసరం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కల్పించుకుని.. "పిటిషనర్ ఏం లబ్ధి పొందారు? ఎందుకు ఆ సెక్షన్లు పెట్టారు?"అని ప్రశ్నించారు. అదంతా దర్యాప్తులో తేలుతుందని ఏజీ బదులిచ్చారు. పిటిషనర్‌కు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వొద్దని కోరారు.

ఎఫ్ఐఆర్ నమోదులో లోటుపాట్లు

కేటీఆర్ తరఫు న్యాయవాది ఆర్యామ సుందరం వాదిస్తూ.. ఫిర్యాదుకు ముందు విచారణ చేయడం కాదని, ఫిర్యాదు చేసిన తర్వాత ఎఫ్ఐఆర్‌కు ముందు ప్రాథమిక విచారణ చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని న్యాయమూర్తికి వివరించారు. ఫిర్యాదుకు ముందే విచారణ చేశామని, గవర్నర్ అనుమతి తీసుకున్నామని ఏజీ చెప్పడం సరికాదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎఫ్ఐఆర్ నమోదులో లోటుపాట్లు ఉన్నాయని, ప్రాథమిక విచారణ కూడా చేయలేదని పేర్కొన్నారు. సీఆర్పీసీ సెక్షన్ 482 మేరకు హైకోర్టుకు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసేందుకు, అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇచ్చేందుకు విశిష్ట అధికారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ మేరకు పిటిషనర్‌ను ఈ నెల 30 వరకు అరెస్టు చేయవద్దని ఏసీబీని ఆదేశించారు. తదుపరి విచారణను 27వ తేదీకి వాయిదా వేస్తూ, ఆ రోజున రోస్టర్ న్యాయమూర్తి విచారణ చేపడతారని తెలిపారు.

'ఫార్ములా-ఈ'లో అణా పైసా అవినీతి లేదు

- కొందరు ఉన్మాదులు తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారు: కేటీఆర్
- హెచ్ఎండీఏ చేసే ప్రతి పనికి ప్రభుత్వ అనుమతులు అవసరం లేదు
- టీఓటీ విధానంలో ఓఆర్ఆర్ లీజు.. ఆ డబ్బులతో రుణమాఫీ చేశాం
- లీజుపై గతంలో రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై హెచ్ఎండీఏ కేసు కూడా పెట్టిందని స్పష్టీకరణ
- రేవంత్ సొంత శాఖ అధికారులతో దర్యాప్తు చేస్తే నిజాలు తెలుస్తాయా? అని ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా-ఈ'కార్ల రేసు విషయంలో అణాపైసా అవినీతి జరగలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ చేపట్టే పనులకు ప్రభుత్వ అనుమతులు అవసరం లేదని... హైదరాబాద్ నగర అభివృద్ధికి దోహదం చేసే ఏ కార్యక్రమం కోసమైనా ఖర్చు చేసే స్వాతంత్ర్యం హెచ్ఎండీఏకు ఉందని చెప్పారు. ఫార్ములా-ఈ రేస్‌లో ఎలాంటి అవినీతి జరగలేదనే అంశం మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలతో బయటపడిందని... ఈ అంశంపై కొందరు ఉన్మాదులు తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ శుక్రవారం శాసనసభ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు విషయంలో కూడా ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటికే అమల్లో ఉన్న 'టీఓటీ'విధానంలోనే ఔటర్ రింగ్ రోడ్డు లీజు ద్వారా నిధులు సేకరించామని.. ఆ నిధులను రైతుల రుణమాఫీ కోసం వినియోగించామని తెలిపారు.

కేబినెట్ సబ్ కమిటీ సూచనలతోనే..


"ఆర్థిక వనరుల సమీకరణపై బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అనేక సూచనలు చేసింది. అందులో భాగంగానే ఓఆర్ఆర్ లీజు కూడా ఉంది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) కూడా ఇదే విధానంలో జాతీయ రహదారుల నుంచి డబ్బులు సేకరిస్తోంది. ప్రైవేటు కంపెనీకి లబ్ధి జరిగిందని ఆరోపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. లీజు ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయడం లేదు? ఓఆర్ఆర్ లీజులో రూ.లక్ష కోట్లు అవినీతి జరిగిందని ప్రతిపక్షంలో ఉన్నపుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీంతో హెచ్ఎండీఏ రేవంత్‌రెడ్డిపై వేసిన పరువు నష్టం కేసు ఇంకా కొనసాగుతోంది.." అని కేటీఆర్ చెప్పారు.

ఓఆర్ఆర్ లీజుపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి

మున్సిపల్, హోం శాఖలను నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి... తన కింద పనిచేసే అధికారులతో ప్రత్యేక విచారణ బృందం (సిట్) వేసి దర్యాప్తు చేస్తే వాస్తవాలు ఎలా బయటకు వస్తాయని కేటీఆర్ ప్రశ్నించారు. ఓఆర్ఆర్ లీజును రద్దు చేసి, సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జితో నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటయ్యే విచారణ సంస్థతో జాతీయ రహదారుల లీజు విధానాలను అధ్యయనం చేయించాలన్నారు. లేని పక్షంలో ఇది మరో రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. కోకాపేటలోని విలువైన ప్రభుత్వ భూమిని టీజీఐఐసీకి విక్రయించి రూ.10 వేల కోట్లు సేకరించే ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల రెండు రోజుల పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు శిక్షణ ఇచ్చారని.. అది స్పీకర్‌పై, ప్రతిపక్ష సభ్యులపై వాటర్ బాటిళ్లు విసరడంలో శిక్షణ ఇచ్చారా? అని విమర్శించారు. స్పీకర్‌ను పదే పదే దళితుడు అంటూ ఆయన గౌరవాన్ని అధికార పక్షం తక్కువ చేస్తోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

అసెంబ్లీలో రేవంత్‌వన్నీ అబద్ధాలే

- హైకోర్టు తీర్పుతో తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం
- రేవంత్ తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్రానికి రూ.700 కోట్ల నష్టం
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా - ఈ కార్ రేస్ అంశంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తొలి అడుగులోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నైతిక విజయం సాధించారని ఆ పార్టీ నేత హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ చెప్పిన మాటలన్నీ పచ్చి అబద్ధాలు, గోబెల్స్ ప్రచారమని హైకోర్టు తీర్పుతో స్పష్టమైందని తెలిపారు. రేస్ నిర్వహణ సంస్థకు ప్రభుత్వం రూ.47 కోట్లు చెల్లిస్తే.. రూ.600 కోట్లు నష్టం అంటూ సీఎం అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. రేవంత్ తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్రానికి రూ.700 కోట్ల నష్టం వాటిల్లిందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ అబద్ధాలతో రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీశారని విమర్శించారు. ఫార్ములా - ఈ రేస్ అంశంలో ప్రొసీజర్ ల్యాప్స్ జరిగి ఉండవచ్చు కానీ అక్రమాలు జరగలేదని స్పష్టంచేశారు.

ప్రశ్నిస్తే అరెస్టులు, నిర్బంధాలు

కాంగ్రెస్ చేతికి అధికారం వచ్చి ఏడాదైనా ప్రజల జీవితాల్లో మార్పు రాలేదని హరీశ్‌రావు అన్నారు. ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులు, నిర్బంధాలతో ప్రభుత్వం అణచివేస్తోందని విమర్శించారు. 'సీఎం రేవంత్, ఆయన సోదరులు, అల్లుడు, బావమరిది అవినీతి బండారాన్ని కేటీఆర్ క్రమ పద్ధతిలో బయట పెడుతున్నారు. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ అంశాల్లో అవినీతిని ప్రశ్నించడంతో కేటీఆర్‌ను జైలులో పెట్టే కుట్రకు తెరలేపారు. అరెస్టుల పేరిట నాయకులను భయభ్రాంతులకు గురిచేసే యోచనలో రేవంత్ ప్రభుత్వం ఉంది'అని మండిపడ్డారు. అక్రమ కేసులు బనాయించు, అబద్ధాలతో బుకాయించు అనే రీతిలో రేవంత్ పాలన ఉందని ధ్వజమెత్తారు. కేటీఆర్‌పై కేసు నమోదైన వెంటనే ఈడీ జోక్యం చేసుకోవడం బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు.

కేటీఆర్‌లో అహంకారం పరాకాష్టకు చేరింది

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత కేటీఆర్‌లో అహంకారం పరాకాష్టకు చేరిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం మండలిలో మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అక్రమాలు జరిగినట్టు ఆధారాలున్నా, తాను కడిగిన ముత్యమంటూ కేటీఆర్ తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేటీఆర్‌పై చట్టపరంగా కేసు నమోదైనందున ఈ విషయంపై కోర్టులో తేల్చుకోవాలని సూచించారు. ఫార్ములా ఈ కార్ రేస్‌లో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని, ప్రభుత్వం పంపిన ఆధారాలపై గవర్నర్ న్యాయసలహా తీసుకొని కేసుకు అనుమతించారని మహేశ్‌కుమార్ చెప్పారు. ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే హెచ్ఎండీఏ ఖాతా నుంచి రూ.54.88 కోట్లు చెల్లించేలా కేటీఆర్ ఒత్తిడి తెచ్చారని వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కంపెనీలకు నిధులు మంజూరు చేశారని మహేశ్‌కుమార్ ఆరోపించారు.

భూ భారతితో రైతు చెంతకు రెవెన్యూ సేవలు

డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: భూ భారతి చట్టంతో భూపరిపాలనలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ వ్యాఖ్యానించారు. కొత్త ఆర్ఓఆర్ చట్టం చరిత్రలో నిలిచిపోయేలా రూపొందించారని, రైతు కోణంలో ప్రజాభిప్రాయం మేరకు ఈ చట్టాన్ని తయారు చేశారని హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో భూ భారతి చట్టం ఆమోదం పొందిన అనంతరం ఈ చట్టం రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్‌ను డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త చట్టంతో రైతుకు రెవెన్యూ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు, ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకే కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొందించారని పేర్కొన్నారు. కొత్త ఆర్ఓఆర్ చట్టం అమల్లోకి రావడం పట్ల తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్ హర్షం వ్యక్తం చేశారు.

ఎక్కడైనా చర్చకు రెడీ

- 'ఫార్ములా-ఈ'కార్ రేసింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీలోనే కాదు.. బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుకు రమ్మన్నా వస్తా
- కోర్టులో అడ్వాంటేజీ తీసుకుంటారనే అన్ని విషయాలను చెప్పడం లేదు
- 2023 డిసెంబర్ నుంచి ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసేదాకా ఏం జరిగిందో వివరిస్తా
- 'ఫార్ములా-ఈ'ప్రతినిధికి నేనే అపాయింట్‌మెంట్ ఇచ్చా
- 'వాళ్లతో మాట్లాడుకున్నా... మీరూ ఊ అంటే సరిపోతుంద'ని ఆయన అన్నారు
- ఊ అంటే.. రూ.500 కోట్లు పోయేవి.. ఆరా తీస్తే అసలు విషయాలు బయటకు వచ్చాయి

సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా-ఈ'కార్ల రేసింగ్ వ్యవహారంపై అసెంబ్లీలోనే కాదని, బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుకు వచ్చి చర్చించేందుకైనా తాను సిద్ధమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏ చర్చలోనైనా వెనక్కివెళ్లడం తనకు ఇష్టం ఉండదని, ఏ విషయంలోనూ తాను వెనక్కి వెళ్లేది లేదని చెప్పారు. భూ భారతి బిల్లుపై శుక్రవారం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

"ధరణి పోర్టల్ పేరుతో వారు పాల్పడిన భూ బాగోతం బయటికి వస్తుందని, జైలుకు వెళ్లాల్సి వస్తుందని బీఆర్ఎస్ అసెంబ్లీలో తొండి పంచాయతీ పెట్టింది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణను నిర్ణయించే బీఏసీ సమావేశంలో.. తొమ్మిది అంశాలపై చర్చించాలని బీఆర్ఎస్ అధికార పక్షాన్ని కోరింది. ఆ తొమ్మిది అంశాల్లో కార్ రేసింగ్ లేదు. కానీ ఇప్పుడు అసెంబ్లీలో చర్చించాలనే డిమాండ్‌తో సభను నడవనీయబోమని అనడం దురహంకారం.

ఎఫ్ఈఓ ప్రతినిధి వచ్చి కలిశాకే..

నేను, ఎఫ్ఈఓ ప్రతినిధితో కలసి దిగిన ఫొటోను బీఆర్ఎస్ చూపెడుతోంది. ఎఫ్ఈఓ ప్రతినిధితో నేను సమావేశమయ్యా. ముఖ్యమంత్రి హోదాలో గత ఏడాది డిసెంబర్‌లోనే అధికారికంగా అపాయింట్‌మెంట్ ఇచ్చా. ఎఫ్ఈఓ ప్రతినిధి అనే కాదు.. నా ఇల్లు, సెక్రటేరియట్‌లో నన్ను కలిసేందుకు వచ్చే వారందరితో ఫొటోలు దిగుతా. నన్ను కలిసిన సందర్భంగా కార్ రేసింగ్ గురించి ఎఫ్ఈఓ ప్రతినిధి మాట్లాడారు. గత ప్రభుత్వంతో అన్నీ మాట్లాడుకున్నామని, మీరు కూడా ఊ అంటే సరిపోతుందని నాకు చెప్పారు. ఈ వ్యవహారం రూ.55 కోట్లతోనే అయిపోలేదు. మొత్తం రూ.600 కోట్లకు వారు మాట్లాడుకున్నారు. నేను ఎఫ్ఈఓ ప్రతినిధి అడిగినప్పుడు ఊ అంటే రూ.500 కోట్లు పోయేవి. తర్వాత నేను ఆరా తీస్తే అసలు విషయాలు తెలిశాయి. ఆయన వచ్చి ఊ అనాలని అడగకపోతే ఈ వ్యవహారం ఇంత తొందరగా బయటికి వచ్చేది కాదేమో!

అన్ని విషయాలు చెప్తే అడ్వాంటేజ్ తీసుకుంటారు

ఇప్పుడు ఈ రేసింగ్ ఏముందని అంటున్నారు. తర్వాత రేసు గుర్రం, జువ్వ, గుట్కా, డ్రగ్స్ వరకు వ్యవహారం వెళుతుంది. హెచ్ఎండీఏ డబ్బులను విదేశాలకు తరలించినా ఏమీ అనొద్దా? హెచ్ఎండీఏ డబ్బును పౌండ్లలోకి మార్చి విదేశీ కంపెనీలకు ఇవ్వడం తప్పు కాదా? అలా జరగాలంటే ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలి. రూ.55 కోట్లు అకౌంట్ నుంచి అకౌంట్‌కు బదిలీ అయితే తప్పేంటని అంటున్నారు. సైబర్ దొంగలు ఎవరి అకౌంట్ నుంచయినా నగదు దొంగిలిస్తే అకౌంట్ నుంచి అకౌంట్‌కు బదిలీ అయ్యాయి కదా.. అందులో ఏముంది అంటారా? ఎన్నికల కోడ్‌ను కూడా పట్టించుకోకుండా నిధులు బదిలీ చేశారు. ఇందుకు సంబంధించిన అన్ని విషయాలను నేను చెబితే కోర్టులో అడ్వాంటేజ్ తీసుకుంటారు. కార్ రేసింగ్ నిర్వహించిన హెచ్ఎండీఏ పురపాలక శాఖ పరిధిలోకి వస్తుంది. ఈ శాఖ నా పరిధిలోనే ఉంది. కేసు నమోదు చేసిన పోలీసు శాఖను కూడా నేనే చూస్తున్నాను. ఇప్పుడు నేను ఏది మాట్లాడినా కోర్టును ప్రభావితం చేస్తున్నారని అంటారు. అందుకే మాట్లాడలేకపోతున్నాను.



త్వరలోనే ప్రజలకు వివరిస్తా..

2023 డిసెంబర్‌లో మేం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదయ్యేంత వరకు ఏం జరిగిందో త్వరలోనే ప్రజలకు వివరిస్తా.. అధికారులతో మాట్లాడి, కోర్టులో పరిస్థితులను అంచనా వేసుకున్న తర్వాత స్పీకర్ అనుమతిస్తే అసెంబ్లీలోనే చెప్తా. అసెంబ్లీలో ఇబ్బంది అనుకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుకు రమ్మన్నా వస్తా. మేం అధికారంలోకి వచ్చాక నాలుగు బీఏసీ సమావేశాలు జరిగాయి. ఏ సమావేశంలో కూడా కార్ రేసింగ్ గురించి మాట్లాడలేదు. అమెరికా నుంచి అనకాపల్లి వరకు ఏం జరిగినా స్పందించే ట్విట్టర్ పిట్ట ఏమీ మాట్లాడలేదు. ఏంటీ దబాయింపు? ధరణి లోపాలు, నేరాలు, ఘోరాలను ప్రభుత్వం బయటపెడుతుందని, భూ భారతి బిల్లును అసెంబ్లీ ఆమోదించవద్దని, ఫోరెన్సిక్ ఆడిట్‌కు ప్రభుత్వం ఆదేశించవద్దని రచ్చ చేశారు.

అలా చేయడం తెలంగాణకు గౌరవం ఇవ్వదు

అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు ఇష్టానుసారంగా వ్యవహరించడం తెలంగాణకు గౌరవం ఇవ్వదు. సభ్యుల తీరుపై స్పీకర్ నిశితంగా ఆలోచించాలి. ఏడాది అయింది. ఇంకా చిల్లర మల్లర వేషాలొద్దు. చట్టం మా ఇష్ట ప్రకారమే నడవాలంటే కుదరదు. అప్పుడప్పుడు స్పీకర్ కొరడా ఝుళిపించాలి.." అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

హరీశ్‌రావుకు కొరడా దెబ్బలు తప్పవు

అసెంబ్లీలో హరీశ్‌రావు అల్లరి చేసి చొక్కాలు చించుకోకపోతే ఇంటికి వెళ్లాక కొరడా దెబ్బలు, కోదండం తప్పవని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. తన కొడుకు కోసం ఏం చేశావంటూ హరీశ్‌రావును మామ కొరడా దెబ్బలు కచ్చితంగా కొడతాడన్నారు. ఓఆర్ఆర్ విషయంలో కూడా కావాలని ప్రభుత్వం విచారణకు ఆదేశించేలా చేశావని హరీశ్‌రావును అంటారని, ఆ కుటుంబంలో పంచాయతీలు వస్తాయని వ్యాఖ్యానించారు.

సాగులో సాంకేతికత పెంచండి..



వజ్రోత్సవాలను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో మంత్రి తుమ్మల తదితరులు

ఏఐ, రోబోటిక్ టెక్నాలజీని విరివిగా వాడాలి

దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముక..

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రొఫెసర్ జయశంకర్ అగ్రి వర్సిటీ వజ్రోత్సవాలు ప్రారంభం

వర్సిటీ 60 ఏళ్ల సేవలను కొనియాడిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఉద్యాన పంటల సాగు పెరగాలి: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక లాంటిదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. వ్యవసాయ విద్య, పరిశోధనల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం.. రైతులకు మరింత చేరువయ్యేలా సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రెండు రోజులపాటు జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను చాన్స్‌లర్ హోదాలో శుక్రవారం గవర్నర్ ప్రారంభించారు. వజ్రోత్సవాల మీనియేచర్ పైలాన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్యతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులకు కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ గుర్తింపు పత్రాలని అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. 2047 నాటికి వ్యవసాయ రంగంలో విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గడిచిన 60 ఏళ్లుగా వర్సిటీ అసమాన సేవలందిస్తూ.. సోనామసూరి, తెలంగాణ సోనా వంటి ఎన్నో కొత్త వంగడాలను అభివృద్ధి చేసిందని కొనియాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ వంటి అధునాతన సాంకేతికతలను వ్యవసాయ రంగంలోకి విస్తృతంగా తీసుకురావాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మారేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు.

ఉద్యానవన పంటల సాగు పెరగాలి: తుమ్మల

రాష్ట్రంలో వరి, పత్తి, మిరప పంటల సాగును తగ్గించి.. కూరగాయలు, ఆయిల్‌పామ్, ఇతర ఉద్యాన పంటల సాగు పెంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతాంగానికి సూచించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కిసాన్ మేళాలో ఆయన ప్రసంగించారు. భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో వ్యవసాయ పట్టభద్రులు రావాలని ఆకాంక్షించారు. శాస్త్రవేత్తలు వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులకు పంటల సాగును సూచించాలని కోరారు. ప్రతి వ్యవసాయ కళాశాల పరిధిలో ఒక 'మోడల్ అగ్రికల్చర్ ఫార్మ్'ను అభివృద్ధి చేయాలని సూచించారు. నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్ మాట్లాడుతూ.. తెలంగాణలో నీటి పారుదల సౌకర్యం పెరగటంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి బాగా పెరిగిందని.. అదే సమయంలో కూరగాయలు, ఉద్యాన పంటలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రులు నాదెండ్ల భాస్కర్‌రావు, సమరసింహారెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బాల్‌రాజ్, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి. రాజిరెడ్డి, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు చింతల వెంకటరెడ్డి, వై. వెంకటేశ్వర్‌రావు, విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతులు రఘువర్ధన్ రెడ్డి, రాఘవరెడ్డి, పద్మరాజు, వెటర్నరీ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

కలుపు తీస్తుంది.. ఎరువు జల్లుతుంది!

రైతుకు చేదోడుగా 'ఫార్మ్ రోబో ఆర్-1'.. కోతుల్ని తరిమికొట్టే 'మంకీగన్'

రైతులను ఆకట్టుకొంటున్న కిసాన్ మేళా.. వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవాల్లో భాగంగా వివిధ స్టాళ్ల ఏర్పాటు

సాక్షి, రంగారెడ్డిజిల్లా

➤ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కిసాన్‌మేళాకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు ఈ స్టాళ్లను ప్రారంభించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతోపాటు పశు వైద్య విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు, విద్యార్థులు తమ పరిశోధనలను ప్రదర్శించారు. ఆగ్రో, బయోటెక్, ఫెర్టిలైజర్ కంపెనీలు తమ ఉత్పత్తులు, యంత్రాలను ప్రదర్శించాయి. సంప్రదాయ చిరుధాన్యాలే కాకుండా వివిధ రకాల పండ్లు, వివిధ పంటల్లో వచ్చిన కొత్త వంగడాలు, యంత్ర పరికరాలతోపాటు కోళ్లు, కుందేళ్లు, పందులు, గొర్రెలు, పక్షుల పెంపకానికి సంబంధించిన స్టాళ్లు కూడా కొలువుదీరాయి.



'ఈ కెనాన్'తో కోతులు పరార్

➤ కోతులు, పందులు, ఇతర జంతువుల నుంచి పంటలకు విముక్తి కల్పించేందుకు 'సోలార్ ఆటోమేటిక్ ఈ కెనాన్' తోపాటు ఈ కెనాన్ (మంకీగన్)ను ప్రదర్శనలో ఉంచారు. సోలార్ ఆటోమేటిక్ ఈ కెనాన్ ధర రూ.26 వేలు. ఇది సోలార్ బ్యాటరీతో పనిచేస్తుంది. జంతువులు, పక్షులు పంటలపై దాడి చేయకుండా ఆటోమేటిక్‌గా సౌండ్స్ చేస్తాయి. ఈ సౌండ్స్ భయానికి అవి పారిపోతాయి. మంకీగన్ ధర రూ.3,500. క్యాల్షియం కార్బైడ్ దీనిలో నింపి, కొంచెం నీటిని వేయడం వల్ల గన్‌లోపల గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ట్రిగ్గర్ నొక్కిన వెంటనే బాంబు పేలిన శబ్దం బయటకు వస్తుంది. ఈ భారీ శబ్దానికి కోతులు, పందులు పారిపోతాయి.

మంకీగన్ కొంటా..

➤ మాకు 15 ఎకరాల భూమి ఉంది. పత్తి, మొక్క జొన్న వరిసాగు చేశాం. కోతుల బెడద ఎక్కువగా ఉంది. పండ్లు, కూరగాయలు ఏ పంట వేసినా చేతికి రావడం లేదు. కిసాన్‌మేళాలో మంకీగన్ చూశాను. ఖర్చు కూడా చాలా తక్కువే అనిపించింది. దీనిని కొనుగోలు చేసి కోతల బెడద నుంచి పంటను కాపాడుకుంటాను.

– కల్యాణి, మహిళా రైతు, ఖమ్మం

ఆహార వ్యర్థాల నుంచి వంటగ్యాస్



ఇంట్లో సహా హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో ఆహార పదార్థాలు, కూరగాయలు ఇతర వ్యర్థాలను వృథాగా పడేస్తుంటారు. ఇవి ఒకటి రెండు రోజుల్లోనే కుళ్లి, దుర్వాసన వెదజల్లుతాయి. పర్యావరణ కాలుష్యానికి కారణమవుతాయి. ఈ ఆహార వ్యర్థాల నుంచి 'నానో బయోగ్యాస్ ప్లాంట్' ద్వారా వంట గ్యాస్ ఉత్పత్తి చేసుకోవచ్చు. ప్రస్తుతం కేరళలో విరివిగా వాడుతున్న ఈ నానో బయోగ్యాస్ ప్లాంట్‌ను కిసాన్ మేళాలో ప్రదర్శించారు.దీనికి పెద్ద శ్రమ అవసరం లేదు. ఖర్చుకూడా తక్కువే. దీని ధర రూ.28 వేలు. ఐదు లీటర్ల సామర్థ్యంతో ఏకధాటిగా రెండు గంటల పాటు వంట చేసుకోవచ్చు.

ఆధునిక పద్ధతిలో వ్యవసాయం ఎలా చేయాలో తెలిసింది

కొత్త టెక్నాలజీతో వ్యవసాయం ఎలా చేయాలో అర్థమైంది. తక్కువ ఖర్చు, తక్కువ శ్రమతో ఎక్కువ పంట దిగుబడి ఎలా సాధించాలో తెలిసింది. వచ్చే సీజన్ నుంచి పూర్తిగా ఈ యాంత్రీకరణపైనే ఆధారపడి పనిచేయాలని నిర్ణయించుకున్నా. రైతులకు తోడుగా ఎన్ని రకాల యంత్ర పరికరాలు వచ్చాయో తెలిసింది.

– ఎట్టయ్య, మనగల్ రైతు

'ఫార్మ్‌రోబో ఆర్-1'తో గొర్రు, గుంటుక



➤ పొలంలో గొర్రుకు ఎద్దులను వాడుతుంటారు. రైతు కూడా రోజంతా పని చేయాలి. దీనికి ప్రత్యామ్నాయంగా 'ఫార్మ్ రోబో ఆర్-1' అందుబాటులోకి వచ్చింది. ఇది మనిషితో పనిలేకుండా పూర్తిగా రిమోట్ కంట్రోల్‌తో పని చేస్తుంది. కేవలం విద్యుత్ చార్జింగ్ బ్యాటరీల ద్వారా పనిచేస్తుంది. గుంటక, గొర్రు, రోటావేటర్‌గా పనిచేస్తుంది. ఎరువులను కూడా వెదజల్లుతుంది. చేలో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలను కూడా తొలగిస్తుంది. రూ.4.25 లక్షలు దీని ధర. డ్రైవర్‌తో పనిలేదు. బ్యాటరీలను ఒకసారి చార్జింగ్ చేస్తే 3 – 4 గంటల పాటు పని చేస్తుంది. గంట వ్యవధిలోనే ఎకరం భూమిలో గుంటుక కొడుతుంది. పటాన్‌చెరుకు చెందిన సంస్థ దీన్ని ప్రదర్శనలో ఉంచింది.



స్మార్ట్ వ్యవసాయానికి 'స్మార్ట్ డ్రోన్లు'

చీడపీడల నివారణకు రైతులు చేతి పంపులు, పెట్రోల్ పంపులను వాడుతారు. ఇది అనేక వ్యయ ప్రయాసలతో కూడినది. రైతు శ్రమ, ఖర్చు తగ్గించేందుకు పవమెన్ ఏవియేషన్ కంపెనీ సహా మారుతి డ్రోన్స్ ఏజీ 335హెచ్, వ్యవసాయ డ్రోన్ స్ప్రేయింగ్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. ఇవి 120 మీటర్ల ఎత్తులో ఎగురుతాయి. క్రిమిసంహారక మందులను నేరుగా పంటపై వెదజల్లుతాయి. వీటి ధర రూ.4.15 లక్షలు. బ్యాటరీ బ్యాకప్‌తో పనిచేస్తుంది. పైలెట్‌కు సదరు సంస్థే శిక్షణ సహా లైసెన్స్‌ను కూడా ఇప్పిస్తుంది. పది లీటర్ల ట్యాంకు సహా రోజుకు కనీసం 25 నుంచి 30 ఎకరాలు పిచికారీ సామర్థ్యం ఉంది.

పాతాళ గంగ పైపైకి..

పదేళ్ల క్రితం బోరు ఏర్పాటు

రూ.4 లక్షల ఖర్చుతో.. 20 ఎకరాలకు సాగునీరు



గోగుపల్లి శివాపురంలో ఆటోమేటిక్ బోరు ద్వారా ఉబికి వస్తున్న నీరు

ఏటూరునాగారం: విద్యుత్ సరఫరా లేకపోయినా.. బోరునుంచి పాతాళగంగ ఉబికి వస్తోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లి శివారులో ఎలాంటి మోటార్, విద్యుత్ సరఫరా లేకుండా గంగమ్మ ఉబికి వస్తోంది. మండల పరిధి శివాపురం గ్రామానికి చెందిన కుంట్ల రంగారెడ్డి తన వరి పొలానికి నీరు పారించేందుకు.. గతంలో సాధారణ మోటార్లు అమర్చి నానా కష్టాలు పడ్డారు. కానీ పదేళ్ల క్రితం విద్యుత్ అవసరం లేకుండా నిరంతరంగా సాగు నీరు అందించేందుకు వినూత్నంగా ఆలోచించారు. రూ.4 లక్షలు వెచ్చించి 600 అడుగుల లోతులో ఆటోమేటిక్ బోర్ ఏర్పాటు చేయించారు. నిరంతరం నీరు ఉబికి వస్తుండటంతో 20 ఎకరాల వరకు వరి పంట పండిస్తున్నారు. చుట్టు పక్కల రైతులకు సైతం సాగునీరు అందిస్తున్నారు. భూమి లోపల జలం అధికంగా ఉండడంతో.. ఆ ఒత్తిడితో పైపుల ద్వారా బయటికి వస్తోందని బోరు మెకానిక్‌లు చెబుతున్నారు. అన్ని ప్రదేశాల్లో ఇది సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. ఏటూరునాగారం, మంగపేట, తదితర ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు ఈ బోరు నుంచి నిరంతరాయంగా వచ్చే నీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు. రైతు రంగారెడ్డి మాట్లాడుతూ.. తన బోరు నీరు తన వ్యవసాయానికి సరిపోవడమే కాకుండా.. ఇతరులకు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. రెండు పంటలు సులభంగా పండుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు నమస్కరిస్తున్న సీఎం రేవంత్

ఘనంగా 'ఎట్ హోం'

సాక్షి, హైదరాబాద్: శీతాకాల విడిది ముగింపు సందర్భంగా శుక్రవారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన ఎట్‌హోం కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ నేత జనక ప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు ఇతర ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కాసేపు ముచ్చటించారు.

మూడు ప్రాజెక్టుల డీపీఆర్‌లు వెనక్కి

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలనలో ఉన్న ప్రాజెక్టుల జాబితా నుంచి తొలగిస్తామని తేల్చి చెప్పింది. ఈ మేరకు డీపీఆర్‌లను వెనక్కి పంపిస్తూ సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టుల మదింపు విభాగం డైరెక్టర్ రాజీవ్‌కుమార్ ఈ నెల 19న లేఖ రాశారు. తాము లేవనెత్తిన అంశాలకు 3 నెలల్లోగా సమాధానమివ్వకపోయినా, ట్రిబ్యునల్ పరిధిలో వివాదం ఉన్నా డీపీఆర్‌లను పరిశీలించకూడదనే నిబంధనలున్నాయని గుర్తుచేసింది.

తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్‌కు మార్గం సుగమం

వార్ధా ప్రాజెక్టుపై పలు అంశాలను లేవనెత్తుతూ 2023 జూలై 4, జూలై 20, 2024 నవంబర్ 17 తేదీల్లో సీడబ్ల్యూసీలోని వేర్వేరు డైరెక్టరేట్లు రాసిన లేఖలకు తెలంగాణ ప్రభుత్వం స్పందించలేదు. ప్రాజెక్టుతో మహారాష్ట్రలో ముంపు ఉండడంతో డీపీఆర్‌ను అంతర్రాష్ట్ర బోర్డు పరిశీలనకు పంపాలని సీడబ్ల్యూసీ గతంలో సూచించింది. ముంపుపై మహారాష్ట్ర నుంచి సమ్మతి తీసుకోవాలని కోరింది. ముంపు ఆధారంగా ప్రణాళికల్లో ఏమైనా మార్పులుంటే తెలపాలని సూచించింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కింద హెడ్‌వర్క్స్, సొరంగాలు, ఇతర పనులు ఎంత మేరకు చేశారు? వ్యయం ఎంత? పనుల లొకేషన్ ఏమిటి? ప్రాజెక్టు కోసం సేకరించిన పంపుసెట్ల వివరాలు, వార్ధా లేదా ఇతర ప్రాజెక్టులో వాటి వినియోగంపై సమాచారం ఇవ్వాలని కోరింది. ప్రభుత్వం సమాచారం ఇవ్వకపోవడంతో సీడబ్ల్యూసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. వార్ధా ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ వెనక్కి పంపడంతో ప్రాణహిత కింద ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మించడానికి మార్గం సుగమమైందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

అదనపు ప్రయోజనం లేకుండా అంత ఖర్చు ఎందుకు?

ఎలాంటి అదనపు ప్రయోజనాలు లేకపోయినా కాళేశ్వరం అదనపు టీఎంసీ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లను ఎలా ఖర్చు చేస్తారని సీడబ్ల్యూసీ ప్రశ్నించింది. దీనిపై ఎన్నో లేఖలు రాసినా సమాధానం ఇవ్వడం లేదని తప్పుబట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టు రోజువారీ పంపింగ్ సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచడానికి ఈ పనులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ప్రాజెక్టు నిర్వహణ ఆర్థికంగా ఆచరణీయమైనదని నిరూపించడానికి దానితో వచ్చే పంటల దిగుబడులను, వాటి విలువను భారీగా పెంచి చూపారంటూ సీడబ్ల్యూసీ తప్పుబట్టింది. చివరగా గత జనవరి 12న రాసిన లేఖకు ఇంకా సమాధానం ఇవ్వలేదని తెలిపింది.

ట్రిబ్యునల్‌లో తేలేవరకు పాలమూరుకు అనుమతి నో

ఏపీ, తెలంగాణల మధ్య కృష్ణా జలాల పంపిణీ వ్యవహారం కృష్ణా ట్రిబ్యునల్-2 పరిధిలో ఉన్నందున పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను పరిశీలించలేమని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. ఉమ్మడి ఏపీకి కృష్ణా జలాల్లో ఉన్న 811 టీఎంసీల వాటాతో పాటు 'పోలవరం' ప్రాజెక్టు నిర్మాణంతో సాగర్ ఎగువన లభ్యతలోకి వచ్చిన 45 టీఎంసీల జలాలను ఏపీ, తెలంగాణ మధ్య పంపిణీ చేసే బాధ్యతను కృష్ణా ట్రిబ్యునల్-2కు కేంద్రం అప్పగించిన విషయాన్ని గుర్తు చేసింది. పోలవరం ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తే దానికి బదులుగా సాగర్ ఎగువ రాష్ట్రాలు 80టీఎంసీలను వాడుకోవడానికి ట్రిబ్యునల్ అవకాశం కల్పించింది. ఈ 80 టీఎంసీల్లో మహారాష్ట్ర, కర్ణాటకలు 35 టీఎంసీలు వాడుకోగా, మిగిలి ఉన్న 45 టీఎంసీలను ఏపీ, తెలంగాణకు పంచే అంశం కృష్ణా ట్రిబ్యునల్-2లో పరిధిలో ఉంది. కాగా ట్రిబ్యునల్ తుది నిర్ణయం వచ్చే వరకు నిర్ణయం తీసుకోవడానికి వీలు లేదని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది.

అయ్యా చంద్రబాబు విద్యార్థులకు ట్యాబ్‌లు ఎక్కడ?

'ఎక్స్'లో నిలదీసిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ స్కూళ్లలో 8వ తరగతి విద్యార్థులకు ఏటా డిసెంబర్ 21న అందచేసిన ట్యాబ్‌లను ఈ ఏడాది ఎందుకు ఇవ్వడం లేదో పిల్లలు, తల్లిదండ్రులకు సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఆయన ట్వీట్ చేశారు. ట్యాబ్‌లు ఇచ్చిన సమయంలో పిల్లలతో తాను దిగిన ఫొటోను కూడా వైఎస్ జగన్ అటాచ్ చేశారు. ఇంకా వైఎస్ జగన్ ఏమన్నారంటే....

'ఏటా డిసెంబర్ 21న ప్రభుత్వ స్కూళ్లలో 8వ తరగతికి వచ్చిన పిల్లలకు ట్యాబ్‌లు అందించి పిల్లల చదువులను వెన్నుతట్టి ప్రోత్సహించే కార్యక్రమం చేశాం. పేదింటి తలరాతలను మార్చే శక్తి చదువులకే ఉందని నమ్మి దృఢంగా అడుగులు వేశాం. ఈ రోజు రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లే ప్రతి విద్యార్థి, వారి తల్లితండ్రులు ట్యాబ్స్ ఎప్పుడు ఇస్తారని అడుగుతున్నారు. ఆ చిన్నారులకు, తల్లితండ్రులకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా చంద్రబాబూ?..



మా ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఏమయ్యాయి?

- ▲ ప్రతి ఏటా రూ.15 వేల అమ్మ ఒడి ఏది?
- ▲ ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం ఎక్కడ?
- ▲ 3వ తరగతి నుంచే పిల్లలకు 'టోఫెల్' ఎక్కడ?
- ▲ 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్స్ బోధన ఎక్కడ?
- ▲ ఐఎఫ్‌పీ ప్యానల్స్‌తో ఆరో తరగతి నుంచి డిజిటల్ క్లాస్ రూములతో బోధన ఎక్కడ?
- ▲ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దే నాడు నేడు పనులు ఎక్కడ?
- ▲ రోజుకో మెనూతో గోరుముద్ద ఏది?
- ▲ 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు ఎక్కడ?
- ▲ విద్యా దీవెన, వసతి దీవెన ఎక్కడ?

■ తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తానని మాయమాటలతో గద్దెనెక్కిన చంద్రబాబు గారు.. 45 లక్షల మంది తల్లుల తరఫున అడుగుతున్నా... 84 లక్షల మంది పిల్లలకు సమాధానం చెప్పండి... మీ హామీ ఏమైంది? దగాపడ్డ లక్షల మంది తల్లులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మేం ఏటా జూన్‌లోనే ఇచ్చిన అమ్మ ఒడిని ఈ ఏడాది ఎందుకు ఎగ్గొట్టారు?



శుక్రవారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మర్యాదపూర్వకంగా కలిసిన ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు

సోషల్ మీడియా కేసులకు '111 సెక్షన్' వర్తించదు

- కోర్టులు కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశాయి
- మేజిస్ట్రేట్లు సైతం ఈ కేసుల్లో రిమాండ్ తిరస్కరిస్తున్నారు
- సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ నిర్బంధాలు
- 'బీఎన్ఎస్ 111'కేసులపై క్వాష్ పిటిషన్లు వేస్తున్నాం
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీలో చట్టాలను సైతం దుర్వినియోగం చేస్తూ సోషల్ మీడియా యాక్టివిస్టులను టీడీపీ కూటమి ప్రభుత్వం వేధిస్తోందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి మండిపడ్డారు. వీరిపై పోలీసులు బీఎన్ఎస్ 111 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారని.. నిజానికి, ఈ సెక్షన్ సోషల్ మీడియా కేసులకు వర్తించదని ఆయనన్నారు. అయినా కూడా పోలీసులు సోషల్ మీడియా యాక్టివిస్టులను భయభ్రాంతులకు గురిచేయాలనే కుట్రతోనే ఈ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే..

వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వారిపై మాత్రమే బీఎన్ఎస్ 111 సెక్షన్ ప్రయోగించాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంచేస్తున్నాయి. కానీ, ఏపీ పోలీసులు మాత్రం దీనిని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఉక్కుపాదం మోపేందుకే బీఎన్ఎస్ 111 సెక్షన్‌ను వారిపై అక్రమంగా బనాయించి వేధిస్తోంది. సాధారణంగా ఈ సెక్షన్‌ను మాదక ద్రవ్యాలు, ఆయుధాల అక్రమ సరఫరా, కిడ్నాప్, దొంగతనాలు, దోపిడీలు, బలవంతంగా ఆస్తుల స్వాధీనం.. సుపారీలు తీసుకుని హత్యలు చేయడం, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, వ్యభిచార వృత్తిలోకి బలవంతంగా దించడం వంటి నేరాలకు పాల్పడే వారిపై ప్రయోగిస్తారు. కానీ, కూటమి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అభంశుభం తెలియని సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ సెక్షన్‌ను బనాయించి వారిని ఎక్కువ కాలం జైళ్లలో నిర్బంధించే కుట్రలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియా కేసులకు బీఎన్ఎస్ 111 సెక్షన్ వర్తించదని కేరళ హైకోర్టు కూడా స్పష్టంగా చెప్పింది. ఇటీవల ఏపీ హైకోర్టులో జస్టిస్ రఘునందన్‌రావు, జస్టిస్ ఉమామహేశ్వరరావులతో కూడిన డివిజన్ బెంచ్ సైతం పప్పుల వెంకటరమణారెడ్డిపై బనాయించిన బీఎన్ఎస్ 111 సెక్షన్ చెల్లదని తమ తీర్పులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో.. ఈ సెక్షన్లు పెట్టిన అన్ని కేసుల్లోనూ క్వాష్ పిటిషన్లు వేస్తున్నాం. ఈ కేసులు బనాయిస్తున్న అధికారులపైన న్యాయస్థానాల్లో పోరాడుతాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారందర్నీ ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తేలేదు. ప్రైవేట్ కేసులు వేసి వీటితో సంబంధమున్న ప్రతి పోలీస్ అధికారిని కోర్టులో ముద్దాయిగా నిలబెడతాం.

సాక్షి బిజినెస్
శనివారం
21-12-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,176	364
78,042	23,588

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,739	△	380
డోజోన్స్	43,204	△	862
ఎఫ్‌టీఎస్ఈ 100	8,085	▽	21
డాక్స్	19,885	▽	85
షాంఘై	3,368	▽	2
నికాయ్	38,711	▽	112

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో – ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	75,377 ▽	636
బంగారం (99.5 స్వచ్ఛత)	75,075 ▽	634
వెండి (కేజీ)	85,133 △	1,094

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.65	85.67
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.90	107.72
€	యూరో	ఎస్‌బీఐ	86.96	89.55
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.55	54.89
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.91	54.09
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.46	64.87
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.78	23.32
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.27	24.03
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.59	10.77

చిప్ చిప్ హుర్రే

అడవుల సంరక్షణ కోసం చేసిన 'చిప్కో' ఉద్యమం గురించి విన్నాం... అయితే ఇప్పుడు టెక్నాలజీ రంగంలో భారత్‌ను పవర్‌హౌస్‌గా నిలిపేలా మరో 'చిప్'కో ఉద్యమం నడుస్తోంది. దేశాన్ని సెమీకండక్టర్స్ శకంలోకి నడిపించేందుకు అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటు పారిశ్రామిక అగ్రగాములు రంగంలోకి దూకడంతో ప్రపంచ దిగ్గజాలన్నీ భారత్‌లో చిప్స్ తయారీకి సై అంటున్నాయి. టాటా నుంచి అదానీ వరకు టాప్ కార్పొరేట్ గ్రూప్‌లన్నీ సెమీకండక్టర్ ఉద్యమంలో తలమునకలయ్యాయి. అమెరికా దిగ్గజం మైక్రాన్ నుండి తొలి మేక్ ఇన్ ఇండియా చిప్ కొత్త ఏడాది ఆరంభంలోనే సాక్షాత్కరించనుంది. ఈ భారీ ప్రణాళికల నేపథ్యంలో కొంగొత్త కొలువులకు ద్వారాలు తెరుచుకున్నాయి. రాబోయే రెండేళ్లలో ఏకంగా 10 లక్షల 'చిప్' జాబ్స్ సాకారమవుతాయనేది విశ్లేషకుల అంచనా!



భారత్‌ను సెమీకండక్టర్ తయారీ హబ్‌గా మార్చేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలతో విదేశీ చిప్ దిగ్గజాలు దేశంలో ల్యాండవుతున్నాయి. దేశీ కంపెనీలతో జట్టుకట్టి ఇప్పటికే భారీ పెట్టుబడులను కూడా ప్రకటించాయి. గుజరాత్ అయితే దేశంలో ప్రత్యేక సెమీకండక్టర్ పాలసీ తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ స్కీమ్ ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)లో ప్రకటించిన రూ.76,000 కోట్ల ప్రోత్సాహకాల చలవతో ఇప్పటికే రూ.1.52 లక్షల కోట్ల విలువైన 5 భారీ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాయి. దీంతో చిప్ డిజైన్ నుంచి ఫ్యాబ్రికేషన్ వరకు పలు ప్రాజెక్టుల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఈ స్కీమ్ ద్వారా కంపెనీల ప్రాజెక్ట్ వ్యయంలో కేంద్రం 50 శాతం సబ్సిడీ అందిస్తోంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నాయి. కాగా, మరో 20కి పైగా ప్రాజెక్టు ప్రతిపాదనలు కేంద్రం పరిశీలనలో ఉన్నాయి. దీంతో రెండు మూడు నెలల్లోనే మరింత భారీ స్థాయిలో ఐఎస్ఎం 2.0 స్కీమ్‌ను ప్రకటించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం దేశంలో 5,000కు పైగా కంపెనీలు సెమీకండక్టర్ పరిశ్రమ పరిధిలో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ డేటా క్లౌడ్ సంస్థ చెబుతోంది. ఇందులో ప్రత్యక్ష చిప్ తయారీ సంస్థలు, పరికర (కాంపోనెంట్) ఉత్పత్తిదారులతో పాటు ఎలక్ట్రానిక్స్ డిజైన్, తయారీ, డిస్ట్రిబ్యూషన్ డిస్‌ప్లే డిజైన్, ఎలక్ట్రానిక్స్, ఇన్నోవేషన్ ఇలా మొత్తం సమగ్ర వ్యవస్థ (ఎకో సిస్టమ్)కు సంబంధించిన కంపెనీలు పాలు పంచుకుంటున్నాయి. 2023–24లో భారత్ దిగుమతి చేసుకున్న సెమీకండక్టర్ల విలువ అక్షరాలా 33.9 బిలియన్ డాలర్లు. 2030 నాటికి ఈ డిమాండ్ 148 బిలియన్ డాలర్లకు ఎగబాకుతుందనేది నోమురా అంచనా.

ఇక చిప్ డిజైన్ జోరు..

త్వరలో కేంద్రం ప్రకటించనున్న సెమికాన్ 2.0 స్కీమ్‌లో చిప్ డిజైనింగ్‌తో పాటు సెమికండక్టర్ పరిశ్రమ ఎకో సిస్టమ్ వృద్ధికి పెద్ద పీట వేయనుంది. దిగ్గజ సంస్థలకూ ప్రాజెక్టుల వ్యయంలో సబ్సిడీ అందించే అవకాశముంది. ప్రస్తుత స్కీమ్ (రూ.1,000 కోట్లు) చిప్ డిజైన్ స్టార్టప్‌లకు మాత్రమే 50 శాతం సబ్సిడీ (రూ.15 కోట్ల పరిమితితో) అమలవుతోంది. తదుపరి స్కీమ్‌లో ఈ పరిమితి పెంపుతో పాటు బడా కంపెనీలకూ వర్తింపజేయనున్నట్లు సమాచారం. ఎల్అండ్‌టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్, క్వాల్‌కామ్, మీడియాటెక్, ఎన్ఎక్స్‌పీ వంటి కంపెనీలు రెడీగా ఉన్నాయి. అయితే, చిప్ మేధోసంపత్తి హక్కులు (ఐపీ) భారత్‌లోనే ఉండేలా షరతు విధించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

నిపుణులకు 'చిప్'కార్పెట్!

భారత్‌ను సెమీకండక్టర్ పవర్‌హౌస్‌గా తీర్చిదిద్దాలంటే నిపుణులైన సిబ్బందే కీలకం. అందుకే అటు ప్రభుత్వం, ఇటు పరిశ్రమవర్గాలు ఈ రంగంలో నైపుణ్యాలు పెంచేపనిలో పడ్డాయి. ఎన్ఎల్‌బీ సర్వీసెస్ డేటా ప్రకారం 2026 నాటికి భారత సెమీకండక్టర్ పరిశ్రమ 10 లక్షల కొత్త కొలువులను సృష్టించనుందని అంచనా. ఇందులో చిప్ ఫ్యాబ్రికేషన్‌లో 3 లక్షలు, అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్ అండ్ ప్యాకేజింగ్ (ఏటీఎంపీ)లో 2 లక్షల జాబ్స్ లభించనున్నాయి. ఇంకా చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సిస్టమ్ సర్క్యూట్స్, తయారీ సరఫరా వ్యవస్థ నిర్వహణ తదితర రంగాల్లో దండిగా ఉద్యోగాలు రానున్నట్లు ఎన్ఎల్‌బీ నివేదిక పేర్కొంది. 'సెమీకండక్టర్ పరిశ్రమకు అవసరమైన సిబ్బందిని అందించడంలో రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. భారీ డిమాండ్‌ను తీర్చాలంటే కనీసం ఏటా 5 లక్షల నిపుణులను పరిశ్రమకు అనుగుణంగా తీర్చి దిద్దాల్సి ఉంటుంది' అని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ సీఈఓ సచిన్ అలుగ్ అభిప్రాయపడ్డారు. ప్రధానంగా ప్రొక్యూర్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్, మెటీరియల్ ఇంజనీరింగ్ వంటి విభాగాల్లో ఇంజనీర్లు, ఆపరేటర్లు, టెక్నీషియన్లు, స్పెషలిస్టులకు ఫుల్ డిమాండ్ ఉంది. కొన్ని చిప్ తయారీ కంపెనీలు ఇప్పటికే నైపుణ్యాభివృద్ధి చర్యలు మొదలుపెట్టాయి. ఏఎండీ, మైక్రాన్ ఇండియా, ఎల్ఏఎం రీసెర్చ్ తదితర కంపెనీలు కొత్త నియామకాల కోసం టెక్నికల్ బూట్ క్యాంపులు, యూనివర్సిటీల్లో రీసెర్చ్ ల్యాబ్‌ల ఏర్పాటు, మెంటార్‌షిప్ అవకాశాల కల్పనకు నడుంబిగించాయి. **- సాక్షి, బిజినెస్ డెస్క్**

సెమీకండక్టర్స్ రంగంలో అపార అవకాశాలు

- ఇప్పటికే ఐఎస్ఎం–1లో రూ.76,000 కోట్ల సబ్సిడీలు
- మరికొద్ది నెలల్లోనే తొలి మేకిన్ ఇండియా చిప్
- పెట్టుబడుల జోరుతో కొంగొత్త కొలువులకు మార్గం
- 2026 నాటికి ఈ రంగంలో 10 లక్షల జాబ్స్

నిర్మాణంలో ఉన్న చిప్ ప్లాంట్లు...

మైక్రాన్ టెక్నాలజీస్
ఎక్కడ: గుజరాత్–సాణంద్
మొత్తం పెట్టుబడి: 2.75 బిలియన్ డాలర్లు.
తొలి దశ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. 2025 నాటికి ఈ ప్లాంట్ నుంచి తొలి మేక్ ఇన్ ఇండియా చిప్ కల సాకారం కానుంది.

టీటీపీఎల్–పీఎస్ఎంసీ
ఎక్కడ: గుజరాత్–ధోలేరా
మొత్తం పెట్టుబడి: రూ. 91,000 కోట్లు.
తైవాన్‌కు చెందిన చిప్ తయారీ దిగ్గజం పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కార్ప్ (పీఎస్ఎంసీ) భాగస్వామ్యంతో టాటా ఎలక్ట్రానిక్స్ (టీఈపీఎల్) ఈ సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను నిర్మిస్తోంది.

టీశాట్
ఎక్కడ: అస్సాం–మోరిగావ్
మొత్తం పెట్టుబడి: రూ.27,000 కోట్లు. టాటా సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (టీశాట్) ఈ చిప్ ఏటీఎంపీ యూనిట్‌ను నెలకొల్పుతోంది. అత్యాధునిక స్వదేశీ సెమీకండక్టర్ ప్యాకేజింగ్ టెక్నాలజీలను టీశాట్ అభివృద్ధి చేస్తోంది.


కేన్స్ సెమికాన్
ఎక్కడ: గుజరాత్–సాణంద్
మొత్తం పెట్టుబడి: రూ. 3,307 కోట్లు.
మైసూరుకు చెందిన ఈ కంపెనీ రోజుకు 63 లక్షల చిప్‌ల తయారీ సామర్థ్యం గల ఓశాట్ (అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్) యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది.

సీజీ పవర్, రెనెసాస్ ఎలక్ట్రానిక్స్, స్టార్స్ మైక్రోఎలక్ట్రానిక్స్
ఎక్కడ: గుజరాత్–సాణంద్
మొత్తం పెట్టుబడి: రూ.7,600 కోట్లు.
జపాన్‌కు చెందిన రెనెసాస్, థాయ్‌లాండ్ సంస్థ స్టార్స్ భాగస్వామ్యంతో సీజీ పవర్ ఈ చిప్ ఏటీఎంపీ యూనిట్‌ను నెలకొల్పుతోంది.

అదానీ–టవర్
(ఐఎస్ఎం ఆమోదం లభించాల్సి ఉంది)
ఎక్కడ: పన్వేల్–మహారాష్ట్ర
మొత్తం పెట్టుబడి: రూ.84,000 కోట్లు
ఇజ్రాయెల్ చిప్ తయారీ సంస్థ టవర్ సెమీకండక్టర్, అదానీ భాగస్వామ్యంతో దీన్ని నెలకొల్పనుంది.

ఇన్వెస్టర్లకు ఫ్రైడే

- ఒక్కరోజులో రూ.10 లక్షల కోట్ల సంపద హుష్..
- బేర్ గుప్పిట్లోనే దలాల్ స్ట్రీట్
- అయిదో రోజూ నష్టాలే
- సెన్సెక్స్ 1,176 పాయింట్లు క్రాష్
- నిఫ్టీ 364 పాయింట్ల పతనం



ముంబై: దేశీయ స్టాక్ సూచీలను వరుసగా అయిదో రోజూ నష్టాలు వెంటాడాయి. వచ్చే ఏడాదిలో ఆశించిన స్థాయిలో వడ్డీరేట్ల తగ్గింపు ఉండకపోవచ్చనే ఫెడ్ రిజర్వ్ సంకేతాలకు తోడు విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలతో శుక్రవారమూ కుప్పకూలాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూలతలు మరింత ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 1,176 పాయింట్లు క్షీణించి 79 వేల పాయింట్ల స్థాయి దిగువన 78,042 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 364 పాయింట్లు నష్టపోయి 23,588 వద్ద నిలిచింది. సెన్సెక్స్ ఒకటిన్నర శాతం పతనంతో ఇన్వెస్టర్లు ఒక్కరోజులోనే రూ. 10 లక్షల కోట్ల సంపద కోల్పోయారు. సెన్సెక్స్ 1,344 పాయింట్లు క్షీణించి 77,875 వద్ద, నిఫ్టీ 415 పాయింట్లు కోల్పోయి 23,537 వద్ద ఇంట్రాడే కనిష్టాలు నమోదు చేశాయి. ఆసియాలో ఇండోనేషియా మినహా అన్ని దేశాల సూచీలు 3% వరకు పతనమయ్యాయి. యూరప్ మార్కెట్లు 1% నష్టపోయాయి. డాలర్‌తో రూపాయి విలువ 9 పైసలు బలపడి 85.04 వద్ద ముగిసింది.

5 రోజుల్లో రూ.18.43 లక్షల కోట్ల నష్టం

స్టాక్ మార్కెట్ వరుసగా 5 రోజుల్లో సెన్సెక్స్ 4,091 పాయింట్ల (5%) కుదేలవడంతో రూ.18.43 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. బీఎస్ఈలోని మొత్తం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.440.99 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ఐజీఐ లిస్టింగ్ ఓకే



డైమండ్ గ్రేడింగ్ సంస్థ ఇంటర్నేషనల్ జెమలాజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐజీఐ) లిస్టింగ్ విజయవంతమైంది. ఎన్ఎస్ఈలో ఇష్యూ ధర (రూ.417)తో పోలిస్తే 21% ప్రీమియంతో రూ.504 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 26% లాభపడి రూ.525 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 13% లాభంతో రూ.471 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.20,318 కోట్లుగా నమోదైంది.

స్టాండర్డ్ గ్లాస్‌కు రూ.40 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా, కెమికల్ పరిశ్రమలకు ప్రత్యేక ఇంజనీరింగ్ పరికరాలను తయారు చేస్తున్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ తాజాగా రూ.40 కోట్ల నిధులు సమీకరించింది. ప్రీ–ఐపీవో ఫండింగ్‌లో అమన్సా ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా కంపెనీ ఈ మొత్తాన్ని అందుకుంది. స్టాండర్డ్ గ్లాస్ రూ.130 ప్రీమియంతో సహా ఒక్కో షేరుకు రూ.140 ధరలో అమన్సాకు 28.57 లక్షల ఈక్విటీ షేర్లను జారీ చేసింది. ఈ లావాదేవీ కంపెనీ ప్రీ–ఆఫర్ షేర్ క్యాపిటల్‌లో 1.55%కి సమానం. కంపెనీ ఐపీఓకి అక్టోబర్‌లో సెబీ అనుమతించింది. ఐపీవోలో భాగంగా రూ.250 కోట్ల వరకు తాజా షేర్ల జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు 1,84,44,000 ఈక్విటీ షేర్లను విక్రయిస్తారు.

వాక్‌మేట్ బ్రాండ్ అంబాసిడర్‌గా సంజూ శాంసన్



ప్రముఖ పాదరక్షల సంస్థ వాక్‌మేట్ అంబాసిడర్‌గా ఇంటర్నేషనల్ క్రికెటర్ సంజూ శాంసన్ నియమితులయ్యారు. దుబాయ్‌లో జరిగిన కొత్త ఫుట్‌వేర్ కలెక్షన్ ఆవిష్కరణ సందర్భంగా సంస్థ డైరెక్టర్ రోషన్ బాప్టిస్ట్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త యాడ్ ఫిల్మ్‌ను కూడా విడుదల చేశారు.

సాక్షి స్పోర్ట్స్



అండర్–19 ఆసియాకప్ ఫైనల్లో భారత మహిళల జట్టు

సింగపూర్: ఆసియా కప్ అండర్–19 మహిళల టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. 'సూపర్ ఫోర్' రెండో మ్యాచ్‌లో భారత జట్టు ఘన విజయం సాధించింది. శుక్రవారం జరిగిన పోరులో నిక్కీ ప్రసాద్ సారథ్యంలోని భారత జట్టు 4 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. కెప్టెన్ మానుడి ననయక్కర (33 ; 1 ఫోర్, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా యువభారత బౌలర్లలో ఆయుషి శుక్లా 4, పరుణిక సిసోడియా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 14.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (24 బంతుల్లో 32 ; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించగా... కమలిని (28), మిథిల (17 నాటౌట్) రాణించారు. ఆదివారం జరగనున్న ఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది.

జనవరి 12న బీసీసీఐ ఎస్‌జీఎమ్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లో ఇటీవల ఖాళీ అయిన కీలక పదవుల్ని భర్తీ చేసేందుకు వచ్చే నెల 12న ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని (ఎస్‌జీఎమ్) ఏర్పాటు చేసింది. బోర్డు కార్యదర్శిగా ఉన్న జై షా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా వెళ్లారు. కోశాధికారి ఆశిష్ షెలార్ మహారాష్ట్ర ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో కార్యదర్శి, కోశాధికారి పదవులు ఖాళీ అయ్యాయి. బోర్డు నియమావళి ప్రకారం ఏదైన పదవి ఖాళీ అయితే 45 రోజుల్లోగా భర్తీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎస్‌జీఎమ్ నిర్వహించాలి. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన బోర్డు ఉన్నత స్థాయి సమావేశంలో జనవరి 12న ఎస్‌జీఎమ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర క్రికెట్ సంఘాలకు సమాచారమిచ్చినట్లు బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మరో ఏడాది పదవీకాలం మిగిలున్నప్పటికీ జై షా, ఆశిష్‌లు తమ పదవులకు రాజీనామా చేశారు. అస్సామ్‌కు చెందిన బోర్డు సంయుక్త కార్యదర్శి దేవజిత్ సైకియా తాత్కాలిక కార్యదర్శిగా ఉండగా, కోశాధికారి పదవి బాధ్యతల్ని ఎవరికీ కట్టబెట్టలేదు.

అర్జున్‌కు వీసా సమస్యలు



న్యూఢిల్లీ: భారత చెస్ గ్రాండ్‌మాస్టర్, తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశి అమెరికా వెళ్లేందుకు వీసా సమస్యలు ఎదురయ్యాయి. న్యూయార్క్‌లో జరిగే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమైన అతనికి ఊహించని విధంగా వీసా సమస్య ఎదురైంది. అమెరికా వీసా జాప్యం కావడంతో ఈ నెల 26 నుంచి 31 వరకు జరిగే పోటీల్లో అతను పాల్గొనడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో అర్జున్ కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) వర్గాలను సామాజిక మాధ్యమాల ద్వారా సంప్రదించాడు. గత వారమే పాస్‌పోర్ట్‌ను వీసా స్టాంపింగ్ కోసం పంపించగా తిరిగి రాలేదని ఈ విషయమై తనకు సాయమందించాలని కోరాడు.



విజయ్‌హజారే ట్రోఫీతో డిఫెండింగ్ చాంపియన్ హరియానా

వన్డేల్లో కుర్రాళ్ల సత్తాకు పరీక్ష

- నేటి నుంచి విజయ్‌హజారే టోర్నీ
- నాగాలాండ్‌తో హైదరాబాద్, రైల్వేస్‌తో ఆంధ్ర పోరు

న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్‌లో టి20 సమరం ముగిసిన తర్వాత ఇప్పుడు వన్డే పోరుకు రంగం సిద్ధమైంది. విజయ్‌హజారే వన్డే టోర్నీలో భాగంగా నేటినుంచి దేశవ్యాప్తంగా వేర్వేరు నగరాలు వేదికలుగా మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత వన్డే జట్టులో రెగ్యులర్ సభ్యులైన ఎక్కువ మంది ఆటగాళ్లు ప్రస్తుతం ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో ఉండగా...ముున్ముందు వన్డే టీమ్‌లో స్థానం ఆశిస్తున్న ఆటగాళ్లు తమ సత్తా చాటేందుకు ఇది సరైన అవకాశం కానుంది. ఈ ఆటగాళ్ల కారణంగా టోర్నీపై ఆసక్తి పెరగడంతో పాటు తీవ్రమైన పోటీ కారణంగా మ్యాచ్‌లు హోరాహోరీగా సాగే అవకాశం కూడా ఉంది. బరోడా తరపున ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా బరిలోకి దిగుతున్నాడు. టి20లో ఇప్పటికే తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పలువురు పేస్ బౌలర్లు వన్డే టీమ్‌లో తమ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ (పంజాబ్), అవేశ్ ఖాన్ (మధ్యప్రదేశ్), ఖలీల్ అహ్మద్ (రాజస్తాన్), ముకేశ్ కుమార్ (బెంగాల్), యశ్ దయాళ్ (యూపీ) తమ బౌలింగ్‌కు పదును పెడుతున్నారు. స్పిన్నర్లలో వరుణ్ చక్రవర్తి (తమిళనాడు), కుల్దీప్ యాదవ్ (యూపీ), రవి బిష్ణోయ్ (రాజస్తాన్) తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. బ్యాటర్లలో అందరి దృష్టి శ్రేయస్ అయ్యర్‌పై ఉంది. వన్డే టీమ్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్న అతను తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ కూడా టి20 మెరుపులను దాటి వన్డే టీమ్‌లో రెగ్యులర్‌గా మారే క్రమంలో ఈ టోర్నీ తగిన వేదిక కానుంది. భారత ఆటగాడు రింకూ సింగ్ ఉత్తర ప్రదేశ్ కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకుంటున్నాడు. సీనియర్ స్థాయిలో అతను తొలిసారి సారథిగా వ్యవహరించనుండటం విశేషం. భారత ఆటగాడు, ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ అయిన సంజు సామ్సన్‌కు కేరళ జట్టులో చోటు లభించలేదు. తాము నిర్వహించిన శిక్షణా శిబిరంలో పాల్గొన్న ఆటగాళ్లనుంచే జట్టును ఎంపిక చేయాలని కేరళ క్రికెట్ సంఘం నిర్ణయం తీసుకోవడంతో సామ్సన్ పేరును పరిశీలించనే లేదు. కర్నాటక టీమ్ కూడా సీనియర్ బ్యాటర్ మనీశ్ పాండేకు ఉద్వాసన పలికింది. ఇక కొత్త ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిన సమయం వచ్చిందని కర్నాటక అసోసియేషన్ స్పష్టం చేసింది. ముస్తాక్ అలీ ట్రోఫీలో 5 మ్యాచ్‌లలో కలిపి 117 పరుగులే చేసిన పాండే ప్రభావం చూపలేకపోయాడు. మరో వైపు ముస్తాక్ అలీ టి20 టోర్నీలో రాణించిన బెంగాల్ పేసర్, భారత సీనియర్ బౌలర్ మొహమ్మద్ షమీను వన్డే టీమ్‌లోకి కూడా తీసుకున్నారు. అయితే నేడు ఉప్పల్ స్టేడియం వేదికగా ఢిల్లీతో జరిగే మ్యాచ్‌లో మాత్రం షమీ ఆడకుండా విశ్రాంతి తీసుకుంటాడని బెంగాల్ క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగే మరో మ్యాచ్‌లో త్రిపురతో బరోడా తలపడుతుంది. అహ్మదాబాద్‌లో జరిగే గ్రూప్ 'సి' మ్యాచ్‌లో నాగాలాండ్‌తో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ తలపడుతుంది. గ్రూప్ 'బి'లో భాగంగా ముంబైలో జరిగే మ్యాచ్‌లో రైల్వేస్‌ను శ్రీకర్ భరత్ సారథ్యంలోని ఆంధ్ర జట్టు ఎదుర్కొంటుంది.



తిలక్ వర్మ



కేఎస్ భరత్

ఆసీస్ జట్టులో కొన్‌స్టాస్‌కు చోటు

- చివరి రెండు టెస్టులకు జట్టు ఎంపిక
- ఓపెనర్ మెక్‌స్వీనీపై వేటు



కొన్‌స్టాస్

మెల్‌బోర్న్: భారత్‌తో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో చివరి రెండు టెస్టులకు ఆస్ట్రేలియా జట్టులో ఒక మార్పు చేసింది. టీనేజ్ సంచలనం స్యామ్ కొన్‌స్టాస్‌ను జాతీయ టెస్టు జట్టులోకి ఎంపిక చేసింది. మూడు టెస్టుల్లోనూ విఫలమైన టాపార్డర్ బ్యాటర్ మెక్‌స్వీనీపై కంగారూ సెలక్షన్ కమిటీ వేటు వేసింది. 25 ఏళ్ల ఓపెనర్ వరుస ఇన్నింగ్స్‌ల్లో 10, 0, 39, 10 నాటౌట్, 9, 4 పరుగులే చేసి నిరాశపరిచాడు. దీంతో అతని స్థానంలో 19 ఏళ్ల బ్యాటర్ కొన్‌స్టాస్‌ను తీసుకున్నారు. ఒకవేళ 26 నుంచి జరిగే 'బాక్సింగ్ టెస్టు' (నాలుగో మ్యాచ్)లో తుది జట్టు తరపున కొత్త కుర్రాడు బరిలోకి దిగితే 70 ఏళ్ల తర్వాత అంతర్జాతీయ టెస్టు ఆడే అవకాశం దక్కించుకున్న ఆసీస్ టీనేజ్ బ్యాటర్‌గా కొన్‌స్టాస్ ఘనత వహిస్తాడు. 1953లో ఇయాన్ క్రెయిగ్ 17 ఏళ్ల వయసులో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ తరపున స్పెషలిస్ట్ బ్యాటర్‌గా అరంగేట్రం చేశాడు. అయితే 2011లో ప్యాట్ కమిన్స్ (ప్రస్తుత కెప్టెన్) 18 ఏళ్ల వయసులో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేసినప్పటికీ అతను స్పెషలిస్టు పేసర్! ఆస్ట్రేలియా దేశవాళీ టోర్నీలతో పాటు ఆసీస్ 'ఎ', బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లలో కొన్‌స్టాస్ నిలకడగా రాణిస్తున్నాడు. భారత్ 'ఎ'తో జరిగిన అనధికారిక టెస్టులో అజేయ అర్ధసెంచరీ (73 నాటౌట్) చేసిన కొన్‌స్టాస్... డేనైట్ టెస్టుకు ముందు భారత్‌తో జరిగిన సన్నాహక పింక్ బాల్ (రెండు రోజుల మ్యాచ్) పోరులో ప్రైమ్ మినిస్టర్ ఎలెవన్ తరపున సెంచరీ (107) సాధించాడు. ప్రస్తుతం బీబీఎల్‌లో సిడ్నీ థండర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కొన్‌స్టాస్ శనివారం సిడ్నీ సిక్సర్‌తో మ్యాచ్ పూర్తయ్యాక ఆస్ట్రేలియా టెస్టు జట్టుతో కలుస్తాడు. భారత్, ఆసీస్‌ల మధ్య గురువారం నుంచి నాలుగో టెస్టు జరుగుతుంది.

ఆస్ట్రేలియా జట్టు: ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), ట్రవిస్ హెడ్, ఉస్మాన్ ఖ్వాజా, స్యామ్ కొన్‌స్టాస్, ఇంగ్లిస్, లబుషేన్, స్మిత్, అలెక్స్ కేరి, మార్ష్, సీన్ అబాట్, బోలండ్, లయన్, రిచర్డ్‌సన్, స్టార్క్, వెబ్‌స్టెర్.

చాంపియన్స్ ధీరజ్, దీపికా కుమారి



ధీరజ్



దీపికా

జంషెడ్‌పూర్: ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ జాతీయ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చినా... పతకం సాధించలేకపోయిన ఈ ఆంధ్ర ఆర్చర్.. జాతీయ టోర్నీలో పెద్దగా పోటీ ఎదుర్కోకుండానే స్వర్ణం గెలుచుకున్నాడు. శుక్రవారం జరిగిన రికర్వ్ సింగిల్స్ ఫైనల్లో ధీరజ్ 6–2తో హరియాణాకు చెందిన దివ్యాన్ష్ చౌధరిపై విజయం సాధించాడు. తొలి రెండు సెట్‌లలో వెనుకబడిన ధీరజ్ ఆ తర్వాత పుంజుకొని అదరగొట్టాడు. ఉత్తరాఖండ్‌కు చెందిన అతుల్ వర్మ కాంస్యం గెలుచుకున్నాడు. మహిళల విభాగంలో నాలుగుసార్లు ఒలింపియన్ దీపికా కుమారి చాంపియన్‌గా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో తన సహచర ఆర్చర్ అంకిత భకత్‌పై విజయంతో దీపికా కుమారి పసిడి పతకం కైవసం చేసుకుంది. శుక్రవారం ఫైనల్లో దీపిక 6–2తో అంకితపై గెలిచింది. సిమ్రన్‌జీత్ కౌర్‌కు కాంస్యం దక్కింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ దీపిక స్వర్ణం గెలిచింది. తన భర్త అతాను దాస్‌తో కలిసి పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ) జట్టు తరపున బరిలోకి దిగింది. ఫైనల్లో పీఎస్‌పీబీ 6–2తో పంజాబ్ టీమ్‌పై విజయం సాధించింది.



జ్యోష్న 'రికార్డు' పసిడి

ఆసియా యూత్ వెయిట్ లిఫ్టింగ్

దోహా: భారత యువ వెయిట్ లిఫ్టర్ జ్యోష్న సబర్ ఆసియా యూత్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకంతో మెరిసింది. ఖతర్ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఈ చాంపియన్‌షిప్‌లో జ్యోష్న 40 కేజీల విభాగంలో రికార్డు బరువు ఎత్తి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. జ్యోష్న 135 కేజీలు ఎత్తి ఆసియా రికార్డు బద్దలు కొట్టడంతో పాటు... వరల్డ్ రికార్డుకు ఒక కేజీ దూరంలో నిలిచింది. స్నాచ్‌లో 60 కేజీలు ఎత్తిన జ్యోష్న, క్లీన్ అండ్ జెర్క్‌లో 75 కిలోలు ఎత్తింది. 45 కేజీల విభాగంలో పాయల్ 155 కేజీల (70 స్నాచ్+85 క్లీన్ అండ్ జెర్క్) బరువెత్తి కాంస్య పతకం కైవసం చేసుకుంది. బాలుర 49 కేజీల విభాగంలో బాబులాల్ 197 కేజీల (88 స్నాచ్+109 క్లీన్ అండ్ జెర్క్) బరువెత్తి కాంస్యం గెలుచుకున్నాడు. 45 కేజీల బాలికల విభాగంలో ఆకాంక్ష వ్యవహారె (151 కేజీలు) ఐదో స్థానంలో నిలిచింది.

సురుచికి మూడు స్వర్ణాలు



న్యూఢిల్లీ: హరియానా యువ షూటర్ సురుచి ఫొగాట్ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 'హ్యాట్రిక్' స్వర్ణాలు సాధించింది. వెటరన్ ఆర్మీ అధికారి కుమార్తె అయిన సురుచి 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఈవెంట్లో పసిడి పతకాలపై గురిపెట్టి సఫలమైంది. సీనియర్ మహిళలు, జూనియర్, యూత్ ఫైనల్స్‌లో ఆమె విజేతగా నిలిచింది. ఎనిమిది మంది ఫైనల్స్‌కు అర్హత సాధించిన సీనియర్ మహిళల ఫైనల్లో సురుచి 243.1 స్కోరుతో అగ్ర స్థానంలో నిలిచింది. తన రాష్ట్రానికే చెందిన రిథమ్ సంగ్వాన్ (237.4) రజతంతో సరిపెట్టుకుంది. జూనియర్ మహిళల ఫైనల్లో చండీగఢ్‌కు చెందిన సైనియమ్ (241.7) గట్టి పోటీ ఇచ్చినప్పటికీ సురుచి 245.1 పాయింట్లతో రెండో బంగారు పతకం సాధించింది. యూత్ మహిళల ఫైనల్లో ఆమె 245.5 స్కోరుతో మూడో పసిడి పతకాన్ని చేజిక్కించుకుంది. ఉత్తరప్రదేశ్ షూటర్ సంస్కృతి బానా (239.2)కు రజతం లభించింది. పలక్‌కు కాంస్యం దక్కింది.

యుద్ధ పద్ధతులకు టెక్నాలజీ సవాల్!

- జాతీయ భద్రతపైనా సాంకేతికత అభివృద్ధి ప్రభావం
- సికింద్రాబాద్ సీడీఎంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- సీడీఎంకు ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్స్ కలర్స్ అవార్డు ప్రదానం



సాక్షి, హైదరాబాద్: సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి జాతీయ భద్రతపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాలు యుద్ధ పద్ధతులను సవాల్ చేస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధకు భారతదేశం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. భారత త్రివిధ దళ అధికారులకు అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నందుకు గుర్తింపుగా సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)కు ప్రెసిడెంట్స్ కలర్స్ అవార్డు దక్కింది. శుక్రవారం సీడీఎంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డును కాలేజీ యాజమాన్యానికి అందించారు. ఈ సందర్భంగా 'ప్రత్యేక దినోత్సవం కవర్', 'స్మారక పతకం', 'పెరల్స్ ఆఫ్ ఏన్షియంట్ ఇండియన్ విజ్డమ్'సంకలనాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ.. భద్రతా సవాళ్లపై ప్రపంచ దృక్పథాన్ని పెంపొందిస్తూ.. పౌర విద్యా సంస్థలు, అంతర్జాతీయ రక్షణ సంస్థలతో సీడీఎం వ్యూహాత్మక సంబంధాలను అభివృద్ధి చేస్తోందని ప్రశంసించారు. స్నేహపూర్వక దేశాల సైనిక అధికారులతోనూ రాష్ట్రపతి మాట్లాడారు. సీడీఎంలోని మహిళా అధికారులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీడీఎం కమాండెంట్ మేజర్ జనరల్ హర్ష చిబ్బార్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఈ నీళ్లు.. చాలా ఖరీదు గురూ!


నీరు.. మానవాళికి తప్పనిసరిగా అవసరమైన వనరు. ఒకప్పుడు ఎక్కడ పడితే అక్కడ ఉచితంగా లభ్యమయ్యే నీటిని ఇప్పుడు డబ్బులు పెట్టి కొనుక్కుంటున్నాం. ఒక లీటరు వాటర్ బాటిల్ ఖరీదు సాధారణంగా రూ.20 ఉంటుంది. కంపెనీ, ఇతరత్రా అంశాలను బట్టి రూ.2వేల బాటిల్ కూడా ఉంది. కానీ జపాన్‌కు చెందిన ఫిల్లికో అనే కంపెనీ ఇంతకుమించిన ధరకు మంచినీళ్లను అమ్ముతోంది. ఆ కంపెనీ వాటర్ బాటిళ్ల ధర రూ.84వేల నుంచి మొదలై ఏకంగా రూ.8 లక్షల వరకు ఉంది. ధర చూస్తే గుండె గుభేల్ మనడం ఎంత నిజమో.. ఆ బాటిల్ చూసిన తర్వాత వావ్ అని అనకుండా ఉండలేకపోవడం కూడా అంతే నిజం. ఆ బాటిల్ అందం అలాంటిది మరి. ఇంతకీ ఆ బాటిల్ నీళ్లకు అంత రేటెందుకు? అవేమైనా పైనుంచి దిగొచ్చాయా అనే కదా మీ సందేహం? ఔను.. జపాన్‌లో అత్యంత స్వచ్ఛమైన ప్రదేశంగా భావించే కోబ్‌లోని రొకా నేషనల్ పార్క్‌లో ఉన్న నునోబికి ఫాల్స్ నుంచి రాతిశిలల ద్వారా సహజసిద్ధంగా శుద్ధి అయి కిందకు వచ్చిన నీళ్లవి. నునోబికి ప్రాంతం అటు పరిశ్రమలకు, ఇటు వ్యవసాయానికి చాలా దూరంగా ఉండటం వల్ల అక్కడ ఎలాంటి కాలుష్యం ఉండదు. అందువల్ల అక్కడ నీళ్లు కూడా చాలా స్వచ్ఛంగా ఉంటాయి. పైగా రాతిశిలల్లో నుంచి ఫిల్టర్ కావడం వల్ల మరింత స్వచ్ఛత కలిగి ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆ నీటిలోని సహజసిద్ధమైన ఖనిజ లవణాలు, స్వచ్ఛత పోకుండా కనీస ప్రాసెసింగ్ పద్ధతులను ఉపయోగించి ప్యాక్ చేస్తారు. ఎంత కష్టపడి నాణ్యమైన నీటిని తీసుకొచ్చి జాగ్రత్తగా ప్యాక్ చేసినా.. రంగు, రుచి, వాసన లేని నీటికి మరీ ఇంత రేటేంటి బాస్ అంటారా? ఇదే డౌట్ ఫిల్లికో కంపెనీ యజమాని క్రిస్టియన్ డయోర్‌కీ వచ్చింది. మనిషికి నిత్యావసరమైన నీటిని లగ్జరీ వస్తువుగా అధిక ధరకు అమ్మడం ఎలా అని ఆలోచించారు.



దేవతా రెక్కలు.. కిరీటాలు..

➤ ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేయడం ద్వారా మార్కెటింగ్ చేయడం సులభం అని డియోర్ భావించారు. దానికి తగినట్టుగా తమ బాటిల్ డిజైన్‌ను వినూత్నంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. శాటిన్ గాజుతో కంటికి ఇంపుగా కనిపించేలా బాటిల్ డిజైన్ చేయించారు. తాము విక్రయించే ధరకు అది చాలదనే భావనతో దానికి అదనపు సొబగులద్దారు. బాటిల్ మూతలను రాజు, రాణి కిరీటాలను పోలి ఉండేలా రూపొందించారు. దేవతలకు రెక్కలు ఉన్నట్టుగా బాటిల్‌కు రెండు రెక్కలు కూడా జోడించారు. అవసరమైన చోట వెండి పూత పూయించారు. లగ్జరీ బ్రాండ్ స్ఫటికాలను ఉత్పత్తి చేసే స్వరోవ్స్కీ స్ఫటికాలను బాటిల్‌పై అమర్చారు. వెరసి.. చూసిన తర్వాత చూపు తిప్పుకోలేనంత అందమైన కళాఖండంగా తీర్చిదిద్దారు. దీనికి ఫిల్లికో జ్యువెలర్ వాటర్ అని పేరు పెట్టి.. ఇది సార్ మా బ్రాండ్ అంటూ తొలుత తమ వీఐపీ కస్టమర్లకు పరిచయం చేశారు. వారి నుంచి అద్భుత స్పందన వచ్చింది. అనంతరం ఫిల్లికో కంపెనీ 2008లో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు స్పాన్సర్‌గా వ్యవహరించడంతో ఈ బ్రాండ్ పేరు ఒక్కసారిగా మార్మోగిపోయింది. అంతే అక్కడ నుంచి వెనుతిరిగి చూడలేదు. 2005లో ప్రారంభమైన ఈ కంపెనీ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోంది. అయితే, బాటిళ్ల డిజైన్ ఎప్పటికప్పుడు కొత్తగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీటిని చేతితోనే తయారుచేస్తారు. అందువల్ల నెలకు 5వేల బాటిళ్లను మించి ఉత్పత్తి చేయరు. ఇది కూడా ఈ బ్రాండ్ డిమాండ్ కొనసాగడానికి మరో కారణం. ప్రస్తుతం ఫిల్లికో జ్యువెలరీ వాటర్ రెండో తరం నడుస్తోంది. ఈ బాటిల్ ప్రారంభ ధర వెయ్యి డాలర్లు. (దాదాపు రూ.84 వేలు). ఒక్కోసారి లిమిటెడ్ ఎడిషన్ పేరుతో మరింత వినూత్నమైన బాటిళ్లను ఉత్పత్తి చేసి విక్రయిస్తుంటారు. వాటి ధర ఏకంగా రూ.8.40 లక్షల వరకు కూడా ఉంటుంది. వాస్తవానికి ఆ బాటిల్‌లో ఉన్న నీళ్లను కాదు.. ఆ నీళ్లున్న బాటిల్‌ను ఇంత ధర పెట్టి కొనాలన్న మాట. అయితే, దాహం వేసిన ప్రతిసారీ ఈ నీటిని తాగితే కష్టమే కదా? కేవలం తమ స్టేటస్ సింబల్ చాటుకోవాల్సిన సందర్భాల్లో ఓ రెండు గుటకలు వేయక తప్పదు మరి. అసలే బ్రాండ్ వాటర్.. పైగా లిమిటెడ్ ఎడిషన్స్. ఆ మాత్రం ముందు జాగ్రత్త తప్పనిసరి.. కాదంటారా?

- సాక్షి సెంట్రల్ డెస్క్



బాహుబలి బాలుడు..!

5.25 కిలోల బిడ్డకు జన్మనిచ్చిన మహిళ



■ భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు క్లిష్టమైన కాన్పును సుసాధ్యం చేశారు. ఈ కాన్పులో మహిళ 5.25 కిలోల బాలుడికి జన్మనివ్వడం విశేషం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన మడకం సన్న భార్య నందినికి నెలలు నిండటంతో.. గురువారం ఉదయం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి వైద్యులు సాత్విక, మల్లేశ్ సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో రాత్రి శస్త్రచికిత్స చేయగా నందిని 5.25 కిలోల బరువైన మగశిశువుకు జన్మనిచ్చింది. ఆమెకు ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉండగా.. ఆ రెండూ సాధారణ ప్రసవాలే జరిగాయి. ఈసారి కేసులో క్లిష్టత దృష్ట్యా తప్పనిసరిగా సిజేరియన్ చేయాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. కాగా, తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వెల్లడించారు.

- భద్రాచలం అర్బన్



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
శనివారం | 21 | 12 | 2024




భారత వాలీబాల్ జట్టులో కన్నా వెంకటనారాయణ (ఫైల్)



ఇనుగుర్తి గ్రామం

వాలీబాల్ @ ఇనుగుర్తి

బంతి తిప్పిన జీవితాలెన్నో..

- 1971లో మొదలై.. నేటి వరకు వాలీబాల్ క్రీడలో రాణింపు
- రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు

కేసముద్రం: వందల మంది వాలీబాల్ క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి అందించింది ఇనుగుర్తి. మహబూబాబాద్ జిల్లాలోని ఇనుగుర్తి వాలీబాల్ క్రీడకు కేరాఫ్‌గా నిలుస్తోంది. 1971లో గ్రామంలో వాలీబాల్ ఆట మొదలైంది. గ్రామానికి చెందిన సట్ల భిక్షపతి, మల్లారెడ్డి, విశ్వరూపాచారి, చంద్రయ్య, సట్ల సోమయ్య, ఓరుగంటి శంకరయ్యతోపాటు పలువురికి ఏదో ఒక ఆట నేర్చుకోవాలనే తపన విద్యార్థి దశలోనే కలిగింది. అప్పటికే జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కొందరు క్రీడాకారులు బ్యాడ్మింటన్, కబడ్డీ ఇతర క్రీడలు ఆడుతుండగా, అందుకు విభిన్నంగా వాలీబాల్ క్రీడను నేర్చుకోవాలనే మక్కువతో బంతి పట్టారు. వాలీబాల్ గ్రౌండ్ ఏర్పాటు చేసుకొని కాళ్లకు కనీసం చెప్పులు లేకుండానే బంతి పట్టి, ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఈ క్రమంలో అదే పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కందునూరి కొమురయ్య వాలీబాల్ క్రీడపై ఆసక్తి చూపుతున్న ఆ విద్యార్థులను చూసి మురిసిపోయారు. క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించారు. ఆ తర్వాత వారు వాలీబాల్ టీంగా ఏర్పడి, 1976లో ప్రస్తుత జనగామ జిల్లా దేవరుప్పలలో జరిగిన క్రిష్ణాసాగర్ మెమోరియల్ టోర్నమెంట్‌లో(గ్రామీణ క్రీడోత్సవాలు) వరంగల్, నల్లగొండ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఆ తర్వాత ఎంతోమంది వాలీబాల్ క్రీడవైపు అడుగులు వేశారు.



ఇనుగుర్తి జెడ్పీ హైస్కూల్ మైదానంలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

స్పోర్ట్స్ కోటాలో 60 మందికిపైగా ఉద్యోగాలు..

వాలీబాల్ క్రీడపై ఆసక్తితో గ్రామానికి చెందిన ఎంతోమంది యువతీ యువకులు రాష్ట్రస్థాయి, యూనివర్సిటీ స్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారు. చదువుతోపాటు, వాలీబాల్ క్రీడలో రాణించడంతో గ్రామానికి చెందిన సుమారు 60 మంది స్పోర్ట్స్ కోటాలో ఆర్టీసీ, పోలీస్, ఆర్మీ, పోస్టల్, రైల్వేశాఖ, ఉపాధ్యాయ, పీఈటీ, ఎల్ఐసీ వంటి ఉద్యోగాలను సాధించి, జీవితంలో స్థిరపడ్డారు. ఇలా బంతి వారి జీవితాలను ఉన్నతస్థాయి వైపునకు మలుపు తిప్పింది.

ఆద్యుడు కొమురయ్య సారే..

ఇనుగుర్తి పాఠశాలలో పనిచేసిన కందునూరి కొమురయ్య 1973లో కొంతమంది విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలని నిర్ణయించుకున్నాడు. ప్రతీరోజు వారికి వాలీబాల్ క్రీడలో శిక్షణ ఇస్తూ, మెళకువలు నేర్పించారు. పాఠశాల స్థాయి పోటీలను నిర్వహించి, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించారు. ప్రతీరోజు పాఠశాల ముగిసిన తర్వాత ప్రాక్టీస్ చేయించారు. రిటైర్డ్ అయ్యాక కూడా మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే కోరికతో యథావిధిగా శిక్షణ ఇస్తూ వచ్చాడు. ఆ విధంగా ఎంతో మంది క్రీడాకారులను తయారు చేసి, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పోటీల్లో ఆడించారు. 2012లో కందునూరి కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సేవలను గుర్తిస్తూ ఇనుగుర్తి గ్రామం నడిబొడ్డున ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఏటా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొమురయ్యసార్ తర్వాత కోచ్‌గా సట్ల భిక్షం వ్యవహరిస్తూ, ఎంతో మంది క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ వచ్చాడు.

భారత్ కెప్టెన్‌గా కన్న వెంకటనారాయణ

ఇనుగుర్తిలో ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన కన్నా వెంకటనారాయణ కొమురయ్య సార్ ప్రోత్సాహంతో వాలీబాల్ క్రీడలో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. భారత జట్టులో 1986 నుంచి 1996 వరకు పదేళ్లపాటు 20 అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, ఎన్నో పతకాలను సాధించారు. కన్నా వెంకటనారాయణ ప్రతిభను గుర్తించి 1993–94లో భారత జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించారు. దశాబ్దకాలంగా భారతజట్టులో ఆడుతూ, కెప్టెన్‌గా వ్యవహరిస్తూ ఎన్నో విజయాలను సాధించారు. దేశంలో మన రాష్ట్రానికి, ఇనుగుర్తి గ్రామానికి వాలీబాల్ క్రీడలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆయన ఆర్టీసీలో స్పోర్ట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.



విద్యార్థి దశ నుంచే ప్రోత్సహించాలి

విద్యార్థి దశలోనే వాలీబాల్ ఆటపై ఆసక్తి కలిగింది. కొమురయ్యసార్ ప్రోత్సాహంతోనే వాలీబాల్ క్రీడలో ప్రతిభ చాటి అంతర్జాతీయస్థాయిలో రాణించా. ప్రతి పాఠశాలలో విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు, క్రీడల్లో పిల్లలకు తగిన ప్రోత్సాహం అందించాలి. ప్రతీజిల్లాలో స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటు చేస్తే విద్యార్థులు ఆటల్లో రాణించేందుకు దోహదపడుతుంది. క్రీడల్లో ప్రతిభ కనబర్చేవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో కోటా అమలు చేయడం వల్ల ఆటలపై ఆసక్తి పెరుగుతుంది.

– కన్నా వెంకటనారాయణ, భారత్ వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్

మొదటిసారి బంతి పట్టాం...

నేను విద్యార్థి దశలో ఉన్నప్పుడే వాలీబాల్ ఆటంటే ఇష్టం పెరిగింది. నాతోపాటు మరికొంతమంది మిత్రులం కలిసి 1971లో వాలీబాల్ ఆట మొదలు పెట్టాం. అప్పటి మా గురువు కందునూరి కొమురయ్య సార్ శిక్షణ ఇస్తూ, ప్రోత్సహించేవారు. ఆయన ప్రోత్సాహంతో తాము వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబరుస్తూ వచ్చాం. అప్పట్లోనే నాకు ఉద్యోగ అవకాశాలు వచ్చినా, కొన్ని కారణాల వల్ల వెళ్లలేకపోయా. కొమురయ్యసార్ తర్వాత నేను ఎంతోమంది క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ, ఎంతో మందిని జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో ఆడించేందుకు తీసుకెళ్లా. ప్రస్తుతం నా ఆరోగ్యం క్షీణించడంతో వైద్యఖర్చుల నిమిత్తం ఉన్న ఇళ్లు అమ్ముకున్న. ప్రస్తుతం ఓ అద్దె ఇంట్లో ఉంటున్న. ఇంటి నుంచి బయటకు వెళ్లలేకపోతున్న. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న.. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి.



– సట్ల భిక్షం,
వాలీబాల్ సీనియర్ కోచ్, ఇనుగుర్తి



ఇనుగుర్తిలో కందునూరి కొమురయ్య సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన శిష్యులు

వాలీబాల్ క్రీడతో ఎంతోమంది స్థిరపడ్డారు

ఇనుగుర్తిలో క్రీడలంటే అంతగా తెలియని రోజుల్లో వాలీబాల్ క్రీడ మొదలైంది. నాకు వాలీబాల్ అంటే ఎంతో ఇష్టం. నాకు యూనివర్సిటీ స్థాయిలో ఆడే అవకాశం వచ్చింది. మా గ్రామం నుంచి ఎంతోమంది వాలీబాల్ క్రీడలో ఉన్నతస్థాయికి ఎదిగారు. వారిని ఆదర్శంగా తీసుకొని చాలా మంది వాలీబాల్ క్రీడను ఎంచుకున్నారు.



– కన్నా సాంబయ్య, రిటైర్డ్ టీచర్, ఇనుగుర్తి

రాష్ట్రంలో 956 ఈవీ చార్జింగ్ స్టేషన్లు

రాజ్యసభలో మంత్రి భూపతిరాజు వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తోందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ కారణంగా దేశంలో ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాల సంఖ్య పెరిగిందని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకున్న వాహనదారులకు చార్జింగ్ విషయంలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్లు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణలో ప్రస్తుతం 956 ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయని రాజ్యసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. పర్యావరణ పరిరక్షణకోసం భారీ పరిశ్రమల శాఖ 'ఎలక్ట్రిక్ డ్రైవ్ రివల్యూషన్ ఇన్ ఇన్నోవేటివ్ వెహికల్ ఎన్‌హాన్స్‌మెంట్'పథకాన్ని నోటిఫై చేసిందన్నారు. ఈ బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లను పబ్లిక్ చార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటు కోసం ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా

టీ–కాంగ్రెస్ ఎంపీల నిరసన

కేంద్ర హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ టీ–కాంగ్రెస్ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం విజయ్‌చౌక్ నుంచి పార్లమెంట్‌కు కాంగ్రెస్ పార్టీ నిరసన ర్యాలీ చేపట్టింది. ఈ ఆందోళనలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకతో కలిసి తెలంగాణ ఎంపీలు మల్లు రవి, గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. జై భీమ్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీ–కాంగ్రెస్ ఎంపీలు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగాన్ని మార్చేస్తామనే బీజేపీ ఆలోచనకు అమిత్ షా వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయని ఆరోపించారు. తాను చేసిన వ్యాఖ్యలకు దళిత సమాజానికి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు.

ఎస్టీ సంక్షేమంపై నివేదికివ్వండి

- మంత్రి సీతక్కకు రాష్ట్రపతి ఆదేశం
- ద్రౌపది ముర్ముతో ఎస్టీ ఎమ్మెల్యేల భేటీ

సాక్షి, హైదరాబాద్: కేంద్రం నుంచి ఎస్టీల సంక్షేమానికి వచ్చిన నిధులు, వాటి వ్యయం, ఇంకా ఎన్ని నిధులు అవసరమన్న అంశంపై ఎస్టీ ఎమ్మెల్యేలతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి కేంద్రానికి నివేదిక అందజేయాలని మంత్రి సీతక్కను.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశించారు. బొల్లారం రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం ద్రౌపది ముర్ముతో.. మంత్రి సీతక్క ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా ఎస్టీ ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో ఎస్టీల అభ్యున్నతి కోసం కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు వచ్చేలా చొరవ చూపాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గిరిజన, ఆదివాసీ ప్రజల సంక్షేమంపై రాష్ట్రపతితో 15 నిమిషాల పాటు ఎమ్మెల్యేలు చర్చించారు. రాష్ట్రంలో ఎస్టీల పరిస్థితి, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో గిరిజనుల అవసరాలను బట్టి కేంద్రం నుంచి అదనంగా నిధులు మంజూరు చేయించేందుకు చొరవ తీసుకుంటానని రాష్ట్రపతి హామీ ఇచ్చినందుకు ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినందుకు మంత్రి సీతక్కను రాష్ట్రపతి అభినందించారు.

తెలంగాణలో 28,200 మంది మాజీ సైనికులు

లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో వెల్లడించిన రక్షణ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో 28,200 మంది మాజీ సైనికులు ఉన్నారని రక్షణ శాఖ తెలిపింది. వీరందరికీ కేంద్ర ప్రభుత్వం 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్'(ఓఆర్‌ఓపీ) కింద పెన్షన్ అందిస్తున్నట్లు లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్ వెల్లడించారు. పెన్షన్‌తో పాటు వివిధ రీ–సెటిల్‌మెంట్, స్కిల్‌డెవలప్‌మెంట్ ట్రైనియింగ్ కోర్సులు, స్వయం ఉపాధి పథకాలను మాజీ సైనికులకు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఆర్‌ఓపీ కింద పెన్షన్ సవరణ జరుగుతుందని మంత్రి తెలిపారు.

దాడిపై టీ–బీజేపీ ఎంపీల నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీలపై గురువారం జరిగిన దాడిని ఖండిస్తూ ఆ పార్టీకి చెందిన తెలంగాణ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. దాడికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంటు ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, గొడెం నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు ఆందోళన చేపట్టారు. రాహుల్ గాంధీ గూండాగిరీ నడవదని, పార్లమెంటును అవమానిస్తే దేశం సహించబోదని.. హిందీలో రాసిన ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. 'రాహుల్ గాంధీ సిగ్గు పడు'.. అంటూ ఎంపీలు నినాదాలు చేశారు.



అసెంబ్లీ మీడియా పాయింట్

హామీలను మరిపించడానికే కేటీఆర్‌పై తప్పుడు కేసు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను మరిపించడానికే కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. తప్పుడు కేసులు పెట్టేందుకు విచారణపై విచారణలు చేయించారని, అయినా కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదని విమర్శించారు. కేటీఆర్‌పై ఒక చిల్లర కేసు పెట్టారని, తప్పు చేసినట్లయితే శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఫార్ములా– ఈ కార్ రేస్‌పై సమాధానం చెప్పడానికి కేటీఆర్ సిద్ధంగా ఉన్నారని, చర్చ పెట్టకుండా ఎందుకు పారిపోతున్నారు..దమ్ము లేదా అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, మహిళా సమస్యలపై అసెంబ్లీలో చర్చనే లేదని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని, బడేభాయ్, చోటేభాయ్ ఒకే లైన్‌లో ఉన్నారని ఆరోపించారు.

– బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

చర్చ లేకుండా తప్పించుకుంటే ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం

ఫార్ములా–ఈ కార్ రేస్‌పై అసెంబ్లీలో చర్చ లేకుండా తప్పించుకుంటే ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అల్టిమేటం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక తప్పుడు కేసులు పెడుతుందన్నారు. ముఖ్యమంత్రి కుటుంబం చేస్తున్న అవినీతి బయటపడకుండా ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కుట్రతో కేసులు పెడితే నడవదని, ఫార్ములా–ఈ కార్ రేస్‌పై తప్పక అసెంబ్లీలో చర్చ పెట్టాలని స్పీకర్‌ను డిమాండ్ చేస్తున్నామన్నారు. – ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఫార్ములా–ఈ కార్ రేస్‌పై అసెంబ్లీలో చర్చ చేపట్టాలి

ఫార్ములా–ఈ కార్ రేస్‌పై అసెంబ్లీలో చర్చ చేపట్టాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తప్పుడు ఆరోపణలపై వాస్తవాలు వినిపించేందుకు కేటీఆర్ సిద్ధంగా ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అమలు కానీ హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. – ఎమ్మెల్యే తలసాని

అసెంబ్లీ లోపల, బయట కాంగ్రెస్ తీరు బాధాకరం

అసెంబ్లీ లోపల, బయట కాంగ్రెస సభ్యుల తీరు బాధాకరమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసుపై గవర్నర్ ఆమోదం ఉన్నా, లేకున్నా చర్చ పెట్టాలని అడుగుతున్నామన్నారు. ఏ అంశాన్ని అయినా చర్చకు పెట్టవచ్చని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు వ్యవస్థ, డీజీపీ నడుచుకుంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ సభ్యులకు చెప్పులు చూపిస్తున్నారని, దమ్ముంటే వీడియోలో బయట పెట్టాలని చెప్పారు. అధికారులతో చర్చించి ఫార్ములా–ఈ కార్ రేస్‌కు నిధులు ఇచ్చామని, రూ.700 కోట్ల ఆదాయం తెలంగాణకు వచ్చిందని గుర్తు చేశారు. ఇందులో ఒక్క రూపాయి లంచం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రతిష్టకు భంగం కలిగించే ఈ విషయంపై చర్చ పెట్టాలని అడుగుతున్నామని, రేవంత్‌రెడ్డి చర్చకు అనుమతి ఇవ్వాలన్నారు. ఒక్క రాయి విసరకుండా తెలంగాణ రాష్ట్రం సాధించామని, ఉద్యమకారులంగా దీనికి భయపడమన్నారు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే పార్టీశ్రేణులు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేయాలన్నారు.

– ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

శాసనసభ చరిత్రలో చీకటి రోజు

దళిత స్పీకర్ పట్ల అవమానకరంగా ప్రవర్తించారని, శాసనసభ చరిత్రలో ఇది చీకటి రోజని కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేతల నరనరానా అహంకారం కనిపిస్తోందని, వారి వికృత చేష్టలు చూస్తుంటే తాగి వచ్చారా అని అనిపిస్తుందన్నారు. కౌశిక్‌రెడ్డి వ్యవహారశైలి దళితవర్గాలపై అహంకారపూరితంగా ఉందని చెప్పారు. గతంలో వారు చేసిన రూల్స్‌ను ఇప్పుడు వారే అతిక్రమిస్తున్నారన్నారని ఆరోపించారు. ఎందుకు మీ సభ్యత్వం రద్దు కావొద్దో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని, వారు చేసిన దుర్మార్గాలు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారని ఆరోపించారు. ధరణి పేరుతో లక్షల ఎకరాల భూమిని ఒక వర్గం కొల్లగొట్టిందని..ఇది ఇప్పుడు బయట పడుతుందని భయపడుతున్నారన్నారు.

– కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశం

వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు

దళితుడైన స్పీకర్ పట్ల బీఆర్‌ఎస్ నేతలు వీధిరౌడీల్లా ప్రవర్తిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఏదోవిధంగా సభ నుంచి బయటకు రావాలని చేస్తున్నారన్నారు. వరి వేస్తే ఉరి అని గత ప్రభుత్వం పేర్కొందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రజాపాలన చేస్తుంటే ఓర్వ లేకపోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద కక్ష కట్టి వెయ్యి మంది సోషల్ మీడియాలో పెట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారుని ఆరోపించారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇవ్వాలని చర్చ పెడితే సభ పూర్తిగా తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

– కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

స్పీకర్‌పైకి ఉసిగొల్పుతున్నారు

హరీశ్‌రావు అందరినీ ఉసిగొల్పి దళితుడైన స్పీకర్ పట్ల చులకనభావంతో ప్రవర్తించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ ఆరోపించారు. గతంలో దళితుడైన సంపత్‌కుమార్‌ను ఏ తప్పూ లేకున్నా అసెంబ్లీ నుంచి డిస్మిస్ చేశారని, ఇప్పుడు వీరి సభ్యత్వం ఎందుకు రద్దు చేయొద్దో చెప్పాలన్నారు. భూభారతితో వీరి లెక్కలు తేటతెల్లం అవుతాయని చెప్పారు.

– కాంగ్రెస్ ఎమ్మెల్యే సత్యనారాయణ

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

దళిత స్పీకర్ పట్ల అవమానకరంగా ప్రవరించినందుకు అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. స్పీకర్ పట్ల అగౌరవంగా ప్రవర్తించారని, స్పీకర్‌పై దాడికి యత్నం.. రాజ్యాంగం రచించిన అంబేద్కర్‌ను అగౌరవ పరిచినట్టే అన్నారు. పది సంవత్సరాలు ధరణి పేరుతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత గుంజుకున్న భూములు, రైతుల నుంచి దోచుకున్న లెక్కలు బయట పడతాయని వారిలో ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. మార్షల్స్ లేకపోతే స్పీకర్‌పై దాడి చేసేవారని, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

– కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్

కుట్రలతో అగ్నిగుండంగా మార్చే ప్రయత్నం

బీఆర్‌ఎస్ కుట్రలతో తెలంగాణను అగ్నిగుండంగా మార్చే ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆరోపించారు. కేటీఆర్ అరెస్టు అయితే అల్లర్లు చేయడానికి నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున కేటీఆర్ బినామీ ఒకరు డబ్బు పంపించినట్టు విశ్వసనీయంగా తెలిసిందన్నారు. అల్లర్లు చేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల పంపిణీ అవకతవకల్లో విచారణ జరుగుతోందన్నారు. బావమరిది కళ్లలో ఆనందం కోసం హరీశ్‌రావు చిల్లరగా ప్రవర్తిస్తున్నారన్నారు.

– కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

భూభారతిని బీఆర్‌ఎస్ అడ్డుకుంటోంది

ధరణి స్థానంలో భూభారతి తెస్తుంటే బీఆర్‌ఎస్ అడ్డుకుంటోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ సభ్యులు సభ నడవకుండా అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. సీరియస్ బిల్లులపై చర్చను పక్కదారి పట్టిస్తున్నారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ధరణితో కబ్జాలు చేశారన్నారు. గవర్నర్ కేంద్ర న్యాయ శాఖను సంప్రదించి అనుమతి ఇచ్చారని, నిజాయితీపరులయితే చట్టానికి సహకరించాలని తెలిపారు.

– కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయరమణారావు

ఓఎన్జీసీ పరిహారంపై దాగుడుమూతలు

వాయిదాల మీద వాయిదాలు వేస్తున్న కూటమి ప్రభుత్వం

- అగ్నికుల క్షత్రియుల ఎదురుతెన్నులు
- ఐదు నెలల 21 రోజుల పరిహారం పంపిణీలో తీవ్ర జాప్యం.
- జిల్లాలో 23,458 మంది లబ్ధిదారులు
- సీఎం చంద్రబాబు రావాలంటూ కాలయాపన
- నేటికీ అందని మత్స్యకార భరోసా
- గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా పరిహారం



సాక్షి, అమలాపురం: చమురు సంస్థల కార్యకలాపాల కారణంగా నష్టపోయే అగ్నికుల క్షత్రియులకు క్రమం తప్పకుండా ఇవ్వాల్సిన పరిహారం.. అలాగే, ఏటా అందించే మత్స్యకార భరోసా ఈ ఏడాది ఇప్పటివరకూ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం లబ్ధిదారులను ముప్పుతిప్పలు పెడుతోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆర్నెలలైనా పరిహారం పంపిణీపై ఇప్పటికీ స్పష్టమైన ప్రకటన చేయలేదు. గత నవంబరు 21న మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఓఎన్జీసీ పరిహారంతో పాటు మత్స్యకార భరోసా అందజేస్తారని లబ్ధిదారులు ఎదురుచూశారు. కానీ, ఇప్పటికీ ఆ ఊసేలేదు. అయ్యవారు వచ్చేవరకూ అమావాస్య ఆగాల్సిందే అన్నట్లుగా ఉంది ఈ వ్యవహారం చూస్తుంటే!

ఓఎన్జీసీ పనులతో వేటకు అంతరాయం..

కోనసీమ జిల్లాలో కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధి గోదావరి పాయపై ఓఎన్జీసీ చమురు సంస్థ చేపట్టిన పైపులైన్ పనులతో స్థానిక మత్స్యకారులకు వేట లేకుండాపోయింది. సముద్రం లోపల ఉన్న రిగ్గు (ఆఫ్‌షోర్ బావి) నుంచి గాడిమొగ సైట్ వరకు బ్రహ్మసమేధ్యం పరిధిలోని గోదావరి పాయల వెంబడి ఓఎన్జీసీ సంస్థ పైపులైన్ పనులు చేపట్టింది. ఇందుకు అనువుగా నదీపాయల్లో పెద్దఎత్తున డ్రెడ్జింగ్ నిర్వహించింది. దీనివల్ల నెలలపాటు వేటకు అంతరాయం ఏర్పడింది. కాట్రేనికోన మండలంతో పాటు ఐ.పోలవరం, ముమ్మిడివరం, అయినవిల్లి, కె.గంగవరం.. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన గోదావరి నదీపాయలను ఆనుకుని జీవిస్తున్న మత్స్యకారుల వేటకు బ్రేక్ పడింది. తమ కార్యకలాపాలు ముగిసే వరకూ నష్టపోయిన మత్స్యకారులకు పరిహారం అందించేందుకు ఓఎన్జీసీ సంస్థ ముందుకొచ్చింది. దీంతో జిల్లాలో 23,458 మంది మత్స్యకారులకు పరిహారం అందించాలి. ఒక్కో మత్స్యకారునికి రోజుకు రూ.460 చొప్పున నెలలో 25 రోజులకు రూ.11,500 ఇచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఓఎన్జీసీ అంగీకరించింది. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పుదుచ్చేరి రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, మత్స్యకార నాయకులతో జిల్లా కలెక్టరు సమక్షంలో బాధిత లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఓఎన్జీసీ ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి కోనసీమ జిల్లా పరిధిలో 16,408 మందికి, కాకినాడ జిల్లా, పుదుచ్చేరి యానాం పరిధిలో 7,050 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు.

జగన్ హయాంలో రూ.647.44 కోట్లు చెల్లింపు..

గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు విడతలుగా ఒకొక్కరికి రూ.2,76,000 చొప్పున రూ.647.44 కోట్లను 8 వేల మంది లబ్ధిదారుల ఖాతాలో జమచేశారు. ఇంకా సంస్థ నుంచి సుమారుగా తొమ్మిది నెలలకు పైబడి నష్ట పరిహారం లబ్ధిదారులకు రావాల్సి ఉందని బాధితులు చెబుతున్నారు. కానీ, సంస్థ మాత్రం కేవలం 5 నెలల 21 రోజుల పరిహారం మాత్రమే పెండింగ్ ఉందని.. అది జిల్లా కలెక్టర్ వద్ద ఉందని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెల్లిస్తామని చెబుతోంది. ఇలా చూసినా వేట నష్టపోయిన మత్స్యకారులకు రూ.157.54 కోట్ల పరిహారం అందించాల్సి ఉంది. అయితే, ఎప్పటికప్పుడు తేదీలు మారుస్తూ కూటమి ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతోంది. అసలు నష్టపరిహారం తమకు వస్తుందో లేదో తెలీక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు..

మరోవైపు.. చమురు సంస్థలు సముద్ర జలాలు, గోదావరి పాయల్లో చేపడుతున్న చమురు నిక్షేపాల వెలికితీత పనులు, చమురు వ్యర్థాలను విడుదల చేయడం, ఓడల రాకపోకలవల్ల జరుగుతున్న శబ్ద కాలుష్యంతో గోదావరి సహజత్వం కోల్పోయి మత్స్య సంపద తగ్గిపోతోంది. దీంతో చేపల వేటలేక జీవనోపాధి కోల్పోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పైగా.. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం చెల్లించే మత్స్యకార భరోసా, ఓఎన్జీసీ నష్టపరిహారం సకాలంలో చెల్లించకపోవడంతో ఉపాధి కోసం ఇతర మార్గాలను అన్వేషిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు రావాల్సిన ఓఎన్జీసీ నష్టపరిహారం చెల్లించాలని మత్స్యకారులు కోరుతున్నారు. నిజానికి.. ఎన్నికల సమయంలో మత్స్యకార భరోసాను రూ.20 వేలకు పెంచుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది మత్స్యకార భరోసా కింద రూ.22.61 కోట్లు అందించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకూ ప్రభుత్వం ఈ ఊసే ఎత్తడం లేదు.

వేట లేక ఉపాధి కోల్పోతున్నాం..



గోదావరిలో పైపులైన్ పనులతో ఏర్పడిన ఇసుక మేటలు తొలగించకపోవడంతో మత్స్య సంపద తగ్గిపోతోంది. పైపులు వేసిన తరువాత పూడ్చి వేత పనులు చేపట్టడంలేదు. మత్స్య సంపదపై ఇది కూడా ప్రభావం చూపుతుంది. వేట లేకపోవడంతో ఉపాధి లేకుండా పోయింది.

– సంగాని చిన్న కన్నయ్య, బ్రహ్మసమేధ్యం, కాట్రేనికోన మండలం

నష్టపరిహారం చెల్లించండి..



మాకు ఓఎన్జీసీ సంస్థ నుంచి రావాల్సిన నష్ట పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలి. ఆ పరిహారం చెల్లించకుండా.. చేపల వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ఇవ్వాల్సిన మత్స్యకార భరోసా సకాలంలో ఇవ్వకపోతే మేం ఎలా బతికేది? అప్పులుచేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది.

– ఓలేటి తేజ, బలుసుతిప్ప, కాట్రేనికోన మండలం

డ్రైనేజీ భూముల్లో టీడీపీ గద్దలు



చీరాల నియోజకవర్గం వేటపాలెం మండలంలో 50 ఎకరాలకు పైగా డ్రైనేజీ భూములు

- రొంపేరు, ముసలమ్మ మురుగు నీటి కాలువల కోసం భూముల కేటాయింపు
- అధికభాగం ఆక్రమించి అమ్మకానికి పెట్టిన టీడీపీ నేతల అనుచరులు
- మరికొంత భూమి తనదంటూ అమ్మకానికి పెట్టిన రిటైర్డ్ అధికారి
- ఎకరం రూ. 4 నుంచి 5 లక్షలకు అమ్మకం
- ఎక్కువ భూమిని కొన్న మాజీ ఎమ్మెల్యే అనుచరుడు
- వాటిలో రొయ్యల సాగుకు ఏర్పాట్లు
- ఆక్రమణదారులతో డ్రైనేజీ అధికారులు కుమ్మక్కు


సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఇసుక, బుసక, గ్రావెల్, గ్రానైట్‌తోపాటు పచ్చ నేతల కన్ను ఇప్పుడు ప్రభుత్వ భూములపై పడింది. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం వేటపాలెం మండలంలోని డ్రైనేజీ (ప్రభుత్వ) భూములపై పచ్చనేతతోపాటు ఒక మాజీ ఎమ్మెల్యే అనుచరుడు, ఇన్నాళ్లూ ఆ భూములను కాపుకాసిన విశ్రాంత అధికారి కన్నూ పడింది. తలో ఇంత పంచుకున్నారు. ఎటువంటి పట్టాలు పొందే అవకాశం లేని ఆ ప్రభుత్వ భూములను ఏకంగా అమ్మకానికి పెట్టారు. అగ్రిమెంట్ల మీదనే ఎకరం రూ. 4 నుంచి 5 లక్షలకు అమ్మారు. వీటిలో ఎక్కువ భూములను మాజీ ఎమ్మెల్యే అనుచరుడు దొరకబుచ్చుకున్నారు. ఆ భూముల్లో రొయ్యల చెరువుల సాగుకు సిద్ధమయ్యారు. వేటపాలెం మండలం సంతరావూరు బ్రిడ్జి సమీపంలో ప్రధాన రహదారికి పక్కనే రొంపేరు డ్రైన్, ముసలమ్మ మురుగు నీటి కాలువల మధ్య 50 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. డ్రైన్స్ నిర్మాణంలో భాగంగా వాటిని పూర్వం ప్రభుత్వం కేటాయించినట్లు స్థానికులు చెబుతున్నారు. పదేళ్ల క్రితం వరకు వేటపాలెం ప్రాంతంలో ఉన్న కుమ్మరులు (శాలివాహనులు) కుండలు, ఇతరత్రామట్టి పాత్రలు తయారు చేసేందుకు ఆ భూముల్లో ఉన్న బంకమట్టిని తీసుకువెళ్లేవారు. అప్పట్లో ఆ భూముల ఆక్రమణకు కొందరు నేతలు ప్రయత్నించగా కుమ్మరులు అడ్డుకున్నారు. ఆ తర్వాత మట్టి పాత్రలకు డిమాండ్ పడిపోయి తయారీ నిలిచి పోవడంతో కుమ్మరులు వాటిని వదిలేశారు. దీంతో ఆ భూములపై అక్రమార్కుల కన్నుపడింది.

వాలిపోయిన పచ్చ మూకలు

ఇప్పుడు వాటిని పరిరక్షించే వాళ్లు లేకపోవడంతో పచ్చ మూకలు వాలిపోయాయి. చీరాల ప్రాంతానికి చెందిన టీడీపీ నేత అనుచరుడు, మాజీ ఎమ్మెల్యే అనుచరుడు, మరికొందరు ఆ భూములను ఆక్రమించారు. 10 మంది కలిసి 15 ఎకరాల్లో వరి, జొన్న పంటలు సాగు చేసేవారు. ఇంకొందరు కొన్ని భూములు వారివంటూ హద్దులు గీసుకున్నారు. వేటపాలేనికి చెందిన డ్రైనేజీ విభాగం విశ్రాంత అధికారి సైతం కొంత మేర ఆక్రమించారు. వాస్తవానికి డ్రైనేజీ, డొంక, శ్మశాన తదితర పోరంబోకు భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వదు. ఇక్కడ కూడా ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని సమాచారం. కానీ టీడీపీ నేతల అనుచరులు ఇప్పటికే సుమారు 18 ఎకరాలు ఆక్రమించడంతో పాటు, అప్పటికే ఆక్రమించిన వారి వద్ద భూములను కూడా ఎకరం రూ. 4 నుంచి 5 లక్షలకు కొన్నారు. ఇలా ఇప్పటివరకూ 30 ఎకరాలకుపైగా డ్రైనేజీ భూములు విక్రయాలు జరిగినట్లు సమాచారం. డ్రైనేజీ విభాగం రిటైర్డ్ అధికారి సైతం కొన్ని భూములను అమ్మకానికి పెట్టినట్లు సమాచారం. వీటన్నింటినీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడొకరు కొంటున్నారు. ఈ భూముల ఆక్రమణ, అమ్మకాలను అడ్డుకోవాల్సిన డ్రైనేజీ విభాగం అధికారులు కూడా కబ్జాదారులతో కుమ్మక్కై పోయారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారి ఉంటాయని ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అయితే, డ్రైనేజీ భూములను కొందరు సాగు చేసుకుంటున్న విషయం తన దృష్టిలో ఉందని, ఆక్రమణలు విషయం తన దృష్టికి రాలేదని మురుగునీటిపారుదల శాఖ డీఈ వెంకట సుబ్బారావు చెప్పారు. విచారణ జరిపి క్రయవిక్రయాలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పుష్ప-2 రికార్డుల సునామీ

రెండు వారాలు పూర్తయినా తగ్గని వసూళ్లు



- రూ.2,000 కోట్ల మార్కు దిశగా పరుగులు
- 14 రోజుల్లో రూ.1,500 కోట్ల మైలురాయి అధిగమించిన ఐకాన్ స్టార్ సినిమా
- అల్లు అర్జున్ అరెస్టు తర్వాత భారీగా పెరిగిన ప్రేక్షకులు
- దేశ సినీ చరిత్రలో ఎన్నడూలేని విధంగా రెండో వారాంతంలో రూ.100 కోట్లు వసూళ్లు
- రెండు వారాల్లో ఒక్క భారత్‌లోనే రూ.వెయ్యి కోట్లు వసూలుచేసిన సినిమాగా రికార్డు
- రూ.275 కోట్లకు ఓటీటీ హక్కులు దక్కించుకున్న నెట్‌ఫ్లిక్స్

సాక్షి, అమరావతి: ప్రపంచ బాక్సాఫీసును పుష్ప-2 'రూల్' చేస్తోంది. సినిమా విడుదలై రెండు వారాలైనా ఇప్పటికీ కలెక్షన్ల సునామీతో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. రెండు వారాల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.1,500 కోట్ల మార్కుకు చేరుకోవడమే కాకుండా దేశీయంగా రూ.1,000 కోట్ల మార్కును వేగంగా అందుకున్న తొలి సినిమాగా ఖ్యాతి గడించింది. తాజాగా.. బుధవారం మధ్యాహ్నం నాటికి పుష్ప సినిమా దేశవ్యాప్తంగా రూ.962 కోట్లు వసూలుచేసినట్లు బాలీవుడ్ క్రిటిక్స్ అంచనా వేస్తున్నాయి. సినిమా విడుదలైన రెండో వారంలో కూడా ఈ స్థాయిలో వసూళ్లు రావడంపై సినీ విశ్లేషకులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా.. అల్లు అర్జున్ అరెస్టు తర్వాత ఈ కలెక్షన్లు మరింత ఊపందుకున్నాయి. హిందీ సినిమా చరిత్రలో ఎన్నడూలేని విధంగా 13 రోజుల్లో రూ.601.50 కోట్లు వసూలుచేయడమే కాకుండా రెండో మంగళవారం రూ.19.50 కోట్ల కలెక్షన్లు సాధించి బాలీవుడ్ రికార్డులను తిరగరాసింది. అంతేకాదు.. సినిమా విడుదలైన తర్వాత రెండో వారాంతంలో రూ.100 కోట్లు చేసిన తొలి హిందీ సినిమాగా రికార్డు సృష్టించిందని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ అధికారికంగా ప్రకటించింది. ఇక రెండో శుక్రవారం రూ.36.4 కోట్లు, రెండో శనివారం రూ.63.3 కోట్లు, రెండో ఆదివారం రూ.76.6 కోట్లు, రెండో సోమవారం రూ.26.95 కోట్లు, రెండో మంగళవారం రూ.24.5 కోట్లు, రెండో బుధవారం మధ్యాహ్నం నాటికి రూ.10 కోట్లు మార్కును అధిగమించిందని.. బుధవారం సెకండ్ షో తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా ఇప్పటికే రూ.291 కోట్ల మార్కును అధిగమించింది. ఈ కలెక్షన్ల పరంపర ఇలాగే ఉంటే పూర్తి రన్‌లో పుష్ప-2 రూ.2,000 కోట్ల క్లబును అధిగమించిన తొలి సినిమాగా రికార్డులను సృష్టిస్తుందని నిర్మాతలు అంచనా వేస్తున్నారు.


విదేశాల్లోనూ రికార్డులు..

కేవలం దేశీయంగానే కాకుండా ఉత్తర అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి ప్రధాన దేశాల్లో పుష్పరాజ్ అల్లు అర్జున్ సందడి చేస్తున్నారు. ఉత్తర అమెరికాలో 13 మిలియన్ డాలర్లు వసూలుచేయడమే కాకుండా బ్రిటన్‌లో 1.615 మిలియన్ పౌండ్లు వసూళ్లుచేసి తొలి దక్షిణాది సినిమాగా రికార్డులకెక్కింది. ఇక ఆస్ట్రేలియాలో ఇప్పటివరకు నాలుగు మిలియన్ల ఆస్ట్రేలియన్ డాలర్లు వసూలుచేసి 2024లో అత్యధిక వసూళ్లు సాధించిన తొలి సినిమాగా రికార్డు సృష్టించింది.

ఓటీటీ ధర రూ.275 కోట్లు..

ఇదిలా ఉంటే.. కేవలం థియేటర్లలోనే కాకుండా ఓటీటీ అమ్మకాల్లో కూడా 'పుష్ప-2' దూసుకుపోయింది. నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఏకంగా ఈ సినిమా స్ట్రీమింగ్ రైట్స్‌ను రూ.275 కోట్ల రికార్డుస్థాయి ధరతో దక్కించుకుంది. ఇంకా థియేటర్ కలెక్షన్లు బాగుండడంతో ఓటీటీలో ఈ సినిమా విడుదల మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. కొత్త సంవత్సరం జనవరి తర్వాతే ఈ సినిమా ఓటీటీలో విడుదలవుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

దుస్తులు పాతబడ్డాయా.. అమ్మేయండి..!



వాడేసిన దుస్తులకూ డబ్బులొస్తాయి



- ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌లు, వెబ్ సైట్లు
- డబ్బులిచ్చి పాత దుస్తులు కొంటున్న సంస్థలు
- కొన్ని యాప్‌లలో ధర ర్ణయాధికారం అమ్మేవారిదే
- కొన్ని యాప్‌లు దుస్తులను బట్టి ధర నిర్ణయిస్తాయి
- ఇంటికే వచ్చి తీసుకెళ్తారు
- నేరుగా మనమే కొనేవారికి అమ్మే వెసులుబాటూ ఉంది

సాక్షి, అమరావతి: ఇంటినిండా బట్టలున్నట్టే ఉంటాయి. కానీ సమయానికి కట్టుకుందామంటే ఒక్కటీ సరైనది కనిపించదు. ఇలా పాతబడిపోయిన దుస్తులను ఏం చేయాలో తెలియదు. ఎవరికైనా ఇద్దామంటే ఏమనుకుంటారోననే సందేహం. వాటిని దాచుకోలేక, పడేయలేక సతమతమవుతుంటారు చాలామంది. ముఖ్యంగా మహిళలు. ఇకపై ఆ సందేహాలు, సతమతాలు అవసరం లేకుండా ఇళ్లల్లో ఉన్న పాత దుస్తులను కొనే యాప్‌లు, వెబ్‌సైట్‌లు వచ్చేశాయి. వీటిద్వారా వాడకుండా పక్కన పెట్టేసిన దుస్తులను ఆన్‌లైన్‌లో అమ్మేసేయొచ్చు. అంటే..పాత దుస్తులకూ డబ్బులొస్తాయన్నమాట. వాటిని కొనేందుకు కొన్ని వెబ్‌సైట్‌లు ప్రత్యేక ఆఫర్లు కూడా ఇస్తుంటాయి. ఆలస్యమెందుకు.. ఆ యాప్‌లు, వెబ్‌సైట్‌లు ఏమిటో తెలుసుకొని.. పాత వాటిని అమ్మేద్దాం..

అమ్మడానికి ఆన్‌లైన్‌లో అనేక వేదికలు

ఆన్‌లైన్‌లో పాత దుస్తులు కొనే వెబ్ సైట్‌లు, యాప్‌లు చాలానే ఉన్నాయి. ఫ్రీ అప్, బేచ్ దే, పోష్ మార్క్, ఓఎల్ఎక్స్, పీ పాప్, ఒయేలా, క్లాతింగ్ క్లిక్, ఈబే, ఓల్డ్ కార్ట్..వంటి పేర్లతో ఆన్‌లైన్ వ్యాపారాలు జరుగుతున్నాయి. కొన్ని సైట్లు, యాప్‌లు నేరుగా దుస్తులు కొనుగోలు చేసి వాటికి కొంత నగదును ఇస్తున్నాయి. అందుకోసం మీ దుస్తులను యాడ్ చేసి ధరను నిర్ణయించిన తర్వాత, కంపెనీ వాటిని చెక్ చేసి ఆమోదిస్తుంది. అనంతరం వాటిని నేరుగా వినియోగదారులకు విక్రయిస్తుంది. మరికొన్ని వినియోగదారులకు నేరుగా అమ్మకందారులే దుస్తులను విక్రయించేందుకు అవకాశం ఇస్తున్నాయి. ఈ యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకుని లాగిన్ అయ్యాక **సేల్** అనే ఆప్షన్‌ను క్లిక్ చేసి, అమ్మాలనుకుంటున్న దుస్తులను క్లోజప్‌లో ఫొటో తీసి పోస్ట్ చేయాలి. వాటికి సంబంధించిన చిన్నపాటి సమాచారం (డిస్క్రిప్షన్)ను కూడా రాయాలి. ఆ తర్వాత డ్రెస్ ఏ కండీషన్‌లో ఉంది, ఎవరికి సరిపోతుంది (కేటగిరీ) అనే వివరాలను సెలక్ట్ చేసి దాని ధర (అమౌంట్) ను కూడా తెలపాలి. కొన్ని సంస్థలు అమ్మకం రుసుము (సెల్లింగ్ ఫీజు) తీసుకోవు. ఇంటికే వచ్చి మనం అమ్మిన పాత దుస్తులను తీసుకెళుతున్నాయి. దుస్తులు అమ్మే సమయంలో క్రెడిట్ పాయింట్స్ లేదా క్యాష్ ఆప్షన్ పెట్టుకునే వీలు కూడా ఉంటుంది. బట్టలతో పాటు వాచీలు, చైన్లు, రింగులు, క్యాపులు, బూట్లు వంటి యాక్సెసరీస్, డెకరేటివ్ ఐటమ్స్ కూడా అమ్ముకునేలా, కొనుక్కునేలా ఈ యాప్‌లలో ఆప్షన్లు ఉన్నాయి. మీషో వెబ్‌సైట్‌లో దేశవ్యాప్తంగా ఎవరైనా మీ దుస్తులను కొనే అవకాశం ఉంటుంది. ఫ్రీఅప్ అనే వెబ్ సైట్ కూడా మరో ఫేమస్ వెబ్ సైట్. ఈ యాప్ లో మీరు మీ పాత బట్టల ఫొటోలు పెట్టగానే వాటి క్వాలిటీని బట్టి ధర నిర్ణయిస్తుంది. ధర నచ్చితే హ్యాపీగా అమ్మేయొచ్చు. రీలవ్ వెబ్ సైట్ ద్వారా కూడా ఎక్కువ మంది కస్టమర్లను చేరుకోవచ్చు. క్లైటెడ్ అనేది ప్రత్యేకంగా ఇంటింటికీ సేవలందించడంలో ప్రసిద్ధి చెందిన యాప్. వెబ్ సైట్ నిర్వాహకులే ఇంటికొచ్చి పాత దుస్తుల బ్రాండ్, ప్రస్తుత పరిస్థితిని చూసి సరైన ధర నిర్ణయించి **డబ్బు**లు కూడా ఇస్తారు.

వ్యాపారం మీరే చేయొచ్చు

ఆన్‌లైన్‌లో పాత దుస్తులను సేకరించి విక్రయించే వ్యాపారం చేయడానికి ఇటీవల యువత కూడా ఉత్సాహం చూపిస్తున్నారు. కొంత మంది లాభాలు కూడా ఆర్జిస్తున్నారు. ఒక యాప్ లేదా వెబ్ సైట్ తయారు చేసి సోషల్ మీడియా ద్వారా వ్యాపారం చేయొచ్చు. నగరా**ల్లో** కమిషన్ పద్ధతిలో సిబ్బందిని నియమించుకుని దుస్తులు సేకరించవచ్చు. వాటిని రీసైక్లింగ్ చేసే కంపెనీలకు బల్క్‌గా అమ్మొచ్చు. ఇలా కొన్ని పాత బట్టలను ఉపయోగించి కొందరు పిల్లోస్, పరుపులు, డెకరేషన్ ఐటమ్స్ తయారు చేస్తారు. అలాంటి వారిని సంప్రదించి మంచి **ధర**కు అమ్మేయొచ్చు. దీని ద్వారా అధిక మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చు.




శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,165 మంది స్వామిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 15 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గోదాదేవికి విశేషంగా తిరువీధి



సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదాదేవికి విశేషంగా తిరువీధి నిర్వహించారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో పాశుర విన్నపం చేశారు. తదుపరి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో అధిష్టింపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. విశేష హారతి అందించారు. అర్చకుడు రాజీవ్ తదితరుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.



సెలెస్ట్రా-25 పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల 28 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న సెలెస్ట్రా-25 ఈవెంట్‌కు సంబంధించిన పోస్టర్లను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని విడుదల చేశారు. వర్సిటీలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ యువ ఆవిష్కర్తలు తమ సరికొత్త ఆలోచనలను పదర్శించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

'నన్నయ'లో చైల్డ్ సైకాలజీ కోర్సు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడాలసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లమా కోర్సును ఆసక్తి ఉన్నవారంతా సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ కోర్సుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇంతవరకు రెండు బ్యాచ్‌లు పూర్తయ్యాయని, ప్రస్తుతం మూడో బ్యాచ్ కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ఏడాది కాలపరిమితితో కూడిన ఈ కోర్సులో 40 సీట్లు ఉన్నాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన జరుగుతుందన్నారు.







● మన సినిమా | జీని

కోరికలు తీర్చే భూతం వచ్చేసింది



క్రిస్మస్ అంటే మనకు శాంటా తెచ్చే కానుకలు గుర్తుకువస్తాయి. సినిమా వాళ్ళకు మాత్రం 'జీని' లాంటి ఫాంటసీ ఐడియాలు వచ్చి వాటిని సినిమాగా తీసి హిట్ కొట్టాలనిపిస్తుంది. అదీగాక ఇలాంటి సినిమాలు క్రిస్మస్ టైమ్‌లో రిలీజ్ చేస్తే చూసే మూడ్ ఉంటుంది. 2023 క్రిస్మస్ టైంలో రిలీజ్ అయిన సినిమా 'జీని'. ఇప్పుడు నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా వుంది. 'జీని' అంటే భూతం. 'జీని' మూవీని శామ్ బాయ్డ్ డైరెక్ట్ చేశారు. ఇది ఓ ఫాంటసీ కామెడీ మూవీ. అలాగే ఓ వెరైటీ స్టోరీ అని చెప్పవచ్చు. బెర్నార్డ్ అనే మన హీరో ఓ ఓల్డ్ హౌస్‌ని ఆక్షన్ చేసే కంపెనీలో పని చేస్తుంటాడు. బెర్నార్డ్‌కి చిరాకు పుట్టించే బాస్ ఉంటాడు. అతని పేరు ఫ్లాక్స్ మాన్. బాస్ పెట్టే టార్చర్ వల్ల బెర్నార్డ్ తన కూతురు బర్త్ డే పార్టీ మిస్ అవుతాడు. దాంతో బెర్నార్డ్ భార్య జూలీ అలిగి కూతురు ఈవ్‌తో కలిసి అమ్మ వాళ్ళింటికి వెళ్ళిపోతుంది. బెర్నార్డ్ ఈ విషయంలో చాలా బాధ పడుతూ ఓ పాత బాక్స్ డస్ట్ క్లియర్ చేస్తూ ఉంటాడు. ఇంతలో ఆ బాక్స్ నుండి 2000 ఏళ్ల కాలానికి చెందిన 'జీని' ఒకటి బయటకు వస్తుంది. తన పేరు ఫ్లోరా అని, తను బెర్నార్డ్‌కు సంబంధించి ఏ విష్ అయినా గ్రాంట్ చేస్తానని చెప్తుంది. ముందు బెర్నార్డ్ 'జీని'ని చూసి భయపడతాడు, దాని తరువాత ఫ్లోరా తన విషెస్ గ్రాంట్ చేయడం చూసి హాపీ ఫీల్ అవుతాడు. తరువాత బెర్నార్డ్, ఫ్లోరా కలిసి జూలీని, ఈవ్‌ని ఇంటికి ఎలా తీసుకువస్తారు? బెర్నార్డ్ బాస్‌ని ఏం చేస్తారన్నది మాత్రం జీని మూవీని చూస్తే తెలుస్తుంది. ఈ మూవీలో జీని చేసే మాజిక్ ట్రిక్స్ చాలా బావుంటాయి. కిడ్స్ ఇట్స్ ఎ వర్త్‌ఫుల్ మూవీ టు వాచ్ ఫర్ దిస్ వీకెండ్. సో గ్రాబ్ ది రిమోట్ ఫర్ జీని టు గ్రాంట్ యువర్ యంటర్‌టైన్‌మెంట్ విష్.

గడ్డ కట్టిన నదిని కోసి మంచు ఉత్సవం

● ఉత్సవం



చైనాలో ప్రతి డిసెంబర్‌లో జరిగే 'హార్బిన్ ఇంటర్నేషనల్ ఐస్ అండ్ స్నో స్కల్ప్చర్ ఫెస్టివల్'కు భారీగా పర్యాటకులు వస్తారు. కారణం ఏమిటంటే అక్కడ ప్రవహించే సొంగువా నది నవంబర్ నుంచి మార్చి వరకు గడ్డ కట్టిపోతుంది. హార్బిన్ నగరానికి దాపుగా ఈ నది ఉండటంతో నది ఉపరితలం మీద ఉన్న ఐస్‌ను కోసి వ్యాపారులు అమ్ముతారు. శిల్పులు ఆ ఐస్ కొని భారీ విగ్రహాలు చేసి ప్రదర్శనకు పెడతారు. ఇలా మంచు శిల్పాలు, ఆకారాలు, మంచుతో కట్టిన భవనాలు ఇవన్నీ కలిసి 'హార్బిన్ ఐస్ ఫెస్టివల్' పేరుతో జరుగుతాయి. ఈశాన్య చైనాలో ఉండే హార్బిన్ నగరం సైబీరియా మంచు ఎడారికి దగ్గర. నవంబర్ నుంచి సైబీరియా మంచు గాలులు మొదలయ్యి చలి పెరుగుతుంది. నది గడ్డ కడుతుంది. డిసెంబర్‌లో అక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ 16 డిగ్రీల వరకూ ఉంటాయి. అందుకే ఈ చలిలో బోర్ కొట్టకుండా ఉండేందుకు ఎంతకీ కరగని మంచుతో ఇలా ఉత్సవం చేసి ఆనందిస్తారు. మీ దగ్గర హుండీలో దాచిన డబ్బు ఉంటే వెళ్లి చూసి రండేం!



నదిని ముక్కలుగా కోస్తున్న దృశ్యం



ఐస్‌తో చేసిన బొమ్మ

● మహనీయులు

పరిశోధనలే ఆయన ప్రాణం



యల్లాప్రగడ సుబ్బారావు

వాళ్లది మధ్యతరగతి కుటుంబం. ఆ అబ్బాయికి 18 ఏళ్ల వయసు ఉండగానే తండ్రి మరణించాడు అనారోగ్యం వల్ల. అతని ఇద్దరు సోదరులకూ మాటిమాటికీ జ్వరం, దగ్గు వస్తూ ఉండేది. వారి బాధను చూసి అతను మరింత బాధపడేవాడు. కానీ ఆ రోజుల్లో సరైన వైద్యవిధానాలు లేకపోవడంతో అనారోగ్యం తగ్గేందుకు ఎలాంటి మందులు వాడాలో తెలిసేది కాదు.

తండ్రి మరణం, అన్నదమ్ముల అనారోగ్యం కారణంగా ఆ అబ్బాయి మెట్రిక్యులేషన్ రెండుసార్లు తప్పాడు. అయినా కుంగిపోలేదు. ఈసారి మరింత పట్టుదల తెచ్చుకున్నాడు. తల్లి నగలు అమ్మి, ఆ డబ్బు తీసుకుని, స్నేహితుల సాయంతో మద్రాసు వెళ్లి అక్కడ హిందూ హైస్కూల్‌లో చేరాడు. దీక్షగా చదివి మూడోసారి మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. అనంతరం వైద్య విద్య మీద ఆసక్తి కలిగింది. మద్రాస్ మెడికల్ కాలేజీలో చేరాడు. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆగిపోయే పరిస్థితి తలెత్తినా ఏమాత్రం అధైర్యపడకుండా ముందుకు సాగాడు.

అవి స్వాతంత్రోద్యమ రోజులు. సహాయ నిరాకరణ ఉద్యమం సాగుతోంది. గాంధీజీ పిలుపుతో ఆ అబ్బాయి విదేశీ వస్త్ర బహిష్కరణలో పాల్గొన్నాడు. ఖద్దరు కట్టుకుని కాలేజీకి వెళ్లాడు. దీంతో అక్కడి అధికారులు అతనిపై కక్షగట్టి డాక్టర్ పట్టా ఇవ్వకుండా, అంతకన్నా తక్కువదైన ఎల్ఎంఎస్ సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో ఆయుర్వేదంపై దృష్టి సారించాడు. అందులో రాణించాడు. ఆ తర్వాత అమెరికాకి వెళ్లి హార్వర్డ్‌లో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ సాధించాడు.

ఫైలేరియా గురించి పరిశోధన చేసి హెట్రజన్ ఔషధాన్ని కనిపెట్టాడు. సిడ్నీ ఫార్బర్ అనే శాస్త్రవేత్తతో కలిసి క్యాన్సర్‌కు వాడే కీమోథెరపీ ఔషధాల్లో తొలితరం డ్రగ్ మెథోట్రెక్సేట్‌ను అభివృద్ధి చేశాడు. ఇన్ని ఘనతలు సాధించిన ఆ మహనీయుడే డా.యల్లాప్రగడ సుబ్బారావు. ఇన్ని అద్భుత ఆవిష్కరణలు చేసినా ఆయనకు నోబెల్ బహుమతి దక్కలేదు. అయితే ఆయన ఆధ్వర్యంలో పరిశోధనలు చేసినవారికి నోబెల్ పురస్కారాలు వచ్చాయి.

విన్నారుగా వైద్యరంగంలో యల్లాప్రగడ సుబ్బారావు చేసిన కృషి. మీరు కూడా ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని శాస్త్ర సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచుకోవాలి. గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి.

అయ్యారే... లేడీస్ టైలర్ గారూ...



ఈ బుజ్జిగాణ్ణి మన రాజేంద్ర ప్రసాద్‌ని పిలిచినట్టు 'లేడీస్ టైలర్' అనంటే ఊరుకోడు. 'ఐ యామ్ ఏ ఫ్యాషన్ డిజైనర్' అంటాడు. ఎనిమిదేళ్ల వయసులో పిల్లలు ఆటపాటల్లో మునిగిపోయి ఉంటారు కానీ అమెరికాకు చెందిన మాక్స్ అలెగ్జాండర్ మాత్రం కొత్త బట్టలు, సరికొత్త ఫ్యాషన్లు, నూతన ఆలోచనలు అంటూ హడావిడిగా ఉంటాడు. అతి చిన్న ఫ్యాషన్ డిజైనర్‌గా పేరు తెచ్చుకున్న మాక్స్ రూపొందించే దుస్తులకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. కీలకమైన వేడుకల్లో అతను తయారు చేసే బట్టలే వేసుకుంటామని కొందరు సెలబ్రెటీలు హటం చేస్తారు. అనగా మంకుపట్టు పడతారు.




మాక్స్‌కి నాలుగేళ్ల వయసున్నప్పుడు అతని తల్లి షెర్రీ మాడిసన్ అతనికో బొమ్మ ఇచ్చింది. దాని కోసం కస్టమ్ కోచర్ గౌన్ కుట్టాడు మాక్స్. అప్పటి నుండి ఇప్పటిదాకా 100 కంటే ఎక్కువ కస్టమ్ కోచర్ గౌన్లు కుట్టాడు. అతని ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు బాగా ప్రోత్సహించారు. తాను తయారుచేసిన దుస్తులతో అనేక రన్‌వే షోలను నిర్వహించి, ప్రపంచంలో అతి చిన్న వయస్కుడైన రన్‌వే ఫ్యాషన్ డిజైనర్‌గా మాక్స్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించాడు. అతను తయారు చేసిన దుస్తుల్ని అంతర్జాతీయ వేదికల మీద ప్రదర్శించారు.



బట్టలు కుట్టేసి ఇచ్చేయడం మాత్రమే మాక్స్ పని కాదు. అవి వేసుకునేవారు ఏం కోరుతున్నారు, వారి ఇష్టాయిష్టాలు ఏమిటి, ఎలాంటి దుస్తులు సౌకర్యంగా అనిపిస్తాయి, ఎలాంటి రంగులు వారి ఒంటికి నప్పుతాయి వంటి అంశాలన్నీ ఆలోచించి డిజైన్ చేస్తాడు. ఈ కారణంగానే అతను రూపొందించే బట్టలకు డిమాండ్ పెరుగుతోంది. దీంతోపాటు పనికిరాని వస్తువులతో కూడా కొత్త రకమైన బట్టలు తయారు చేసి అందర్నీ ఆశ్చర్యపరుస్తుంటాడు. ఇన్‌స్టాగామ్‌లో మాక్స్‌కి మూడు మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. మరిన్ని కొత్త ఫ్యాషన్లు రూపొందించాలని, అందుకోసం మరింత సాధన చేయాలని అతను అంటున్నాడు.

● బాలల గేయం



చూడు..చూడు అదిగో
చిలకలు వాలిన చెట్టు
చూడు.. చూడు అదిగో
కోయిల చేరిన చెట్టు

పచ్చని ఆకులు తారాడంగా
కొమ్మలు నిండుగ ఆటాడంగా
ఊడలు వేసి.. ఊయలూగగా
అనువైనదే మన చెట్టు

చల్లని నీడకు వేపచెట్టు
కాయలు రాల్చే మామిడిచెట్టు
వనభోజనాలకు ఉసిరిచెట్టు
ఎత్తున నిలిచే కొబ్బరి చెట్టు

గుంతలు తవ్వి.. పాదులు చేసి
నీళ్లు పోసి.. చక్కగ పెంచి
ఆదరవిచ్చే ఆయువు పెంచే
మనదే మనదే ఈ చెట్టు

చూడు..చూడు అదిగో
చిలకలు వాలిన చెట్టు
చూడు.. చూడు అదిగో
కోయిల చేరిన చెట్టు

ఈ జంట పదాలు తెలుసా?

- **ఇల్లూవాకిలీ**
  పాపం.. అతనికి ఇల్లూవాకిలీ లేదు.
- **కూడూగుడ్డా**
  పేదవారికి కూడూగుడ్డా అందించడం ప్రభుత్వం బాధ్యత
- **చీకూచింత**
  ఏ చీకూచింత లేకుండా జీవించడమే గొప్ప విషయం.
- **పురుగు పుట్ర**
  పొలానికి వెళ్లినప్పుడు పురుగు పుట్రతో జాగ్రత్తగా ఉండండి.
- **ఆలనాపాలన**
  ఆ పిల్లాడి ఆలనాపాలన వాడి నానమ్మే చూస్తోంది.
- **నగానట్రా**
  ఆమె ఆశంతా ఎప్పుడూ నగానట్రా మీదే ఉంటుంది

ఖోఖో అంటూ కూత పెట్టగానే..



ఇప్పుడు కొన్ని స్కూళ్లలో దీనిని మర్చిపోయారుకాని ఒకప్పుడు ప్రతి స్కూల్లో ఆడించేవారు. పిల్లలు ఉత్సాహంగా ఆడేవారు. ఖోఖో ఆట ఆడటం సులువు కాబట్టి పిల్లలు స్కూళ్లలో, ఇంటి వద్ద, మైదానాల్లో ఆడవచ్చు. ఇది ఆడేందుకే కాదు, చూసేందుకూ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. మరి ఖోఖో చరిత్రేమిటో తెలుసా? ఖోఖో దక్షిణాసియా సంప్రదాయ క్రీడ. క్రీ.పూ నాలుగో శతాబ్దం నుంచే ఈ ఆట ఆడి ఉంటారని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. మహాభారతంలో కూడా ఖోఖో ప్రస్తావన ఉందని కొందరి మాట. అప్పట్లో దీన్ని 'ఖో ధ్వని క్రీడ' అని పిలిచేవారు. అంటే 'ఖో' అని శబ్దం చేస్తూ ఆడే ఆట అని అర్థం.

రకరకాల నియమాలు, విధానాలతో ఆడే ఈ ఆట 1914 నుంచి ఒక స్థిరమైన రూపాన్ని పొందింది. పుణెలోని దక్కన్ జింఖాన్ క్లబ్ వారు ఈ ఆటకు సంబంధించి నిబంధనలు ఏర్పాటు చేసి తొలి రూల్ బుక్ తయారు చేశారు. అనంతరం అనేక పోటీల్లో ఖోఖో భాగమైంది. దక్షిణాసియా క్రీడా పోటీలు, ఖేలో ఇండియా, నేషనల్ గేమ్స్ ఆఫ్ ఇండియా వంటి వేదికలపై ఖోఖో చోటు దక్కించుకుంది.

ఆటలో ఒక జట్టుకు ఏడుగురు క్రీడాకారులు ఉంటారు. వారిలో ఒకరు




పరిగెడుతూ ఉండగా మరో జట్టులోని వ్యక్తి అతణ్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తుంటాడు. అతని వెళ్లే మార్గాన్ని బట్టి పరిగెత్తే వ్యక్తి మరో వ్యక్తిని తట్టి 'ఖో' అంటాడు. వెంటనే అతను లేచి అవతలి జట్టు వ్యక్తి కోసం పరిగెడతాడు. అతని స్థానంలో అతనికి 'ఖో' ఇచ్చిన వ్యక్తి కూర్చుంటాడు. ఇది 'ఖోఖో' ఆడే విధానం. మొదట్లో మట్టి, ఇసుక వంటివి ఉన్నచోట ఖోఖో ఆడేవారు. ప్రస్తుతం స్టేడియంలో ఏర్పాటు చేసిన కోర్టుల్లోనూ ఆడుతున్నారు. మనదేశంలో నస్రీన్ షేక్, సతీష్‌రాయ్, సారికా కాలె, పంకజ్ మల్హోత్రా, మందాకినీ మరీఝ, ప్రవీణ్‌కుమార్ వంటివారు ఖోఖో క్రీడాకారులుగా గుర్తింపు పొందారు.

2024 మార్చిలో జాతీయ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. అందులో మహారాష్ట్ర జట్లు స్త్రీ, పురుషుల విభాగాల్లో విజేతలుగా నిలిచాయి. ఖోఖోకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు 'అంతర్జాతీయ ఖోఖో సమాఖ్య' 2025లో 'ఖోఖో ప్రపంచ కప్ పోటీల'ని నిర్వహించాలని అనుకుంటోంది. ఇందులో భారత ఖోఖో సమాఖ్య కూడా భాగం కానుంది. దీంతోపాటు 2036లో జరిగే ఒలింపిక్స్‌లో ఖోఖోను కూడా చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాబట్టి ఖోఖో నేర్చుకోండి. ఈసారి మరింత ఉత్సాహంగా ఆడండి.

బీమా ప్రీమియంపై పన్ను మినహాయించేనా?

- నేటి భేటీలో తేల్చనున్న జీఎస్‌టీ కౌన్సిల్
- ఖరీదైన వస్తువులపై పెంచే అవకాశం
- సిన్ గూడ్స్‌పై 35 శాతం పన్నుకు సిఫారసు



జైసల్మేర్: జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై పన్ను భారం తొలగించాలన్న కీలక డిమాండ్‌పై జీఎస్‌టీ కౌన్సిల్ శనివారం నాటి భేటీలో నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. అదే సమయంలో ఖరీదైన చేతి గడియారాలు, పాదరక్షలు, వస్త్రాలపై పన్ను పెంపు, కొన్ని రకాల ఉత్పత్తులపై 35 శాతం ప్రత్యేక సిన్ (హానికారక) ట్యాక్స్‌పైనా చర్చించనున్నట్టు సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 55వ జీఎస్‌టీ కౌన్సిల్ భేటీ రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరగనుంది. కౌన్సిల్‌లో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆర్థిక మంత్రులు కూడా పాల్గొననున్నారు. 148 ఉత్పత్తుల పన్ను రేట్ల క్రమబద్ధీకరణపై జీవోఎం నివేదిక కూడా కౌన్సిల్ అజెండాలో ముఖ్యాంశంగా ఉంటుందని తెలుస్తోంది. విమానయాన ఇంధనాన్ని (ఏటీఎఫ్) జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్‌పైనా చర్చించే అవకాశం కనిపిస్తోంది. ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు జొమాటో, స్విగ్గీపై 18 శాతం పన్ను (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌తో) ఉండగా, ఇన్‌పుట్ ట్యాక్స్ ప్రయోజనం లేకుండా 5 శాతానికి తగ్గించాలన్న ప్రతిపాదన సైతం ఉంది. వినియోగించిన ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), చిన్న పెట్రోల్, డీజిల్ వాహనాలపై పన్ను రేటును 12 శాతం నుంచి 18 శాతానికి పెంచాలంటూ ఫిట్‌మెంట్ కమిటీ కౌన్సిల్‌కు నివేదించనున్నట్టు తెలిసింది.

ప్రధాన అంశాలు ఇవే..

టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్‌టీని పూర్తిగా మినహాయించేందుకు బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల బృందం నవంబర్‌లోనే అంగీకారం తెలిపింది. అలాగే, రూ.5 లక్షల సమ్ అష్యూరెన్స్ వరకు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం, 60 ఏళ్లు నిండిన వారికి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై పూర్తి పన్ను మినహాయింపునకు సైతం అంగీకరించింది. ఇందుకు సంబంధించి జీవోఎం ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం తెలపాల్సి ఉంది. రూ.5లక్షలకు మించిన హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై పన్ను రేటులో ఎలాంటి ఉపశమనం ఉండదని తెలుస్తోంది. ఎయిరేటెడ్ బెవరేజెస్, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై పన్ను రేటును 28 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని జీవోఎం ఇప్పటికే తన సిఫారసులను సమర్పించడం గమనార్హం.

గేమింగ్ ప్లాట్‌ఫామ్ ఫీజులపైనే పన్ను..

గేమింగ్ డిపాజిట్లపై కాకుండా ప్లాట్‌ఫామ్ ఫీజులపైనే 28 శాతం జీఎస్‌టీ విధించాలని స్కిల్ ఆన్‌లైన్ గేమ్స్ ఇనిస్టిట్యూట్ (ఎస్‌వోజీఐ) డిమాండ్ చేసింది. తద్వారా ఆఫ్‌షోర్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు పన్ను ఆర్బిట్రేజ్ ప్రయోజనం పొందకుండా అడ్డుకున్నట్టు అవుతుందని ప్రభుత్వానికి సూచించింది. ఉపాధి కల్పన, జీడీపీలో కీలక పాత్ర పోషించే గేమింగ్ పరిశ్రమ పూర్తి సామర్థ్యాల మేరకు రాణించేందుకు సహకరించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు, క్యాసినోల్లో గేమర్లు చేసే డిపాజిట్లపై పన్ను రేటు 18 శాతం ఉండగా, 2023 అక్టోబర్ 1 నుంచి 28 శాతానికి పెంచడం గమనార్హం.

అదనపు ఫ్లోర్ స్పేస్‌పై జీఎస్‌టీ వద్దు: క్రెడాయ్

అదనపు ఫ్లోర్ స్పేస్ (విస్తీర్ణం) కోసం చెల్లించే చార్జీలపై జీఎస్‌టీ విధించొద్దంటూ ప్రభుత్వాన్ని క్రెడాయ్ కోరింది. డిమాండ్‌ను దెబ్బతీస్తుందన్న ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై కేంద్ర ఆర్థిక శాఖకు రియల్టర్ల మండలి క్రెడాయ్ ఒక లేఖ రాసింది. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ)/ అదనపు ఎఫ్ఎస్ఐ కోసం స్థానిక అధికారులకు చెల్లించిన చార్జీలపై 18 శాతం జీఎస్‌టీని విధించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పునరాలోచించాలని కోరింది. ఈ చార్జీ విధింపు నిర్మాణ వ్యయాలను పెంచేస్తుందని, ఫలితంగా దేశవ్యాప్తంగా ఇళ్ల ధరలు 10 శాతం వరకు పెరగొచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాజెక్టు వ్యయాల్లో ఎఫ్ఎస్ఐ/అదనపు ఎఫ్ఎస్ఐ అధిక వాటా కలిగి ఉన్నట్టు క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. ప్రతిపాదిత జీఎస్‌టీ విధింపు ఇళ్ల సరఫరా, డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తుందన్నారు.

దేశీయ, అంతర్జాతీయ అంశాలపై ఆర్‌బీఐ సమీక్ష

గువహటిలో 612వ బోర్డ్ సమావేశం



గువహటి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇక్కడ జరిగిన 612వ సెంట్రల్ బోర్డ్ సమావేశంలో దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై చర్చించింది. కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరిగిన మొదటి బోర్డ్ సమావేశమిది. సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా శక్తికాంత్ దాస్ ఆరేళ్లు అందించిన విశేష సేవలను బోర్డ్ ప్రశంసించింది. ''ప్రపంచ, దేశీయ ఆర్థిక పరిస్థితిని, అవుట్‌లుక్‌ను బోర్డ్ సమీక్షించింది. ఎంపిక చేసిన సెంట్రల్ బ్యాంక్ శాఖల కార్యకలాపాలతో పాటు దేశంలో 'బ్యాంకింగ్ ధోరణి, పురోగతి-2023-24'పై ముసాయిదా నివేదికపై చర్చించింది'' అని ఆర్‌బీఐ ప్రకటన ఒకటి పేర్కొంది. సెంట్రల్ బోర్డు ఇతర డైరెక్టర్లు సతీష్ కె మరాఠే, రేవతి అయ్యర్, సచిన్ చతుర్వేది, వేణు శ్రీనివాసన్, రవీంద్ర హెచ్ ధోలాకియాలు సమావేశానికి హాజరయ్యారు. డిప్యూటీ గవర్నర్లు మైఖేల్ దేబబ్రత పాత్ర, ఎం రాజేశ్వర్ రావు, టీ రబీ శంకర్, స్వామినాథన్ జే కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి నాగరాజు మద్దిరాల సమావేశంలో పాల్గొన్న వారిలో ఉన్నారు.

ఇండస్‌ఇండ్ బ్యాంక్‌తో నిప్పన్ లైఫ్ చర్చలు

బ్యాంకష్యూరెన్స్ టైఅప్ కోసం కృషి

న్యూఢిల్లీ: ఇండస్‌ఇండ్ బ్యాంక్‌తో టైఅప్ కోసం రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ సంప్రదింపులు మొదలు పెట్టింది. ఇండస్ ఇండ్ బ్యాంక్ ప్రమోటర్ అయిన ఇండస్ ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఐఐహెచ్‌ఎల్).. నిప్పన్ లైఫ్ మాతృసంస్థ రిలయన్స్ క్యాపిటల్‌ను కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్‌సీఎల్‌టీ బిడ్డింగ్‌లో ఐఐహెచ్‌ఎల్ విజేతగా నిలవడం గమనార్హం. ఈ లావాదేవీ వచ్చే నెల చివరికి పూర్తవుతుందని తెలుస్తోంది. దీంతో అప్పుడు ఇరు సంస్థలకూ మాతృసంస్థ ఒక్కటే అవుతుంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇండస్ ఇండ్ బ్యాంక్‌తో బ్యాంకష్యూరెన్స్ టైఅప్ కోసం రిలయన్స్ క్యాపిటల్ సంప్రదింపులు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. ఇది ఇరు సంస్థలకు ప్రయోజనం కలిగిస్తుందని రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఈవో ఆశిష్ వోహ్రా తెలిపారు. అదే సమయంలో ఇతర సంస్థలతోనూ ఇదే విధమైన భాగస్వామ్యం కోసం కృషి చేస్తున్నట్టు చెప్పారు.

పిల్లల కేటగిరీలోకి ఈమోటోరాడ్

వచ్చే ఆరు నెలల్లో 30 ఉత్పత్తులు



ముంబై: ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీ సంస్థ ఈమోటోరాడ్ తాజాగా పిల్లల వాహనాల విభాగంలోకి ప్రవేశించింది. ఫార్ములా ఫన్ పేరిట కొత్త కేటగిరీ ప్రారంభించింది. వచ్చే రెండేళ్లలో దీనిపై రూ. 150 కోట్లు ఇన్వెస్ట్ చేసే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది. రైడ్ ఆన్ కార్లు సహా పిల్లలకు సంబంధించి ప్రీమియం వాహనాలను ఆవిష్కరించేందుకు బ్రిటన్‌కు చెందిన ఆటబొమ్మల రిటైల్ సంస్థ హ్యామ్లీస్‌తో చేతులు కలిపినట్లు వివరించింది. దేశీయంగా పిల్లల మొబిలిటీ మార్కెట్ రూ. 1,000 కోట్ల పైగా ఉన్నప్పటికీ అసంఘటితంగానే ఉన్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు కునాల్ గుప్తా తెలిపారు. ప్రీమియం నాణ్యత, భద్రతపై ప్రధానంగా దృష్టి పెడుతూ దీన్ని సంఘటిత రంగంగా క్రమబద్ధీకరించే యోచనలో ఉన్నట్లు వివరించారు. ఫార్ములా ఫన్ ఉత్పత్తుల రేట్లు రూ. 3,000 నుంచి, ప్రీమియం రైడ్-ఆన్ కార్ల ధరలు రూ. 9,999 నుంచి ప్రారంభమవుతాయి. వచ్చే ఆరు నెలల్లో 30 పైగా ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నట్లు గుప్తా చెప్పారు.

ఒకసారి చార్జింగ్‌తో 153 కిలోమీటర్లు

- బజాజ్ కొత్త చేతక్ 35 సిరీస్
- మూడు వేరియంట్లలో లభ్యం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం బజాజ్ ఆటో ఎలక్ట్రిక్ స్కూటర్ చేతక్ నుంచి సరికొత్త 35 సిరీస్‌ను ఆవిష్కరించింది. 3.5 కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యంతో మూడు వేరియంట్లలో వీటిని రూపొందించింది. ఒకసారి చార్జింగ్‌తో 153 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. కొత్త చేతక్ రూ.1.2 లక్షల ధరతో మిడ్ వేరియంట్ 3502, రూ.1.27 లక్షల ధరతో టాప్-ఎండ్ వేరియంట్ 3501 మాత్రమే ప్రస్తుతానికి విడుదలైంది. వీటి టాప్ స్పీడ్ గంటకు 73 కిలోమీటర్లు. బేస్ వేరియంట్ అయిన 3503 కొద్ది రోజుల్లో రంగ ప్రవేశం చేయనుంది. ఈ వేరియంట్ టాప్ స్పీడ్ గంటకు 63 కిలోమీటర్లు. డెలివరీలు డిసెంబర్ చివరి వారం నుంచి ప్రారంభం అతుతాయి. నావిగేషన్, మ్యూజిక్ కంట్రోల్, కాల్స్ అందుకునేలా స్మార్ట్ టచ్‌స్క్రీన్ పొందుపరిచారు. సీటు కింద 35 లీటర్ల స్టోరేజ్ ఏర్పాటు ఉంది. స్టోరేజ్ స్థలం పరంగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల్లో ఇదే అత్యధికం. రిమోట్ ఇమ్మొబిలైజేషన్, గైడ్ మీ హోమ్ లైట్స్, జియో ఫెన్సింగ్, యాంటీ థెఫ్ట్, యాక్సిడెంట్ డిటెక్షన్ వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయి. 3501 మూడు గంటల్లో, 3502 వేరియంట్ 3 గంటల 25 నిముషాల్లో 80 శాతం చార్జింగ్ పూర్తి అవుతుందని కంపెనీ తెలిపింది. వారంటీ మూడేళ్లు లేదా 50,000 కిలోమీటర్లు.

వచ్చే ఏడాది మెరుగ్గా ఉపాధి అవకాశాలు

- 9 శాతం వృద్ధి ఉండొచ్చు
- ఐటీ, రిటైల్, టెలికం, బీఎఫ్ఎస్ఐ ఆశాజనకం
- ఫౌండిట్ సంస్థ నివేదిక వెల్లడి



ముంబై: వచ్చే ఏడాదిలోనూ నియామకాలు జోరుగా సాగనున్నాయి. 9 శాతం మేర నియామకాలు పెరగనున్నట్టు జాబ్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ (గతంలో మాన్‌స్టర్ ఏపీఏసీ) వెల్లడించింది. ముఖ్యంగా ఐటీ, రిటైల్, టెలికం, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో నియామకాలు మెరుగ్గా ఉంటాయని అంచనా వేసింది. ఈ ఏడాది మొత్తం మీద 10 శాతం మేర ఉపాధి అవకాశాల్లో వృద్ధి ఉంటుందని, రానున్న రోజుల్లో ఈ ధోరణి వేగాన్ని అందుకుంటుందని తెలిపింది. కొత్త టెక్నాలజీలు, మారుతున్న వ్యాపార సంస్థల ప్రాధాన్యతలు 2025లో ఉద్యోగ మార్కెట్ తీరును నిర్ణయించనున్నట్టు పేర్కొంది. ఎడ్జ్ కంప్యూటింగ్, క్వాంటమ్ అప్లికేషన్స్, అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ సిస్టమ్‌లు.. తయారీ, హెల్త్‌కేర్, ఐటీ రంగాల్లో మార్పును తీసుకురానున్నట్టు వివరించింది. 2023 జనవరి నుంచి 2024 నవంబర్ వరకు ఫౌండిట్ ప్లాట్‌ఫామ్‌పై డేటా విశ్లేషణ ఆధారంగా ఈ వివరాలను విడుదల చేసింది. రిటైల్ మీడియా నెట్‌వర్క్‌లు, ఏఐ ఆధారిత విశ్లేషణ టూల్స్‌తో ఈ-కామర్స్, హెచ్‌ఆర్, డిజిటల్ సేవల్లో నిపుణుల అవసరాల తీరును మారుతుందని పేర్కొంది. డిజిటల్ మార్కెటింగ్, యాడ్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ అనలైటిక్స్‌లో నిపుణులను సంస్థలు నియమించుకుంటాయని తెలిపింది.

ఈ ఏడాదీ మెరుగైన పనితీరు..

2023తో పోల్చి చూసినప్పుడు ఈ ఏడాది అన్ని రంగాల్లో, అన్ని పట్టణాల్లో జాబ్ మార్కెట్ బలమైన వృద్ధిని చూసినట్టు ఫౌండిట్ తెలిపింది. తయారీలో 30 శాతం, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్‌లో 29 శాతం, రియల్ ఎస్టేట్‌లో 21 శాతం చొప్పున నియామకాలు పుంజుకున్నట్టు పేర్కొంది. కోయింబత్తూర్‌లో 27 శాతం, జైపూర్‌లోనూ 22 శాతం మేర నియామకాల్లో వృద్ధి కనిపించినట్టు తెలిపింది. చురుకైన పారిశ్రామిక కార్యకలాపాలు, డిజిటలైజేషన్‌కు మళ్లడం, పట్టణీకరణ సానుకూలించినట్టు వివరించింది.

ప్రమాణాలు నెలకొల్పడంలో సత్తా చాటాలి

తయారీ సంస్థలకు కేంద్రం సూచన



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పగలిగే సత్తా తమలోనూ ఉందని గుర్తించి, ముందుకెళ్లాలని దేశీ తయారీ సంస్థలకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే సూచించారు. నిష్క్రియాత్మకమైన ధోరణిని విడిచిపెట్టాలని పరిశ్రమల సమాఖ్య సీఐఐ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు సంబంధించి టాప్ అయిదు దేశాల జాబితాలో యూరప్ ఆధిపత్యమే కొనసాగుతుండగా, ఆ లిస్టులో భారత్ లేకపోవడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. మన దేశ పరిస్థితులకు అనుగుణమైనవి కాకపోయినప్పటికీ మిగతా దేశాలు నెలకొల్పిన ప్రమాణాలను మనం పాటించాల్సిన అవసరం ఉంటోందని నిధి వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధ విషయంలో భారత్‌లో గణనీయంగా ప్రతిభావంతులు ఉన్నప్పటికీ ఆమె చెప్పారు. అయితే, ముందుకెళ్లాలంటే కనిపించని అవరోధాలు ఉన్నాయని, వాటిని అధిగమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మరోవైపు, గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం)తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)ను అనుసంధానం చేయడం సహా నాణ్యతా ప్రమాణాలను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రపంచ స్థాయి సర్వీసులు అందించేందుకు టెస్టింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, ప్రైవేట్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయడం మొదలైన వాటిపై దృష్టి పెడుతోందని పేర్కొన్నారు.

ఓఎన్‌జీసీ నుంచి పవన్ హన్స్‌కు ఆర్డర్

డీల్ విలువ రూ.2,141 కోట్లు



ముంబై: ప్రభుత్వ యాజమాన్యంలోని హెలికాప్టర్ సేవల ఆపరేటర్ పవన్ హన్స్ తాజాగా ఓఎన్‌జీసీ నుంచి భారీ కాంట్రాక్ట్ దక్కించుకుంది. ఇందులో భాగంగా ఓఎన్‌జీసీ ఆఫ్-షోర్ కేంద్రాలకు సిబ్బందిని తరలించడానికి నాలుగు హెలికాప్టర్లను పవన్ హన్స్ సమకూరుస్తుంది. ఈ డీల్ విలువ రూ.2,141 కోట్లు. 10 ఏళ్లపాటు పవన్ హన్స్ ఈ సేవలను అందించాల్సి ఉంటుంది. అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ద్వారా కాంట్రాక్ట్ దక్కించుకున్నట్టు పవన్ హన్స్ వెల్లడించింది. హెచ్ఏఎల్ తయారీ అత్యాధునిక ధ్రువ్ ఎన్‌జీ హెలికాప్టర్లను పవన్ హన్స్ వినియోగించనుంది. 'దేశీయంగా తయారు చేసిన ధ్రువ్ ఎన్‌జీ అనేది అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ (ఏఎల్‌హెచ్) ఎంకే-3 యొక్క సివిల్ వేరియంట్. ఏఎల్‌హెచ్ ఎంకే-3ని ప్రస్తుతం భారత రక్షణ దళాలు ఉపయోగిస్తున్నాయి. ఈ సైనిక హెలికాప్టర్లు నిరూపితమైన ట్రాక్ రికార్డును కలిగి ఉన్నాయి. ఇప్పటి వరకు 335 కంటే ఎక్కువ హెలికాప్టర్లు రంగ ప్రవేశం చేశాయి. ఇవన్నీ కలిపి మొత్తం 3,75,000 గంటలపాటు గగనతల విహారం చేశాయి' అని పవన్ హన్స్ తెలిపింది. సంస్థ వద్ద ప్రస్తుతం 46 హెలికాప్టర్లు ఉన్నాయి. ఇవి చమురు, సహజ వాయువు అన్వేషణ, పోలీసు, కేంద్ర బలగాలు తరలింపు, యుటిలిటీ రంగంతోపాటు మారుమూల, కొండ ప్రాంతాలకు కనెక్టివిటీని అందిస్తున్నాయి.

జెట్‌వర్క్‌కు రూ.766 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: సీఎన్‌సీ మెషీనింగ్, డై క్యాస్టింగ్ తయారీలో ఉన్న జెట్‌వర్క్ తాజాగా రూ.766 కోట్ల నిధులు సమీకరించింది. ఖోస్లా వెంచర్స్ నేతృత్వంలోని ఫండింగ్ రౌండ్‌లో అనేక వాయిదాలలో ఈ మొత్తాన్ని అందుకున్నట్టు కంపెనీ తెలిపింది. ఈ డీల్ ద్వారా 3.1 బిలియన్ డాలర్లుగా జెట్‌వర్క్‌ను విలువ కట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో ఈ విలువ 2.7 బిలియన్ డాలర్లు. ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక శక్తి, విమానయానం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో తయారీ కోసం వివిధ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నట్టు జెట్‌వర్క్ కో-ఫౌండర్, సీఈవో అమృత్ ఆచార్య తెలిపారు. 'ఆరేళ్ల క్రితం జెట్‌వర్క్ కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయి. ఈ ఏడాది రూ.17,564 కోట్ల విలువైన ఉత్పత్తులను సరఫరా చేశాం. గతేడాది ఇది రూ.13,000 కోట్లుగా ఉంది. కంపెనీ సరఫరా చేసిన మొత్తం ఉత్పత్తుల్లో యూఎస్ వాటా 20 శాతం ఉంది. గతంలో ఈ క్లయింట్లు చైనా నుంచి కొనుగోలు చేసేవారు. ఇప్పుడు భారత్ నుంచి స్వీకరిస్తున్నారు. 2023-24లో రూ.15,000 కోట్ల టర్నోవర్ నమోదు చేశాం. 12-18 నెలల్లో ఐపీవోకు వెళ్లాలన్నది ఆలోచన' అని వెల్లడించారు.

అల్ట్రాటెక్-ఇండియా సిమెంట్స్ డీల్‌కు సీసీఐ ఓకే..

న్యూఢిల్లీ: ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ సిమెంట్ మెజారిటీ వాటాలను కొనుగోలు చేసే ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే ఓపెన్ ఆఫర్ ద్వారా మరో 26 శాతం వరకు వాటాల కొనుగోలుకు కూడా ఆమోదముద్ర వేసింది. ఒప్పందం ప్రకారం ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్, శ్రీ శారదా లాజిస్టిక్స్ నుంచి అల్ట్రాటెక్ సిమెంట్ 32.72 శాతం వాటాలను దక్కించుకోనుంది. ఇందుకోసం సుమారు రూ. 3,954 కోట్లు, ఓపెన్ ఆఫర్‌కి సంబంధించి రూ. 3,142 కోట్లు వెచ్చించనుంది. ఈ డీల్‌తో, వేగంగా వృద్ధి చెందుతున్న దక్షిణాది మార్కెట్‌లో, ముఖ్యంగా తమిళనాడులో కార్యకలాపాలను విస్తరించే యోచనలో ఉంది. గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌లో భాగమైన అల్ట్రాటెక్ సంస్థ .. గ్రే సిమెంట్, వైట్ సిమెంట్, రెడీ మిక్స్ కాంక్రీట్ మొదలైన ఉత్పత్తుల తయారీ, విక్రయ కార్యకలాపాలు సాగిస్తోంది. అటు ఇండియా సిమెంట్స్ సంస్థ రెడీమిక్స్ కాంక్రీట్, గ్రే సిమెంట్ తయారీ, విక్రయ కార్యకలాపాలు సాగిస్తోంది.



రియల్టీలో పీఈ పెట్టుబడులు అప్

2024లో 4.15 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: దేశీ రియల్టీ రంగంలో ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) పెట్టుబడులు భారీగా ఎగశాయి. ప్రస్తుత క్యాలండర్ ఏడాది(2024)లో ఇప్పటివరకూ 4.15 బిలియన్ డాలర్లు లభించాయి. రియల్టీ రంగ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం వార్షికంగా ఇవి 32 శాతం అధికం. పెట్టుబడుల్లో అత్యధికంగా హౌసింగ్ విభాగానికి ప్రవహించినట్లు తెలియజేసింది. 2024 ఇండియాలో పీఈ పెట్టుబడుల ట్రెండ్ పేరుతో నివేదికను విడుదల చేసింది. ఈ వివరాల ప్రకారం 2024లో ఇప్పటి వరకూ రియల్టీలో పీఈ పెట్టుబడులు 415 కోట్ల డాలర్లను అధిగమించాయి.

వేర్‌హౌసింగ్ ఆధిపత్యం

రియల్టీ రంగ మొత్తం పీఈ పెట్టుబడుల్లో వేర్‌హౌసింగ్ 45 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలవగా.. రెసిడెన్షియల్ విభాగం 28 శాతం వాటాను ఆక్రమించింది. కార్యాలయ విభాగం 26 శాతం పెట్టుబడులను ఆకట్టుకుంది. అయితే గతేడాదితో పోలిస్తే రెసిడెన్షియల్ విభాగం రెట్టింపునకుపైగా వృద్ధితో 117.7 కోట్ల డాలర్లు అందుకుంది. గృహ కొనుగోళ్లలో వినియోగదారుల నుంచి పెరుగుతున్న డిమాండ్ ప్రభావం చూపుతోంది. కాగా.. వేర్‌హౌసింగ్‌కు 187.7 కోట్ల డాలర్లు అందితే.. ఆఫీస్ ప్రాపర్టీలకు 109.8 కోట్ల డాలర్లు లభించాయి.

పదేళ్లుగా

ప్రధానంగా భారత్‌లో గత దశాబ్ద కాలం నుంచి పెట్టుబడులు పుంజుకుంటున్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్, ఎండీ శిశిర్ బైజల్ పేర్కొన్నారు. ఇందుకు ఆర్థిక సుస్థిరత, నిరవధిక వృద్ధి సహకరిస్తున్నట్లు తెలియజేశారు. ఈకామర్స్, థర్డ్‌పార్టీ లాజిస్టిక్స్ ఊపందుకున్న నేపథ్యంలో వేర్‌హౌసింగ్‌కు భారీ డిమాండ్ నెలకొన్నట్లు వివరించారు. వెరసి వేర్‌హౌసింగ్ విభాగం అత్యధిక పెట్టుబడులకు నెలవుగా మారినట్లు తెలియజేశారు. ఈ బాటలో గృహ రంగం సైతం ప్రస్తావించదగ్గ స్థాయిలో పెట్టుబడులను ఆకట్టుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఆఫీసులు ఓకే

పీఈ పెట్టుబడుల్లో కార్యాలయ విభాగం కొంత మేర నీరసించినప్పటికీ ఉద్యోగులు తిరిగి వర్క్‌ప్లేస్‌లకు రావడం, ఆఫీసులు పెరగడం, అద్దెలు బలపడటం వంటి అంశాలు అండగా నిలుస్తున్నట్లు శిశిర్ వివరించారు.

ఇక దేశీయంగా మొత్తం రియల్టీ పీఈ పెట్టుబడుల్లో ముంబై 50 శాతం వాటాను ఆక్రమించడం గమనార్హం! మొత్తం పెట్టుబడుల్లో 42 శాతం వాటాకు సమానమైన 1.7 బిలియన్ డాలర్లు యూఏఈ నుంచి లభించాయి. దేశీ పీఈ ఇన్వెస్టర్లు 32 శాతం వాటాకు సమానమైన 1.3 బిలియన్ డాలర్లు సమకూర్చారు! సింగపూర్ ఫండ్స్, ఇన్‌స్టిట్యూషన్స్ నుంచి 63.37 కోట్ల డాలర్లు ప్రవహించాయి.

హోండా కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హోండా కార్స్ ఇండియా 2025 జనవరి 1 నుండి ధరలను 2 శాతం వరకు పెంచనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. పెరుగుతున్న ముడిసరుకు వ్యయాల ప్రభావాన్ని తగ్గించుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ మార్కెటింగ్, సేల్స్ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ వివరించారు. ఇప్పటికే మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్ సహా వివిధ కార్ల తయారీ సంస్థలు జనవరి నుండి ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి.

టాటా పవర్, కెనరా బ్యాంక్ జత

రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్‌కు దన్ను



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం టాటా పవర్ రెనెవబుల్ ఎనర్జీ పీఎస్‌యూ సంస్థ కెనరా బ్యాంక్‌తో చేతులు కలిపింది. తద్వారా పీఎం సూర్య ఘర్ పథకంకింద రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలకు తెరతీయనున్నాయి. దీనిలో భాగంగా కుటుంబా(వినియోగదారు)లు సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను సులభంగా పొందగలిగేలా సహకారాన్ని అందించనున్నాయి. వెరసి ఆకర్షణీయ ఫైనాన్సింగ్ అవకాశాలను కల్పించనున్నాయి. దీంతో ప్రజలు మరింతగా సస్టెయినబుల్ ఎనర్జీ వినియోగంవైపు మళ్లేందుకు సహకారమందించనున్నట్లు టాటా పవర్ పేర్కొంది. అందుబాటు ధరలలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేందుకు వీలుకల్పించనున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ దీపేష్ నందా తెలియజేశారు. పీఎం సూర్య ఘర్ పథకంకింద వినియోగదారుల అవసరాలకు అనుగుణమైన ఫైనాన్సింగ్ సౌకర్యాలకు తెరతీయనున్నట్లు వివరించారు. పథకంలో భాగంగా 3 కిలోవాట్లవరకూ 10 శాతం మార్జిన్ మనీతో రూ. 2 లక్షల వరకూ రుణాలను అందించనున్నట్లు కెనరా బ్యాంక్ రిటైల్ రుణాల జీఎం ఆర్.అనురాధ వెల్లడించారు. తద్వారా 10ఏళ్ల కాలానికి 7 శాతం వార్షిక వడ్డీతో హామీలేని రుణాలను కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ బాటలో 3 నుంచి 10 కేవీ వ్యవస్థలకు 20 శాతం మార్జిన్ మనీతో రూ. 6 లక్షల వరకూ రుణాలు లభించనున్నాయి. వీటికి కాలపరిమితి పదేళ్లుకాగా.. 10 శాతం వార్షిక వడ్డీ రేటు వర్తించనుంది.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,345.30	1.49
JSWSTEEL	931.45	0.59
ICICIBANK	1,292.00	0.4
NESTLEIND	2,165.00	0.21
HDFCLIFE	623.75	0.03

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,685.85	-3.9
AXISBANK	1,070.00	-3.51
INDUSINDBK	930.9	-3.47
M&M	2,916.95	-3.24
TRENT	6,880.00	-2.99

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-12-2024

విశాఖ	600-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600-00
విజయవాడ	600-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	570-00
వరంగల్	572-00
రిటైల్ ధర	6.30

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,263
ఎన్ఎస్ఈ	1,41,780
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,85,294
ఎఫ్ఐఐ	- 3,560
డీఐఐ	+ 1,374

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.69	$ 70.58
బ్రెంట్	73.12	$ 72.88


కమ్రాన్ గులామ్

పాకిస్తాన్‌దే వన్డే సిరీస్

దక్షిణాఫ్రికాపై రెండో వన్డేలో ఘన విజయం

కేప్‌టౌన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న పాకిస్తాన్ జట్టు... దక్షిణాఫ్రికాపై వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన రెండో వన్డేలో పాకిస్తాన్ 81 పరుగుల తేడాతో ఆతిథ్య దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. తద్వారా మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో సిరీస్ చేజిక్కించుకుంది. పాకిస్తాన్ జట్టుకు విదేశాల్లో ఇది వరుసగా రెండో సిరీస్ విజయం కావడం విశేషం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 49.5 ఓవర్లలో 329 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (82 బంతుల్లో 80; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (95 బంతుల్లో 73; 7 ఫోర్లు) అర్ధ శతకాలతో ఆకట్టుకోగా... కమ్రాన్ గులామ్ (32 బంతుల్లో 63; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. సఫారీ బౌలర్లను ఓ ఆటాడుకుంటూ ఎడాపెడా బౌండ్రీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడి దూకుడుతో పాకిస్తాన్ చివరి 10 ఓవర్లలో 105 పరుగులు రాబట్టింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎమ్‌పాకా 4, యాన్సెన్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 43.1 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్ (74 బంతుల్లో 97; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) కొద్దిలో సెంచరీ చేజార్చుకోగా... తక్కినవాళ్లు ఆకట్టుకోలేకపోయారు. కెప్టెన్ తెంబా బవుమా (12), టోనీ (34), డసెన్ (23), మార్క్‌రమ్ (21), మిల్లర్ (29) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. పాకిస్తాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది 4, నసీమ్ షా మూడు వికెట్లు పడగొట్టారు. ధనాధన్ ఇన్నింగ్స్‌తో దంచికొట్టిన కమ్రాన్ గులామ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన మూడో వన్డే ఆదివారం జొహాన్నెస్‌బర్గ్‌లో జరగనుంది.


విన్నర్స్ ట్రోఫీతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు

బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్

మూడో టి20లోనూ వెస్టిండీస్ పరాజయం

కింగ్‌స్‌టౌన్: వెస్టిండీస్ పర్యటనలో వన్డే సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన బంగ్లాదేశ్ జట్టు... టి20 సిరీస్‌లో విజృంభించింది. మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఆతిథ్య వెస్టిండీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న బంగ్లాదేశ్ గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఆఖరి టి20లో బంగ్లాదేశ్ 80 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తుచేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ జాకీర్ అలీ (41 బంతుల్లో 72 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ అర్ధ శతకంతో ఆకట్టుకోగా... పర్వేజ్ హుసేన్ (39; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మెహిదీ హసన్ మిరాజ్ (29; 3 ఫోర్లు) పర్వాలేదనిపించారు. వెస్టిండీస్ బౌలర్లలో రొమారియో షెఫర్డ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో వెస్టిండీస్ 16.4 ఓవర్లలో 109 పరుగులకే ఆలౌటైంది. బౌలింగ్‌లో ఆకట్టుకున్న షెఫర్డ్ (33; 1 ఫోర్, 3 సిక్స్‌లు) బ్యాటింగ్‌లోనూ పోరాడాడు. కెప్టెన్ రావ్‌మన్ పావెల్ (2), రోస్టన్ చేజ్ (0), బ్రండన్ కింగ్ (0), పూరన్ (15) విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో రిషాద్ హుసన్ 3... తస్కీన్ అహ్మద్, మెహిదీ హసన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. జాకీర్ అలీకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', మెహిదీ హసన్‌కు 'ప్లేయర్ ఆఫ్ సిరీస్' అవార్డులు దక్కాయి.

జూనియర్ చాలెంజ్ వరల్డ్ ఈవెంట్‌కు భారత్

జట్టులో రిషిత రెడ్డి సభ్యురాలు



సాక్షి, హైదరాబాద్: ఐసీ రాడ్‌లేవర్ జూనియర్ టెన్నిస్ చాలెంజ్ టోర్నమెంట్‌లో భారత జట్టు వరల్డ్ ఈవెంట్‌కు అర్హత సాధించింది. ఆసియా–ఓసియానియా ఈవెంట్‌లో భాగంగా జరిగిన పోరులో భారత జట్టు 4–2 తేడాతో జపాన్‌పై విజయం సాధించింది. ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు సభ్యులుగా ఉన్న ఈ టీమ్‌లో తెలంగాణకు చెందిన బసిరెడ్డి రిషిత కూడా ఉంది. ఇటీవల జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న రిషితా రెడ్డి వరుసగా మూడు ఐటీఎఫ్ టోర్నీలు గెలిచి సత్తా చాటింది. ఆమెతో పాటు ఆరాధ్య క్షితిజ్, సోహిని మొహంతి, సమర్థ్ సహిత బరిలోకి దిగారు. భారత జట్టుకు కెప్టెన్‌గా విక్రమ్ ఆనంద్ వ్యవహరించారు. ముందుగా నలుగురు భారత ప్లేయర్లు తమ సింగిల్స్ మ్యాచ్‌లలో విజయాలు సాధించారు. రిషిత 6–1, 6–3 స్కోరుతో మియూ తకిగుచిపై విజయం సాధించగా...సోహిని 7–5, 6–4తో కీ సవాకీపై, క్షితిజ్ 6–1, 6–3తో జున్యా కవమురపై, సమర్థ్ 7–6 (7/3), 6–1తో తామొకి పుజివరపై గెలుపొందారు. అయితే బాలుర, బాలికల విభాగాల్లో డబుల్స్ మ్యాచ్‌లు గెలిచి జపాన్ ఓటమి అంతరాన్ని తగ్గించింది. ఆరాధ్య–సమర్థ్ 4–6, 6–3, 4–6తో కొవముర–పుజివర చేతిలో...సాహిని–రిషిత 5–7, 3–6తో సవాకి–తకిగుచి చేతిలో ఓడారు. ఈ టోర్నీలో ఆతిథ్య సింగపూర్‌లో మూడో స్థానం దక్కింది. వరల్డ్ ఈవెంట్ వచ్చే ఏడాది జూన్‌లో స్పెయిన్‌లో జరిగే అవకాశం ఉంది.

కర్నాటక, హరియానా జట్లకు టైటిల్స్



జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

బెంగళూరు: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కర్నాటక పురుషుల జట్టు ఐదు దశాబ్దాల తర్వాత విజేతగా నిలిచింది. మహిళల టైటిల్‌ను హరియానా జట్టు కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన టీమ్ ఈవెంట్ ఫైనల్స్‌లో ఆతిథ్య కర్నాటక జట్టు 3–1 స్కోరుతో రైల్వేస్ జట్టుపై ఘన విజయం సాధించింది. తొలి సింగిల్స్‌లో డి.ఎస్.సనీత్ 21–23, 16–21తో చిరాగ్ సేన్ చేతిలో ఓడిపోవడంతో కర్నాటక 0–1తో వెనుకబడింది. కానీ తర్వాత జరిగిన రెండు సింగిల్స్, ఒక డబుల్స్ పోటీల్లో జట్టు షట్లర్లు సత్తా చాటడంతో కర్నాటక టైటిల్ గెలుచుకుంది. రెండో సింగిల్స్‌లో భార్గవ్ (కర్ణాటక) 13–21, 21–18, 21–16తో ఆయుశ్ షెట్టిపై గెలుపొందగా, డబుల్స్‌లో నికోలస్ నతన్ రాజ్–తుషార్ సువీర్ 16–21, 21–9, 21–19తో పృథ్వీ రాయ్–సాయి ప్రతీక్ జంటపై విజయం సాధించింది. తర్వాత జరిగిన మూడో సింగిల్స్‌లో రఘు 21–12, 21–10తో సిద్ధార్థ్ ప్రతాప్ సింగ్‌పై అలవోక విజయం సాధించడంతో 3–1తో గెలిచింది. దీంతో మరో డబుల్స్ మ్యాచ్ ఆడించలేదు. మహిళల టీమ్ ఈవెంట్ తుది పోరులో హరియానా 3–2తో గుజరాత్ జట్టుపై గెలుపొందింది. తొలి సింగిల్స్‌లో హరియానా అమ్మాయి దేవిక సిహాగ్ 25–27, 10–21తో తస్నీమ్ మీర్ చేతిలో ఓడింది. రెండో మ్యాచ్‌లో అన్‌మోల్ ఖర్బ్ 14–21, 21–17, 21–15తో ఆదిత రావును ఓడించడంతో స్కోరు 1–1తో సమమైంది. డబుల్స్‌లో ఉన్నతి హుడా–అన్‌మోల్ జోడీ 21–8, 21–12తో షెనస్ క్రిస్టియాన్–అంజలీ రావత్ జంటపై సునాయాస విజయం సాధించి 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే మూడో సింగిల్స్‌లో ఉన్నతి హుడా 21–19, 19–21, 15–21తో శ్రేయా లెలె చేతిలో ఓడటంతో స్కోరు 2–2తో సమమైంది. ఈ దశలో నిర్ణాయక రెండో డబుల్స్ పోరులో దేవిక–రిధి కౌర్ ద్వయం 9–21, 21–19, 21–13తో తస్నీమ్ మీర్–అదిత రావు జంటపై నెగ్గడంతో హరియానా విజేతగా నిలిచింది. టీమ్ ఈవెంట్ పోటీలు ముగియడంతో నేటి (శనివారం) నుంచి పురుషుల, మహిళల వ్యక్తిగత విభాగం పోటీలు జరుగుతాయి.



సెమీఫైనల్లో తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: జాతీయ సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న టోర్నీ అండర్–13 బాలికల క్వార్టర్ ఫైనల్లో శుక్రవారం తెలంగాణ జట్టు 74–73 పాయింట్ల తేడాతో ఛత్తీస్‌గఢ్‌పై గెలిచింది. హోరాహోరీగా సాగిన పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఛత్తీస్‌గఢ్‌పై తెలంగాణ జట్టు ఉత్కంఠ విజయం సాధించింది. తెలంగాణ జట్టు తరఫున మైత్రి 23 పాయింట్లతో అదరగొట్టగా... ఆరాధ్య 22 పాయింట్లు, చరిత 13 పాయింట్లతో ఆకట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ తరఫున గుర్‌ప్రీత్ 32 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. తొలి క్వార్టర్ ముగిసే సమయానికి తెలంగాణ జట్టు 20–26తో వెనుకంజలో నిలిచింది. ఆ తర్వాత రెండో క్వార్టర్‌లోనూ ఛత్తీస్‌గఢ్ ప్లేయర్లు సత్తాచాటడంతో తెలంగాణ జట్టు 37–44తో నిలిచింది. మూడో క్వార్టర్‌లో కాస్త మెరుగైన ప్రదర్శన చేసిన తెలంగాణ జట్టు 56–60తో చివరి క్వార్టర్‌లోకి ప్రవేశించింది. ఆఖర్లో సర్వశక్తులు ఒడ్డిన తెలంగాణ ప్లేయర్లు... డిఫెండింగ్ చాంపియన్‌కు షాకిస్తూ కీలక విజయం సాధించారు.

సెమీఫైనల్లో రష్మిక జోడీ ఓటమి

నవీ ముంబై: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల డబ్ల్యూ50 టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. ఇప్పటికే సింగిల్స్ విభాగంలో ఓడిపోయిన రష్మిక... డబుల్స్ విభాగంలో సెమీ ఫైనల్లో పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక (భారత్)–జిబెక్ కులమ్‌బయేవా (కజకిస్తాన్) జంట 3–6, 6–3, 5–10తో జీల్ దేశాయ్ (భారత్)–రియా భాటియా (భారత్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. ఈ పోరులో రెండు ఏస్‌లు సంధించిన రష్మిక జోడీ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. హైదరాబాద్‌కే చెందిన సహజ యామలపల్లి మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలైంది. రెండో సీడ్ సహజ శుక్రవారం క్వార్టర్స్‌లో 6–7 (5/7), 3–6తో ఎకతెరీనా రిన్‌గోల్డ్ చేతిలో ఓడింది.

భారత్, మాల్దీవుల 'ఫ్రెండ్లీ' మ్యాచ్‌లు

ఇరు దేశాల మహిళల జట్ల మధ్య ఈ నెల 30న తొలి పోరు

న్యూఢిల్లీ: భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు మాల్దీవులుతో అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడనుంది. ఈ నెల 30న ఇరు జట్ల మధ్య తొలి ఫ్రెండ్లీ మ్యాచ్ జరగనుండగా... వచ్చే ఏడాది జనవరి 2న రెండో మ్యాచ్ నిర్వహించనున్నట్లు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) శుక్రవారం వెల్లడించింది. ఈ రెండు మ్యాచ్‌లను బెంగళూరులోని పదుకోన్–ద్రవిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపింది. 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో భారత మహిళల జట్టు 69వ ర్యాంక్‌లో ఉండగా... మాల్దీవులు జట్టు 163వ స్థానంలో ఉంది. అక్టోబర్‌లో చివరిసారిగా బరిలోకి దిగిన భారత మహిళల జట్టు రెండు నెలల విరామం తర్వాత తిరిగి మ్యాచ్‌కు సిద్ధం కానుంది. ఇటీవల దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) చాంపియన్‌షిప్ సెమీఫైనల్లో నేపాల్ చేతిలో ఓడిన టీమిండియా... మాల్దీవులుపై విజయం సాధించేందుకు ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తోంది.

టైటాన్స్ గెలుపు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్–11)లో తెలుగు టైటాన్స్ 12వ విజయాన్ని సాధించింది. శుక్రవారం జరిగిన పోరులో టైటాన్స్ 48–36తో పుణేరి పల్టన్‌పై విజయం సాధించింది. తెలుగు టైటాన్స్ జట్టును కెప్టెన్, రెయిడర్ పవన్ సెహ్రావత్ ముందుండి నడిపించాడు. 16 సార్లు రెయిడింగ్‌కు వెళ్లిన కెప్టెన్ 11 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చాడు. 4 బోనస్ పాయింట్లు కలుపుకొని మొత్తం 15 పాయింట్లు సాధించాడు. స్టార్ రెయిడర్ ఆశిష్ నర్వాల్ (11) కూడా క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చాడు. డిఫెండర్లలో అంకిత్ (6), అజిత్ పవార్ (3) రాణించారు. పుణేరి జట్టులో రెయిడర్ అజిత్ (10 పాయింట్లు) అదరగొట్టాడు. సబ్‌స్టిట్యూట్‌గా ఆలస్యంగా మైదానంలోకి దిగిన అజిత్ 13 సార్లు కూతకెళ్లి 10 పాయింట్లు చేశాడు. మిగతా సహచరుల్లో రెయిడర్ ఆర్యవర్ధన్ నవలె (8), డిఫెండర్లు అమన్ (5), దాదాసో పూజారి (3) రాణించారు. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో జైపూర్ పింక్‌పాంథర్స్ 31–28తో బెంగాల్ వారియర్స్‌పై గెలుపొందడంతో ప్లే ఆఫ్స్‌కు ఐదో జట్టుగా అర్హత సాధించింది. జైపూర్ జట్టులో కెప్టెన్, రెయిడర్లు అర్జున్ దేశ్వాల్ (9), అభిజిత్ మాలిక్ (7) నిలకడగా స్కోరు చేశారు. మిగతావారిలో డిఫెండర్లు రెజా మీర్‌బఘేరి (5), అంకుశ్ రాఠి (3) మెరుగ్గా ఆడారు. బెంగాల్ వారియర్స్ తరఫున రెయిడర్లు ప్రణయ్ (8), అర్జున్ రాఠి (7) ఆకట్టుకున్నారు. డిఫెండర్లలో వైభవ్ గార్జే 4 పాయింట్లు చేశాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్... గుజరాత్ జెయంట్స్‌తో పోటీ పడనుండగా, దబంగ్ ఢిల్లీ... జైపూర్ పింక్‌పాంథర్స్‌తో తలపడుతుంది.


తెలుగు టైటాన్స్, పుణేరి పల్టన్ మధ్య మ్యాచ్‌లో దృశ్యం

గోవా ఘనవిజయం

- మోహన్ బగాన్‌పై 2–1తో గెలుపు
- ఇండియన్ సూపర్ లీగ్

పనాజీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో గోవా జట్టు 'హ్యాట్రిక్' విజయం నమోదు చేసుకుంది. శుక్రవారం జరిగిన పోరులో గోవా ఫుట్‌బాల్ క్లబ్ 2–1 గోల్స్ తేడాతో మోహన్ బగాన్‌పై గెలుపొందింది. గోవా జట్టు తరఫున బ్రిసన్ ఫెర్నాండెజ్ (12వ, 68వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో విజృంభించగా... మోహన్ బగాన్ జట్టు తరఫున దిమిత్రి పెట్రాటస్ (55వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా... మోహన్ బగాన్ జట్టు 59 శాతం బంతిని తమ ఆధీనంలో పెట్టుకొని మూడుసార్లు ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై దాడి చేసి ఒక గోల్ నమోదు చేసింది. అదే సమయంలో 5 సార్లు ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై దాడి చేసిన గోవా జట్టు అందులో రెండుసార్లు సఫలమైంది. లీగ్‌లో ఇప్పటి వరకు 12 మ్యాచ్‌లాడిన గోవా జట్టు 6 విజయాలు, 2 పరాజయాలు, 4 'డ్రా'లతో 22 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. మోహన్ బగాన్ జట్టు 12 మ్యాచ్‌ల్లో 8 విజయాలు, 2 పరాజయాలు, 2 'డ్రా'లతో 26 పాయింట్లు సాధించి టేబుల్ టాపర్‌గా కొనసాగుతోంది. శనివారం జరగనున్న మ్యాచ్‌ల్లో ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్‌తో చెన్నైయిన్ జట్టు (సాయంత్రం గం. 5:00 నుంచి), ఈస్ట్ బెంగాల్ జట్టుతో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ (రాత్రి గం. 7:30 నుంచి) తలపడతాయి.



గడ్డకట్టే చలిలోనూ... లెహంగాలో స్నాతకోత్సవానికి!

- వైరల్‌గా మారిన భారత విద్యార్థిని ఫొటో
- మూలాలు మరవలేదంటూ నెటిజన్ల ప్రశంసలు

ఎలాంటి పరిస్థితుల్లోనైనా తగ్గేదేలే అంటారు కొందరు. ఆ విద్యార్థిని సరిగ్గా అలాంటి వారిలో కోవలోకే వస్తుంది. గడ్డ కట్టించే చలిలోనూ వస్త్రధారణలో రాజీ పడలేదు. స్నాతకోత్సవంలో సంప్రదాయ దుస్తులే ధరించింది! స్విట్జర్లాండ్‌లో ప్రస్తుతం చలి వణికిస్తోంది. మైనస్ డిగ్రీలతో సర్వం గడ్డ కట్టుకుపోతోంది. అయినా సరే, లక్ష్మీకుమారి అనే భారతీయ విద్యార్థిని అస్సలు రాజీ పడలేదు. స్నాతకోత్సవానికి లెహెంగా ధరించి ప్రశంసలు అందుకుంది. ఆ ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ''మైనస్ డిగ్రీల వాతావరణం. బయట ఎటు చూసినా మంచు. ఊహించలేనంతటి చలి! అయినా సరే, లెహంగా ధరించడంలో రాజీపడలేదు''అని రాసుకొచ్చింది. ఆ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. జీవితంలో ప్రత్యేకమైన మైలురాయిని సంప్రదాయంతో మేళవించిందంటూ నెటిజన్లు ఆమెను ప్రశంసిస్తున్నారు. అంతటిప్రతికూల వాతావరణంలోనూ గ్రాడ్యుయేషన్ కోసం సంప్రదాయ దుస్తులు ధరించడం బాగుంది. ఆమె నిజమైన భారతీయురాలు. అంతర్జాతీయ వేదికపై తన మూలాలను ఇంతందంగా చూపించింది''అంటూ పొగుడుతున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్





ఒక్క ఏడాదిలో 2.7 లక్షల మంది

అక్రమ వలసదారులను వెనక్కి పంపిన అమెరికా ప్రభుత్వం

- 2014 తర్వాత దశాబ్ద కాలంలో ఇదే అత్యధికం
- ఈ ఏడాది మరింత భారీగా డిపోర్టేషన్లు
- విస్తృత ఏర్పాట్లలో రాబోయే ట్రంప్ ప్రభుత్వం

వాషింగ్టన్: అధికారంలోకి వస్తే దేశంలో అక్రమంగా ఉంటున్న లక్షలాది మందిని సొంత దేశాలకు పంపిస్తానంటూ ఇచ్చిన ఎన్నికల వాగ్దానం అమలుకు అమెరికా కాబోయే అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. లక్షలాది మంది అక్రమ వలసదారులను గుర్తించడం వారిని ఆయా దేశాలకు పంపించడంలో ఎదురయ్యే ఆర్థిక, నిర్వహణపరమైన సవాళ్ల పరిష్కారంపై అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) మల్లగుల్లాలు పడుతోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023 అక్టోబర్ 1- 2024 సెప్టెంబర్ 30 మధ్య కాలంలో దేశంలో అక్రమంగా ఉంటున్న 2,71, 484 మందిని గుర్తించి భారత్ సహా మొత్తం 192 దేశాలకు పంపించి వేసినట్లు ఐసీఈ తాజాగా ప్రకటించింది. 2014 తర్వాత ఇదే అత్యధికమని కూడా వివరించింది. 2014లో 3.15 లక్షల మందిని దేశం నుంచి బహిసష్కరించగా, ట్రంప్ హయాంలో 2019లో 2.67 లక్షల మందిని వారివారి సొంత దేశాలకు పంపించినట్లు ఐసీఈ తెలిపింది. ఇటువంటి వారి కోసం వారాంతాల్లో ప్రత్యేకంగా విమానాలను నడపాలని, పొరుగునున్న గ్వాటెమాల, హొండురస్, ఎల్ సాల్వడార్‌లకు నడిపే విమానాలను క్రమబద్ధీకరించాల్సి ఉంటుందని తెలిపింది. దీంతోపాటు ఆరేళ్ల తర్వాత చైనాకు అక్రమ వలసదారులతో కూడిన అతిపెద్ద విమానం పంపనుంది. ఇంకా భారత్‌తోపాటు అల్బేనియా, అంగోలా, ఈజిప్ట్, జార్జియా, ఘనా, గినియా, మారిటానియా, రొమేనియా, సెనెగల్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లకు కూడా ప్రత్యేక విమానాలను నడపనుంది.

ఈ ఏడాది నవంబర్ నుంచి మెక్సికో గుండా సరిహద్దులు దాటి అక్రమంగా ప్రవేశించిన 46 వేల మందిని అరెస్ట్ చేసినట్లు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం(యూసీబీపీ) తెలిపింది. అక్టోబర్‌లో అరెస్టయిన 56 వేల మందితో పోలిస్తే ఇది 18 శాతం తక్కువని పేర్కొంది. 2023 డిసెంబర్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా 2.50 లక్షల మందిని అక్రమ వలసదారులను అరెస్ట్ చేశామని తెలిపింది. అయితే, మెక్సికో ప్రభుత్వం నిఘాను పెంచడంతో అరెస్ట్‌లు తగ్గాయని వివరించింది. దీనికి ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికవడం కూడా తోడైందని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా మెక్సికో సరిహద్దుల గుండా 87 వేల మంది రాగా, గ్వాటెమాల మీదుగా 66 వేల మంది, హొండురస్ నుంచి 45 వేల మంది అమెరికాలోకి ప్రవేశించినట్లు ఐసీఈ పేర్కొంది. ఐసీఈ సిబ్బంది సంఖ్య మాత్రం దశాబ్ద కాలంగా 6 వేలకు పరిమితం కాగా, అక్రమంగా ప్రవేశించే విదేశీయుల సంఖ్య దశాబ్ద కాలంలో నాలుగు రెట్లు పెరిగిందని ఐసీఈ తెలిపింది. ఏడాది కాలంగా రోజుకు సగటున 37,700 మంది అక్రమ వలసదారులను గుర్తించి, అదుపులోకి తీసుకుంటున్నట్లు పేర్కొంది. వీరందరినీ నిర్బంధించేందుకు సరిపోను స్థలం కూడా లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో టెక్సాస్ యంత్రాంగం గ్రామీణ ప్రాంతంలోని స్థలం ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని తెలిపింది. ఇప్పుడిక మెక్సికో సరిహద్దుల్లో కాకుండా దేశం లోపల అక్రమంగా ఉంటున్న వారిపై దృష్టి పెట్టాలని ఐసీఈ అభిప్రాయపడింది.

క్యూబాలో వింత ఆచారం

ఊరేగింపులో రోడ్డుపై పాకుతున్న భక్తులు

కోరికలు తీర్చాలనో.. అవి తీరినందుకు మొక్కు చెల్లించుకోవడానికో ఆలయాల్లో పొర్లు దండాలు పెట్టడం చూస్తూనే ఉంటాం. క్యూబాలో కూడా ఇలాంటి సంస్కృతే ఉండటం విశేషం. పొర్లు దండాలు కాకున్నా సెయింట్ లాజరస్ ఊరేగింపు సందర్భంగా భక్తులు నేలపై పాకుతూ వెళ్తుంటారు. అందుకోసం భక్తులు పేదరికానికి ప్రతీకగా సంచులతో చేసిన బట్టలు వేసుకుంటారు. మోచేతులు, కాళ్లు రక్తమోడుతున్నా పట్టించుకోకుండా పాకుతారు. హవానా శివార్లలోని ఎల్ రిన్కాన్ అనే చిన్న చర్చికి చెప్పుల్లేకుండా నడిచి వెళ్తారు. కోర్కెలు తీర్చాల్సిందిగా లాజరస్‌ను మొక్కుకుంటారు. ఇది తాతల నాటి సంప్రదాయమట. ఏదేమైనా దాన్ని కచ్చితంగా ఆచరిస్తామని చెబుతారు వాళ్లు.

క్యూబా నాస్తికత్వాన్ని వీడి 1992లో లౌకిక రాజ్యంగా మారింది. అక్కడ ఇటీవల బహిరంగ మత విశ్వాస ప్రదర్శనలు పెరిగాయి. 200 ఏళ్ల క్రితం బానిసలుగా వచ్చిన ఆఫ్రికన్లు యోరుబా మతంలోని శాంటరియా శాఖను తమతో తీసుకొచ్చారు. కొందరేమో బలవంతంగా కాథలిక్ మతంలోకి మారారు. దేశమంతటా ఈ రెండు మతాల సమ్మిళిత వాతావరణం ఉంటుంది. 1959 విప్లవం తరువాత క్యూబాలో వ్యవస్థీకృత మతాన్ని అణచివేసి శాంటరియా చాలావరకు విస్తరించింది. అది మతం కాదని క్యూబా ఆధ్యాత్మిక సంస్కృతి అని చెబుతుంటారు. ఇప్పుడు దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుంచి అమెరికాతో శత్రుత్వమున్నా ఒబామా హయాంలో దౌత్య సంబంధాలు కాస్త మెరుగయ్యాయి. కానీ 2016లో డొనాల్డ్ ట్రంప్ రాకతో క్యూబాపై ప్రతికూల ప్రభావం పడింది. మళ్లీ ట్రంప్ రాకతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడుతుందని క్యూబన్లు భయపడుతున్నారు. ఈ క్లిష్ట సమయాల్లో మత విశ్వాసాలను నమ్ముకుంటున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

కైరోలో యూనుస్, షరీఫ్ భేటీ

1971నాటి విభేదాల శాశ్వత పరిష్కారంపై చర్చ

ఢాకా: బంగ్లాదేశ్‌లోని ఆపద్ధర్మ ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శుక్రవారం ఈజిప్టు రాజధాని కైరోలో మొదటిసారిగా సమావేశమయ్యారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఈజిప్టులతోపాటు తుర్కియే, ఇరాన్, ఇండోనేసియా, మలేసియాలతో కూడిన డి-8 దేశాల శిఖరాగ్రం కైరోలో జరిగింది. ఈ సందర్భంగా వీరిరువురు సమావేశమయ్యారు. పాకిస్తాన్‌లో సంబంధాలు మరింత బలోపేతమవ్వాలంటే ముందుగా 1971 నాటి విభేదాలకు శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరముందని ఈ సందర్భంగా యూనుస్ కోరారు. 1974లో జరిగిన త్రైపాక్షిక ఒప్పందంలో రెండు దేశాలతోపాటు భారత్ కూడా ఉన్నందున, ఇతర అంశాలేవైనా ఉంటే పరిష్కరించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు షరీఫ్ తెలిపారని బంగ్లా అధికార మీడియా తెలిపింది. దక్షిణాసియా దేశాల కూటమి సార్క్‌ను తిరిగి శక్తిమంతం చేయడం, వ్యూహాత్మక భాగస్వామ్యంపైనా ఇరువురు చర్చించారు. 1971లో బంగాదేశ్ అవతరించాక, భారత్, పాక్, బంగ్లాదేశ్‌లు 1974లో ఢిల్లీలో ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీని ప్రకారం.. 1971 యుద్ధంలో భారత్‌కు పట్టుబడిన పాకిస్తానీ ఖైదీలను స్వదేశానికి పంపించడం, యుద్ధం కారణంగా రెండు దేశాల్లో చిక్కుబడిపోయిన వారిని స్వదేశాలకు పంపించడం వంటి అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఇలా ఉండగా, పాకిస్తాన్ నుంచి వచ్చే సరుకును పూర్తిగా తనిఖీ చేయాలన్న నిబంధన సహా పలు ఆంక్షలను ఎత్తివేసినందుకు, పాక్ విమాన ప్రయాణికులపై ఉన్న ఆంక్షలను సడలించినందుకు ప్రధాని షరీఫ్ బంగ్లా నేత యూనుస్‌కు కృతజ్ఞతలు తెలిపారని పాకిస్తాన్ మీడియా పేర్కొంది. మొట్టమొదటిసారిగా బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ నుంచి బయలుదేరిన సరుకు ఓడ నవంబర్‌లో నేరుగా కరాచీ ఓడరేవును చేరిందని అధికారులు తెలిపారు. పాక్-బంగ్లాల మధ్య నేరుగా త్వరలోనే విమాన సర్వీసులను ప్రారంభిస్తామని చెప్పారు.

సరిహద్దుల రక్షణలో ఎస్ఎస్‌బీ కీలకం: షా

సిలిగురి: దేశ సరిహద్దుల రక్షణలో సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ) కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రశంసించారు. బిహార్, జార్ఖండ్‌లో నక్సలిజాన్ని ఎదుర్కోవడంలో, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడంలోనూ ఎస్ఎస్‌బీది గణనీయమైన పాత్ర అని వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురిలో శుక్రవారం ఎస్ఎస్‌బీ 61వ రైజింగ్ డే వేడుకల్లో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎస్ఎస్‌బీ దళాలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండడం వల్లే మన సరిహద్దులు సురక్షితంగా ఉంటున్నాయని చెప్పారు. సిలిగురి రీజియన్‌తోపాటు తూర్పు కారిడార్‌లో ఎస్ఎస్‌బీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లో నక్సలిజం బలహీన పడడం వెనుక ఎస్ఎస్‌బీ కృషి ఉందని కొనియాడారు. సరిహద్దు గ్రామాల ప్రజలను దేశ ప్రధాన జన ప్రవంతితో సాంస్కృతికంగా, భాషపరంగా, వారసత్వపరంగా అనుసంధానించడంలో సశస్త్ర సీమాబల్ బహుముఖ కృషి చేస్తోందని అమిత్ షా వెల్లడించారు.

బీజేపీ ఎమ్మెల్సీకి కర్ణాటక హైకోర్టు బెయిల్

బెంగళూరు: కర్ణాటక మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్‌ను ఉద్దేశించి అనుచిత మాట వాడారనే ఆరోపణపై అరెస్టయిన బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవికి శుక్రవారం హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జైలు నుంచి విడుదలయ్యాక విచారణాధికారులకు సహకరించాలని జస్టిస్ ఎంజీ ఉమ సారథ్యంలోని ధర్మాసనం ఆయన్ను ఆదేశించింది. గురువారం శాసనమండలిలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో సీటీ రవి ఆమెనుద్దేశించి అభ్యంతరకర పదం వాడారు. హెబ్బాల్కర్ ఫిర్యాదు మేరకు సీటీ రవిపై కేసు నమోదు చేశారు. సాయంత్రం సీటీ రవి శాసన మండలి ఆవరణలో ఉండగానే వ్యాన్‌లో పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లారు.

డల్లెవాల్ ఆరోగ్య బాధ్యత మీదే

పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: పంజాబ్-హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీ వద్ద 25 రోజులుగా నిరాహార దీక్ష సాగిస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లెవాల్(70) ఆరోగ్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించే విషయమై నిర్ణయం తీసుకోవాల్సింది పంజాబ్ ప్రభుత్వ అధికారులు, వైద్యులేనని స్పష్టం చేసింది. రైతు నేత బాధ్యత పంజాబ్ ప్రభుత్వానిదేనని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం శుక్రవారం తెలిపింది. జనవరి 2వ తేదీకల్లా డల్లెవాల్ ఆరోగ్య పరిస్థితిపై నివేదిక అందజేయాలని పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించింది. అవసరమనిపిస్తే తమను సంప్రదించొచ్చని కూడా పంజాబ్ ప్రభుత్వానికి తెలిపింది. అప్పటి వరకు దీక్షా శిబిరానికి 700 మీటర్ల దూరంలో తాత్కాలిక ఆస్పత్రి ఏర్పాటు చేసి, అందులోకి డల్లెవాల్‌ను తరలించాలని సూచించింది. డల్లెవాల్‌ను దీక్షా శిబిరం నుంచి బలవంతంగా తరలిస్తే ఆయన ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదముందని ఈ సందర్భంగా పంజాబ్ అడ్వొకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆయన అంగీకరించడంతో ఈసీజీ వంటి పరీక్షలు చేయించామని కూడా చెప్పారు. ప్రస్తుతానికి ఆరోగ్యం విషమంగానే ఉన్నా నిలకడగా ఉందన్నారు. స్పందించిన ధర్మాసనం..కేన్సర్ పేషెంట్ డల్లెవాల్‌ను ఒప్పించి, ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నాలను కొనసాగించాలని అధికారులకు సూచించింది. పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించడం వంటి రైతు సంఘాల డిమాండ్లను కేంద్రం పరిష్కరించాలంటూ నవంబర్ 26 నుంచి ఖనౌరి వద్ద డల్లెవాల్ నిరశన దీక్ష కొనసాగిస్తున్నారు. ఇలా ఉండగా, డల్లెవాల్ గత 25 రోజులుగా కేవలం నీళ్ల మాత్రమే తాగుతున్నారని వైద్యులు తెలిపారు. ఆయన ఆరో గ్యం మొత్తమ్మీద విషమంగా ఉందన్నారు. ఆయనకు ఏ సమయంలోనైనా ఏమైనా జరగొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

సుప్రీంకు దల్లెవాల్ లేఖ

పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించడం వంటి రైతు సంఘాల డిమాండ్లను పరిష్కరించేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలంటూ డల్లెవాల్ శుక్రవారం సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో కోరారు. పార్లమెంటరీ కమిటీ నివేదిక, రైతుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని డిమాండ్లకు అంగీకారం తెలపాలన్నారు. తద్వారా రైతు బలవన్మరణాలు ఆగిపోతాయని చెప్పారు. వివిధ ప్రభుత్వాలిచ్చిన హామీల అమలు కోసం మాత్రమే రైతులు ఆందోళనలు కొనసాగిస్తున్నారని తెలిపారు. తన ఆరోగ్యంపై సుప్రీంకోర్టు ఆందోళన చెందుతోందన్న విషయం మీడియా ద్వారా తెలిసిందని, న్యాయస్థానం అభిప్రాయాన్ని గౌరవిస్తానని తెలిపారు.

ఆపద్ధర్మ ప్రభుత్వ అభ్యంతరకర పోస్ట్

బంగ్లాదేశ్‌కు నిరసన తెలిపిన భారత్

న్యూఢిల్లీ: భారత్‌లోని కొన్ని భూ భాగాలు తమవేనంటూ బంగ్లాదేశ్ లోని ఆపద్ధర్మ ప్రభుత్వంలో కీలక నేత పెట్టిన పోస్ట్‌పై దుమారం చెలరేగింది. ఈ వ్యవహారంపై బంగ్లాదేశ్‌కు భారత ప్రభుత్వం నిరసన తెలిపింది. ఆపద్ధర్మ ప్రభుత్వంలో తాత్కాలిక మంత్రిగా వ్యవహరిస్తున్న మహ్ఫుజ్ ఆలం నాలుగు రోజుల క్రితం పశ్చిమబెంగాల్, త్రిపుర, అస్సాంలోని కొన్ని ప్రాంతాల ను బంగ్లాదేశ్‌లో నివిగా పేర్కొంటూ ఫేస్‌బుక్‌లో ఓ మ్యాప్‌ను పోస్ట్ చేశారు. వివాదం చెలరేగడంతో అనంతరం ఆ పోస్ట్‌ను డిలీట్ చేశారు. ఆ పోస్ట్‌పై విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తీవ్ర నిరసన తెలిపారు. 'ఈ విషయాన్ని బంగ్లాదేశ్ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. గట్టిగా నిరసన తెలిపాం' అని చెప్పా రు. 'బంగ్లాదేశ్ ప్రజలు, మధ్యంతర ప్రభుత్వంతో సంబంధాలను పెంపొందించుకో వడానికి ఒక వైపు భారత్ ప్రయత్ని స్తుండగా, ఇటువంటి వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. బాధ్యతా యుతంగా వ్యవహరించే వారు అప్రమత్తంగా ఉండాల్సిన అవసర ముంది'అని ఆయన అన్నారు. ఆగస్ట్‌లో యూనుస్ ప్రభుత్వ బాధ్య తలు చేపట్టాక రెండు దేశాల మధ్య సంబంధాలు దారుణంగా దెబ్బతిన్నాయి.

ప్రియాంక ఎన్నికపై కోర్టుకెక్కిన నవ్యా హరిదాస్

కొచ్చి: కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఎన్నికను సవాల్ చేస్తూ బీజేపీ అభ్యర్థి నవ్యా హరిదాస్ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ వేశారు. ప్రియాంక సొంత, కుటుంబ ఆస్తుల వాస్తవ వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని, ఆమె ఇచ్చినదంతా తప్పుడు సమాచారమని, ప్రజల్ని ఆమె మోసగించారని నవ్య అందులో ఆరోపించారు. జనవరిలో ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారించే అవకాశాలున్నాయని ఆమె తెలిపారు.



పార్లమెంట్‌లోకి ఎన్‌పీ సభ్యులు రాకుండా కుర్చీలను అడ్డుపెట్టిన డీపీపీ సభ్యులు

తైవాన్ పార్లమెంట్‌లో సభ్యుల కొట్లాట

తైపీ: తైవాన్ పార్లమెంట్‌లో ఎంపీలు బాహాబాహీగా తలపడ్డారు. మూడు కీలకమైన బిల్లుల విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలైన నేషనలిస్ట్ పార్టీ(ఎన్‌పీ), డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(డీపీపీ)కి మధ్య తీవ్ర విభేదాలొచ్చాయి. దీంతో, గురువారం అర్ధరాత్రి డీపీపీ సభ్యులు పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించి స్పీకర్ కుర్చీని ఆక్రమించుకుని అక్కడే తిష్ట వేశారు. చుట్టూ రక్షణగా అడ్డంకులు ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం ఎన్‌పీ సభ్యులు పార్లమెంట్ లోపలికి ప్రవేశించి, అక్కడున్న వారిని బయటకు పంపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఎంపీలు పరస్పరం తలపడ్డారు. కుర్చీలు, వాటర్ బాటిళ్లు విసురుకున్నారు. ఈ ఘటనలో కొందరు గాయపడినట్లు మీడియా అంటోంది. వివరాలు మాత్రం వెల్లడి కాలేదు. చివరికి ఎన్‌పీ సభ్యులదే పైచేయి అయింది. స్పీకర్ యథా ప్రకారం కార్యక్రమాలు నిర్వహించారు.

'ఈవీఎంల పరిశీలన' వ్యాజ్యంపై వచ్చే నెల 20న విచారణ

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను(ఈవీఎంలు) తనిఖీ చేసుకొనే విధానాన్ని తీసుకొచ్చేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను మరో ధర్మాసనానికి అప్పగిస్తూ సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ పిటిషన్‌పై వచ్చే ఏడాది జనవరి 20న జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపడుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం పేర్కొంది. ఈవీఎంలను పరిశీలించే విధానం తీసుకురావాలని కోరుతూ హరియాణా మాజీ మంత్రి కరణ్‌సింగ్ దలాల్, లఖన్‌కుమార్ సింగ్లా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనానికి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది.

బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై 2,200 దాడులు

లోక్‌సభలో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులకు సంబంధించి 2024లో డిసెంబర్ 8వ తేదీ వరకు మొత్తం 2,200 కేసులు నమోదయ్యాయని కేంద్రం శుక్రవారం లోక్‌సభలో తెలిపింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి కృతి వర్ధన్ సింగ్ ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో ఈ విషయం వెల్లడించారు. మైనారిటీ, మానవ హక్కుల సంఘాలు అందించిన సమాచారం ప్రకారం.. 2024లో అక్టోబర్ 12వ తేదీ నాటికి పాకిస్తాన్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై 112 దాడులు జరిగాయన్నారు. మైనారిటీలకు భద్రత కల్పించాలని కేంద్రం పాకిస్తాన్ ప్రభుత్వాన్ని కోరిందన్నారు. పాకిస్తాన్‌లో మైనారిటీల దుస్థితిపై అంతర్జాతీయ వేదికలపైనా ప్రస్తావిస్తున్నామన్నారు. అలాగే, మైనారిటీలపై పెద్ద సంఖ్యలో జరిగే దాడులపై బంగ్లాదేశ్ ప్రభుత్వంతో చర్చించామన్నారు. వారి భద్రతకు తగు చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ నిస్పృహకు నిదర్శనం

రాహుల్‌పై కేసు నమోదుపై ప్రియాంక వ్యాఖ్య

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై ఆ పార్టీ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ఎంత నిస్పృహతో ఉందో తెలిపేందుకు ఇదో ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడాన్ని దేశ ప్రజలు క్షమించరని తెలిసిన బీజేపీ ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ వెలుపల ఆమె మీడియాతో మాట్లాడుతూ..'రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు ప్రభుత్వ నిస్పృహకు చిహ్నం. నిరాశతోనే తప్పుడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయిస్తున్నారు. రాహుల్ ఎప్పుడూ ఎవరినీ అలా చేయలేదు. సోదరిగా ఆ విషయం నాకు తెలుసు'అని తెలిపారు. రాజ్యసభలో ఇటీవల హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఆమె ప్రస్తావిస్తూ..బీఆర్ అంబేడ్కర్ పట్ల తన వైఖరి బట్టబయలవడం, ఈ విషయంపై ప్రతిపక్షాలు గట్టిగా పట్టుబడుతుండటంతో బీజేపీ భయపడుతోందని చెప్పారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానం జాతీయ ప్రయోజనానికి సంబంధించిన అంశమన్నారు.

జాకిర్ హుస్సేన్‌కు ఘనంగా అంతిమ వీడ్కోలు

డ్రమ్స్‌తో శివమణి తదితర కళాకారుల నివాళి

న్యూయార్క్: ప్రఖ్యాత తబలా విద్వాంసుడు జాకిర్ హుస్సేన్ పార్థివ దేహాన్ని అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఖననం చేశారు. ఫెర్న్‌వుడ్ సిమెట్రీలో గురువారం ఆయనకు అంతిమ వీడ్కోలు పలికారు. అక్కడికి సమీపంలో జరిగిన సంతాప కార్యక్రమంలో శివమణి తదితర కళాకారులు డ్రమ్స్‌తో జాకిర్ హుస్సేన్‌కు సంగీత నివాళులర్పించారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న జాకిర్ హుస్సేన్(73) సోమవారం శాన్‌ఫ్రాన్సిస్కోలో కన్నుమూయడం తెలిసిందే. ఆయనకు తుది వీడ్కోలు పలికిన వారిలో కుటుంబసభ్యులు, సన్నిహితులతోపాటు సంగీత కళాకారులు, సంగీత ప్రేమికులు మొత్తం 300 మంది వరకు హాజరయ్యారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సుల్ జనరల్ డాక్టర్ శ్రీకర్ రెడ్డి కూడా హాజరయ్యారు. పద్మ విభూషణ్ గ్రహీత ఉస్తాద్ జాకిర్ హుస్సేన్ పార్థివ దేహంపై భారత జాతీయ పతాకాన్ని కప్పి, భారత ప్రభుత్వం, ప్రజల తరఫున నివాళులర్పించారు. జాకిర్ హుస్సేన్ భార్య ఆంటోనియా మిన్నెకొలా, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రధాని మోదీ పంపిన సంతాప సందేశాన్ని చదివి వినిపించారు. భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చిన నిజమైన మేధావి జాకిర్ హుస్సేన్ అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

వ్యక్తిగత విభేదాలకు ఆయుధాలుగా కేసులు: సుప్రీం ఆందోళన

న్యూఢిల్లీ: వ్యక్తిగత విభేదాలతో విడిపోయే జంటలు కక్ష సాధింపునకు క్రిమినల్ కేసులను ఆయుధంగా వాడుకుంటున్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. అత్తమామలపై ఓ మహిళ పెట్టిన వేధింపుల కేసును కొట్టివేస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. వైవాహిక సంబంధిత కేసుల్లో ఐపీసీలోని సెక్షన్ 498-ఏ దుర్వినియోగమవడంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. వివాహితను ఆమె భర్త, అతడి కుటుంబీకులు వేధించిన సందర్భాల్లో ఈ సెక్షన్‌ను వర్తింపజేస్తారు. భర్తకు విడాకుల నోటీసు పంపిన ఓ మహిళ అందులో అత్తమామల వేధింపుల గురించి కనీస ప్రస్తావన కూడా చేయని విషయం తమ దృష్టికి వచ్చిందని ధర్మాసనం పేర్కొంది. విడాకులకు సమ్మతించేలా వారు తమ కుమారునిపై ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతోనే అత్తమామలపై కేసు పెట్టినట్లు భావించాల్సి వస్తోందని తెలిపింది. ఈ మేరకు వేధింపుల కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

వైద్య సీట్లను వృథా చేయొద్దు: సుప్రీం



న్యూఢిల్లీ: దేశంలో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నందున వైద్య కళాశాలల్లో సీట్లు అమూల్యమైనవి, వాటిని వృథా చేయరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఖాళీగా మిగిలిపోయిన సీట్లను డిసెంబర్ 30వ తేదీలోగా భర్తీ చేసేందుకు మళ్లీ కౌన్సెలింగ్ చేపట్టాలని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం శుక్రవారం అధికారులకు ఆదేశాలిచ్చింది. ఇప్పటి వరకు ఐదు రౌండ్లలో కౌన్సెలింగ్ చేపట్టినా వైద్య కళాశాలల్లో సీట్లు ఇంకా మిగిలిపోయి ఉన్నాయని వాటిని భర్తీ చేసేందుకు ప్రత్యేకంగా మళ్లీ కౌన్సెలింగ్ చేపట్టేలా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర అడ్మిషన్ యంత్రాంగాల ద్వారా మాత్రమే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని, నేరుగా అడ్మిషన్లు ఇవ్వొద్దని కూడా కళాశాలలకు స్పష్టం చేసింది. ఇప్పటికే పూర్తయిన అడ్మిషన్లలో ఎలాంటి మార్పులు చేపట్టరాదని కూడా పేర్కొంది.

గూగుల్ స్ట్రీట్ ఫొటోతో మర్డర్ మిస్టరీ వీడింది!

గూగుల్ మ్యాప్ ఫొటో ఓ హంతకుడిని పట్టించిన ఘటన స్పెయిన్‌లో జరిగింది. సోరియా ప్రావిన్స్‌లోని తజుకో పట్టణ వీధులను గత ఏడాది నుంచి గూగుల్ యాప్ చిత్రించడం మొదలు పెట్టింది. అందులో కనిపించిన ఒక ఫొటో చివరికి హత్య కేసు తాలూకు దోషుల్ని పట్టించింది. క్యూబాకు చెందిన జార్జి అనే 33 ఏళ్ల వ్యక్తి 2023 అక్టోబర్‌లో అదృశ్యమయ్యాడు. తానో మహిళను కలిశానని, స్పెయిన్ నుంచి వెళ్లిపోతున్నానని చివరిసారిగా బంధువుకు మెసేజ్ పంపాడు. తర్వాత కనబడకుండా పోవడంతో సదరు బంధువు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒక వ్యక్తి తన కారు డిక్కీలోకి పెద్ద ప్లాస్టిక్ సంచిని లోడ్ చేస్తున్న చిత్రం ఇటీవల గూగుల్ స్ట్రీట్ వ్యూలో పోలీసుల కంట పడింది. అనుమానం వచ్చి విచారించగా ఓ మహిళ తన మాజీ బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి హత్య చేసినట్టు తేలింది. దాంతో వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి ప్లస్
శనివారం। 21-12-2024

‘దేవానాం ప్రియ’ అనేది ఎవరి బిరుదు?

కళింగ యుద్ధం అశోకుడు పూర్తిగా ధర్మం వైపుగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ధర్మ ప్రచారం కోసం ఈయన ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను నియమించాడు. వీరిని పశ్చిమాసియా, శ్రీలంకకు పంపించాడు. మానవుడిని నైతికంగా, ఉన్నతంగా చేసేవిధంగా, సమాజాన్ని ఉద్ధరించేలా దమ్మ సూత్రాలను రూపొందించాడు. అంతేగాని ప్రజలపై మతాన్ని రుద్దడం వీటి ఉద్దేశం కాదు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

జైనమతం (క్రీపూ. 540-468)

జైనమత స్థాపకుడు రుషభనాథుడు. జైన ప్రవక్తలను ‘తీర్థంకరులు’ అంటారు. మొత్తం 24 మంది తీర్థంకరులు ఉండేవారు. రుషభనాథుడు మొదటి తీర్థంకరుడు. 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు. చివరివారైన 24వ తీర్థంకరుడు మహావీరుడు.

మహావీరుడు క్రీ.పూ. 540లో వైశాలి నగరానికి సమీపాన ఉన్న ‘కుంద’ గ్రామంలో క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు సిద్ధార్థుడు, వైశాలి. మహావీరుడి భార్య యశోధ, కుమార్తె ప్రియదర్శిని. ఈయన జీవిత సుఖాలతో తృప్తి చెందక కొంత కాలం దిగంబరుడిగా కఠోర నియమాలను పాటించి తపస్సు చేశాడు. ‘జృంబిక’ గ్రామంలో పరిపూర్ణజ్ఞానాన్ని పొందిన తర్వాత ‘మహావీరుడు’గా పేరు పొందాడు. ఈయన ప్రబోధించిన సరైన క్రియ, సరైన విశ్వాసం, సరైన జ్ఞానం అనే మూడు అంశాలను ‘త్రిరత్నాలు’గా పేర్కొంటారు. పంచవ్రతాల ద్వారా మోక్షాన్ని సాధించవచ్చని మహావీరుడు ప్రవచించాడు. ఈయన తన 72వ ఏట క్రీ.పూ. 468లో ‘పావాపురి’ వద్ద నిర్యాణం చెందాడు.

జైనులు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. ఉపవాసాలు చేసి శరీరాన్ని కృశింపజేసుకొని మరణించడాన్ని ‘సల్లేఖన వ్రతం’గా పేర్కొంటారు. చాలా మంది రాజులు జైనమతాన్ని ఆదరించి అభివృద్ధి చేశారు. చంద్రగుప్త మౌర్యుడు ఈ మతాన్ని అనుసరించి, అన్నింటినీ త్యజించి శ్రావణ బెళగొళలో మరణించాడు. జైనులు ప్రజల భాష అయిన ప్రాకృతంలో తమ సందేశాన్ని ప్రచారం చేశారు. చంద్రగుప్తుడి కాలంలో పాటలీపుత్రంలో స్థూలభద్ర ఆధ్వర్యంలో జైనమత మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జైనమత బోధనలను 12 అంగాలుగా విభజించి క్రోడీకరించారు. కొంతకాలం తర్వాత వస్త్రధారణ విషయంలో అభిప్రాయభేదాలు తలెత్తడం వల్ల జైనమతం దిగంబర, శ్వేతాంబర శాఖలుగా చీలిపోయింది. రెండో జైన సంగీతి క్రీ.శ. 512లో వల్లభి (గుజరాత్)లో దేవార్ధి క్షమపణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ‘గంధర్వ’ అనే పవిత్ర గ్రంథాలను క్రమానుసారంగా రాశారు. జైనులు శిల్పకళను అభివృద్ధి చేశారు.

క్రీ.పూ. 4వ శతాబ్దం చివరి రోజుల్లో గంగా లోయ ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చాలామంది జైన గురువులు, సన్యాసులు దక్షిణ భారతదేశానికి తరలివెళ్లారు. ముఖ్యంగా శ్రావణ బెళగొళ ప్రాంతానికి ఎక్కువ మంది వచ్చారు. దక్షిణానికి వచ్చినవారిలో భద్రబాహుడు, చంద్రగుప్త మౌర్యుడు లాంటి ప్రముఖులు ఉన్నారు. మగధలో ఉన్న జైనులు శ్వేతాంబరులయ్యారు. వీరికి గురువు స్థూల బాహుడు.

జైనమత మహత్వ సూత్రాలు:

1) అహింస 2) సత్యభాషణ
3) అపరిగ్రహం (దొంగిలించకపోవడం)
4) అస్తేయం (ఆస్తి లేకుండా ఉండటం)
5) బ్రహ్మచర్యం

వీటిలో మొదటి నాలుగు సూత్రాలు మహావీరుడి ముందు కాలం నుంచే అమల్లో ఉన్నాయి. మహావీరుడు బ్రహ్మచర్యాన్ని పంచమ సూత్రంగా కలిపాడు.

జైనుల ప్రధాన కట్టడాలు:

- అబూ పర్వతం-మహావీరుడి దేవాలయం
- శ్రావణ బెళగొళ-గోమతేశ్వరుడి విగ్రహం
- అజంతా, ఎల్లోరా, ఉదయగిరి గుహలు
- బాదామి - జైన దేవాలయాలు

ఆజీవికులు: గోశాల మస్కారిపుత్రుడు ఆజీవిక మతశాఖను స్థాపించారు. ఇది జైన మత సిద్ధాంతాలకు దగ్గరగా ఉంటుంది. అశోకుడి కాలంలో ఇది బాగా వ్యాప్తి చెందింది.

హర్యాంక వంశం (క్రీపూ.542-490)

క్రీ.పూ. 542-490 మధ్య కాలంలో రాజకీయంగా అనేక పరిణామాలు సంభవించాయి. ఉత్తర భారతదేశంలో మహాజనపదాలుగా పేర్కొనే పదహారు పెద్ద రాజ్యాలు ఏర్పడ్డాయి. వీటినే ‘షోడశ మహాజనపదాలు’ అంటారు. వీటిలో మగధ రాజ్యం శక్తిమంతమైంది. గిరివ్రజ, పాటలీపుత్రం దీని రాజధాని నగరాలు. మొదటగా దీన్ని బృహద్రథ వంశస్థులు పాలించారు. తర్వాత హర్యాంక వంశస్థులు పరిపాలించారు. వీరిలో బింబిసారుడు గొప్పవాడు. ఈయన తర్వాత అజాతశత్రువు పాలించాడు.

అజాతశత్రువు పాలనా కాలం క్రీ.పూ. 495-464. ఈయన హర్యాంక వంశ స్థాపకులైన బింబిసారుడి కుమారుడు. అజాతశత్రువు భార్య వజీరాదేవి. ఈమె కోసలరాజు ప్రసేనజిత్తు కుమార్తె. అజాతశత్రువు వజ్జి గణరాజ్య సమాఖ్యతో 16 ఏళ్లు యుద్ధం చేసి జయించాడు. కంటక శిల, కంటక బోధన అనే రాళ్లు, విసరు రథాలను యుద్ధంలో ఉపయోగించి శత్రురాజులను జయించాడు. ఈయన పాటలీపుత్రాన్ని నిర్మించాడు. ఈయనకు కుణిక అనే పేరు కూడా ఉంది. ఉదయనుడు ఈయన వారసుడు. అజాతశత్రువు గౌతమబుద్ధుడి సమకాలీకుడు.

హర్యాంక వంశం తర్వాత మగధను శిశునాగ వంశం (క్రీ.పూ. 490-458) పాలించింది. వీరి తర్వాత నంద వంశస్థులు రాజ్యానికి వచ్చారు. నంద వంశంలో మహాపద్మనందుడు గొప్పరాజుగా పేరు పొందాడు. ఈయనకు ‘మహాక్షత్రాంతక’ అనే బిరుదు ఉంది. ఆ తర్వాత చంద్రగుప్త మౌర్యుడు చాణక్యుని సహాయంతో నందవంశాన్ని నిర్మూలించి మౌర్యవంశాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు (క్రీపూ. 327-325):

భారతదేశంలో రాజకీయ అనైక్యత కారణంగా విదేశీయులు దండయాత్రలు ప్రారంభించారు. పారశీకులు మొదటగా భారత్‌పై దండయాత్ర చేశారు. వీరిలో ‘సైరస్’, ‘డేరియస్’ గొప్పవారు. పారశీక చక్రవర్తి ‘సైరస్’ గాంధారను జయించారు. వీరి తర్వాత గ్రీకులు భారతదేశంపై దండెత్తారు. గ్రీకు రాజ్యాల్లో అగ్రగామి అయిన మాసిడోనియా చక్రవర్తి అలెగ్జాండర్ విశ్వవిజేతగా పేరు పొందారు. గ్రీకు దండయాత్రల ఫలితంగా భారతదేశానికి, యూరప్ దేశాల మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. భారతీయులు గ్రీకుల నుంచి నాణేల ముద్రణ; శిల్ప, ఖగోళ శాస్త్రాలను నేర్చుకున్నారు.

మౌర్య సామ్రాజ్యం (క్రీపూ. 322)

మౌర్యుల చరిత్రకు ఆధారాలు:

విదేశీ గ్రంథాలు: మెగస్తనీస్ (గ్రీకు రాయబారి) రాసిన ‘ఇండికా’, స్ట్రాబో, డియోడరస్, ఏరియస్, ప్లీనీ రచనలు మౌర్యుల చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

సాహిత్య ఆధారాలు: కౌటిల్యుడి ‘అర్థశాస్త్రం’, విశాఖదత్తుడి ‘ముద్రారాక్షసం’.

మత సంబంధ ఆధారాలు: పురాణాలు, బౌద్ధుల దివ్యవదన, అశోకవదన, శ్రీలంకకు సంబంధించిన దీపవంశ, మహావంశ, జైనులకు సంబంధించిన పరిశిష్ట పర్వణ్ మొదలైనవి కూడా మౌర్యుల చరిత్రను తెలుసుకోవడానికి దోహదపడుతున్నాయి.

వీటితో పాటు శిలా శాసనాలు, రాతి చెక్కడాలు, గుహలు కూడా మౌర్యుల చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి.

చంద్రగుప్త మౌర్యుడు: ఈయన మౌర్యవంశ స్థాపకుడు. చంద్రగుప్త మౌర్యుడు తన చివరి రోజుల్లో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో జీవించాడు. ‘సల్లేఖన వ్రతం’ ద్వారా మరణించాడు. ఈయన క్రీ.పూ. 303లో ‘సెల్యూకస్ నికేటర్’తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మౌర్య సామ్రాజ్యానికి ఎక్కువ ప్రయోజనం కలిగింది.

బిందుసారుడు (క్రీపూ. 298-273): ఈయన చంద్రగుప్త మౌర్యుడి కుమారుడు. బిందుసారుడికి ‘అమిత్రఘాత’, ‘సింహసేనుడు’ అనే బిరుదులు ఉన్నాయి. ఈయన రాజ్యాన్ని మైసూరు వరకు విస్తరించాడు. చాణక్యుడు కొంత కాలంపాటు బిందుసారుడికి కూడా మహామంత్రిగా ఉండి ఆయనకు రాజ్యరక్షణలో సాయపడినట్లుగా టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ పేర్కొన్నారు. బిందుసారుడి పాలనా కాలంలో తక్షశిలలో తిరుగుబాటు జరిగింది. ఈయన ఆజ్ఞ ప్రకారం అశోకుడు తక్షశిలకు వెళ్లి శాంతి నెలకొల్పాడు. బిందుసారుడు గ్రీకు రాజ్యాలతో స్నేహ సంబంధాలు పెంపొందించాడు.

అశోకుడు (క్రీపూ. 273-232): ఈయన బిందుసారుడి కుమారుడు. అశోకుడు పట్టాభిషేకం చేసుకున్న తొమ్మిదేళ్లకు (క్రీ.పూ. 262- 61లో) సామ్రాజ్యకాంక్షతో కళింగ రాజ్యంపై దండెత్తి జయించాడు. ఈ యుద్ధం ‘ధర్మాశోకుడు’గా పూర్తిగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ఆ తర్వాత ఉపగుప్తుడు అనే బౌద్ధ ఆచార్యుడి వద్ద అశోకుడు బౌద్ధమత దీక్ష స్వీకరించాడు. ధర్మప్రచారానికి పూనుకొని ‘దేవానాం ప్రియ’, ‘ప్రియదర్శిని’ బిరుదులు పొందాడు. బానిసలు, సేవకుల పట్ల కరుణ, తల్లిదండ్రులు, పెద్దల పట్ల విధేయత, గురువుల పట్ల గౌరవం, స్నేహితులు, బంధువులు, పరిచయస్థుల పట్ల ఔదార్యం, పురోహితులు, భిక్షువుల పట్ల ఆదరణ అనేవి అశోకుడు ప్రబోధించిన ‘ధర్మం’లోని సూత్రాలు. ‘అహింసా’ అనేది ‘ధర్మం’లోని ముఖ్యసూత్రం. అశోకుడు 42 ఏళ్లు పరిపాలించి క్రీ.పూ. 232లో మరణించాడు.

వివిధ శాసనాల ఆధారంగా అశోకుడి సామ్రాజ్య సరిహద్దుల గురించి తెలుస్తోంది. షహబద్‌గిరి, మాన్‌షేషరా శాసనాలు వాయవ్య సరిహద్దును, రుమిందై శాసనం ఈశాన్య సరిహద్దును, సోపారా, గిర్నార్ శాసనాలు పశ్చిమ సరిహద్దును తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. బబ్రూ శాసనం అశోకుడి బౌద్ధమత స్వీకారం గురించి, ధౌలీ, జునాగడ్ శాసనాలు ఉదాత్త రాజ ధర్మ స్వరూపం గురించి, బరాబర్ శాసనం పరమత సహనం గురించి, 13వ శిలాశాసనం కళింగ యుద్ధం గురించి తెలుపుతున్నాయి. మస్కీలో అశోక అనే పదం ఉంది. కళింగ యుద్ధం తర్వాత అశోకుడి పాలన గురించి కళింగ శాసనం ద్వారా తెలుస్తోంది. రుమిందై, ఇగ్లివ శాసనాలు అశోకుడికి బుద్ధుడిపై ఉన్న గౌరవాన్ని వివరిస్తాయి. తరాయి శాసనం అశోకుడికి బౌద్ధమతంపై ఉన్న గౌరవాన్ని తెలుపుతుంది.

అన్ని మతాల సారాంశం ఆధారంగా అశోకుడు కొన్ని సూత్రాలతో దమ్మను తయారు చేశాడు. ఈయన దమ్మ ప్రచారం కోసం ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను పంపిస్తే వారు బౌద్ధ మతాన్ని ప్రచారం చేశారు. భారత ఉపఖండంలో అశోకుడు వేయించిన 14 ప్రధాన శిలా శాసనాలు, ఏడు స్తంభ శాసనాలు, అనేక చిన్నరాతి శాసనాలు లభించాయి. ఇందులో చాలావాటిపై ప్రజల కోసం చేసిన ప్రకటనలు చెక్కారు. 14 శిలా శాసనాలు అశోకుడి దమ్మ సూత్రాల గురించి తెలుపుతున్నాయి. మస్కీ శాసనంలో ‘దేవానాం ప్రియ’ అని ఉంది.

మౌర్య వంశ చివరి పాలకులు (క్రీపూ. 232 - 185): అశోకుడి తర్వాత వచ్చిన రాజులు అర్ధ శతాబ్దం పాటు పాలించారు. మౌర్య వంశ చివరి రాజైన బృహద్రథుడిని ఆయన సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించడంతో వీరి పాలన అంతమైంది.

మౌర్యుల పాలనా వ్యవస్థ

భారతదేశంలో ప్రప్రథమంగా కేంద్రీకృత అధికారాలు కలిగిన నిర్దిష్టమైన పరిపాలన రూపొందించింది మౌర్య చక్రవర్తులే. వీరికి పాలనలో సలహా కోసం మంత్రితో పాటు పరిషత్తు ఉండేది. పాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించి వాటికి రాజప్రతినిధులను నియమించారు. భూమిశిస్తు ప్రభుత్వ ప్రధాన ఆదాయం. పంట దిగుబడిలో 4 నుంచి 6వ వంతు వరకు శిస్తు వసూలు చేసేవారు. పాటలీపుత్ర నగర పాలన ముప్పై మంది సభ్యులున్న బోర్డు నిర్వహణలో ఉండేది. వర్తకుల ‘శ్రేణులు’ బ్యాంకులుగా పనిచేశాయి. సమాజంలో బహు భార్యత్వం, కన్యల విక్రయం, సతీసహగమనం లాంటి దురాచారాలు ఉండేవి. ఈ కాలంలో స్త్రీల స్థాయి తగ్గింది. మౌర్యులు ఎక్కువగా ప్రజల భాష అయిన ప్రాకృతాన్ని ఉపయోగించారు. శిలా శాసనాల్లో ‘ఖరోష్టి’, ‘బ్రాహ్మి’ లిపులను వాడారు.

పాఠశాల ఒక విద్యా సంవత్సరంలో కనీసం పనిచేసే రోజులు ఎన్ని?



బోధన పద్ధతులు

ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు బోధన పద్ధతులు తప్పనిసరి. కాబట్టి అభ్యర్థులు తెలుగు మెథడాలజీపై ప్రత్యేక దృష్టిని సారించాలి. ఎందుకంటే డీఎస్సీలో ఏ విభాగాన్నీ అశ్రద్ధ చేయరాదు. ఎస్.జి.టి, లాంగ్వేజ్ పండిట్ అభ్యర్థులు డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని సేకరించుకొని చదవాలి. గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సిద్ధమయ్యే అభ్యర్థులు బీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాలను విస్తృతంగా అధ్యయనం చేయాలి. తెలుగు అకాడమీ డీఎడ్, బీఎడ్ పుస్తకాల్లోని ‘ప్రణాళిక రచన- పాఠ్యగ్రంథాలు’ అనే అధ్యాయంలో వచ్చే ప్రశ్నలను సమగ్రంగా తెలుసుకుందాం.

మాదిరి ప్రశ్నలు

1. కరిక్యులమ్ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
   1) జర్మనీ 2) గ్రీకు
   3) లాటిన్ 4) ఆంగ్లం
2. ‘పిల్లలకు ఎంత బ్రహ్మాండమైన శక్తి, ఉత్సాహం ఉంటాయో ఊహించడం కష్టం. ఈ శక్తి ప్రవాహాన్ని అవసరమైన కాలువల్లోకి మళ్లించడమే ఉపాధ్యాయుడి అసలైన ప్రతిభ’ అని ఎవరన్నారు?
   1) ఫ్రాన్సిస్ బేకన్ 2) జార్జ్ బెర్నార్డ్ షా
   3) వలారి అజమూల్ 4) రస్సెల్
3. బోధన ప్రణాళికను, అందుకవసరమైన పరికరాలను అభివృద్ధి చేసుకోవడానికి శిశుమనస్తత్వ శాస్త్ర సూత్రాలు, క్రీడాపద్ధతులు సరిపోతాయన్న వాదనను ఏమంటారు?
   1) సిలాయిజమ్ 2) చైల్డ్ సైకాలజీ
   3) హ్యూమన్ సైకాలిజం
   4) సైకోలోగిజం
4. పాఠశాలకు, సమాజానికి మధ్య సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచడం ఏ ప్రణాళిక ముఖ్య లక్షణం?
   1) విద్యాప్రణాళిక 2) సంస్థాగత ప్రణాళిక
   3) విషయ ప్రణాళిక 4) వార్షిక ప్రణాళిక
5. సంస్థాగత ప్రణాళికను తయారుచేసేవారు?
   1) ఉపాధ్యాయుడు
   2) ప్రధానోపాధ్యాయుడు
   3) మండల విద్యాధికారి
   4) పైవారందరూ
6. విద్యార్థుల సంపూర్ణ మూర్తిమత్వాన్ని అభివృద్ధి చేసేది?
   1) వార్షిక ప్రణాళిక
   2) సంస్థాగత ప్రణాళిక
   3) సమగ్ర పథకం 4) విద్యా ప్రణాళిక
7. తరగతి గదుల్లో సంప్రదాయంగా బోధించే విషయాలే కాకుండా పాఠశాలలో విద్యార్థి పొందే అన్ని అనుభవాల మొత్తాన్ని ఏమంటారు?
   1) విద్యా ప్రణాళిక 2) వార్షిక ప్రణాళిక
   3) సంస్థాగత ప్రణాళిక 4) సమగ్ర పథకం
8. విద్యా ప్రక్రియకు పునాది?
   1) సమగ్ర పథకం 2) విద్యా ప్రణాళిక
   3) వార్షిక ప్రణాళిక
   4) సంస్థాగత ప్రణాళిక
9. వర్తమాన విద్యా ప్రణాళికకు ప్రాతిపదిక ఏది?
   1) కొఠారీ కమిషన్ (1964-66)
   2) విద్యాప్రణాళిక చట్రం -2005
   3) జాతీయ విద్యా విధానం- 1986
   4) విద్యాహక్కు చట్టం -2009
10. ఆధునిక సమాజంలో పిల్లలు జీవించడానికి అవసరమైన విషయజ్ఞానాన్ని అందజేసేది?
    1) విద్యా ప్రణాళిక 2) వార్షిక ప్రణాళిక
    3) సంస్థాగత ప్రణాళిక
    4) విషయ ప్రణాళిక
11. విద్య ఏ జాబితాలో ఉంది?
    1) రాష్ట్ర జాబితా 2) కేంద్ర జాబితా
    3) ఉమ్మడి జాబితా
    4) అవశిష్టాధికార జాబితా
12. ఎలా అయితే శరీర రక్షణ ద్వారా శరీరం దృఢపడుతుందో, శిక్షణ ద్వారా బుద్ధి పదునెక్కుతుందో, ఆత్మవిశ్వాసం కూడా దానికి తగ్గ అభ్యాసాన్నివ్వడం ద్వారానే సాధ్యపడుతుంది అని ఎవరన్నారు?
    1) మహాత్మాగాంధీ 2) జె.పి.యల్. గ్విన్
    3) జవహర్‌లాల్ నెహ్రూ
    4) డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్
13. విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు తమ తమ సబ్జెక్టుల్లో ప్రతి తరగతికి పాఠ్యాంశ బోధన అమలు చేసే పథకాన్ని ఏమంటారు?
    1) విద్యా ప్రణాళిక 2) వార్షిక ప్రణాళిక
    3) విషయ ప్రణాళిక
    4) సంస్థాగత ప్రణాళిక
14. ఉపాధ్యాయులు ప్రతినెలా పూర్తిచేసిన పాఠ్యాంశాలను పొందుపరిచే ప్రణాళిక ఏది?
    1) విషయ ప్రణాళిక 2) విద్యా ప్రణాళిక
    3) యూనిట్ ప్రణాళిక
    4) వార్షిక ప్రణాళిక
15. పాఠశాల ఒక విద్యా సంవత్సరంలో కనీసం పనిచేసే రోజులు ఎన్ని?
    1) 180 2) 220 3) 260 4) 280
16. యూనిట్ ప్రణాళికను ఇలా కూడా పిలుస్తారు?
    1) విషయ ప్రణాళిక 2) పాఠ్య పథకం
    3) పాఠ్యాంశ ప్రణాళిక 4) వార్షిక ప్రణాళిక
17. పాఠ్య పథకాన్ని ఎవరు విధిగా తయారు చేసుకోవాలి?
    1) ఉపాధ్యాయుడు
    2) ప్రధానోపాధ్యాయుడు
    3) ఛాత్రోపాధ్యాయుడు 4) 1, 3
18. ‘మన గొప్ప గొప్ప పాఠశాలలకుండే గొప్ప లోపం ఏమిటంటే అవి పరిసర సమాజాన్ని జ్ఞానార్జన వనరుగా ఉపయోగించడానికి ససేమిరా సిద్ధపడవు’ అని ఎవరన్నారు?
    1) డా॥ కొఠారీ 2) ప్రొ॥కృష్ణకుమార్
    3) డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్
    4) ప్రోబెల్
19. ఉపాధ్యాయులు యూనిట్ పథకాన్ని, పాఠ్యపథకాన్ని కనీసం ఎన్ని రోజులు ముందుగా తయారు చేసుకోవాలి?
    1) వారం 2) నెల
    3) రెండు రోజులు 4) ఒక రోజు
20. పాఠ్య పథకాన్ని ఏమని వ్యవహరిస్తారు?
    1) పాఠ పథకం 2) పాఠ్య ప్రణాళిక
    3) పాఠ్యాంశ ప్రణాళిక
    4) 1, 2
21. ఒక పీరియడ్‌లో ఒకరోజు బోధించే పాఠ్యాంశ భాగానికి ఉపాధ్యాయులు తయారుచేసుకొనేది?
    1) పాఠ్యపథకం 2) యూనిట్ పథకం
    3)పాఠ్యాంశప్రణాళిక 4) విషయ ప్రణాళిక
22. తరగతి గదిలోని పనులకు కొనసాగింపుగా ఉండే సోపానం?
    1) ప్రవేశం 2) ప్రదర్శనం
    3) పునర్విమర్శ 4) గైహికం
23. విద్యార్థి తనను తాను తెలుసుకొని తనలోని లోటుపాట్లను సరిచేసుకొనే అవకాశం దేని ద్వారా కలుగుతుంది?
    1) భాష 2) ప్రణాళిక
    3) బోధనోపకరణం 4) మూల్యాంకనం
24. ‘సర్వశాస్త్ర ప్రయోజనమ్ ఆత్మదర్శనమ్’ అని ఎవరన్నారు?
    1) జవహర్‌లాల్ నెహ్రూ 2) భర్తృహరి
    3) సర్వేపల్లి రాధాకృష్ణన్
    4) మహాత్మాగాంధీ
25. తరగతి బోధనకు మార్గదర్శకత్వం నెరపి ఆయా పాఠ్యాంశాల ద్వారా విద్యార్థుల్లో ఆశిస్తున్న ప్రవర్తనా మార్పుల్ని సూచించేవి?
    1) ఉద్దేశాలు 2) గమ్యాలు
    3) లక్ష్యాలు 4) స్పష్టీకరణలు
26. బోధనాభ్యసనానికి విద్యా కళాశాల్లోని శిక్షణార్థులు తయారుచేసుకొనేది?
    1) పాఠ్య ప్రణాళిక 2) పాఠ్య పథకం
    3) యూనిట్ ప్రణాళిక 4) సమగ్ర పథకం
27. ‘విద్యార్థికి సంబంధించిన మొత్తం పాఠశాల జీవితమే విద్యా ప్రణాళిక’ అని పేర్కొన్నవారు?
    1) ఫిలిప్స్ టేలర్ 2) పాల్ హార్స్ట్
    3) జె.ఎస్.కేర్
    4) సెకండరీ విద్యా కమిషన్
28. ఉపాధ్యాయుడి పనితనాన్ని, సామర్థ్యాన్ని తెలియజేసే ప్రణాళిక?
    1) సమగ్ర పథకం 2) పాఠ్య పథకం
    3) వార్షిక ప్రణాళిక
    4) సంస్థాగత ప్రణాళిక
29. భాషా బోధనలో యూనిట్ అంటే?
    1) పద్య భాగం 2) గద్య భాగం
    3) ప్రతి పాఠం ఒక యూనిట్
    4) ఒక పద్య పాఠం, ఒక గద్య పాఠం రెండూ కలిపి
30. అభ్యాసం చేయడం ద్వారా విద్యార్థుల్లో పునర్బలనం చేకూర్చడానికి తోడ్పడే గ్రంథం?
    1) వాచక పుస్తకం 2) ఉపవాచకం
    3) కృషి పుస్తకం
    4) ఉపాధ్యాయ కరదీపిక
31. భాషా బోధనలో పీరియడ్‌లను నిర్ణయించిన కమిటీ?
    1) మొదలియార్ 2) కొఠారీ
    3) ఈశ్వరీభాయ్ పటేల్
    4) సర్వేపల్లి రాధాకృష్ణన్
32. ఉపవాచక బోధన ముఖ్య ఉద్దేశం కానిది?
    1) విద్యార్థుల్లో విస్తార పఠనాభిలాషను పెంపొందించడం
    2) విద్యార్థుల్లో క్షుణ్న పఠనాభివృద్ధిని పెంపొందించడం
    3) విద్యార్థుల్లో స్వయం అధ్యయనాన్ని పెంపొందించడం
    4) విద్యార్థుల విరామ కాల సద్వినియోగం

సమాధానాలు

1) 3;	2) 3;	3) 4;	4) 2;
5) 2;	6) 4;	7) 1;	8) 2;
9) 3;	10) 4;	11) 3;	12) 1;
13) 2;	14) 4;	15) 2;	16) 3;
17) 4;	18) 2;	19) 4;	20) 4;
21) 1;	22) 4;	23) 2;	24) 3;
25) 3;	26) 2;	27) 4;	28) 1;
29) 3;	30) 3;	31) 1;	32) 2.

గత డీఎస్సీ ప్రశ్నలు

1. విద్యార్థుల సంపూర్ణ మూర్తిమత్వాన్ని అభివృద్ధి చేసేది?
   1) విద్యా ప్రణాళిక 2) వార్షిక ప్రణాళిక
   3) పాఠ్య ప్రణాళిక
   4) సహ పాఠ్య ప్రణాళిక
2. యం.బి.బచ్ నిర్వచనం ఆధారంగా తమ పాఠశాల కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి ఒక పాఠశాల తన అవసరాలను, అందుబాటులో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకొని తయారుచేసుకొనే అభివృద్ధి ప్రణాళిక?
   1) పాఠ్య ప్రణాళిక
   2) విషయ ప్రణాళిక
   3) సమగ్ర ప్రణాళిక
   4) సంస్థాగత ప్రణాళిక
3. విద్యార్థులను ప్రభావితం చేసే అన్ని అంశాలు ఉండేది?
   1) పాఠ్యపుస్తకం
   2) మౌలిక విద్యా ప్రణాళిక
   3) విద్యా ప్రణాళిక 4) పాఠ్య ప్రణాళిక
4. బ్యూచాంపీ నిర్వచనాన్ని అనుసరించి పాఠశాలలో విద్యార్థులకు విద్యానుభవాలు కలిగించడం కోసం సాంఘిక సమూహం రూపకల్పన?
   1) విద్యా ప్రణాళిక 2) సాంఘిక ప్రణాళిక
   3) యూనిట్ ప్రణాళిక
   4) సంస్థాగత ప్రణాళిక
5. స్వాధ్యయనానికి అనుకూలంగా ఉండాల్సింది?
   1) మూల గ్రంథం 2) కృషి పుస్తకం
   3) ప్రధాన వాచకం 4) ఉపవాచకం
6. విద్యా ప్రణాళిక అంటే?
   1) విద్యా సంస్థ బయట జరిగే కార్యక్రమాల సమూహం
   2) విద్యా సంస్థలో జరిగే కార్యక్రమాల సమూహం
   3) తరగతి గదిలో జరిగే కార్యక్రమాల సమూహం
   4) విద్యా సంస్థ లోపల బయట జరిగే కార్యక్రమాల సమూహం
7. కృషి పుస్తకం ప్రధాన ఆవశ్యకత?
   1) వాచకాల్లో నేర్చుకున్న విషయాలకుపునర్బలనం చేకూర్చడం
   2) ఇంటి పనికి అవకాశం కల్పించడం
   3) ఉపాధ్యాయులకు బోధనలో సహాయపడటం
   4) విద్యార్థి ఉత్తీర్ణతలకు సహాయపడటం
8. రాష్ట్రాల విద్యా ప్రణాళికలు ఒకే విధమైన ప్రమాణాలను సాధించడానికి జాతీయస్థాయిలో సూచించిన విద్యా ప్రణాళిక?
   1) కనీస అభ్యసన ప్రణాళిక
   2) మౌలిక విద్యా ప్రణాళిక
   3) విశిష్ట విద్యా ప్రణాళిక
   4) గరిష్ఠ విద్యా ప్రణాళిక

సమాధానాలు

1) 1;	2) 4;	3) 3;	4) 1;
5) 4;	6) 4;	7) 1;	8) 2

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ప్రకటనకు బలమైన వాదనే సరైంది

ప్రకటనలు - వాదనలు

'ప్రకటనలు - వాదనలు' చాప్టర్‌లోని ప్రశ్నలు ప్రకటనల రూపంలో ఉంటాయి. ప్రకటనల కింద రెండు వాదనలు అవును లేదా కాదు అని ఇస్తారు. ఈ ప్రశ్నలకు జవాబు గుర్తించడానికి సూచనలు..

- ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు జవాబు గుర్తించేటప్పుడు ఆ జవాబు (వాదనలు) ప్రకటనకు సంబంధించి ఉండాలి. కానీ నిజ జీవితానికి సంబంధించి అన్వయించుకోకూడదు.
- బలమైన వాదనే సరైన వాదన అవుతుంది. అవును అని ఉన్నా, లేదా కాదు అని ఉన్నా బలమైన వాదనే సరైంది.
- వాదనల్లో తిరిగి ప్రశ్నించినట్టు ఉంటే ఆ వాదన సరైంది కాదు.
- వాదనలు నిజాలుగా ఉండాలి. కానీ ఊహలుగా ఉండకూడదు.

ఉదాహరణ:

ప్రకటన: భారతదేశంలో రూపాయికే కిలో బియ్యం ఇవ్వొచ్చా?

వాదన -1: అవును, పేదరిక నిర్మూలనకు కేవలం ఇదొక్కటే మార్గం.

వాదన -2: కాదు, ప్రభుత్వంపై ఇప్పటికే అధిక భారం ఉంది.

సమాధానం: 2 మాత్రమే సరైంది

వివరణ: పేదరిక నిర్మూలనకు ఇదొక్కటే మార్గం అని చెప్పడం మిగతా అంశాలను విస్మరించినట్టే అవుతుంది కాబట్టి వాదన 1 సరైంది కాదు. కానీ వాదన 2 మాత్రమే సరైంది, బలంగా ఉంది.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
మెంటల్ ఎబిలిటీ

మాదిరి ప్రశ్నలు

కింద ప్రకటనలు, వాటి కింద రెండు వాదనలు ఉన్నాయి. ఆ వాదనలను జాగ్రత్తగా విశ్లేషించి ఏ వాదన బలమైందో, ఏది బలహీనమైందో/ పేలవమైందో గుర్తించాలి. ఆప్షన్‌ను కింది విధంగా ఎంచుకోవాలి.

1. కేవలం వాదన-1 మాత్రమే బలమైంది అయితే.
2. కేవలం వాదన-2 మాత్రమే బలమైంది అయితే.
3. రెండు వాదనలూ సరైనవి కాకపోతే.
4. రెండు వాదనలూ సరైనవి అయితే.

1. **ప్రకటన:** భారత్‌లో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వలస వెళ్లడం నిషేధించాలా?
వాదన -1: కాదు, ప్రతి పౌరుడు రాజ్యాంగం ప్రకారం దేశంలో ఎక్కడైనా నివసించవచ్చు.
వాదన -2: అవును, దీని ద్వారా వనరులు సద్వినియోగం అవుతాయి.

2. **ప్రకటన:** కళాశాలల్లో / యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాలు అవసరమా?
వాదన -1: లేదు, దీనివల్ల క్యాంపస్‌లో రాజకీయ వాతావరణం ఏర్పడుతుంది.
వాదన -2: అవును. ఇది అవసరం ఎందుకంటే విద్యార్థులే రేపటి రాజకీయ నాయకులు.

3. **ప్రకటన:** ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం అవసరమా?
వాదన -1: అవును. భారత్ శాంతి సౌభ్రాతృత్వాన్ని కోరుకునే దేశం.
వాదన -2: కాదు. ఎందుకంటే ముందుగా భారత్‌లో పేదరికాన్ని తొలగించాలి.

4. **ప్రకటన:** పెళ్లికి ముందే కాబోయే జంటకు వైద్య పరీక్షలు అవసరమా?
వాదన -1: లేదు. అలాంటి ఆలోచన ఊహించలేనిది/ భరించరానిది.
వాదన -2: అవును. దీనివల్ల జన్యులోపాలతో పుట్టే బిడ్డల సంఖ్య తగ్గుతుంది.

5. **ప్రకటన:** ఎల్పీజీపై సబ్సిడీని విరమించాలా?
వాదన -1: లేదు. ఇది మామూలు ప్రజలపై భారాన్ని పెంచుతుంది.
వాదన -2: అవును. దీనివల్ల నిజమైన పేదలు లబ్ధిపొందడం లేదు.

6. **ప్రకటన:** కిరోసిన్‌పై సబ్సిడీ పెంచాలా?
వాదన -1: అవును. దీనిమూలంగా పేదలకు మేలు జరుగుతుంది.
వాదన -2: కాదు మన ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా లేదు.

7. **ప్రకటన:** కత్తి కంటే కలం గొప్పదా?
వాదన -1: అవును. ఎందుకంటే రచయితలు ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తారు.
వాదన -2: కాదు. ఎందుకంటే కత్తి బలంతో ఒక వ్యక్తి అందరినీ జయించవచ్చు.

8. **ప్రకటన:** ప్రయోగ పరీక్షల కోసం జంతువులను చంపాలా?
వాదన -1: అవును. అవి చాలా ఎక్కువ సంఖ్యలో ఉంటాయి కాబట్టి.
వాదన -2: కాదు. మేం అహింసకు సహకరిస్తాం.

9. **ప్రకటన:** సైన్యంలో చేరడానికి 18 ఏళ్ల లోపు వారిని అనుమతించాలా?
వాదన -1: లేదు. 18 ఏళ్ల లోపు వారికి శారీరక, మానసిక ఎదుగుదల తగినంత ఉండదు. కాబట్టి వారు ఆ భారాన్ని మోయలేరు.
వాదన-2: అవును. ఎక్కువ కాలం సైన్యంలో సేవ చేయడానికి, దేశంలో ఆర్మీని అభివృద్ధి చేయడానికి ఇది తోడ్పడుతుంది.

10. **ప్రకటన:** ప్రైవేటు రంగంలో కూడా బలహీన వర్గాల వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలా?
వాదన -1: లేదు. ప్రైవేటు రంగం వారు దీన్ని అంగీకరించరు.
వాదన -2: అవును. దీనివల్ల ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి ఉపయోగకరంగా ఉంటుంది.

11. **ప్రకటన:** అన్ని పొగాకు ఉత్పత్తులను మనదేశంలో నిషేధించాలా?
వాదన -1: లేదు. దీనివల్ల నిరుద్యోగం పెరిగే అవకాశం ఉంది.
వాదన -2: కాదు. దీనివల్ల పొగాకు ఉత్పత్తుల నుంచి వచ్చే ఆదాయం ప్రభుత్వానికి సమకూరదు.

12. **ప్రకటన:** మనదేశంలో ఆదాయ పన్ను రద్దు చేయాలా?
వాదన -1: అవును. ఎందుకంటే రోజు కూలీ చేసుకునేవారికి ఇది అదనపు భారంగా మారుతుంది.
వాదన-2: లేదు. ఎందుకంటే రెవెన్యూ శాఖకు ఇది మంచి ఆదాయ వనరు అవుతుంది.

13. **ప్రకటన:** రక్షణ రంగంలా విద్యను కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి తీసుకురావాలా?
వాదన -1: లేదు. విద్య రాష్ట్రానికి సంబంధించింది. దీన్ని రాష్ట్ర పరిధిలోనే ఉంచాలి.
వాదన -2: అవును. అన్ని రాష్ట్రాల్లో ఒకే విధమైన విద్యాభివృద్ధి సాధ్యపడాలంటే ఇది ఒక్కటే మార్గం.

14. **ప్రకటన:** వ్యవసాయంలో క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించాలా?
వాదన -1: అవును. భూగర్భ జలాలు కలుషితం అవకుండా పరిరక్షించవచ్చు.
వాదన -2: కాదు. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గుతుంది.

15. **ప్రకటన:** ప్రజాస్వామ్యంలో అన్ని వార్తలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలా?
వాదన -1: అవును. ప్రత్యేకమైన వార్తలు మాత్రమే ప్రజల్ని కలవరపెడతాయి.
వాదన -2: కాదు. నియంత్రించిన వార్తలు విశ్వాసం కోల్పోతాయి.

16. **ప్రకటన:** ముంబైలో మళ్లీ పెద్ద పరిశ్రమల స్థాపన అవసరమా?
వాదన -1: అవును. వాటివల్ల కొత్తగా ఉద్యోగావకాశాలు లభ్యమవుతాయి.
వాదన -2: లేదు. వాటి వల్ల కాలుష్యం స్థాయి మరింత పెరుగుతుంది.

17. **ప్రకటన:** భారత్‌లో అన్ని రంగాల్లో కంప్యూటరీకరణ అవసరమా?
వాదన -1: అవును. వాటివల్ల పనినాణ్యత, కచ్చితత్వం పెరుగుతుంది.
వాదన -2: లేదు. దీనివల్ల ఉద్యోగాల్లో అసమానతలు పెరుగుతాయి. మానవ వనరులు నిరుపయోగం అవుతాయి.

18. **ప్రకటన:** విదేశాలతో నదుల అనుసంధానంపై ప్రణాళిక అవసరమా?
వాదన -1: అవును. ఎందుకంటే అతివృష్టి, అనావృష్టిలను ఎదుర్కొనొచ్చు.
వాదన -2: కాదు. ఎక్కువ ధనం ఖర్చు అవుతుంది.

19. **ప్రకటన:** మీడియాలో పొగాకు ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించాలా?
వాదన -1: అవును. కేవలం ఇలా మాత్రమే ప్రజలను కేన్సర్ నుంచి రక్షించొచ్చు.
వాదన -2: లేదు. దీనివల్ల పొగాకు అమ్మకాలు తగ్గుతాయి.

20. **ప్రకటన:** ఎవరైతే డ్రగ్స్‌కు బానిసై ఇతరులను కూడా ఆ దురలవాట్లకు లోను చేస్తారో వారికి కఠిన శిక్షలు అమలు చెయ్యాలా?
వాదన -1: కాదు. ఎవరూ.. ఎవరి జీవితాన్ని ప్రభావితం చేయరు.
వాదన -2: అవును. ఎవరైతే వారి జీవితంతోపాటు ఇతరుల జీవితాన్ని కూడా నాశనం చేయాలనుకుంటారో వాళ్లు చాలా ప్రమాదం.

21. **ప్రకటన:** ఐదో తరగతి వరకు ఉండే అన్ని వార్షిక పరీక్షలు రద్దు చేయాలా?
వాదన -1: అవును. చిన్న వయసులో విద్యార్థులపై అధిక భారం మోపొద్దు. అలాంటి పరీక్షలు వారి శారీరక, మానసిక ఎదుగుదలపై దుష్ప్రభావం చూపుతాయి.
వాదన -2: కాదు. అలా చేస్తే విద్యార్థులు శ్రద్ధగా చదవలేరు. అయినప్పటికీ పై తరగతులకు వెళతారు. దీనివల్ల భవిష్యత్తులో చదవబోయేది సమస్యగా మారవచ్చు.

22. **ప్రకటన:** భారతదేశంలోని పత్రికలకు పూర్తి స్థాయిలో స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు ఇవ్వాలా?
వాదన -1: అవును. దీనివల్ల ప్రజలు రాజకీయం గురించి పూర్తిగా తెలుసుకుంటారు.
వాదన -2: లేదు. దీనివల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి.

23. **ప్రకటన:** మనదేశంలో వైద్యవృత్తిని జాతీయం చేయాలా?
వాదన -1: లేదు. ఏ దేశం ఇలాంటి ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలు చేపట్టదు.
వాదన -1: అవును. దీనివల్ల అవినీతి వైద్య ప్రాక్టీషనర్‌లను తొలగించవచ్చు.

సమాధానాలు

1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 1;
6) 1; 7) 1; 8) 3; 9) 1; 10) 2;
11) 3; 12) 2; 13) 1; 14) 2; 15) 2;
16) 4; 17) 4; 18) 4; 19) 3; 20) 2;
21) 2; 22) 1; 23) 3.

టీఎస్‌పీఎస్సీ ఏఈఈ (మెకానికల్) - 2015లో అడిగిన ప్రశ్న

సూచనలు: నిర్ణయాలు తీసుకునే ముందు ఆ నిర్ణయాలకు ఆధారమైన వాదాల్లో ఏవి బలమైనవి, ఏవి బలహీనమైనవి అని తెలిసి ఉండటం అవసరం. బలమైన వాదాలు ప్రకటనలోని అంశానికి నేరుగా సంబంధం కలిగి ముఖ్యమైనవిగా కూడా ఉంటాయి. బలహీనమైన వాదాలు ప్రకటనలోని అంశానికి దూరంగా సంబంధం కలిగి ఉంటాయి. లేదా అల్పప్రాధాన్యం కలిగి ఉంటాయి.

ఈ ప్రశ్నలో భాగంగా ఒక ప్రకటన, రెండు వాదాలు ఇచ్చారు. ఇచ్చిన ప్రకటనను, వాదాలను పరిశీలించి ఇచ్చిన వాదం బలమైందో/బలహీనమైందో గుర్తించండి.

ప్రకటన: పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం 'ట్యాబ్స్' ఇవ్వాలా?

వాదం-1: అవును. ట్యాబ్స్ వల్ల బాగా నేర్చుకోవడంతోపాటు మోసుకెళ్లే పుస్తకాల బరువు కూడా తగ్గుతుంది.

వాదం-2: లేదు. విద్యార్థులు 'ట్యాబ్స్'ను దుర్వినియోగపరుస్తారు.

1) వాదం-1 మాత్రమే బలమైంది
2) వాదం-2 మాత్రమే బలమైంది
3) రెండు వాదాలూ బలమైనవి కావు
4) రెండు వాదాలు బలమైనవి

జవాబు: 1

What is the code name for 'WINDOWS 95'?

Computer Network

A computer network consists of two or more autonomous computers that are connected together in order to share resources(files, printers, modem etc), share application, allow electronic communication etc.

A computer network includes the network operating system in the client and server machines, the cables, which connect different computers and all supporting hardware in between such as bridges, routers & switches. In wireless system, antennas and towers are also part of the network.

Types of Computer Network: Computer network are generally classified according to their structure and the area.

Local Area Network (LAN)

In LAN, computers are connected locally within a room, building or in a small area. LAN can range from simple (two computers) to complex (hundred of computers and peripherals). LANs connect workstations and personal computers. User can share data as well as devices like printers, fax etc and can use LAN to

BANK EXAMS
Computer Awareness

communicate with each other, by sending e-mail or chatting.

Examples of LAN Technology: Ethernet, Token Ring, and Fiber Distributed Data Interconnect (FDDI).

Characteristics of LAN are:

- Configured to small area i.e. it connects several devices over a distance of 5 to 10 KM.
  - High Speed
  - Low error rates
  - Data and hardware sharing between users.
  - Operates at speed ranging from 10 Mbps to 100 Mbps. Now a day's 1000 Mbps are available.

Network Topology

Topology is physical arrangement of computer system in a network. Or refers to the shape of net works. Some of the most common network topologies are

Bus topology

In bus topology, all devices are connected to a central cable, called the bus or backbone. The bus topology connects workstations using a single cable. Each workstation is connected to the next workstation in a point to point fashion. All workstation connect to the same cable. An extension to the bus topology is tree topology.

Advantage of Bus topology: Installation is easy and cheap. Connections are simple and easy to use. Data can be transmitted from the both sides.

Disadvantage of Bus topology: A single fault in the cable stops all transmission. Fault identification is difficult.

Ring topology

In ring topology, all devices are connected to one another in the shape of a closed loop; so that each device is connected directly to each other i.e. the ring topology connects workstations in a closed loop. Data is transmitted around the ring in one direction only. Each station passing on the data to the next station till it reaches its destination. The common implementation of this topology is token ring.

Advantage of Ring topology: Easy to install and modify the network and fault isolation is simplified.

Disadvantage of Ring Topology: Adding or removing computer disrupts the entire network. A break in the ring can stop the transmission in the entire network. Finding fault is difficult.

Star Topology

Star topology uses a central hub through which, all components are connected. A central hub is the host computer and at the end of each connection is a terminal. Communication on the connecting links between the stations and the central station of star topology can be bi-directional and are point to point.

Advantage of Star Topology: Expansion or modification is easy. Single computer failure does not affect the network.

Disadvantage of Star Topology: Failure in the central hub brings the entire network to halt.

Tree topology

Tree topology is LAN topology in which only one route exists between any two nodes on the network. It is similar to the star topology but the nodes are connected to the secondary hub, which in turn is connected to the central hub.

Advantage of Tree Topology: Installation and configuration of tree network is easy. Less expensive when compared to mesh topology.

Disadvantage of tree Topology: Failure in central hub brings the entire network to a halt. More cabling is required when compared to bus topology.

Mesh topology

Devices are connected with many redundant interconnections between network nodes. In a well connected topology, every node has a connection to every other node in the network. Mesh topology are used in critical connection of host computers [typically telephone exchange]. Alternate path allow each computer to balance the load to other computer systems in the network by using more than one connection path available.

Advantage of Mesh topology: Failure in one of the computers does not affect the entire network. Privacy between computers is maintained as messages travel along dedicated path.

Disadvantage of Mesh Topology: Amount of caballing required is high. A large number of I/O ports are required.

MODEL BITS

1. The property that, when classes are arranged in a hierarchy, each class assumes the attributes and methods of its ancestors is ____.
1) Generalization
2) Inheritance
3) Encapsulation
4) Information hiding
5) None of these

2. An E-R diagram is a graphic method of presenting ____.
1) Primary keys and their relationships
2) Primary keys and their relationships to instances
3) Entity classes and their relationships
4) Entity classes and their relationships to primary keys
5) None of these

3. ____ is a primary key of one file that also appears in another file.
1) Physical key 2) Primary key
3) Foreign key 4) Logical key
5) None of these

4. SMTP, FTP and DNS are applications of the ____ layer.
1) Data link
2) Network
3) Transport
4) Application
5) None of these

5. Which of the following is the smallest and fastest computer imitating human brain working?
1) Supercomputer
2) Quantum Computer
3) Param-10,000 4) IBM chips
5) None of these

6. Which of the following statement is wrong?
1) Windows XP is an operating system
2) Linux is owned and sold by Microsoft
3) Photoshop is a graphical design tool by Adobe
4) Linux is free and open source software
5) None of these

7. What is the full form of SDRM?
1) Shift Dynamic random access memory
2) Synchronous Dynamics random access memory
3) System Dynamic random access memory
4) Serial Dynamic random access memory
5) Synchronous Dynamic random access memory

8. First microprocessor was used in which of the following?
1) Computer 2) Calculator
3) Telephones 4) Printers
5) None of these

9. Which of the following transforms input data into output data?
1) Peripherals
2) RAM 3) ROM
4) CPU 5) None of these

10. BSNL, Reliance, Shaw cable, AOL, Tata Indicom all can be kept in which one of the following groups?
1) ISDN 2) IRC 3) ISP
4) ICONS 5) None of these

11. In windows XP, which shortcut is used you lock the computer?
1) Ctrl + L 2) Windows Key + k
3) Ctrl + K 4) Scroll Lock key
5) Windows Key + L

12. What is a 'tuple'?
1) Another name for a table in an RDBMS.
2) Another name for the key linking different tables in a database.
3) Initial seed value of field.
4) A row or record in a database table.
5) An attribute attached to a record

13. A spooler is a (n):
1) Location in memory that maintains the contents of a document until it prints out
2) Print job
3) Program that coordinates the print jobs that are waiting to print
4) Message sent from the printer to the operating system when a print job is completed
5) None of these

14. A scientific institution performing intensive mathematical operations for a complex model that required extremely powerful computing capabilities will most likely use a (n):
1) Supercomputer
2) PC
3) Mainframe
4) ISP
5) None of these

15. The process ___ involves automated study of consumer buying patterns in order to support marketing, inventory replenishment and pricing decisions.
1) Transaction processing
2) Data mining 3) Simulation
4) Information processing
5) None of these

16. Press the ___ button to have the window fill the entire screen.
1) Close
2) Maximize
3) Minimize
4) All of the above
5) None of these

17. What is the code name for 'WINDOWS 95'?
1) Snowball 2) Chicago
3) Win ball 4) Sparta
5) None of these

18. Which is not a language processor?
1) Compiler 2) Interpreter
3) Processor 4) Assembler
5) None of these

19. The first part of a complete URL is the needed to access the web resource.
1) Address 2) Name
3) Location 4) Protocol
5) None of these

20. ____ is known as POS scanner.
1) Bar code reader
2) Magnetic stripe reader
3) MICR 4) OCR
5) None of these

KEY

1) 2	2) 3	3) 3	4) 4
5) 2	6) 2	7) 5	8) 2
9) 4	10) 3	11) 5	12) 4
13) 3	14) 1	15) 2	16) 2
17) 2	18) 3	19) 4	20) 1